

భారతి

# భారతి

## సచిత్రమాసపత్రిక

ప్రతిచాంద్రమాసాదిని ప్రచురింపబడును

సచిత్రమాసపత్రిక-ప్రతిసంచికయందును 3, 4 రంగులపటములు కలిగి ఇతరచిత్రపటములతో ప్రచురింపబడును. వాఙ్మయము, చిత్రకళలు, గానము, కథలు, నాటకములు మున్నగు అనేక విషయములతో ప్రతిమాసమునను 200 పుటలు కలిగియుండును.

సంవత్సర చందా రూ 6-0-0 అర్ధసంవత్సరము రూ 3-0-0 విడిపత్రిక రూ 0-10-0

☞ ప్రస్తుతము పోస్టలు రూల్సు ప్రకారము. 0-2-0 రిజిస్టరుచార్జి, 0-3-0 తపాలుచార్జి అధికమగుచున్నది. మీరే సొమ్ము మాకు ముందుగ మణియార్డరుపంపిన ఈఖర్చు తగ్గును. వీ. పీ. లు పంపినచో ఒక్కొక్కప్పుడు ఆలస్యముగ చేర్చుటయు పత్రికలు పంపుట ఆలస్యమగుటయు సంభవించును.

ప్రకటన ధరలు:—ఒక నెలకుమాత్రము సాధారణపుట 1-కి రూ 25. 6 నెలలకు అంతకుపైన పుట 1-కి రూ 20. వ్యాసములకు మున్న పుట 1-కి రూ 30- ఇతరవివరములకు వ్రాసిన తెలుపబడును.

మేనేజరు, భారతి. తపాలపెట్టె నెంబరు 212 మద్రాసు.

# విషయానుక్రమణిక


పుష్పాంజలి—మానవల్లి రామకృష్ణకవిగారు ఎమ్. ఏ. ... ... ... ౧-౭

ఆంధ్రకవిత్వచరిత్రము—భోగరాజు నారాయణమూర్తిగారు ... ... ౮-౨౦

ఓచిన్ని మొలకా! ఓ చిట్టితరగా!—కవికొండల వెంకటరావుగారు, బి. ఏ., బి. యల్. ౨౦

కవిజనాశ్రయము—వజ్ఝలచిన సీతారామస్వామిశాస్త్రిగారు ... ... ౨౧-౩౦

తెలుఁగుపడవ—తురగా వేంకటరామయ్యగారు ... ... ... ౩౧

మృచ్ఛకటికము—విద్వాన్ కత్తిసాంబమూర్తిశాస్త్రిగారు ... .. ౩౨-౩౭

వానప్రస్థుని విభ్రమము—శ్రీ శివశంకరశాస్త్రి ... ... ... ౩౮

పరిణామసూత్రము—పొక్కులూరి లక్ష్మీనారాయణగారు ... ... ౩- -౪౦

విమానము—క్రొత్తపల్లి సూర్యారావుగారు ... ... ... ... ౪౧-౫౦

ఈశావాస్యోపనిషత్తు—మల్లాది వేంకట విశ్వనాథశర్మగారు ... ... ౫౧-౫౨

దేవవ్రతచరిత్రము- సవిమర్శపఠనము—దేవులపల్లి అప్పల నరసింహముగారు ... ౫౩-౬౦

అలతి సేయకు నా ప్రణయంబునాథ—అధికార్ల సూర్యనారాయణరావుగారు ... ౬౧

కుటుంబరావుగారి సంసారగోష్ఠి—వే. వీరరాఘవస్వామిగారు, బి. ఏ., యల్. టి. ౬౧-౬౨

చిన్నిముచ్చట—సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు ... ... ౬౩-౬౪

చదువు-సంధ్యలు—శంకరదీక్షితులుగారు ... ... ... ... ౬౫-౭౨

అశ్రుదేవి—పాపినేని వెంకటేశ్వరరావుగారు ... ... ... ... ౭౩

వరూథినిమాయలు—ఆండ్ర శేషగిరిరావుగారు ... ... ... ... ౭౪-౭౯

ముద్దులబిడ్డఁడు—వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ... ... ...

అభీప్సితము—నాయని సుబ్బారావుగారు ... ... ... ... ౮౦

అరటితోటలు—ఒకకృషీవలుడు ... ... ... ... ... ౮౧-౮౮

సింధుసంకీర్తనము—సీరిపి ఆంజనేయులుగారు ... ... ... ౮౯

భూతత్త్వశాస్త్రము—ఆచార్య పప్పు పార్వతీశంగారు ఎమ్. ఏ., బి. యస్. సి. ౯౦-౯౬

ఆతిథ్యము—ఓలేటి వేంకటరామశాస్త్రిగారు ... ... ... ౯౭-౯౯

తేజోలేఖనము—నింజమూరి కృష్ణమాచార్యులుగారు ... ... ౧౦౦-౧౦౮

పోతన్నగారికినై వేద్యము—విద్వాన్ గరిమెళ్ల సోమన్నగారు, ఎం. ఏ., యల్. టి. ౧౦౯
నాగై-ఒకశిథిలమైనపట్టణము, గుల్బర్గజిల్లా—కొ. నరసింహాచారిగారు ౧౧౦-౧౧౨
సంఘసేవ - మోక్షమార్గము—గుండిమెడ వేంకటసుబ్బారావుగారు ౧౧౩
లోటా—చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు ... ... ౧౧౪-౧౨౧
ప్రేమతత్త్వము—మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు ... ... ౧౨౨-౧౨౫
చిత్రలేఖనము—భమిడిపాటి రామసోమయాజులుగారు బి. ఏ. ... ౧౨౬-౧౩౫
రాధవలపు—మంగిపూడి వెంకటశర్మగారు ... ... ... ౧౩౫
బ్రాహ్మణుఁడు-నాఁడు, నేఁడు—మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ... ౧౩౬-౧౩౭
ఎవరిది తప్పు?—మాడపాటి హనుమంతరావుగారు ... ... ౧౩౮-౧౪౭
ముక్తావళి—వేదుల సత్యనారాయణశాస్త్రి ... ... ౧౪౭
ప్రాచీన హైందవగణితములు—దర్భాయజ్ఞేశ్వర సోమయాజిగారు ... ౧౪౮-౧౫౬
ప్రకృతిశోభ—పెనుమర్తి వెంకటరత్నముగారు ... ... ౧౫౬
ఆంధ్రభాషావిమర్శనలు—కమలాకర నారాయణరావుగారు ... ౧౫౭-౧౫౯
ముఖ్యాల సంస్థానము ... ... ... ... ... ౧౬౦-౧౬౧
పత్రికాపరిచయము ... ... ... ... ౧౬౨
సాభిప్రాయవిశేషములు ... ... ... ... ... ౧౬౩-౧౬౬


# చిత్రములవివరము

వర్ణచిత్రము: మాయాదేవి స్వప్నము.

సాధారణ చిత్రములు:—భారతకథనము, భారతరచనము, అమృతప్రదానము, దేవ దానవ యుద్ధము; గౌరముఖుఁడు శృంగిశాపమును బరీక్షితునకుఁ దెలుపుట. వరూథినీ ప్రవరాఖ్యులు, ఇతర చిత్రములును.

## మాయాదేవి స్వప్నము


గీ. [illegible]
[illegible]



ఉ. ......యశోధరా [illegible]
[illegible]

గీ. [illegible]
[illegible]

చిత్రకారుడు:—[illegible]




చెన్నపట్టణము, జూలై ౧౯౨౪

సంపుటము ౧. రక్తాక్షి సంవత్సరము ఆషాఢమాసము సంఖ్య ౭.

# పుష్పాంజలి

మానవల్లి రామకృష్ణకవి గారు, యమ్. ఏ.,

(గత సంచిక శేషము)

## వీరభద్రవిజయము

ఈ గ్రంథము భాగవతకర్త యగు పోతనామాత్యుఁడు రచియించెనా యని పెక్కండ్రు సందేహపడుచున్నారు. వీరభద్రవిజయములోని గ్రంథకర్తృవంశావళి భాగవతములోని తద్భాగమునకు సరిపోవుచున్నది. ఇవ్వటూరి సోమనారాధ్యుఁడు పోతనను శైవగ్రంథరచనకుఁ బ్రోత్సహించుచుఁ "చిన్నవాఁడ" వని చెప్పుటచేఁ బోతన బాల్యముననే యీశైవగ్రంథరచనమునకుఁ దొడంగియుండును. భాస్కరరామాయణభాగవతగ్రంథములు నడుమ నడుమ దెగిపోయి పరకవిపూరితము లగుటకు ముఖ్యకారణ మోరుంగల్లు తురకలచేఁ బడి రాష్ట్ర మెల్ల విప్లవపరిభూత మగుటయే యని మాయభిప్రాయము. పోతన యోరుగంటివాఁడని క్రీడాభిరామపీఠికలోనే చెప్పియుంటిమి.

వీరభద్రవిజయముకూడ నిట్లు పరకవిపూరితమై యుండునేమోయని శంక గలుగుచుండి దానిని బరీక్షింప నందు నాల్గవయాశ్వాసపుఁ గూరు వేఱని తోఁచినది. గ్రంథము శ్రీశైల మల్లికార్జునదేవున కంకిత మీయఁబడియె.

ప్రథమాశ్వాసమునఁ గృత్యవతారికయు, దక్షుని యహంకారమును, శివద్వేషమును, యజ్ఞార్థము దేవతల నాహ్వానించుటయు, దాక్షాయణీయజ్ఞగమనమును, సతీపరిభవమును, శంకరుశాపమును, పార్వత్యవతారమును, తపోనిష్ఠుఁ డగుశివునకుఁ బార్వతి శుశ్రూషకు నియమింపఁబడుటయునుఁ గల కథాభాగము వర్ణింపఁబడియె.

ద్వితీయాశ్వాసమునఁ దారకాసుర విజృంభణమును, మదనదహనమును, పార్వతీతపోయోగమును, శివసాక్షాత్కారమును వర్ణింపఁబడియె. తృతీయాశ్వాసమున శివపార్వతీ వివాహమునకు సప్తర్షుల సంధానమును, వివాహమును, శివపార్వతీవివిక్తసల్లాపములును వర్ణింపఁబడియె. నాల్గవయాశ్వాసమున మరల దక్షయజ్ఞకథయు, వీరభద్రావతారమును, దక్షపరాభూతియు, శివప్రసాదంబును వర్ణింపఁబడియె.

ఈకథాప్రణాళిక చదివినతోడనే నాల్గవయాశ్వాసకథ యసందర్భమని తోఁచకమానదు. రెండవమూఁడవయాశ్వాసముల మొదటఁ గందపద్యమున శ్రీశైలనాథునిసంబోధనము తక్కిన యాంధ్రకావ్యముల మర్యాద ననుసరించి చేయఁబడియున్నను నాల్గవయాశ్వాసము మొదట:—

ఉ. శ్రీరమణీయహీరసర
సీగణరంజితసోమ వాసవాం
భోరుహసంభవప్రముఖ
భూరినిలింపభుజాబలప్రతా
పోరుమహాంధకారపట
లోగ్రనిఖండనచండభానుగం
భీరగుణాభిరామ రణ
భీమ వినిర్జితకామ శంకరా!

అని యుత్పలమాలలో సామాన్యశివరూపసంబోధనము గలదు. నాల్గవయాశ్వాసములోనిపద్యములు కొంచెము నీరసములుగానున్నవి. ఇది యేమని యాలోచించుచుండ వీరభద్రవిజయము తాటియాకులప్రతి యొకటి లభించె. దానిఁ బరికించిచూడ నాల్గవయాశ్వాసము ముద్రితపాఠమునకంటె సర్వథా భిన్నమయి శివపార్వతీకైలాస విహారవర్ణనమును, కుమారజననమును, దారకాసురసంహారమును దెలుపుకథాభాగము విస్తరించునదిగానున్నది. నూతనముగా లభించినయీభాగమునను పూర్వాశ్వాసములలోవలెనే మహర్షులకు వాయుదేవుం డీకథ చెప్పిన ట్లున్నది. ఆశ్వాసాంతమునఁ గొన్నిపత్రములు లేనందున నీభాగము పోతనకృత మగునా కాదా యనుసంశయము స్పష్టముగాఁ జెప్పుటకు వీలు లేక పోయినను గవిత్వధోరణి ననుసరించియుఁ గథానుస్యూతత్వమును జూచియు నిది పైమూఁడాశ్వాసములకు సంబంధించి యేకకవికృతమని తోఁచుచున్నది. ముద్రిత మగుభాగము పరకవిపూరితమగుటచేఁగాఁబోలు నుత్పలమాలతోఁ బ్రారంభింపఁబడియె. ఇట్లిప్పుడు లభించినభాగములో నుండి కొన్నిపద్యము లుదాహరించుచున్నారము.

క. శ్రీకర నతజనహృదయ వ
శీకర ... మమృతలింగచేతోబ్జలస
ద్భాకర వలయీకృతద
ర్వీకర రాజేశలింగ వృషభతురంగా.

వ. అవధరింపు మవ్వాయుదేవుండు మహామునుల కిట్లనియె. నకైలాసశిఖరంబునఁ బరమేశ్వరుండు హైమవతీ మానసోత్సాహంబు విస్తరింపం దలంచి శృంగారచేష్టాయుక్తుండై ప్రమథగణంబుల నొకరి నొకరి ననేక నాటకసూత్రవేషంబు లాడుట కనుజ్ఞ యిచ్చి యుమాసమేతుండై నవరత్నసింహాసనంబునఁ గూర్చుండి యుండె నంత.

క. గౌరీశునాజ్ఞఁ దల నిడి
పారిషదౌఘములు ప్రమదభరితాత్మకులై
చారుతరచిత్ర నాట్యము
లారూఢి ననేకగతుల నాడందొడఁగెన్.

క. శ్రుతితాళపటహవీణాం
చితగీతమృదంగ సమితి చెలువొందంగా
నతిరమ్యలీల నిలిచిరి
చతురత వేషముల నాడ శంకరుప్రోలన్

క. తెర వచ్చి(విచ్చి?) మొదల గణపతి
వరవేషము నటన సలుప వర్ణింపఁదగన్
హరసుతుఁడు నాట్యరాగము
లరయంగా నాడుసరణి యప్పుడు తోఁచెన్.

చ. పలుకువెలంది పుక్కిటను
బంగరుబొజ్జయుఁ పైని జంధ్యముల్
నలుదెసలన్ ముఖంబులు స
నందనముఖ్యులు చుట్టుఁ గొల్వఁగాఁ
దెలు పసువారువం బొనర
దేవపితామహవేష మెన్నఁగా
నలరువిరించి చందముగ
నప్పుడు దోఁచెను జూడఁ జిత్రమై

సీ. కడునీలివన్నియకాసె చక్కఁగఁ గట్టి
యిమ్ముగా నీలంపు (?) సొమ్ము వెట్టి
కస్తూరి మైఁ బూసి కచము సొంపుగఁ దీర్చి
లక్ష్మీమీఅ నుదుటిపైఁ దిలక మలఁది
కరమొప్పఁ బదములఁ గంచు గజ్జెలుగట్టి
వెలయంగ నొకచేత వీణఁ బూని
కలకంఠరవ మొప్ప గానంబు సేయుచుఁ
దెరచాటుగా నిల్చి తరుణి పల్కె
వినుఁడు మాయాభిధానంపువెలఁది నేను
చిత్తమున నున్నముచ్చటఁ జెప్ప నేర్తు.
ఘనులహృదయాంబురుహముల కనువుగొనఁగ
ననుచు నలర సభాపతి నభినుతించె.

శ్లో. స్వభావమూర్తిం గిరిజాసమేతం
విభావితం పంకజవిష్ణుముఖ్యైః,
ప్రభాకరా ...ంతనిభాత్మ కాంతిం
సభాపతే! త్వాం గిరిశం భజేఽహమ్.

సీ. నల్లనిమసి పూఁత కుళ్లాయి తలపైని
మిడిగ్రుడ్లు తేలీగండ్లు మిట్టపండ్లు
పలువంక లగు మేను మెలిగొన్న చేకాళ్లు
బొక్కియందపువాక్కు బుఱ్ఱముక్కు
కొఱమాలినకురూపు గూనుగల్గినవీఁపు
గొప్పైనదవడలు దొప్ప చెవులు
బొల్లిగందపుఁబూతఁ డొల్లుగట్టుడుపాత
సంకుపూసలబోరు సరులతీరు
తనరఁ దనరాక సభవారు గనుచు నవ్వఁ
గుంటినడపులు నడచుచు గెంటినట్లు
పరఁగ దండాలు దండాలు దొరకు ననుచుఁ
బ్రౌఢపరిహాసకుఁడు వచ్చె భర్గుసభకు.

సీ. ఇసుచెక్కులను గురు లొలగినతలపాగ
పలువన్నె పులుఁగు లెక్కలతురాయి
లలిమీన నుదుటిపై లత్తుగందపుఁబూఁత
పచ్చనిపట్టంగి పైని వెలయు
మెండు నొక్కిటిఘుండి(?)గండపెండారముల్
చాలంగ బిరుదులు వ్రేలుబొమ్మ
మణిమంత్రమాలికల్ వలచినతాయెత్తు
లపహేటికలకావ డంసమునను
వెలఁగ నాగస్వరము వలచేతఁ బూని
తనర డాచేత నొకక్రొత్త త్రాడుపట్టి
యద్భుతంబులఁ గల్పంబు లాడుకొనుచు
సరవి నహితుండికుఁడు వచ్చె హరునిసభకు.

క. వినుఁ డేను గారడీఁడను
గనుఁడీ నాపేరు వీరగారడి యనఁగా
ననువొంది విద్యలకు నేఁ
బెనుబిరుదులు గట్టి బొమ్మ వెట్టినవాఁడన్.

సీ. చప్పన్న భాషలు చౌషష్టివిద్యలు
తగజలంబుల నిడి త్రావినాఁడ
గజకర్ణగోకర్ణగారుడేంద్రమహేంద్ర
జాలవిద్యల కెల్ల సద్గురుఁడను
ఈరేడుజగముల నెల్ల రాజసభాంత
రముల నేను జయించి ప్రబలినాఁడ
నగ్నిజలస్తంభనారామపట్టణో
త్పాదనాంతర్ధానపటిమ నేర్తు
నిన్ని తెలుపుటకై వచ్చి తిటకు నేను
మమ్ముగెలుచుటకై రండు మల్లచఱచి
లేక యున్నను గనుఁడీ పరాకు మాని
యనుచు బహువిద్యలెల్లఁదానాడఁదొడఁగె.

సీ. వీణామృదంగనిక్వాణంబులమరఁగ
శ్రుతిగూర్చి గానంబు సొంపుమీఱ
చారుసప్తస్వరజనితభేదంబులు
తాళసప్తకశబ్దతతుల కొనర (?)
పాదహస్తముఖాదిభాసురసర్వాంగ
చలనంబు శృంగారకలన మెఱయ
చక్రఖడ్గాంతరితాసనాదికవృత్తి
నటన లత్యాశ్చర్యపటిమఁ దెలుపఁ
బద్యగద్యాదిగీతప్రబంధములను
హావభావాదిభావస్వభావమలర
నఖిలరసయుక్తి కరముల నభినయించి
చెలఁగిమాయాప్రభావంబు చెప్పఁదొడఁగె.

## తుక్కాపంచకము

ఆంధ్రభోజుఁ డను ప్రఖ్యాతి వహించి పెద్దనాది కవికీరముల కాశ్రయకల్పకమై తురుష్కసేనాధాటి కడ్డుకట్టయగు కృష్ణరాయనికిఁ దుక్కా యనుభార్య యుండెనఁట. కటకాధిపతి యగు ప్రతాపరుద్రగజపతి కృష్ణరాయనిచే విజితుఁడై తనకుమారిత యగు తుక్కాదేవి నతని కొసఁగి తత్కోపానలము శమింపఁ జేసెనఁట. విజయియగు రాయలు తుక్కాదేవిని బరిగ్రహించియు నేకారణముచేతనో దానివలన సహచారిణీసుఖం బనుభవింపఁ జాలక కంభ మనుకోటలో దాని నిరోధించి యుంచెనఁట. ఆమె చక్కనికవయిత్రియు, దాత్రియు, కంభస్థలతటాకనిర్మాత్రియు నయ్యెనని "విజయనగరచరిత్రమున కాధారములు" (Sources of Vijayanagar History) అను గ్రంథమునఁ గానవచ్చుచున్నది. ఆమె తుక్కాపంచకమను నైదుశ్లోకరత్నములం దుమ్మొదల సంబోధించుచు మగని నెత్తిపొడుచుచు నన్యాపదేశముగా రచించెనఁట. ఆయైదుశ్లోకములు నందే కలవు. అం దొకటి

"చరన్ వనాంతే నవమంజరీషు
న షట్పదో గంధఫలీ మజిఘ్రత్,
సా కిం న రమ్యా స చ కిం న రంతా
బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా"

(వనాంతరముల నవనవప్రసవగుచ్ఛంబులఁ బొలసాడు తేఁటి చంపకలతను వాసననైనఁ జూడదు. అది యేమి రమ్యమైనది కాదా? తేఁటియుఁ (రసికత్వముగల) క్రీడాశాలి కాదా? ఈవియోగము కేవల మీశ్వరాజ్ఞయే) అని యామె స్వావస్థావిశేషమును వర్ణించుకొనెనఁట

"మా కింశుక ! ప్రకటయాత్మని మేచమాత్రం
మన్మస్తకే విహరతీతి మధువ్రతో౽యమ్(?)
కిం మాలతీ విరహవేదనయా త్వదీయం
దృష్ట్వా ప్రసూన మచిరా దనలభ్రమేణ.
భ్రమర! భ్రమతా దిగంతరాళే(ణి)
క్వచి దాసాదిత మీక్షితం శ్రుతం వా,

వద సత్య మపాస్య పక్షపాతం
యది జాతీకుసుమానుకారి పుష్పమ్."

(ఓతుమ్మెదా! దిగంతరములు సంచరించు నీవు జాజిపూవుల కెన యైనపూవు వేఱొండు చూచితివా; పొందితివా, లేక వింటి నైనవింటివా? పక్షపాతము లేక సత్యము చెప్పుము.) అని యామె యాత్మ సౌభాగ్య ప్రకటనమును భర్తృవివేకమును నన్యాపదేశ విషయమున నెలయించుచున్నదఁట.

"కుసుమాని లిఖంతు నామ చిత్రే
కతిచిత్కారువి శేషరూఢిశిక్షాః,
సురభిత్వ మమూని కిం లభంతే
కిముచైతేషు రసం పిబంతి భృంగాః.
కిం మాలతి! మ్లాయసి మాం విహాయ
చుచుంబ తుంబీకుసుమం షడంఘ్రిః,
లోకే చతుర్భి శ్చరణైః పశుః
స్యాత్స షడ్భిరత్యర్థపశు ర్న కిం స్యాత్.

తుక్కాదేవి రచించినయీ యైదుపద్యములను విన్నంతనే కృష్ణరాయలు కేవలము వీరలక్ష్మీగాఢకరగ్రహణ మోహాంధుం గాని యిక్షుచాపునిగసాధిదేవత ప్రణయాతిరేకమున దూలఁజల్లు మానోపాలంభముల నోర్వలేకుండె నని తోఁచవచ్చును. కృష్ణరాయల పూర్వోత్తరకాలముల గంగాదేవి, తిరుమల దేవి, మధురవాణి, రామభద్రాంబ మొదలగు వార లాంధ్రసంస్కృతకవయిత్రులై ప్రసిద్ధి చెందియుండ నీతుక్కాదేవి కవిత చెప్పుట యేమియాశ్చర్య మనవచ్చును. ఈశ్లోకముల నేను మొదటఁ జదువఁగా గంగాదేవి మొదలగుకవ్రులు స్మృతిఫలకములో నున్నను వీనిని రచించినకవి ప్రాచీనుఁడేమో యని కొన్ని పదప్రయోగములవలన సందేహించితిని గాని నోరెత్తిచెప్పఁజాలక స్త్రీకవి యనియుఁ గృష్ణరాయని దేవి యనియు లోకము నమ్మియుండఁగా కేవలసందిగ్ధముగా శ్లోకములు ప్రాచీనకాలవాసన నెఱపుచున్న వని చెప్పినచో హాస్యపాత్ర మగుదు నని తలంచితిని. దీనిని తుక్కాదేవికి నంటఁగట్టిన బ్రహ్మశ్రీ సరస్వతిగారెచ్చటినుండి యీసంబంధము సాధించి తెచ్చిరో యెఱుఁగఁజాల. వీనిలో మొదటిశ్లోకము "చరణ వనాంతే" యనునది వల్లభదేవుని సుభాషితావళిలో 755 వ పద్యముగా నున్నది. సుభాషితావళి కృష్ణరాయనియనంతరము లిఖింపఁబడి యుండరాదా? అని యందురేమో! "భ్రమర, భ్రమతా దిగంతరాణి" యనునదియు దానిలోనే 727 వ శ్లోకముగా నున్నది. దానిచేతను సిద్ధించిన విశేష మేమి? "భ్రమర, భ్రమతా" యనుశ్లోకమును భట్టకల్లటునికుమారుఁడు ముకుళభట్టు తనయభిధావృత్తిమాతృకలో సాదృశ్యలక్షణ కుదాహరణము నిచ్చి "అత్ర హి భ్రమరపుష్పశబ్దా సంబోధనాన్యథానుపపత్త్యా బాధితముఖ్యార్థావభిధేయసాదృశ్యా త్తద్గతగుణసదృశప్రయుక్తమర్థాంతరం లక్షణయావగమయతః"అని లక్షణలక్ష్య సమన్వయము చేయుచున్నాఁడు. భట్టకల్లటునిగుఱించి కల్హణుఁడు రాజతరంగిణిలో-

అనుగ్రహాయ లోకానాం భట్టా శ్రీకల్లటాదయః,
అవంతివర్మణః కాలే సిద్ధా భువ మవాతరన్.

అని యవంతివర్మకాలములో నుండినట్లు తెలుపుచున్నాఁడు. ముకుళభట్టు:—

భట్టకల్లటపుత్రేణ ముకులేన నిరూపితా,
సూరిప్రబోధనాయేయ మభిధా వృత్తిమాతృకా.

అని చెప్పుటచేతను, అభినవగుప్తుని కం టెను (1000 A. D.) ప్రాచీనుఁ డగు ప్రతీహారేందురాజు తనకు ముకుళభట్టు గురు వని ప్రశంసించుటచేతను, వామనాలంకారము శిథిలము కాఁగా దానిఁబూరించి లోకమునకు ముకుళభట్టు ప్రసాదించినపిదప నభినవగుప్తాదులకు నది లభించియుండుటచేతను ముకుళుఁడు 870 క్రీ. శ. కాలమువాఁ డనుట నిశ్చయము. ఇతఁ డుదాహరించిన యీతుక్కాపంచకము లోనిద్వితీయరత్నము తత్పూర్వప్రథిత మనుటకు సందేహము లేదు గదా! కావున "చరణవనాం తే" యనుశ్లోకముగూడఁ బ్రాచీనమైనదే. భ్రమరపంచక మను నొకలఘుకృతి గలదు. ఈమైదును నందులోనివే. చరిత్రకారులు వీనిని తుక్కాదేవికి నంటఁగట్టి యీామెను గవితాసామ్రాజ్యపదవికిఁ బట్టాభిషిక్తఁ జేసినను నీకవితాసింహాసనము పూర్వకవులచే నపహరింపఁబడుటచే నామెయుఁ గేవలము భావనాపదవిలో జనించికృష్ణరాయనికి సహృదయకవి సార్వభౌమత్వము దొలఁగింప నెంచిన మిథ్యారూపిణియో యనుసంశయము మమ్ము బాధించుచున్నది. దేశచరిత్ర పరిశోధకులును వాఙ్మయవిమర్శకులు నామెకుఁ దోడ్పడి యామెకీర్తిని నిలుపుదురుగాక.

## చా టు వు

### ౧. భూ దే వీ స్తు తి

కహానాకిటీంద్రుని కోఱసోఁకిన భామ, కలిమిచూపులసింధుకన్యసవతి
అంభోదవర్ణునకైన శృంగారిణి, తొలిమికెల్లను దానకంబు
గజకుంభములమీఁదఁ గాఁ పున్నదేవత, రాజశేఖరుమనోరథము రథము
పెనువేల్పుకోర్కులఁ బిదికెడిధేనువు, మెట్టపట్టులకునుబుట్టినిల్లు
హరునియష్టాంగములకును నాదివేల్పు, కడలి రత్నాదివస్తువుల్ గలుగుపెట్టె
యల్లవలయాద్రి క్రిందటి యంటు బిళ్ళ, భవ్యగంధాదిగుణముల భరణి ధరణి,

### ౨. మన్మథునిబాణములును విల్లును నల్లెత్రాడును


(ప్రాచీనపద్యములు)

క. పచ్చెన్నుఁ జిగురుఁగొమ్మయు, నచ్చపుఁబూఁదీగ చెఱకు నబ్జము తూఁడుల్
మెచ్చుగ నివి మరువింట్లై, మచ్చిక విరహులను గిట్టి మర్మము లేచుల్

క. అళిశింజిని చెఱకునకుం, దలి రబ్బసమునకుఁ జిగురునకుఁ దామరనూల్
నెలజిగి పచ్చెన్నునకున్, వెలయఁగఁ గురువేరు పువ్వువింటికి నారుల్.

సీ. వెలిదమ్మివావిలి కలువ కేదఁగరంటి, మొల్లయు దిరిసెనంబును బొగడయుఁ
జాతంబు సంపెఁగ సురపొన్న పాదిరి, మల్లె యశోకంబు మంకెనయును
బాణముల్గాఁ బంచబాణుండు పాంథుల, ఫాలశిరోఽక్షి కపోలకంఠ
వక్షోఽధరోదర కక్షకటీరము, లంగుష్ఠ జానూరు లంఘ్రిగుల్ఫ
ములను గుఱిసేసి చెఱకెల పూవ్రుఁదూడు, చిగురుపచ్చైన్ను పిందలచేతఁబొం
యదయుఁడై యేయుచుండు దుర్మదము గదురఁ, బఱచి పది యేనవస్థల పాలుపడఁగ.

సీ. మామిడి కలువ తామరవిరుల్, తేటల్లె, పుండ్రేక్షుధనువునఁ బొలుపుమీఱు
మొల్లవావిలరంటి పువ్వు, లిగురుగొనయము, తూఁడుబద్వింటను రూఢికెక్కు
మఱి యశోకము మల్లెమంకెనపూవులుఁ, దమ్మినాల్ నా రొప్పఁ దలిరువింటఁ
బాటలవకుళచంప కుసుమములు కురు, వేగుశింజిని విరివింట నమరు
దిరిసనముఁ బొన్న మొగలిపూల్ తేట వెన్నెలను గుణము పచ్చవెన్వింటఁ దనరు నిటుల
నైదువింట్లను బంచదశాస్త్రములును, మరుఁడు ధరియించి విరహులఁగరువ మడఁచు.



# ఆంధ్రకవిత్వ చరిత్రము

భోగరాజు నారాయణమూర్తి గారు

## III

### ఆంధ్రకవుల కవితా విమర్శనములు

ఆంగ్లభాషయందు నుత్కృష్ట కావ్యరచన గావించిన మహాకవు లనేకులు వారివారిమతముల ననుసరించి కవితాతత్త్వమును బలువిధములఁ జక్కఁగ నిర్ణయించిరి. జాన్సను- వర్డ్సువర్తు- ఆర్నాల్డు- హాంట్- మొదలగు నయ్యాంగ్లకవులు పలువిధములగు శీర్షికల క్రిందఁ జర్చించి వ్రాసినకవితాతత్త్వనిర్ణయవ్యాసములు (Critical essays) యుగ విభాగములతోఁ బ్రత్యేకగ్రంథములుగా ముద్రింపఁబడియున్నవి. నన్నయాదులైన మన యాంధ్రకవులు ప్రత్యేకవ్యాసరూపములుగఁ గాకపోయినను దత్తత్కావ్యరచనారంభములయందు సుకవినమస్కార కుకవితిరస్కార సందర్భములలోఁ గవితాతత్త్వమును గూర్చి తమతమ యభిప్రాయముల నించుకించుక వెల్లడించియున్నవారు. కాని యాంగ్లకవుల యుపన్యాసములవలె వానిని మనవిమర్శకులు గూడఁ దీసి చర్చించి, కవులకవితామతములను బ్రత్యేకముగ నేర్పరచియుండలేదు. పురాణకవిత్వమునకుంబోలె నాంధ్రకవిత్వమునకుఁ దగినంత విమర్శ లేక యుండుట మొదటినుండియు నొక పెద్దలోపము. ఆంగ్లకావ్యసంస్కారవిశేషమున నిటీవలి మన విమర్శకులు కొందఱు మనవాఙ్మయమునకుఁ గొంతనూతన వికాసమును గలిగింపఁజొచ్చిరి. అట్టి మహనీయులలో "కవిత్వతత్త్వ విచారము"ను రచించిన శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డి గారిని, 'విమర్శాదర్శము'ను రచించిన శ్రీయుత బుఱ్ఱా శేషగిరిరావు పంతులు గారిని ముఖ్యముగఁ బ్రశంసింపక తప్పదు. ఆంధ్రవాఙ్మయమున నాచనసోమనాథునిస్థానమును నిర్ణయించుటకొఱకుఁ బ్రస్తుతము గావింపఁబడుచుండినచర్చ లుత్తమవిమర్శకు మార్గదర్శకములై క్రొత్తవిజ్ఞానమును గలిగింపుచున్నవి. ఇంకఁ దక్కినమనవా రిదివరలో విమర్శించినవిషయములకన్న నెక్కుడు ముఖ్యమైనవిషయము లనేకములు విమర్శలేక యుండిపోయినవని నామనవి. మఱియు నావిమర్శ లెల్లఁ బ్రాయికముగఁ గవులం గూర్చినవియే కాని తత్కవితలం గూర్చినవి కావనియు, నన్నియు నొక్కమార్గమునే యనుసరించినవనియు నీక్రిందిశీర్షికలవలనఁ దెలియుచున్నది.

1. నన్నయభట్టారకుఁ డాదికవి యగునా కాఁడా?

2. నన్నయ నియోగియా వైదికియా ?

4. ఆముక్తమాల్యదకృతికర్త పెద్దనయా రాయలా?

5. భట్టుమూర్తి, రామరాజభూషణు లిరువురా యొక్కఁడా?

6. నన్నెచోడుఁడు నన్నయకుఁ బూర్వుఁడా తరువాతివాఁడా?

7. వేమనకూర వేంకటకవి శూద్రుఁడా, క్షత్రియుఁడా, నియోగియా?

ఇంకనునిట్టివిషయము లనేకములు చర్చింపఁబడినవి. ఆంగ్లభాషయందు సైతమును గవులంగూర్చి యిట్టివిమర్శలు జరిగినను, ఆంధ్రకవితాతత్త్వనిరూపణమునకై యెట్టివిషయములు విమర్శింపవలసియున్నవో సూచించుటకునై పూర్వకవులు చర్చించిన విషయములు కొన్ని యీక్రిందఁ బొందుపరుపఁబడినవి.

1. Poetry and poetic diction
2. Wordsworth's theory of diction
3. A defence of poetry
4. Sacred poetry
5. The poet as Hero
6. An answer to the question "What is poetry"
7. The choice of subjects in poetry

కుకవినిందలు

ఇట్టి వనేకము లున్నవి. ఆంధ్రకావ్యములయందు సుకవినమస్కార కుకవితిరస్కార పురవర్ణనాదులు లెక్కన మొదలు నేఁటివఱకుం గల కవులెల్లరు నియమముగా ననుసరించుచు వచ్చుచుండుట యొకపిచ్చిమతము మనవారిలోఁ గొందఱియధిక్షేపము. పురవర్ణనముమాట యటుండ సుకవిభూషణ కుకవిదూషణనియమము మనయాంధ్రకవులు వహింపకుండినయెడలఁ గవితాతత్త్వముం గూర్చి వారిమతభేదముల నీపాటికైనఁ దెలియక మన మింత కన్న నజ్ఞానములో నుండియుందుము. ఏభాషయందలి వాఙ్మయమైనను నొక్కమతముపై నెప్పుడు నిలిచియుండదు. మత మొక్కటి కాక భిన్నమతము లేర్పడినప్పుడు పరస్పరదూషణము గలుగకపోదు. నాటకరచనా కౌశలమున నాచంద్రతారార్కమగు యశము గడించిన షేక్స్పియరువంటి మహాకవీశ్వరునకే తద్భిన్నమతస్థుల దూషణము తప్పినది కాదు. చూడుఁడు—

1 'Rymer, accepted in his own days as the champion of regular criticism and pronounced by Pope as one of the best critics England ever had, says, that in tragedy shakspeare appears quite out of his element. His brains are turned. He raves and rambles without any coherence, any spark of reason, or any rule to control him or set bounds to his phrensy.'

2 'Voltaire calls shakspeare a writer of monstrous farces called tragedies. His poetry is the fruit of the imagination of an intoxticated savage.'

3 'Pope points that shakspeare was dependent for his subsistence on pleasing the taste of tradesmen, and machanies, and that his wrong choise of subjects, and wrong conduct of incidents, his false thoughts and forced expressions are the result of his being forced to please the lowest of the people and keeps the worst of his company.'

కుకవియన నిట్టివాఁడని నిర్వచింపఁబడి యుండలేదు. నిర్వచించుటకు వీలును లేదు. పోపు - జాన్సను - ఎడిసను - మొదలగువారికి షేక్స్పియరు - మిల్టను - వర్డ్సువర్తు - మొదలగువారు కుకవులు. అట్లే వీరికి వారును గుకవులు. ఆంధ్రకవితాప్రపంచమునందును గుకవు లన భిన్నమతస్థులనియే మన మూహింప

పవలసియున్నది. ఈకుకవినిందలే కొంతవఱకుఁ గవులకవితామతములను స్థిరపరచుచున్నవి.

భారత రచనోద్యమము

ఆంధ్రకవిత్వమును గూర్చిన మతభేదములు పూర్వమున నాంధ్రమహారాజులయాస్థానములలో విద్వాంసులచేఁ దరుచుగఁ జర్చింపఁబడుచుండెడివి. ఆంధ్రకవిత్వప్రచారమునకును దదౌన్నత్యమునకును, ఈనాఁటికైనఁ గవితాచరిత్రమును వ్రాయుభాగ్యము మనకుఁ దటస్థించుటకును నాఁటియాంధ్రభూవల్లభుల యద్వితీయకవితాభిమానమే ముఖ్యకారణము. ఆంధ్రకవితాప్రియుండైన రాజరాజు శత్రురాజుల జయించి రాజకీయ వ్యవహారముల స్థిరపరచుకొనిన పిమ్మట శాంతచిత్తుఁడై కొంతకాలము కవితాగోష్ఠియందుఁ గడపెను. నన్నయరచితమైన భారతభాగ మేతత్కవితాగోష్ఠికిఁ బర్యవసానము. అమ్మహాభారతభాగమునఁ గృత్యాదిపద్యములలోఁ దిక్కనాదులవలెఁ గవితాతత్త్వమును గూర్చి తన మతమును నన్నయ విపులముగఁ బేర్కొని యుండలేదు. అందుచే నాయాసందర్భములను బట్టియే మనము వానిహృదయమును వెదుకవలసియున్నది. నన్నయకవితాతత్త్వమును దిక్కనాదు లెవరెవ రెంతవఱ కనుసరించిరో చర్చించుట కవకాశమున్నది; కాని, తత్పూర్వగ్రంథములేమియుఁ గానరానందున నన్నయ కవితామతమును జర్చించుట కాధారముగ వేఱొకకవిత స్ఫురింపకున్నది. అందుచేతనే యాంధ్రకవులెల్లరును దమతమ కవిస్తుతులయందు నన్నయను బేర్కొనినప్పుడెల్ల వ్యాసునిఁ బేర్కొనుచువచ్చిరి. లోకత్రయపూజ్యుండైన కృష్ణద్వైపాయనుని ప్రౌఢకవితానిబద్ధంబైన మహాభారతకథ సామాన్యజనావళికి దురవగాహంబై యుండ నద్దానిని జనసామాన్యమునకు గ్రాహ్యమగునట్లు తెనిఁగింప నెంచిన నన్నయయుద్యమమును వానికవిత్వముకన్న నెక్కుడుగఁ దరువాతికవులు కొందఱు శ్లాఘించుచు వచ్చిరి. ఆంధ్రభారతరచనమునందలి ముఖ్యాభిప్రాయము సామాన్యజనోపయోగమే యని నన్నయతోఁ బలికిన రాజనరేంద్రునిపలుకులవలనఁ దెలియుచున్నది.

క. జనవినుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహితమహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్

రచనామార్గప్రశంస

ఈవిషయమునే మనసునం దిడుకొని యెఱ్ఱాప్రెగ్గడ, యట్టియుద్యమమును దలపెట్టిన నన్నయను, దానిని గొనసాగించిన తిక్కనను గూడ నిట్లు స్తుతించియుండెను.

చ. భాసురభారతార్థములభంగులు నిక్క మెఱుంగనే
రమిన్, గాసటబీసటే చదివి గాథలు త్రవ్వ తెనుంగు
వారికిన్, వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లముచేసి
నట్టియా, భాసనకల్పులం దలఁతు నాద్యుల నన్నయ
తిక్కనార్యులన్.

దీనినిబట్టి కావ్యరచనావిధానమునందు భారతకవులు మువ్వురు నేకాభిప్రాయులే యని చెప్పవచ్చును. మఱియు సామాన్యజనోపయోగమే వారికవిత్వమునకు ముఖ్యలక్షణము. మార్కండేయపురాణకారుఁడైన మారనయు

ఉ. చారుకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలు
నట్లుగా, భారతసంహితన్ మును *ద్విపర్వము లెవ్వఁ
డొనర్చె నట్టివి, ద్యారమణీయు నాంధ్రకవితాగురు
నన్నయభట్టుఁ గొల్చెదన్.

అని స్తుతించుటలో నన్నయరచనామార్గమును స్పష్టముగా వివరించుచున్నాఁడు. పైపద్యమున 'జను'లనివాడుటలో మారనకవి యర్థము పామరులనియే కానోపు.

భారతరచన జనోపయోగము కొఱకు

ఈవిషయములన్నియు సమన్వయింపఁజూడ భారతరచనయందు నన్నయముఖ్యాభిప్రాయము పామరజనోపయోగమే యనుటకు వివాదముండఁగూడదు. ఇట్టి యభిప్రాయముతోఁ బ్రారంభింపఁబడిన మహాభారతమున నన్నయచే రచింపఁబడిన భాగమునందలి రచనావిధానమునుబట్టి వానిముఖ్యాభిప్రాయ మెంతవఱకుఁ గొనసాగినదో నిర్ణయించుట కష్టసాధ్యము. ఒకానొక వస్తువునుగూర్చి గుణనిర్ణయముగావింపవలసివచ్చినప్పుడు, తత్సమానధర్మముగల మఱియొక వస్తువుతో సరిచూచినఁగాని ప్రస్తుతవస్తుగుణమునుగూర్చిన సత్యాసత్యములు బయలుపడనేరవు. నన్నయ రచించిన భారతభాగమువంటి యుత్కృష్టమైనదియుఁ బ్రమాణమైనదియు నగుమఱియొక తెనుఁగుగ్రంథము తత్సమకాలికులచేతఁగాని పూర్వులచేతఁగాని రచింపఁబడినది కానరాలేదు. ఎన్నివిధముల నాలోచించినను నన్నయభారతమును వ్యాసభారతముతో సరిపోల్పక తప్పనివిధి యగుచున్నది. అట్లు సరిపోల్చినప్పుడు సామాన్యజనోపయోగమను నన్నయకావ్యరచనాసంకల్పము సంపూర్ణముగా నెరవేరెనని చెప్పవచ్చును.

నన్నయరచితమైన భారతభాగమును జూచి తిక్కనయుఁ దిక్కనమార్గమును బరిశీలించి యెఱ్ఱనయుఁ దమతమసహజకవితారచనలకుఁ గ్రొత్తవన్నెలువెట్టి, నన్నయరచనాపద్ధతి యూఁతగా భారతము సమాప్తినొందించిరి. నన్నయ కూఁతగాఁ బనికిరాఁదగిన యుత్కృష్టగ్రంథ మేదియు లేకపోయినను, దత్పూర్వవిరచితములును సమకాలవిరచితములును నగుసామాన్యకవితలైన నప్పుడు లేకపోలేదు. కాని నూతనకావ్యనిర్మాణమునం దప్రతిమప్రతిభావంతుఁడగు నన్నయవంటిమహాకవీశ్వరున కట్టి సామాన్యకవితలు కొంతవఱకైన మార్గదర్శకములై యుండునని నాకుఁ దోఁపదు. ఇట్లు తగినంతయాధారము లేశము లేని కాలములో జగత్పావనంబైన వియన్నదిని భగీరథుండుంబోలెఁ దనకవితాదీక్షచే భారతిని మెప్పించి తదనుగ్రహమున గీర్వాణలోకముననున్న భారతకథామృతప్రవాహమును నాంధ్రలోకమునఁ బ్రవేశపెట్టి, తన్నిమగ్నులైన యాంధ్రులను దద్భాషనుగూడఁ బవిత్రవంతములుగాఁ జేసినమహామహుఁడగుటచే నన్నయ భట్టారకుఁడు "ఆదికవి"యనియు "వాగనుశాసనుం"డనియుఁ గీర్తింపఁబడుచున్నాఁడు.

నన్నయకవితాప్రశస్తి-శ్రీనాథుఁడు

ఎఱ్ఱాప్రెగ్గడయు మారనయు మొదలగు కొందఱు కవులు కవిస్తుతులయందు నన్నయ

* ఇదియొకపాఠము. దీన్నిగూర్చి ద్వితీయసంపుటమునఁ జర్చింపఁబడును.

రచనామార్గమును శ్లాఘించినట్లే మఱికొందఱు కవులు నన్నయకవితయందుఁ దామెఱిఁగి కనిపెట్టిన ప్రత్యేకగుణములను దమగ్రంథములయందు సందర్భానుసారముగ నుడివియుండిరి.

"భాషింతు నన్నయభట్టుమార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమారు"

ఈపద్యపాదము శ్రీనాథరచితము. నన్నయకవితయందుఁగల గుణాతిశయములలో నుభయవాక్ప్రౌఢి శ్రీనాథుఁ డెన్నినగుణము. ఒక్కొక్కరి కొక్కొక్కరుచికదా? మఱియు శ్రీనాథుఁడు తానును దనకవితయం దీయుభయవాక్ప్రౌఢి మెండుగఁ జూపుచుండుటయే కాక, యతం డించుక నారికేళపాకాభిరుచియుఁ గలవాఁడని యీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

చ. పనివడి నారికేళఫలపాకమునం జవిరైన భట్టహ
ర్షునికవితానుగుంభములు సోమరిపోతులు కొందఱయ్యలో, ననికొనియాడ నేరరదియట్టిద; లేజవరాలు చెక్కుగీటినపసవల్పుబాలకుఁడు డెందమునంగలఁగంగ నేర్చునే?

అదియునుంగాక.

"వచియింతు వేములవాడభీమునిభంగి
నుద్దండలీల నొక్కొక్కమారు"

అను వాక్యమువలనఁగూడ సంస్కృతపదఘాటియందలి వానియుత్సాహము మఱింత వెల్లడియగుచున్నది. నైషధకావ్యరచనాసందర్భమునఁ దనకు నారికేళపాకాభిరుచి యున్నట్లు చెప్పియుండినను

"సంతరించితి నిండుజవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాష"

అను వాక్యమునుబట్టి తత్కావ్యరచన వానినిండుజవ్వనమునఁ గావింపబడిన దగుటచేతను దనసాహిత్యము సైతము యావనదశయందే బలిష్ఠమై యుండిన దగుటచేతను, నారికేళఫలపాకమునం జవి యన్నమాట యావనదశావిశేషమున నుచ్చరింపఁబడినమాటయే కాని శ్రీనాథునిరచనలయందు ద్రాక్షాపాకము లేకపోలేదు.

నన్నయ సంస్కృతపదప్రయోగము

పైనివివరించిన యంశములవలన శ్రీనాథుఁడు నన్నయకవితయందలి గుణములలో నుభయవాక్ప్రౌఢి నెన్నుకొనుట యొకవింత కాదు. నన్నయకవితయందు సంస్కృతపదబాహుళ్యము లేకపోలేదు. లేకపోవుటకు వీలును లేదు. ఇందుకుఁ గారణము తనకావ్యరచనకై యతఁడు మేలుబంతిగా (model) నిడుకొనిన కావ్యము వ్యాసభారత మగుటయే! మఱియుఁ దనకాలమునాఁటి తెనుఁగుకైతలు తనహృదయము నాకర్షింపఁజాలకపోవుటచేతను, తనమాతృక సంస్కృతగ్రంథ మగుటచేతను, ఆంధ్రకవిత్వమునందు సంస్కృతపదప్రయోగమున కెంతవఱకు స్థాన మొసంగవలయునో నిర్ణయించుకొనుటకుఁ దగినయవకాశము తిక్కనాదులకుంబలె దనకు లేకపోవుటచేతను, నన్నయ తనకావ్యరచనయం దంతవఱకు సంస్కృతపదములనే మెండుగఁ బ్రయోగింపవలసివచ్చినదని నాయభిప్రాయము. మఱియు నింతకన్న ముఖ్యమగు మఱియొకయంశము విచారింపఁదగియున్నది. ప్రస్తుతజనసామాన్యముకంటె నన్నయనాఁటివారికి వానిభారతరచన మెక్కుడు సూక్ష్మగ్రాహ్యమైనదై యుండియుండును. గానటబీనకే

చదివి గాథలు త్రవ్వనాఁటి తెనుఁగువారికి నన్నయభారతమువలన వ్యాసముని ప్రణీతపరమార్థములు తెల్లమయినట్లు నన్నయకు మనకంటె దగ్గరవాఁడగు నెఱ్ఱాప్రగడ చెప్పుచున్నాఁడు. తనకాలమునాఁటి జనుల కగ్రాహ్యమైనరచన నన్నయగావింపఁడు. వాని ప్రభువును గావింపనీయఁడు.

### భారత రచనాచర్చ

రాజరాజనరేంద్రుఁడు విద్వజ్జనంబులతోఁ గొంతవఱకుఁ జర్చించి జనసామాన్యమునకు వలయురచన "మిట్టిద"యని నిరూపించినపిమ్మటనే కావ్యారంభమును గావింపుమని నన్నయ కాజ్ఞాపించియుండును. పండితులసాహాయ్యముతోడనే మహాభారతము రచింపఁబడినట్లు రెండవరాజరాజు శ్రీకూర్మము శాసనమువలనఁ దెలియుచున్నది.

'తస్మాదభూత్ క్షితిపతిః ప్రణతాంఘ్రిపద్మః
శ్రీరాజరాజనృపతిః ప్రవిశాలకీర్తిః;
యస్సూరిభిః సహ కిల సత్కృతిజాలసార
మంధ్రీచకార వరభారతవంశవృత్తమ్.'

ఈశ్లోకమునఁ జేర్కొనఁబడిన సూరిజనంబులు, అపారశాస్త్రపారగులైన వైయ్యాకరణులనియు, భారత రామాయణాద్యనేకపురాణప్రవీణులైన పౌరాణికులనియు మృదుమధురరసభావభాసురనవార్థవచనరచనావిశారదులైన మహాకవులనియు, వివిధతర్కవిగాహితసమస్త శాస్త్రసాగరగరీయఃప్రతిభులైన తార్కికులనియు, నన్నయచే వర్ణింపఁబడినవారే కాని తదన్యులై యుండరు. ఇట్టి పండితులతో రాజరాజు భారతరచనంగూర్చి చర్చించినప్పు డభిప్రాయభేదములు కలిగియుండకపోవు. కథారంభము, కథాగమనము, కావ్యభాష మొదలగు నంశములనుగూర్చి కాని, యథామూలమా లేక కన్నడకావ్యానుసరణమా యనునాంధ్రీకరణ మార్గమునుగూర్చి కాని, మఱి యేయితరవిషయములనుగూర్చి కాని భారతరచనకొఱకు వలసినంతచర్చ జరుగుట కవకాశమున్నది. లేదా, రాజనరేంద్రుఁడు పండితులనందఱనుగూడ భారతమును వ్రాయ నియోగించియే యుండును. వానిలో నన్నయరచన వానికెక్కుడు సమ్మతమైనదై యుత్కృష్టముగా నుండియుండును. నన్నయచే వర్ణింపఁబడిన పండితులలో నథర్వణుఁడుగూడ నుండినయెడల వానిభారతగ్రంథ వృత్తాంతమును గొంతవఱకు నిజమై, యీయూహను బలపఱుపఁగలదు.

### నారాయణభట్టుసాహాయ్యము

పైనివివరించినవానిలో నేవిషయమునందైన నేమి జరిగినవిద్వత్కలహమున నన్నయభట్టునకు నారాయణభట్టు మిక్కుటముగఁ దోడైనట్లు కనఁబడుచున్నది. ఆంధ్రభారతరచనావిధాన నిరూపణమునందలి యభిప్రాయభేదములే కాక, నన్నయయందుఁ బ్రభువునకున్న యభిమానాతిశయమునఁ గలిగిన పండితసహజమగుమచ్చరమును, తమయుక్తివాదములచే రాజును మెప్పించి భారతాంధ్రీకరణగౌరవము తమలోనే యొక్కరైనఁ బొందవలయునను నభిలాషయు నాఁటిభారతకవితారణమునకుఁ గారణములై యుండవచ్చును. ఘోరమైనయీకవితారణమునఁ దనకిష్టుఁడును సహాధ్యాయియు నైన నారాయణభట్టు శాస్త్ర

పాదములయందు సహస్రముఖములఁ దనకుఁ దోడుపడుటచేత వానిసాహాయ్యమున నన్నయ యచ్చటివిద్వాంసుల నోడించి కృతకృత్యుఁ డయ్యె ననుట కీక్రిందిపద్యము కొంత తోడు పడుచున్నది.

ఉ. పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా, రాయణునట్లు తానును ధరామరవంశవిభూషణుండు నా, రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడున్ దనకిష్టుఁడున్ సహా, ధ్యాయియు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగన్.

రాజనరేంద్రుని యాస్థానమున నాంధ్రభారతకవితారచనంగూర్చి యట్టి తీవ్రమైన విద్వత్కలహము జరుగకుండినయెడల నన్నయవంటి యాలంకారికుఁడు తన్నర్జునునితోడను నారాయణభట్టును గృష్ణునితోడను నుపమించియుండఁడు. భారతసంగ్రామమునం దెందును నారాయణుఁడు యుద్ధముచేయనియట్లే భారతరచనమున నే సందర్భమునందును నారాయణభట్టు వ్రాసియుండకపోవుటయే పైపద్యమునందలి యుపమానమునకు సారస్యమని కొందరి సమన్వయము. నారాయణుం డొకమారు చక్రమును నొకమారు మునికోలయు భీష్మునిపై కెత్తెను. †ప్రయోగింపకపోయినను శస్త్రాస్త్రములతో నవసరమైనప్పుడు యుద్ధమొనర్చు సంకల్పముతోడనే నొగ లెక్కెనని చెప్పుటకు సంశయము లేదు. మననారాయణభట్టుకూడ భారతరచనలో గంటమును బట్టుకొని యే నన్నయకడఁ గూర్చుండి యుండవలెను. సైంధవవధనాఁడు నారాయణుఁడు మాయాతిమిరమును బ్రయోగించి కౌరవులకుఁ దిమిరభ్రాంతిగలిగించెను. ఇది యుద్ధము చేయుటగాదా? ఒక యస్త్రమునుండి యగ్నిజ్వాలలు! ఒకయస్త్రమునుండి వారిపూరములు! ఒక యస్త్రమునుండి మహావాయువులు! ఒకయస్త్రమునుండికటికిచీకటులు! దివ్యాస్త్రములవలని ప్రయోజనము లిట్టివేకదా? నారాయణుఁడు ప్రయోగించిన మాయాతిమిరముగూడ నొకదివ్యాస్త్రమేల కాఁగూడదు! ఇట్లే నారాయభట్టునైతము భారతరచనలో గంటము నుపయోగించియే యుండును. ఆభాగము లెట్టులేర్పడవలసియుండునో మఱియొకసందర్భమునందు వివరింపఁబడును.

### నారాయణభట్టుప్రతిభ

భారతరచనారంభమున జరిగినవిద్వత్కలహము నందును, భారత రచనమునందును గూడ నన్నయకు నారాయణభట్టు వలసినన్ని విధములఁ దోడుపడుటచేతనే వానికి నందమపూండియగ్రహారమును రాజరాజు బహుమానముగా నొసంగినట్లు తోఁచుచున్నది. మఱియు నన్నయచే వ్రాయించిన యాశాసనములోని యీక్రిందిశ్లోకమున నారాయణభట్టు ప్రతిభ యెట్లు వర్ణింపఁబడినదో చూడుఁడు!

"కవీ న్మనీషాలవదుర్విదగ్ధా న్మనోహరాభి ర్నిజసూక్తిభి ర్యః, సర్వా న్సగర్వాన్ పటుభి ర్బిభర్తి కవీభవజ్రాంకుశనామ సార్థమ్."

మనీషాదుర్విదగ్ధులైనకవులను నిజమనోహరసూక్తులచే గర్వహీనులఁ గావించి నారాయణభట్టు కవీభవజ్రాంకుశుఁడను బిరుదము వహించినట్లు నన్నయయే శాసనకావ్యకర్తయై వ్రాసియుండుటచేత తత్కవిగర్వాపహరణం

† సీ. కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ........" భాగవతము.

బును గవిభవజ్రాంకుశబిరుదధారణంబును జరుగుటకు భారతరచనాసంబంధమైన విద్వత్కలహము తప్ప మరియొకసందర్భము గానరాదు.

### పండితప్రశంస

తన ప్రతిపక్షులైన రాజాస్థానవిద్వాంసులను నన్నయ తన గ్రంథమునందు శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులనియు మృదుమధురరసభావభాసురనవార్థవచనరచనావిశారదులైన మహాకవులనియు నాదిగఁ బలుభంగులఁ బ్రశంసించెను. ఆ ప్రశంసకు లౌకికుఁడగు వానిలోకజ్ఞతావిశేషమే కారణము. తక్కటి యాస్థానవిద్వాంసులవలె విజిగీషలేశమును వహింపక భారతకవితాతత్త్వనిరూపణమే ముఖ్యాభిప్రాయముగను, గావ్యరచనయందలి తన మతము వాఙ్మయాభివృద్ధికి గారణము కాకపోదను దృఢవిశ్వాసముతో దానిని స్థిరపఱుచుకొనుటకును మాత్రమే నన్నయ విద్వాంసులతో వాదించెనని యాతఁడొనర్చినవిద్వజ్జనప్రశంసవలన నూహింపఁదగియున్నది. మఱియు నాతఁ డభిలషించినది భారతము నాంధ్రీకరించుకీర్తియే కాని శాస్త్రవాదంబుల నాటి విద్వజ్జనంబుల జయించుకీర్తి గాదు. అందుచే నయ్యుదారచిత్తుఁడు తన గ్రంథమునందుఁ గుకవినిందయను పేర విద్వాంసులను దూషింపక, "పాయక పాకశాసనికి" అనుపద్యములో "భారతఘోరరణంబునందు" అనువాక్యము నారాయణునిపక్షమే కాక, నారాయణభట్టుపక్షమునఁగూడ భారతరచనాసంబంధమైన తీవ్రమగు వాక్ప్రాకరణంబను నర్థము ధ్వనించునట్లుగ రచించి యంతతో విడిచెను.

### ప్రసన్నకవితార్థయుక్తి

ఇట్లు నన్నయ కృతకృత్యుఁడై రాజాజ్ఞ వడసి లేఁబ్రాయముననున్న యాంధ్రకవితాకన్యకకన్నప్రాశనము గావించి భారతకథామృతమును మెల్లగఁ ద్రావించుటకుఁ బ్రారంభించెను. కారము తగులకుండఁ బసిపిల్లలకన్నము వెట్టునాఁడు కన్నతల్లులు వహించు జాగరూకతయు, నోటికెలంకుల మోటుపలుకలు నాటి బాధింపకుండ లేఁబచ్చికచివుళ్లనేరి కురంగశాబకములకుఁ బెట్టుటయందు మునికన్యకలు వహించు జాగరూకతయు సంస్కృతపదప్రయోగమున నన్నయ వహించెనని చెప్పవచ్చును. కర్ణకఠోరమైన శబ్దములు పండితాభేద్యములైన సమాసములు గ్రాహ్యములుగాని దూరాన్వయములును జొరకుండ, సాధ్యమైనంతవఱకు ప్రచారముననున్న సంస్కృతపదములను మాత్రమే ప్రయోగించుటచేత నాతనిరచనలలో నెంతటి దీర్ఘసమాసములైనను బూవులు తావులఁ జిమ్మునట్లు లప్రయత్నముగ నర్థమును బ్రకటించుచున్నవి. చూడుఁడు.

"ఉ. ద్వాదశమాసికవ్రతము ధర్మవిధిం జలుపంగ నేగి గం,
గాదిమహానదీహిమవదాదిమహాగిరిదర్శనంబు మీ
పాదపయోజదర్శనము పన్నుగఁ జేయుటఁ జేసి పూ
ర్వసం, పాదితసర్వపాపములఁ బాసె భృశంబుగ
నాకు నచ్యుతా !"

### ఆశ్వాసాంతనియమము

ఇట్టి మృదుపదగుంఫితములైన సమాసములకు బంగారు పతకమునకు వజ్రంపుఁరవలవలెఁ దెనుఁగుమాటలలోన గూర్చుచు అక్షరరమ్యతయందు మగ్నుండు గాక ప్రసన్న

కథాకవితార్థయుక్తియందే దృష్టి యుంచి చక్కనిశ్రుతి సౌఖ్యమును దానివెంటనే యర్థ సౌలభ్యమును దఱుచుగాఁ గలిగించుచుండుట నన్నయకవితయందలి గుణములలో నొకటి. కృతిపతింగూర్చిన యశ్వాసాంత పద్యములు మాత్రము నన్నయ యాంధ్రపదసంపర్కములేకుండఁ గేవలసంస్కృతపద భూయిష్ఠములుగా రచించెను. ఆశ్వాసారంభాంతముల యందలి యాయాపద్యములన్నియు సమన్వయించి చూడ నిట్టి నియమమును వహించుటలో నన్నయ యభిప్రాయము స్ఫురింపక పోదు. కృతిపతియైన రాజనరేంద్రునివంశ విశేషములు రాజ్యవిశేషములు, శత్రువిజయములు, బిరుదావళులు, గుణశీలములు, దానములు, ధర్మములు, కవితాభిమానాది సకల విషయములును, నన్నయ యాయాపద్యముల యందుఁ బ్రకటించియుండుట చూడ భారత కథాంశములతోఁ బాటు తన ప్రభువు జీవితచరిత్రాంశములుఁగూడ శతాబ్దములకొలఁది జనులు స్మరించుచుండవలయునని యాతఁ డూహించినట్లు స్పష్టపడుచున్నది.

క. ఆదిక్షత్రచరిత్రధ
రాదేవాశీఃపరంపరావర్ధితని
త్యోదయ సత్యోదితవిమ
లాదిత్య తనూజ విక్రమాదిత్యనృపా!.

క. శ్రీవనితావల్లభ వే
గీవిషయాధీశ కావ్యగీతప్రియ నా
నావనినాథకిరీటత
టీవిలసద్రత్నసంఘటితపదకమలా!.

క. రాజమహేంద్రకవీంద్రస
మాజసురక్షాత్రజరాజమార్తాండ ధరి
త్రీజననుతరుచిరాజివి
రాజితగుణరత్న రాజరాజనరేంద్రా!.

పై పద్యములు లేశమును ముఖ్యకథతో సంబంధింపనివే యైనను, కేవలము కృతిపతింగూర్చినవియే యైనను, అందును సంస్కృతపదైకబద్ధములైనను, నన్నయ తనపాండిత్యప్రకర్షకై ప్రయత్నింపక ప్రయత్నపూర్వకమైన శబ్దాలంకారములఁ జొనుపక, కృతిపతింగూర్చినగుణవిశేషాదులను బ్రకటించు నుద్దేశముతోడనే రచించినట్లు రూఢిపడుచున్నది.

### ఇతరకవుల యాశ్వాసాంతనియమములు

నన్నయ తరువాత తిక్కన మొదలు నేఁటివఱకుం గలకవులెల్లరుఁ దమతమపురాణకావ్యప్రబంధరచనల యందీనియమము ననుసరించుచు వచ్చిరి గాని యనుసరించినవారిలో ననేకులకు నన్నయ ముఖ్యోద్దేశము స్ఫురించినట్లు కనఁబడదు. ఆయాకవులెల్లరుఁ దమతమ యాశ్వాసాంత పద్యములయందుఁ బాండిత్యప్రకర్షయే ప్రధానోద్దేశముగా నిడుకొని, చిత్రకవిత్వపటుత్వమో, బంధకవితాసామర్థ్యమో, శబ్దాలంకారరచనాప్రవీణతయో, లేక, మఱి యేనిపుణత్వమో తఱుచుగాఁ బ్రకటించుచువచ్చిరి.

స్రగ్ధర— తారక్ష్మాభృద్ద్విపౌక స్తరులసబలభద్రత్రినేత్రాబ్జ
ముక్తా, హారాకాశాపగా ఫణ్యధిపతిబిసనీహారహం
సావళీ నం, డీరశ్రీఖండ తారానికరమృగపవాణీ
సుధాకుందమల్లీ, క్షీరాంభోరాశి కాశస్థిరవిమల
యశః కీర్ణదిక్చక్రవాళా!

పద్మపురాణము - సింగనామాత్యుఁడు.

ఉ. సూరిజనస్తవార్హతమ శుభ్రయశోజిత పుండరీకడిం,
డీరమరాళ నారదపటీర మహేశ్వర హీరతారకా,
పారతరంగిణీ దరతుషార హిమాచల శేషశారదా,

శారదచంద్రచంద్రహరిచందన కొండలరాయనందనా.

రంగరాయవిజయము-దిట్టకవి - నారాయణకవి.

సుగంధివృత్తము—సారసాహితీసదధ్వచారిభూరిధీరసా
ధీరసాహసోరు దోరతి స్ఫురన్మహోరసా
హారసానుమత్తటీ సురాపగాసుధారసా
ధారసాధుకీర్తి హంసహారి సూరిసారసా.

వసుచరిత్ర - రామరాజభూషణుఁడు.

బాలరసాలపల్లవఖాదనముచేతనే కోకిలము కలకంఠ మగుచున్నది. మృదుమధుర సంస్కృతపద సౌలభ్యసంకలిత మగుటచేతనే దేశభాషలందు దెనుఁగు తెన్నె యగుచున్నది. కలకంఠము కలకంఠమగుటయే కాక యెంత పాడినను దానికంఠము జీరవారకుంటకుఁ గారణము తద్బాలరసాల పల్లవగ్రాసమే. నన్నయ వలనఁ దేటతెల్లమగు సంస్కృతపుమాటలు పలుకుట కలవాటు పడుటచేతనే తరువాతి కవులలోఁ బలువురు పలికించిన యయఃపిండములవంటి యుద్దండవాక్యములను నాంధ్రకవితాలతాంగి యుచ్చరింపఁ గలుగుచున్నది.

నన్నయకవితాప్రశంస

ఎఱ్ఱాప్రెగడ వంశములోనివాఁడై యాతనిమనుమఁడనని చెప్పుకొనిన చెదలువాడమల్లయ నన్నయకవితాగుణములలో మాధుర్యమును బ్రధానముగా నెన్నినట్టు లీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

ఉ. ధారఁ దెలంగి నిత్యపరితర్పితరాజరసజ్ఞమై యసా
ధారణభారతాదృతపయఃకణము మించి నిరంతరక్షణా
ధారమహామహత్వ సహితంబగు నన్నయభట్టభారతీ
సారసుధారసంబు బుధసంస్తవనీయముగాక యుండునే.

మఱియు—'ఆంధ్రకవితా గౌరవజనమనోహారి నన్నయసూరి' అని పోతనయు.

"అరటిపండు వొలిచి చేతికి నిచ్చినరీతి"

అని పింగళిసూరన్నయు.

"నవ్యమంజులవాగ్ధుర్య నన్నపార్య"

అని మొల్లయు నన్నయకథా ప్రసన్నతయును, బదసౌష్ఠవమునువానికవితాగుణములలో ముఖ్యమైనవానిగాఁ బ్రశంసించుచున్నారు

తిక్కనకవితామతము

నన్నయ తరువాత వానికవితామార్గము ననుసరించి దానికిఁ గ్రొత్తశోభగలిగించిన మహనీయుఁడు తిక్కన యని కవితాప్రపంచమున జనులు ప్రాయికముగాఁ జెప్పుకొనుచున్నారు. తిక్కన కవితామతములను జర్చించుచు నీసందర్భమున నేను వ్రాసినభాగము నిదివఱకే 1923 సంవత్సరపుటాంధ్రపత్రికయుగాదిసంచికలోఁ బ్రకటించియుండుటచేత మరల నిచ్చటఁ జేర్చుట యనవసరమని విడిచిపెట్టితిని. కావ్యరచన శిల్పమువంటిదనియు, సంగీతమువలెనే కవిత్వముఁగూడ శ్రావ్యతామాధుర్యగుణశోభితంబై యుండవలయుననియుఁ జెప్పుటయే కాక,

"ఏ నిన్ను మామయనియెడు
దీనికిఁ దగనిమ్ము భారతీకన్యను........."

అని కవిత్వమును గన్యకతో సరిపోల్చిన యాంధ్రకవులలోఁ దిక్కనయే మొదటివాఁడుగాఁ దోఁచుచున్నాఁడు. ఇట్లే తరువాతియాంధ్రకవులనేకులు తమతమ గ్రంథములయందుఁ గృతిపతి ప్రసంగములలోఁ గవిత్వమునందు గన్యాత్వమునారోపించుచువచ్చిరి. చూడుఁడు;

i ..........................పరిగ్రహింపు మయ్యా రఘునాథభూప! రసికాగ్రణి! మామక కావ్యకన్యకన్.

చేమకూర వేంకటకవి.

ii సజ్జనవిధేయునకున్ గవితాస్త్రీలోలునకున్.

పెద్దన.

iii మదీయకావ్య కన్యా మనోహరుండగు రావూరిబసవ భూపాలరాఘువువంశం బభివర్ణించెద."

వెన్నెలగంటి - సూరన.

iv ............రంగపతి యంగజుతండ్రి మదీయ కావ్యసా, రంగవిలోచనామణికి బ్రాణవిభుండట భాగ్య మెట్టిదో".        కాకమాని - మూర్తికవి.

v బాలరసాలసాల నవ పల్లవకోమల కావ్యకన్యకన్.

బమ్మెర - పోతన.

నన్నెచోడుని కవితామతము

నన్నెచోడకవియుఁ గవిత్వము నందును స్త్రీయందును సమానధర్మముల నారోపించి స్త్రీవలెనే కావ్యమును సౌభాగ్యముతో నొప్పుచుండవలయునని చెప్పుచున్నాఁడు.

క. చతురోక్తుల నుతపదబహు
గతుల నలంకారభావకాంతిరసార్థో
న్నతిఁ గృతి నతిరసికులు వర
సతిగతి నెతిఁగింపవలదె సౌభాగ్యమునన్.

ఇంతియె కాక తనకవితామతమును వెల్లడించుటలో నన్నెచోడుఁడు!

మ. పదబంధంబుల నగ్గలించి బుధశబ్దభ్రాజియై సద్గుణాస్పదమై దుష్కవిహృత్సరోజవనముల్ భంజించుచున్ భూరి స, మ్మదలీలన్ విలసిల్లి సత్కృతి జగన్మాన్య ప్రభావంబునన్, మదనాగంబునుబోలెఁ గ్రాలవలదా మా రెందు లే కున్నతిన్.

అని కావ్యము మదపుటేనుఁగువలె నుండవలెనని చెప్పుచున్నాఁడు. ఇది వింతయైన కల్పన. కవితాతత్త్వమునుగూర్చి ప్రసంగించిన కవులు సాధారణముగ ధారయందును మాధుర్యమునందును గంగాప్రవాహమనియు నమృతలహరియనియు వాడుచుండిరేగాని కావ్యముగాని కవిత్వముగాని మందయానముగల మదపుటేనుఁగువలె నుండవలెనని చెప్పియుండలేదు. పిల్లలమఱ్ఱి పినవీరన తనకావ్యరచనావిశేషమునుగూర్చి

శా. జంబూద్వీపములోన నెంతయుఁ బ్రశస్తంబైన దీనిన్నట, ద్వంభూమండలజూటకోరకకుటీ ధృత్స్వర్ధునీవీచికా, లంబిస్విన్నవచేందుకందళ సుధాలంకార వాగ్వైఖరిన్, జంబూకావ్యముఁ జేసెదన్ బుధజనశ్లాఘానిరాఘాటతన్.

అనియుఁ గుమారధూర్జటి తనతాతగారైన పెదధూర్జటిని స్తవముచేయుటలో

సీ. అమ్మహాత్ము మదీయవంశాబ్ధిచంద్రుఁ
డైనధూర్జటికవిరాజు నభినుతింతు
ధూర్జటిజటాతటీనటద్ధ్యోధునీత
రంగరంగదభంగవాగ్రీతి మెఱయ.

అనియు వర్ణించుకొనియున్నారు. నన్నెచోడుని యేనుఁగుపద్య మాతఁడు క్షత్రియుఁడనియు మండలాధిపతియనియు నూహింపఁదగియున్నది. కావ్యమునందుఁ గవిప్రతిబింబించుచుండునుగదా?

పెదపాటి సోమనాథకవి

ఈయేనుఁగు పద్యమువంటిదే కవిలోకబ్రహ్మ యను బిరుదొందిన పెదపాటి సోమనాథకవి చెప్పిన గుఱ్ఱము పద్యమొకటి కలదు.

మ. పదలాలిత్యము వర్ణశుద్ధియును శబ్దస్థైర్యమున్ మంగళాస్పదభావంబును రాజయోగ్యతయు దోషస్ఫూర్తి రాహిత్యమున్, సదలంకారవిశేషముం గలిగి విశ్వప్రాణసౌభాగ్యసం, పదమైఁ దేజియ పోలి క్రాలవలదా పద్యంబు హృద్యస్థితిన్.

సోమనాథునిపద్యము కదమునడుచుచున్నట్లే హృద్యస్థితిని గ్రాలుచున్నది. ఇందలి మృదుపదకల్పితములైన సమాసములయందు

కవి కడుసొంపుగ నింపిన శ్లేషార్థము పూవుమొగ్గ వలెఁ దనంత దానే విడిపోవుచున్నది. ఏనుఁగుపద్యమునందలి యలంకార మొక్క పాదము మాత్రమే దాఁటి రెండవపాదమునందు భేదించినది. రెండవపద్యమునం దట్లు కాక పద్యారంభముతోడనే ప్రారంభింపఁబడిన యలంకారము తుదవరకు నతిచతురతతోఁ బోషింపఁబడి "సదలంకారవిశేషముం"గలిగి యొప్పుచున్నది. పిచ్చియెత్తి "సరోజవనముల్ భంజించు"మదపుటేనుఁగున కలంకారము లేల? ఈ రెండుపద్యముల నడకలను బట్టియు వృత్తమును బట్టియు బ్రాసమును బట్టియు నొకదాని ననుసరించి మఱియొకటి రచింపఁబడినట్లు తోఁచకమానదు. కాని పెదపాటిసోమనాథుని ♦ కాలము నిర్ణయింపఁబడక పోవుటచేత నన్నెచోడుని పద్యము నీతఁడే యనుసరించెనో యీతని పద్యమును నన్నెచోడుఁడే యనుసరించెనో మనకుఁ దెలియ [redacted] బట్టి యీ రెండును [redacted] డునని తోఁచుచున్నది. అందువలన సోమనాథుఁడు నన్నెచోడునకు సమకాలికుఁడై యుండునను భ్రాంతియుఁ గలుగవచ్చును. ఒక్కపద్యమునందే యింతటి రచనాచమత్కృతిని బ్రకటించిన యీకవిలోకబ్రహ్మ గ్రంథములను జూచుభాగ్యము ప్రాచ్యలిఖిత ♦ గ్రంథప్రకాశకుల యనుగ్రహమున నాంధ్రదేశమునకు శీఘ్రముగ లభించుఁగాక.

నన్నిచోడుని కవితాప్రసంగము

కుమారసంభవము నామూలాగ్రముగఁ బరిశీలించి నన్నెచోడుని కవితారచనం గూర్చి కవితాతత్త్వజ్ఞులైన వీరేశలింగము పంతులు గారు తమయభిప్రాయము నిట్లు ప్రకటించిరి. "తఱుచుగాఁ గన్నడపదముల నుపయోగించుటయు గ్రాంథికభాషలోను వ్యావహారికభాషలోనుగూడ లేనియప్రతీత పదములను వాడుటయు స్వచ్ఛమైనయీతని కవిత్వమునకుఁ గొంతకళంకముం దెచ్చుచున్నవి............ కొందఱు పొగడినంత యత్యుత్తమమైనది కాకపోయినను నన్నెచోడునికవిత్వ మన్యభాషాపదదూషితము కానియెడల నుత్తమమైనదనియే చెప్పనచ్చును."

కన్నడమునందు నుద్భటుఁడను నొకకవి యున్నట్లును దత్కృవికృతమైన కుమారసంభవము నన్నెచోడుని కుమారసంభవమునకు [redacted] మును ఉద్భట దేవచ [redacted] ముప్రతి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారముననున్నదనియు నుయూనివర్సిటీరీడరుగాఁబనిచేసిన శ్రీ బుట్టా శేషగిరిరావు పంతులుగారు చెప్పుచున్నారు. నన్నెచోడునిరచనంగూర్చి వీరేశలింగము పంతులుగారు గావించిన విమర్శకు శేషగిరిరావు పంతులుగారియూహ మిక్కిలి యనుకూలముగా నున్నది. కుమారసంభవము గాక తత్కవివిరచితమైన మఱియొక గ్రంథ మేదేని మనకు లభించియుండినయెడల నందీకన్నడ పదప్రయోగములును

♦ పెదపాటి సోమనాథుఁడు కవిస్తుతులలో భీమకవిని జేర్కొనుటచేత వాని తరువాతివాఁడై యుండునని కందుకూరి వీరేశలింగం పంతులుగారు వ్రాసిరి.

గ్రామ్యగ్రాంథికభాషాతీతపదప్రయోగములును కొంతవఱకు తగ్గింపఁబడియుండునని నా నమ్మకము. రూపురేఖలంబట్టికుమారసంభవమున న్నెచోడుని ప్రథమప్రయత్నముగాఁ దోఁచుచున్నది. కవితానుభవము కలిగినకొలఁదిని బదప్రయోగమును రచనావిధానమును దమంతఁదామే సంస్కరింపఁబడుఁచు క్రొత్తశోభవహించుచుండును. వయసుమాఱుకొలఁది లోకానుభవము మీఱుకొలఁదిని బ్రపంచమున మానవుని జీవితమునందు మార్పులు కనఁబడుచున్నవి. అట్లే కవితాప్రపంచమునసైతము రచనానుభవమునుబట్టి కవికి రుచులు మారుట కలదు. మొగ్గ వీడుచున్నకొలఁదిని సౌందర్యసౌకుమార్యసౌరభ్యాదు లతిశయించురీతిగఁ గావ్యరచనగావించుకొలఁదిని భరితహృదయుండగు నీ కవితయందలి పదములును బదములతోడనే భావములును భావములతోడనే పాకాదులును క్రొత్తరుచులతో నొప్పుచుండును. విమర్శదృష్టితోఁ బరిశీలించినయెడల నీవిశేషములు మనయాంధ్ర కవీంద్రుల కావ్యరత్నములయందు గోచరింపకపోవు!

---

# ఓ చిన్ని మొలకా! ఓ చిట్టితరగా!

కవికొండల వెంకటరావుగారు, బి. ఏ.,

ఓ చిన్ని మొలకా!
ఊఁటకే కనిపించు ఓగడ్డిమొలకా?-
నీకు నెగడునె ఒక్క నీకైననిశ్శ్వాస
మున్నదే నీకొక్క ఒప్పైన యుచ్ఛ్వాస
మదిలేక యిదిలేక ఆ వీచుపెనుగాలి
నాటాడుదే నీటునెడలను మొలకా?

ఓచిట్టితరగా!
ఒడ్డునను విఱిగేటి ఓకూనతరగా
నీకు నెగడునె ఒక్క నిబ్బరపు మార్గంబు
ఉన్నదే నీకొక్క యున్నతపు టాశయం
బదిలేక యిదిలేక ఆపెద్ద గోదారి,
నోలాడుదే నీదు నురగలను తరగా!

మొలక!
నీ పరిమళపు పుష్పవికాసంబు
తరగ నీతెలినురగ సుందర హాసంబు
పెనుగాలి మఱపించి పెన్నదని మఱిపించి
మిన్నభావ ప్రభల మిన్నందజేసెడిని
చిన్నారి యో మొలక! ఓచిట్టి తరగా!

# కవిజనాశ్రయము

వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రి గారు

విమర్శకులారా! ఇప్పటికి ముద్రితములై యంద అగుచు లభించుచున్న యాంధ్రచ్ఛందో గ్రంథములలోఁ గావ్యాలంకార చూడామణియుఁ గవిజనాశ్రయమును బ్రాచీనతమములై యున్నవి. వీనిలోఁ గావ్యాలంకార చూడామణిలోని మొదటిరెండాశ్వాసములను బ్ర. శ్రీ. వేదము వెంకటరాయశాస్త్రిలవారు సంపాదించి పరిష్కరించి ముద్రించియున్నారు, దానికో అవడి నభాగమును, గవిజనాశ్రయమును మ. రా. శ్రీ, జయంతి రామయ్య పంతులవారు సంపాదించి పరిష్కరించి ముద్రింపించి యున్నారు. ఆగ్రంథములు విద్వద్విబుధపరీక్షకుఁ బఠనీయ గ్రంథములుగఁగూడ నెన్నుకొనఁబడినవి.

కవిజనాశ్రయ కావ్యాలంకార చూడామణులలోఁ గవిజనాశ్రయమే ప్రాచీనతరమనియుఁ, గవిజనాశ్రయకర్త వేములవాడ భీమకవియేయనియు రామయ్య పంతులవారు కవిజనాశ్రయపీఠికలో సిద్ధాంతము చేసి యున్నారు. ఈసిద్ధాంతము నంగీకరింపక కీర్తిశేషులగు రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులవారు మున్నగువారు ఆంధ్రకవుల చరిత్రాదులలోఁ జర్చించి యున్నారు.

కవిజనాశ్రయము రేచనకృతమన్నట్లు తద్గ్రంథమున ననేకస్థలములందుఁ గంఠోక్తముగ నున్నది. అట్లయినను వేములవాడ భీమన రేచనపేరుపెట్టి యీ గ్రంథమును రచించెదనని ప్రతిజ్ఞచేసినట్లు చెప్పినపద్యములు పరిషత్పుస్తకభాండాగారములోని 257వ నెంబరు గల కవిజనాశ్రయ మాతృకలో నవతారికగా నున్నవనియు నవి ప్రక్షిప్తములు కావనియు, వానినిబట్టి కవిజనాశ్రయము వేములవాడ భీమకవికృతమే యని విశ్వసింపఁదగుననియు రామయ్యపంతులవారు వ్రాసియున్నారు. మఱియుఁ గవిజనాశ్రయమునకు భీమనఛందస్సను పేరు ప్రసిద్ధమయి యున్నది.

"వికటకవులు కొన్నివింతలు కల్పించి
కవిజనాశ్రయమునఁ గలిపినారు
వానిఁ గైకొనంగవల దప్రయుక్తంబు
లేలచెప్పు భీముఁ డెఱిఁగియుండె"

అను నప్పకవి వాక్యమును,

"ఛందోనిబంధన చాతురీధౌరేయ
వాగ్ధాము వేములవాడభీము"

అను వాసిరాజు రామయ్యవాక్యమును రామయ్యపంతుల వారి పైయభిప్రాయములను బలపఱుచుచున్నవి. కాని యప్పకవియు వాసిరాజు రామయ్యయు భీమకవికి సమకాలికులు కామింజేసి వారివాక్యములంత ప్రబలప్రమాణము లనఁజాలము.

భీమకవి తాను గోమటిరేచన పేర గ్రంథమును రచించుచున్నట్లు చెప్పిన యవతారికాపద్యములు రామయ్యపంతులవా రుదాహరించినట్లొయొక్క మాతృకలో నుండెనే కాని మఱియేప్రతియందును గానరావు. "ఇంచుమించుగ ముప్పది నలువది కవిజనాశ్రయపుఁ దాళపత్రప్రతు లాంధ్రదేశమునను దక్షిణదేశమునను బరిశీలించితినిగాని యీపద్యములు నాకెందును గానరాలేదు." అని యిట్లు ప్రబంధరత్నావళి పీఠికలో బ్ర. శ్రీ. వేటూరి ప్రభాకరశాస్త్రిలవారు వ్రాసియున్నారు. మఱియు "పార్వతీపరమేశ్వరులే తమకుఁ దల్లిదండ్రులనుట శైవుల సంప్రదాయము.

భీమకవియు ద్రాక్షారామ భీమేశనందనుఁడనని చెప్పికొన్నాఁడు. ఇకఁ గవిజనాశ్రయకర్తగా గ్రంథమున నెఱుఁగఁబడు రేచన జైనుఁడు. శైవులకును జైనులకును బ్రచండద్వేషము" అని యిట్లువ్రాయుచుఁ బ్రభాకరశాస్త్రిలవారు కవిజనాశ్రయకర్త వేములవాడ భీమకవి కాఁడనియె తలంచిరి.

కవిజనాశ్రయకర్త వేములవాడ భీమకవియే యనుటకు జనశ్రుతియు నప్పకవ్యాదుల వాక్యములు

తప్ప వేఱొక ప్రబలమగు ప్రమాణ మగపడదు. అక్కారణమున నిప్పటికిఁ గవిజనాశ్రయ కర్తృత్వమును నిర్ణయించుట సుకరముకాదు. కాని కవిజనాశ్రయములోని కొన్ని విషయములనుబట్టి చూడఁగా నాగ్రంథము కావ్యాలంకారచూడామణికిఁ దర్వాతిదని మాత్రము విశదమగుచున్నది. గ్రంథములోని విషయములనుబట్టి తేలిన యంశమును జనశ్రుతులు చాటువులు మున్నగు దుర్బల ప్రమాణములు ఖండింపఁజాలవుగదా! కాఁగా, క్రీ. శ. 1350 ప్రాంతములోనిదగు చూడామణికిఁ దర్వాతిదగు కవిజనాశ్రయము పదునైదవ శతాబ్దారంభములోని దని యీక్రింది సందర్భమున విశదమగుచున్నది.

కావ్యాలంకారచూడామణికిఁ జాళుక్య విశ్వేశ్వరరాజు కృతిపతియై యున్నాఁడు. "విశాఖపట్టణ మండలములోని పంచతీర్థములయొద్దనున్న ధర్మలింగేశ్వర స్వామివారి యాలయములో నున్నచాళుక్యవిశ్వేశ్వరుని పుత్రుఁడగు నుపేంద్రుని తనయుఁడు నృసింహభూపుని శిలాశాసనమొకటి శా. శ. 1325 అనఁగా క్రీ. శ. 1403 సంవత్సరమునఁ బుట్టియుండుటంజేసి చాళుక్య విశ్వేశ్వరుఁడు క్రీ. శ. 1330 వఱకునుండి యుండు"నని యాంధ్రకవుల చరిత్రమువల్ల విశదపడుచున్నది. మఱియుఁ జూడామణిలోని కొన్నివిషయములనుబట్టి పరిశీలింపఁగా విశ్వేశ్వరకృతికమగు నాగ్రంథము క్రీ. శ. 1323 సంవత్సరమునకుఁ దర్వాతిదని స్పష్టమగుచున్నది.

ఎట్లన:—విద్యానాథ కృతమగు ప్రతాపరుద్రీయమును చాలవఱకు మూలముగాఁగొని విన్నకోట పెద్దనార్యుఁడు తనచూడామణిలోని యలంకారశాస్త్రభాగమును రచించియున్నాఁడని యీక్రింది సందర్భమువల్ల విశదమగుచున్నది. "శ్రుతికటు రూపదోష నిరాకరణాయ సౌకుమార్యం సమ్మతమ్; గ్రామ్యదోష నిరాకరణాయ కాన్తి స్స్వీకృతా; అపుష్టార్థనిరాకరణాయార్థవ్యక్తి ర్మతా; న్యూనాధికపదనిరాకరణాయ సమ్మితత్వం మతమ్; అనుచితార్థనిరాకరణార్థ ముదాత్తతా స్వీకృతా; విసంధినిరాకరణాయ శ్లిష్టత్వంమతమ్, పతత్ప్రకర్ష నిరాకరణాయ రీతి రిష్టా, క్లిష్టపరిహారాయ ప్రసాదోమతః; అశ్లీలపరిహారార్థ ముక్తిస్స్వీకృతా; చ్యుత సంస్కారపరిహారార్థం సౌశబ్ద్యమిష్టమ్; ప్రక్రమభంగ నిరాకరణాయ సమతా మతా; పరుషదోషనివృత్త్యర్థం ప్రేయా న్మతః;" (ప్రతాపరుద్రీయము గుణప్రకరణము 3. గద్యము) అను పయి విద్యానాథుని వాక్యములను జాలవఱకు నరుసకూడఁదప్పకుండ విన్నకోట పెద్దనార్యుఁడు తనగ్రంథమున దోషప్రకరణమున నీక్రింది రీతి నాంధ్రీకరించియున్నాఁడు.

క. శ్రుతిపరుషత మానుటకై
మతిఁ గర్తవ్యంబు సౌకుమార్యము చెప్పన్
జతురతఁ గాంతిఘటించుట
వితతగ్రామ్యార్థహరణ విశ్రుతిఁజేయన్.

క. కృతుల న పుష్టార్థప్రవి
హతికొఱకై చూనుపవలయు నర్థవ్యక్తిన్
వితతన్యూనాధికపద
యుతిహతికై సమ్మతంబు నొప్పం గవితన్.

తే. గీ. అనుచితార్థ నిరాకరణాప్తి కొఱకు
నగు నుదాత్తతఁ గావ్యంబులందుఁ జూనుప
యుక్తపాదవిసంధి విచ్యుతి యొనర్చు
పనికి నూర్జతి కర్జంబు పద్యములను.

ఆ. వె. తుదిఁ బతత్ప్రకర్ష దోషాపహతికినై
యుక్తరీతిఁ గావ్య మొగి నొనర్ప
నప్రతీతక పరిహారంబు కొఱకునై
సుప్రసాదగుణముఁ జూనుపవలయు.

క. చ్యుతసంస్కృతి మానుటకై
యతిమధుర సుశబ్దవృత్తి నగు నొనరింపన్
బ్రతతప్రక్రమభంగా
హతికై యల సమతఁగూర్ప నగునంద్రుఁబుధుల్.

క. ప్రేయోలంకారము దా
శ్రేయంబుగఁ బరుషదోషశిథిలతకొఱకై
చేయఁదగు సూక్తితంత్రము
హేయాశ్లీలంబుఁ దొలఁగ నెగచుటకొఱకై

(కావ్యాలంకారచూడామణి షష్ఠోల్లాసము-137-142)

ఇట్టి సామ్యములు గ్రంథద్వయమునందును ననేకస్థలములందుఁ గానవచ్చుచున్నవి. ఇట్టిసామ్యములను బట్టి ప్రతాపరుద్రీయమునకుఁ గావ్యాలంకారచూడామణి యాంధ్రీకరణమో లేక కావ్యాలంకారచూడామణికే ప్రతాపరుద్రీయము సంస్కృతీకరణమో యై

యుండవలయునని యెవ్వరికేనితోఁచకపోదు. కాని పైని జెప్పఁబడిన గుణదోషములసందర్భము కావ్యాలంకార చూడామణిలోని గుణదోష సందర్భమున కింతమాత్రము నుసంగతమై యుండలేదు. చూడామణిలోని కాంతిగుణ మందలి గ్రామ్యదోషమును నివారింపఁజాలదు. 'ఉదాత్తత ఊర్జిత రీతి సమ్మితము ఉక్తి' అను గుణములే చూడామణిలోఁ జెప్పఁబడలేదు. ఈసందర్భ మెల్లఁ బ్రతాపరుద్రీయమున సుసంగతమై యున్నది. పైకారణములచేఁ గావ్యాలంకార చూడామణియే ప్రతాపరుద్రీయమును మూలముగాఁ బెట్టికొని చాలవఱకు రచింపఁబడె నని నిస్సందేహముగా నిర్ణయింపవచ్చును. కావున విద్యానాథుని సత్కరించిన యీ ద్వితీయప్రతాపరుద్రుఁడు క్రీ. శ. 1323 సంవత్సరముతోఁ దుదిముట్టె నను సుప్రసిద్ధమగుటంజేసి ప్రతాపరుద్రీయానుకారి యగుకావ్యాలంకార చూడామణి తదనంతరమునఁ గొంత కాలమునకుఁ బిమ్మట రచితమయ్యెననుట నిశ్చయము. మఱియుఁ గావ్యాలంకారచూడామణికర్త మధ్యాక్కర పద్యములకుఁ జతుర్థగణాదియతినిల్పవలయునని లక్షణము చెప్పుటకూడ నాతఁడు క్రీ. శ. 1350 ప్రాంతములోని యెఱ్ఱాప్రగడకుఁ దర్వాతివాఁడని చెప్పుటకు మంచినిదర్శనమై యున్నది. మధ్యాక్కరపద్యములు పదవశతాబ్దపు యుద్ధమల్లుని బెజవాడశాసనమునందును బదునొకండవ శతాబ్దపు నన్నయభట్టారకుని భారతభాగమునందును నెఱ్ఱాప్రెగడ భారతారణ్యపర్వశేషమునందును దప్ప మఱెచ్చటను నగపడకున్నవి. అందు బెజవాడశాసన మధ్యాక్కరలలోను నన్నయమధ్యాక్కరలలోను బంచమగణాదినే యతి నిల్పఁబడియున్నది. అట్టియతి పాదాంత్యమునకు సమీపస్థమగుటచేఁ బాదాద్యక్షరమునకుదూరమై శ్రుతిసుఖకరము కాదని కావలయు నెఱ్ఱాప్రెగడ పాదమధ్యమున నడఁగాఁ జతుర్థగణాదిని తనమధ్యాక్కర పద్యములలో యతిని నిల్పియున్నాఁడు.

మహాకవులలక్ష్యములను బట్టియే లక్షణములు చెప్పఁబడుట లక్షణశాస్త్రసంప్రదాయమగుటంజేసి నన్నయాక్కరలకు విలక్షణముగాఁ జతుర్థగణాదిని యతిని నిల్పవలెనని చెప్పుచున్న కావ్యాలంకారచూడామణి చతుర్థగణాదిని యతిని బ్రయోగించియున్న యెఱ్ఱాప్రెగడకుఁ దర్వాతిదేయని నొక్కి వక్కాణింపఁదగియున్నది. ఇట్టిస్థితిలో లక్షణశాస్త్రసంప్రదాయ విరుద్ధముగా మ. రా. శ్రీ. జయంతిరామయ్యపంతులవారు "మఱియు నీగ్రంథమున మధ్యాక్కరకుఁ బ్రతిపాదమునందును నాల్గవగణము మొదట యతి విధింపఁబడినది. ఇది యాధునికమతము నన్నయభట్టుకాలమున యతి యైదవగణము మొదట నుండినట్లు భారతమువలన విశదమగును. తిక్కనసోమయాజికవిత్వములో మధ్యాక్కరలు నాకుఁ గనఁబడలేదు. కాని యెఱ్ఱాప్రెగడ కృతమగు నారణ్యపర్వశేషమందు యతి చతుర్థగణాదియందె యున్నది. ఈమార్పు నన్నయ్యభట్టునకును నెఱ్ఱాప్రెగడకును మధ్యకాలములో జరిగియుండవలయును..."అని యిట్లు వ్రాయుట మిక్కిలి వింతగ నున్నది. మహాకవిప్రయోగములను బట్టియే లక్షణగ్రంథములు కల్పింపఁబడుట సంప్రదాయసిద్ధమగుటంజేసి నన్నయభట్టు ప్రయోగములకు విరుద్ధముగాఁ బ్రమాణాంతరము లేక లక్షణకర్తలు లక్షణము నొనరించి రనుట యుక్తము కాదుగదా. కావునఁ గావ్యాలంకారచూడామణి యెఱ్ఱాప్రెగడ ప్రయోగములనే యాధారముగఁ గొని యట్లు లక్షణము చెప్పెననుటకు సందేహము లేదు. ఇంతయేల!

తే. గీ. అచ్చుపరమైనపట్టున......కవిత్రయాను మతిని." అను కావ్యాలంకారచూడామణిలోని నవమోల్లాసమందలి పద్యమువలనఁ గావ్యాలంకారచూడామణి యెఱ్ఱాప్రెగడకుఁ దర్వాతిదేయనుట నిశ్చితమగుచున్నది గదా! పైపద్యము కొన్ని తాళపత్రమాతృకలలో లేదనిరి. గాని యది ప్రక్షిప్తమనిమాత్రము రామయ్యపంతులవారు చెప్పియుండలేదు. వెనుక నుదాహరించిన గ్రంథస్థసాక్ష్యముచేఁ గావ్యాలంకారచూడామణి క్రీ. శ. 1323సంవత్సరపు ప్రాంతములోనిదగు ప్రతాపరుద్రీయమునకుఁ దర్వాతిదనుట నిశ్చయమగుటంజేసి యాపద్యము చూడామణిలో నుండుట సుసంగతమయియే యున్నది. పై సందర్భమును బట్టి కావ్యాలంకార చూడామణి క్రీ. శ. 1323 సంవత్సరమువఱకు రాజ్యపాలనముచేసిన ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమునకును క్రీ. శ. 1350 సంవత్సర ప్రాంతములోనివాఁడగు నెఱ్ఱాప్రెగడ కాలమునకును దర్వాతిదని సిద్ధాంతితమగుచున్నదిగదా.

ఇఁకఁ బైరీతినే కవిజనాశ్రయమును గావ్యాలంకారచూడామణిని బట్టి పరిశీలించినచోఁ గవిజనాశ్రయము కావ్యాలంకారచూడామణికిఁ దర్వాతివనుసిద్ధాంతము స్థిరపడఁగలదు. అట్లగుటం జేసి పుక్కిటిపురాణములు నిర్మూలములగు చాటుపద్యములుమున్నగు దుర్బలప్రమాణముల నాధారముగాఁజేసికొని కవిజనాశ్రయము చూడామణికిఁ బూర్వకాలపుదనియుఁ, బండ్రెండవశతాబ్దపుదనియుఁ దలంచుట యుక్తముకాదు.

కవిజనాశ్రయము కావ్యాలంకార చూడామణికి దరువాతిదని యాగ్రంథములలోని విషయములే విశదీకరింపఁజాలియున్నవి. ఆగ్రంథద్వయమును ఛందోవిషయము నే ప్రతిపాదించుచునదగుటచేత వానియందు విషయైక్యమున్నను నద్దానివలన వానిలో నొకదానికి వేఱొకటి మూలమని నిర్ణయించుటకు వలనుపడదు. కాని వానియందలి పద్యైక్యములవల్ల మాత్రము వానిలో నేదే నొకటి వేఱొకటికి మూలమై యుండునని నిర్ణయింపఁజాలుదనను టకు సందేహ ముండదు. అట్టిపద్యైక్యములవలనఁ దత్కవులలో నొకరు వేఱొకరిగ్రంథము నాధారముగాఁ జేసికొని యుండిరనియుఁ బద్యచౌర్యమనిపించుకొనని కొన్నియప్రధానస్థలములందుఁ బద్యానుకరణమును జేసియుండిరనియు, నెవ్వరికేని దోఁచకపోదుగదా!

క. ప్రపరాపసమనుసుప్ర
త్యపినిర్దురధి న్యుపాభ్యుదాఙ్వ్యత్యవప
ర్యుపసర్గ వింశతివ
ఖ్యపరిస్ఫురయుక్తమైన నుభయము చెల్లున్.

కావ్యాలంకార. తాళపత్రప్రతి. 7 ఉ.
కవిజనాశ్రయ సంజ్ఞాధికార. 87 పద్య.

క. భాసురములగుచు సుకర
ప్రాసానుప్రాసదుష్కరప్రాసాంత్య
ప్రాసద్వంద్వత్రితయ
ప్రాసములవ షడ్విధములు పరగుం గృతులన్.

కావ్యాలం. తాళపత్రప్రతి. 7 ఉల్లా.

.........ప్రాసద్విప్రాసత్రిప్రాస.........

కవిజనా. సంజ్ఞా. 76 పద్య.

క. వలసినచో శిలములు వల
ములు మజెబులు క్రాంతవర్ణములు ప్రాసముల్లై
యులవడు సత్కవికృతులన్
నిలుపందగు వానిఁ దెలిసి నియతస్థితిన్.

క. తాళము తాలమునాఁజను
జోళుఁడు చోడుండునాఁగ సొంపగుఁ గృతులన్
వ్యాళము వ్యాడము వ్యాలము
లోలిని సమరూఢిఁ బ్రాస యుక్తిం జెల్లున్.

తే. గీ. భీకరాకారుఁడయ్యె నంగీ (భీ-కవిజ) కృతుండు
మేదురక్రోధుఁ డయ్యె ననాదృతుండు
పాపనాత్మకుఁ డయ్యె ఖలాన్వితుండు
నాఁగఁ బ్రాసంబులకు సమానంబు లెపుడు.

కావ్యాలం. 7 ఉల్లా. 85, 86, 87, పద్య.
కవిజనా. సంజ్ఞా. 90, 91, 92 పద్య.

శ్రీవృత్తము:—

శ్రీ శ్రీ గ జే యున్.

కావ్యా. 7 ఉల్లా. 90 ప.
కవిజ. వృత్తా. 5 ప.

నారీవృత్తము.

నారీవృత్తారంభం బాదున్మా కారంబై.

కావ్యాలం. 7 ఉల్లా. 9 ప.
కవిజ. వృత్తా. 9 ప.

కన్యావృత్తము.

పొత్తై మాగా వృత్తిం గన్యా
వృత్తం బయ్యెన్ జిత్తం బారన్.

కావ్యాలం 7 ఉల్లా 92 ప.

పొత్తై గాగా వృత్తిం గన్యా
వృత్తం బయ్యెన్ జిత్తం బారన్.

కవిజ వృత్తా 12 ప.

పయిరీతినున్నపద్యైక్యములవలన వానిలో నేదే నొకదానినుండి తక్కినదానిలోఁ బద్యానుకరణము చేయఁబడెనని గ్రహింపక తీరదుగదా. ఇఁక వీనిలోని విషయములలో నెందులోనివిషయములు తక్కినదానిలోని విషయములను ననరించుచున్నట్లుండునో? ఏదానియందు విషయాతిశయ మగపడుచుండునో? యది తక్కినదానికిఁ దర్వాతిదని గ్రహింపవలసియున్నది. ఇట్టి యభిప్రాయముతో గ్రంథద్వయము సామూలాగ్రముగాఁ బరిశీలింపఁగాఁ గావ్యాలంకార చూడామణినే కవిజనాశ్రయము ననరించుచున్నట్లును కవిజనాశ్రయ మే

# శ్రీ కృష్ణ భారతము

కవిరాజు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారు

వ. ............నామేనర్పంబూనిన శ్రీకృష్ణభారతంబునకుం గథాక్రమం బెట్టిదనిన
నైమిశారణ్యపుణ్యక్షేత్రనివాసులగు శౌనకాదిమహర్షులు హర్షోత్కర్షంబున ద్వాద
శవార్షికోత్తమసత్రయాగంబు గావించుచు సమాగతుం డైన రోమహర్షణపుత్త్రుం
డుగ్రశ్రవుం డను సూతు నర్చించి స్వాగతంబు వలుకుచు నెచ్చటినుండి వచ్చితి వేమివృ
త్తాంతం బని యడిగిన నతండు వారి కభివందనం బాచరించి యిట్లని చెప్పం దొడంగె.

శా. ప్రద్వేషించి పరీక్షిదాత్మజుఁడు సర్పవ్రాతము న్వ్రేల్చుచో
విద్వాంసు ల్వినుచుండఁ బార్థివునకు న్విచ్చేసి తా విన్పెఁ గృ
ష్ణద్వైపాయనమౌనికృద్వివిధపుణ్యప్రస్తుతాఖ్యానముల్
సద్వేద్యంబుగఁ బండితోత్తముఁడు వైశంపాయనుం డచ్చోటన్. ౧౨౫

ఉ. భారతసంశ్రితంబు లయి భాసిలునట్టిమహావిచిత్రపుం
ధోరణు లెల్ల నే విని ప్రతుష్టమనస్కుఁడ నై మహాస్థలుల్
భూరినదీనదంబులును బుణ్యనగంబులు దాఁటి వచ్చితిన్
మీకు పౌనర్చ్యసత్రము తమిం గని పోవ్రతలంపు పెంపునన్. ౧౨౬


తే. అనిన శౌనకముఖ్యు లిట్లనిరి ధర్మ, శాస్త్రములు పుణ్యవృత్తముల్ సత్పురాణ
కథలు నీ వెఱుంగుదు మాకుఁ గౌతుకంబు, భారతామ్నాయము వినంగ భూరితేజ!

వ. అనుటయు నక్కథకుండు. ౧౨౭

మ. సరగన్ సత్యవతీపరాశరులకున్ జన్మించి సత్త్వంబున
స్వరుస స్వేదము లచ్చుకట్టియుఁ బురాణంబు ల్వినిర్మించి ధ
ర్మరహస్యార్థము లెల్లఁ దేట పడఁగా మర్త్యాళి రక్షించు మ
ద్గురునిన్ సన్నుతసన్మునిప్రవరుఁ గొల్తున్ వ్యాసభట్టారకున్. ౧౨౮

వ. అని వినుతించి పరుండును బరాపరుండును బురాణుండును బురుషుండు నగు పుండరీకా
క్షునకు నమస్కరించి యిట్లనియె......

ఆదిపర్వము ఆ. ౧.



ఛందోవిషయబాహుళ్యముతో నున్నట్లును నెవ్వరికేని తోఁచకమానదు. ఆ విషయము చదువరులకు విశదపడుట కయి యిచటఁగొంతవఱకుఁ జూపుచున్నాను.

చూడామణికర్త గణాధిదేవతలను గణఫలములను మాత్రమే చెప్పియున్నాఁడు. అట్లుచెప్పుటలోఁ గూడఁ గృతిముఖమున నాగణములలో దేనిని ఘటించినను గర్త కనుకూలఫలమే గల్గునని చెప్పెను.

క. ధీ శ్రీ స్త్రీ మ న మగణము
విశ్రుత మధిదైవతంబు విశ్వంభర, ని
త్యశ్రీల నొసఁగు మగణ
ప్రశ్రేయముఖకవితచెప్పఁ బనిఁ దనుఁ దలఁపన్.

క. గతికై ఫణివసుధాసని
మతిఁ దలఁచిన సగణ మయ్యె మారుత మధిదై
వతమంద్రు సగణముఖమగు
కృతిపగఱకు మగుడు లేని కీడొనరించున్.

కావ్యాలం. 7. ఉల్లా: 11-14.

దుష్టఫలములనిచ్చుగణ మాదుష్టఫలములను శత్రుల కిచ్చునన్నచో నదియు శుభగణమే యనఁదగునుగదా! ఈపక్షమున గణముల శుభాశుభఫలములను వర్ణించుటయే వ్యర్థమగుచున్నది, ఈమార్గమునకు "శుభవర్ణా శ్శుభశబ్దా యే చ శుభగణా స్త ఏవ కావ్యాదౌ" అనుమొదలగు కృత్యాద్యవస్థాని రూపణము ప్రతికూలమే యగును. కావుననే కవిజనాశ్రయకర్త యీమార్గము నుపేక్షించి తత్తద్గణాదుల శుభాశుభఫలంబులను విపులముగా నుదాహరించియున్నాఁడు. మఱియు గణాధిదేవతలనే కాక గణములరంగులు గ్రహములు కులములు గోత్రములు నక్షత్రములు రాసులు యోనులు లింగములు బీజాక్షరములు వానివానివలనఁ గల్గు శుభాశుభఫలములును సంప్రదాయ సిద్ధముగా విశదీకరించియున్నాఁడు.

ఒకవేళ ఛందోవిషయమున నంతప్రధానములు కామింజేసి పైవిషయములు చూడామణికర్త సంక్షేపించి చెప్పె ననరాదా యని శంకింతురేమో? ఆకాలమందీవిషయము లప్రధానములనుటలం దెంతమాత్రమును లేదు. కొందఱు ఛందోగ్రంథకర్తలు యతిప్రాసపద్యాది లక్షణములను జెప్పక యుపేక్షించియు నీవర్ణగణాది శుద్ధివిషయమునే గ్రంథమందుఁ బూర్ణముగఁ జెప్పి యున్నారు. ఒకవేళ కొంతసంక్షేపించినను నవంతామాత్యాదులవలె సంక్షేపించి చెప్పుట యుక్తముగాని యేగణము మొదటఁ జెప్పినను గర్తకు శుభఫలమే గల్గునని చెప్పుటయు, శ్రీకారాది భద్రాదివాచక శబ్దములను మొదట నిల్పుట శుభదాయకమనియైనఁ జెప్పకుండుటయు నవీనతకు లక్షణములగునా? కవిజనాశ్రయము కన్నఁ జూడామణి నవీనమే యగునపుడు కవిజనాశ్రయములోని వర్ణగణాదిశుద్ధివిషయములను జూచియుఁ బైరీతిని గ్రంథకర్త చెప్పియుండునా? కావున విషయ బహుళమగుటంజేసి కవిజనాశ్రయమే నవీనమని గ్రహింపవలసియున్నది.

యతులసందర్భము కూడఁ గవిజనాశ్రయపునవీనతనువిశదపఱచుచున్నది. చూడామణిలో నాదేశవళియు, దేశీయవళియు, వృద్ధివళియు ననుమూఁడుయతులు కవిజనాశ్రయముకన్న నధికముగాఁ జెప్పఁబడినవి. కాని కవిజనాశ్రయములో నున్నయఖండయతి చూడామణిలోఁ జెప్పఁబడలేదు. ఈసందర్భమును జూచి భ్రమించి రామయ్యపంతులవారు "గ్రంథనిర్మాణకాలమును నిర్ణయించుటకుఁ గొంతవఱకనుకూలపడు నంశములు రెండు కవిజనాశ్రయమునందే కలవు. ఈగ్రంథమునందు బదివిధములగుయతులు చెప్పఁబడినవి. కావ్యాలంకారచూడామణి యందుఁ బదిరెండువళ్లు చెప్పఁబడినవి. అనంతుఁ డిరువదినాల్గు విశ్రమములు, నామీఁదఁ గొందఱు కవిగ్రామణు లిరువదియు నేడును విశ్రమములం జెప్పినట్లు అప్పకవి చెప్పియున్నాఁడు. యతులసంఖ్య కాలక్రమమున వృద్ధియైనట్లు తేలుచున్నది. కవిజనాశ్రయములోఁ జెప్పఁబడిన యతులసంఖ్య యన్నిటికంటెఁ దక్కువది. కావున నాగ్రంథమే యన్నిటిలోఁ బ్రాచీనమైనదని యూహింపవచ్చును." అని యిట్లు కవిజనాశ్రయ పీఠికలో వ్రాసియున్నారు. చూడామణిలోనియాదేశవళి దేశీయవళులే కాక యింకను ననేకస్థలములందలియుభయయతులను సాధించెడి యఖండయతి కవిజనాశ్రయమునఁ జెప్పఁబడియుండుటచే యతివిషయము కవిజనాశ్రయమునందే యధికమనియు నకారణమున నదియే పరకాలికమనియు నంగీకరింపక తీరదు. స్వరసంధిజరుగునపు డాసంధ్యక్షరము యతిస్థానములో నుండెనేని

యాసంధ్యక్షరము నఖండముగా భావించి ప్రాణియతిని వేసికొనవచ్చుననియు, నచట విఱుఁగెడు స్వరమునకుఁ గూడ వేసికొనవచ్చుననియు, మహాకవి ప్రయోగము లుండుటచే నిట్టియెడలను నఖండయతి యంగీకరింపఁబడె ననియుఁ గవిజనాశ్రయకర్త చెప్పియుండుటచేఁ జూడామణిలోని యాదేశయత్యాదులే కాక యెల్లయుభయయతులును నీయఖండయతిలోని యవాంతరభేదములే యగును. పృథక్ప్రయోగ యోగ్యతలేని ప్రాదులసంధి నిత్యసమాససంధిలోని దగుటచేఁ బ్రత్యయాదుల సంధిలోవలె హల్లునకేగాని యచ్చునకు యతి చెల్లదేమో యనుశంకను వారించుట కుపసర్గ యతిని, స్వరమే విఱుఁగనిప్లుతమున స్వరయతి చెల్లుటకై ప్లుతయతిని జెప్పవలసెను గాని హల్లునకు యతిచెందుననుట కీయఖండయతియంగీకారమే సమర్థమై యుండును. తుదకుఁ జూడామణిలోఁ జేర్పఁబడిన వృద్ధియతి కూడ, స్వరయతిసందర్భములోఁ జెప్పఁబడక యుభయయతి సందర్భములోఁ జెప్పఁబడి యుండుటచేతను వృద్ధిసంధితో సంబంధమే లేని సోదరశబ్దమందు గ్రహింపఁబడియుండుటచేతను నందలియైకైకనాకాకశ్శబ్దములు ఉభయ యతిలక్ష్యములుకూడ నగుచేతను నఖండయతి భేదము నుభయయతి విశేషమనియే గ్రంథకర్త యభిప్రాయమై యుండునని తోఁచుచున్నది.

కవిజనాశ్రయములోని వృత్తాధికారసందర్భము సైతమయ్యది కావ్యాలంకారచూడామణికిఁ దర్వాతిదే యని నిర్ణయింపుచున్నది.

కావ్యాలంకారచూడామణియందుఁ బంచమచ్ఛందస్సుతుదివఱకును పాదము లత్యంతహ్రస్వములగుటచే రెండేసిపాదములలోఁ దల్లక్షణము లిముడవనికావలయును నాల్గుపాదములతోను నాయావృత్తములలక్షణములాయావృత్తములతోనె చెప్పఁబడినవి. ఆయాఛందస్సులలోఁ బ్రస్తారవశమునఁ బుట్టెడివృత్తపరంపరలో శ్రుతిసుఖకరములగువృత్తములకే నామకల్పనము చేసి చూపఁబడుచుండుట సకలచ్ఛందోలక్షణగ్రంథములకును సహజమై యున్నది. మఱియు నిట్టికేవల హ్రస్వపాదములతోనుండు వృత్తములు కవులలక్ష్యములందు మృగ్యములనఁ దగియే యున్నను ఛాందసప్రసిద్ధిని బట్టియు ప్రస్తారన్యాయసిద్ధమగు యుక్తినిఁబట్టియు లక్షణకర్తలు వారిని జూపిరని యూహింపవలసియున్నది. ఇట్లే

"న పర్యంతోఽస్తి వృత్తానాం
ప్రస్తారగణనా విధౌ,
పూర్వాచార్యకృతం వృత్తం
చిహ్నం కించి దిహోచ్యతే"

అని యిట్లు హలాయుధవృత్తియందును. "పురాణభారతాదిషు మహాకవి ప్రణీతకావ్యేషుచ ఉక్తాదీనాం ప్రయోగా దర్శనా తాని సూత్రకారేణ పరిత్యక్తాని", అని తద్వ్యాఖ్యయందును జెప్పఁబడియున్నది. పింగళసూత్రములలో వైవ్యాఖ్యాత వ్రాసినట్లే అయిదవ ఛందము తుదిదాఁక వృత్తముల నుదాహరింపకున్నను ప్రాకృతపైంగళాదులనుబట్టి కాఁబోలు చూడామణికర్త వానియందు సైతము కొన్నివృత్తములను జేర్చియున్నాఁడు. ప్రథమచ్ఛందస్సునఁ బ్రాసమునకుఁ బ్రసక్తియే లేకుండుటచే రెండవఛందము మొదలుగ ప్రాసనియమమును బాటింపసాగెను. సంస్కృతమునఁ బాదములు కొంత దీర్ఘములగునపుడే యుచ్చారణ సౌకర్యమునకై పదచ్ఛేదరూపయతి పాదమధ్యమున నంగీకరింపఁ బడినది. పింగళసూత్రములందును వృత్తరత్నాకరమునందును బన్రెండవ ఛందస్సువఱకు యతినియమమే లేదు. పన్రెండుమున్నగు వానిలోఁగూడఁ గొన్నివృత్తములకే యతినియమ మగపడుచున్నది. పదునాఱవఛందము మొదలు కొని మాత్రమే నియతముగాఁ బదచ్ఛేదరూపయతి పాటింపఁబడెను. అట్లయినను హలాయుధవృత్తి మున్నగు వానిలో నేడవఛందము మొదలుగనే పదచ్ఛేద రూపయతినియమము కొన్నివృత్తములకుఁ జేర్పఁబడెను. నాగవర్మకృత కర్ణాటఛందస్సులోఁ బదవఛందము మొదలుగఁ బదచ్ఛేదరూపయతి కన్నడమందు నియమింపఁబడెను. కావ్యాలంకారచూడామణికర్త పైకన్నడ మార్గము ననుసరించియే పదవఛందము మొదలుకొని యాంధ్రమునందు వర్ణసాజాత్యరూపయతి నిలుపవలయునని నియమించియున్నాఁడు. ఆఱవఛందము మొదలుకొని రెండేసిపాదములలో నాయావృత్తలక్షణము లయ్యావృత్తములలో నిమిడిపోవుననియు గ్రంథవిస్తరమేలయనియు, నర్థగౌరవము పాటింపఁదగుననియుఁ జెప్పి

రెండేసి పాదములతోనే యాయావృత్తముల లక్షణములు కావ్యాలంకారచూడామణికర్త చెప్పియున్నాఁడు.

క. ఇందుండియుఁ గరణీయ
 చ్ఛందోవృత్తముల నర్థసంజ్ఞితములుగా
 నొందింతు గ్రంథవిస్తృతి
 కెందునకుం గాక యర్థగౌరవమొప్పన్.

కావ్యాలంకారచూ 7. ఉల్లాస.

పింగళసూత్రములలోఁ బండ్రెండవఛందస్సుతో నధ్యాయపరిసమాప్తి యుండుటచేఁ గావలయుఁ గావ్యాలంకారచూడామణికర్తయుఁ బండ్రెండవ ఛందముతో సప్తమోల్లాసమును ముగించియున్నాఁడు.

పయిరీతిని జూడామణికర్త రెండేసిపాదములతోనే యాయావృత్తములలక్షణములను జెప్పుచుండుటచే వాని యతిస్థానములసంఖ్యను జెప్పుటకుఁ జోటుచాలదనియో పాదములు కేవలదీర్ఘములు కామింజేసి లక్ష్యములనుబట్టి యే యతిస్థానములను సుకరముగ గ్రహింపవచ్చుననియో పదుమూఁడవ ఛందముతుదిదాఁక (ఒక్క-విశ్వేదేవీవృత్తమునఁ దక్క-) నియమముగా యతిస్థానసంఖ్యను జేర్కొ-నలేదు. తర్వాతఁ బదునాల్గు పదునేను పదునాఱు ఛందస్సులలోననియతముగాఁ గొన్నివృత్తములందుఁ జెప్పియుఁ గొన్నిటియందుఁ జెప్పకుండియు నడచియున్నాఁడు. పదునేడవఛందము మొదలుకొని తుదిదాఁకఁ బాదములు కేవలదీర్ఘములగుటచేఁ దగినంతయవకాశ మున్నదనియో పాదము లత్యంతదీర్ఘము లగుటచే యతిస్థానమును జెప్పకున్నచో గ్రహించుట యంతసుకరముగ నుండదనియో నియతముగా యతిస్థానసంఖ్యను జేర్కొ-నుచు వచ్చెను. (కవిరాజవిరాజితమంగళమహాశ్రీవృత్తములందుఁదక్క-.)

పైవిషయము లన్నిటియందును గవిజనాశ్రయము పూర్తిగఁ జూడామణి ననుసరించుచునే యున్నది. "ఇక్క-డినుండి రెండుపాదములతోనే వృత్తలక్షణములు చెప్పఁబడు" నని చెప్పుటయుఁ బండ్రెండవ ఛందస్సుతో నాశ్వాసమును ముగించుటయు ననావశ్యకములని తలఁచి కావలయుఁ జూడామణిలోని యారెండు విషయములను మాత్ర ముపేక్షించెను. పింగళసూత్రములలోఁ బండ్రెండవఛందము తుదిదాఁకఁ బదచ్ఛేదరూపయతి నియమము జేర్కొ-నకుండుటయుఁ బదుమూఁడవ ఛందము మొదలుకొని యతినియమమును జేర్కొ-నుట కారంభించుటయు ననుభేద ముండుటచేఁ బండ్రెండవఛందముతో నంద ధ్యాయపరిసమాప్తిచేయుట యుక్తముగాని యట్టిభేదము లేమియు లేని యాంధ్రచ్ఛందముల విషయమున నట్లు చేయుట యేమి యావశ్యకమని తలఁచికావలయుఁ గవిజనాశ్రయకర్త యవ్విషయమునఁ జూడామణిని సవరించి తనగ్రంథమును నడపెనని గ్రహింపవలయును. చూడామణితోఁ గవిజనాశ్రయమునకుఁ బైరీతి గ్రంథసామ్యమును సవరణలును నుండుటయే కవిజనాశ్రయమునకుఁ గల చూడామణ్యనుకారమునకుఁ బ్రబలనిదర్శన మని చెప్పవచ్చునుగదా. అనంతామాత్యాప్పకవ్యాదుల గ్రంథములు పైవిషయమునఁ బైరీతిసామ్యముతో నుండలేదు. అవి విభిన్నమార్గమున నున్నవి.

ఆయాఛందస్సులలోని వృత్తములను వివరించిన సందర్భముకూడఁ జూడామణికిఁ దర్వాతిదే కవిజనాశ్రయమని నిర్ణయించుచున్నది. ఇరువదియాఱు ఛందస్సులను జేర్కొ-ని వానియందలివృత్తములను వివరించు సందర్భమున నాయాఛందస్సులలోఁ బ్రస్తారవశమున బుట్టినవృత్తముల మొత్తపుసంఖ్యలు కవిజనాశ్రయమునఁ జేర్కొ-నఁబడినవి. కాని చూడామణిలోఁ జేర్కొ-నఁబడలేదు. మఱియు నాయాఛందస్సులలోనివృత్తములను జేర్కొ-నుటలో నేవో నడకసరిగాలేని యొకటిరెండు వృత్తములను విడిచినను గవిజనాశ్రయకర్తచూడామణిలోఁ జెప్పఁబడిన వృత్తములనెల్ల వరుసగా నుదాహరించుచుఁ బ్రతిఛందస్సునందును నేవో కొన్నినూతనవృత్తములను జేర్చుచునే వచ్చెను. తొమ్మిదవఛందస్సునఱకుఁ గలవృత్తములకు వాఙ్మయములో నంతప్రచారము లేమింజేసి యనంతామాత్యాదులు కొంతతక్కు-వచేసి వృత్తములను జెప్పిరికాని పదవఛందస్సు మొదలుకొని యిరువదియాఱవఛందము ముగియువఱకు నుత్తరోత్తరులెవ్వరును బూర్వపూర్వులకన్న వృత్తసంఖ్యను సంక్షేపించియుండలేదు. ఏదేనొకటి నడకసరిలేనిది విడువఁబడిన విడువఁబడుఁగాక! ఇంకొక చిత్రము. కవిజనాశ్రయకావ్యాలంకారచూడామణులలోని వృత్తముల నుదాహరించిన వరుసకూడఁ జాలవఱకు సరిపడుచుండును. కొన్నియలంతి స్థలములందు లేఖకముద్రాపకాదుల ప్రమాదమున నించుక తప్పినందప్పుగాక! ఆయాఛందము

లలోని వృత్తము నుదాహరించుటలో నప్పకవివలెను నెవ్వరును ప్రస్తారక్రమమున నుదాహరింపలేదు. అట్లే దేవి నియమము లేనందున ముందటిదానిని జూడనపు డొక గ్రంథములో నివరుస వేఱొక గ్రంథములో నివరుసకు సరిపడియుండదు. కాని యీరెండు గ్రంథములందును నట్లుగాక తెలుచుగా వృత్తముల నుదాహరించువరుసయుఁ దుల్యముగ నుండును. అందుఁ గవిజనాశ్రయములో నసేకఛందములందు నూతనవృత్తములు చేర్పఁబడుచువచ్చెను. ఈకారణములచేఁ గవిజనాశ్రయకర్త కావ్యాలంకారచూడామణి చూచియే తనకవిజనాశ్రయమును రచింపసాగెనని యెవ్వరికేని తోఁచకపోదుగదా!

యతిస్థానమున హల్లులసంయోగ ముండునపు డా సంయుక్తవర్ణములలో దేనికైన నొకదానికి యతివేసికొనినం జాలును. ఈవిషయమును జెప్పుదానికిఁ జూడామణికర్త ద్వ్యక్షరత్ర్యక్షరయతియని పేరిడెను. "సౌక్ష్మ్యము, విలసత్క్ష్మానాథులు" మున్నగుస్థలములందు నాలుగుహల్లుల సంయోగముగూడ నగపడుచుండుటచే నాపేరుపొసఁగదయ్యె. అక్కారణముననే కాఁబోలును గవిజనాశ్రయకర్త చూడామణిలోనియా పేరు నుపేక్షించి దానికి సంయుక్తయతియని పేరుపెట్టెను. ఉత్తరోత్తరులగు ననంతాప్పకవ్యాదులును నీపేరినే గ్రహించిరి. చూడామణికర్త కవిజనాశ్రయమునకుఁ దర్వాతివాఁడే యయ్యెనేని యవ్యాప్తిదోషదూషితమగు ద్వ్యక్షరత్ర్యక్షరయతి యన్న పేరిని గ్రహించియుండునా?

అయహలకును వఱలకును ఋభజఝశషసలకును జెల్లుయతికి ఇతరేతరవర్గజయతియని చూడామణికర్త పేరు పెట్టి యున్నాఁడు. ఇతరేతర శబ్దమున "కన్యోన్యము, పరస్పరము" నని యర్థము కావున దీనివలన భిన్నభిన్నవర్గాక్షరములసామ్యమును నర్థము రాఁజాలదు. ఆకారణము చేతనే కావలయు నా పేరిని విడిచికొని కవిజనాశ్రయకర్త దీనికి సరసయతియని పేరిడెను. సరసయనఁగా సమీపము. ఉచ్చారణమునందలి సామీప్యమునుబట్టి చెల్లెడియతియని దానికిఁ దాత్పర్యము కానోపును. ఇట్టి యుచ్చారణసామీప్యము వానికిఁ దద్భవరూపములలోఁ జూడనగును. ఈపేరు దీనికి మిక్కిలిగఁ బొసఁగియుండుటచేతనే యనంతామాత్యాప్పకవ్యాదులు సైతము చూడామణిలోని పేరిని విడిచి దీనినే గ్రహించిరి. చూడామణికర్తయుఁ గవిజనాశ్రయమునకుఁ దర్వాతివాఁడే యగునేని యనంతాదులవలెనే సరసవడి యన్న పేరినే గ్రహించియుండఁడా?

పుఫుబుభులకు ప్రథమావిభక్తి మువర్ణకముతో యతిచెల్లుటకు మకారయతియని చూడామణికర్త పేరు పెట్టెను. ఈపేరు మువర్ణకయతికే కాక ముద్రమొదలగు వానిలో మకారమునకుఁ జెల్లుయతికిఁగూడ వర్తించును. అట్టియతిని గవిజనాశ్రయకావ్యాలంకారచూడామణి కర్తలిరువురును నంగీకరింపలేదు. కావుననే కవిజనాశ్రయకర్త అతివ్యాప్తితోఁ గూడిన మకారయతి యన్న పేరు విడిచి పోలికయతి యని పేరుపెట్టెను. ప్రథమావిభక్తిలో "ము, మ్ము-ంబు" అనునవి మూఁడునుండుటచేతను వానికి 'పు-ంపు' అనునవి కర్మధారయమున వచ్చుట సహజమగుటచేతను అట్టిపోలికచే మువర్ణకముమాత్రము పుపుబుభులతో యతిచెల్లుననియు నక్కారణముననే దానికి 'పోలికయతి' అను పేరు చెల్లుననియుఁ దలంచియే కాఁబోలును గవిజనాశ్రయకర్త దానికి పోలికయతి యని పేరు పెట్టెను. అనంతామాత్యుఁడు సైతము మువర్ణకమునకే యతినంగీకరించిన వాఁడగుటంజేసి కవిజనాశ్రయకర్త పేరనే గ్రహించెను. చూడామణి కవిజనాశ్రయమునకుఁ దర్వాతిదే యగునేని యనంతునిఛందము నందువలెనే యందును పోలికవడి అన్న పేరే గ్రహింపఁబడకుండునా? అట్టిపేరిని జూచినపిదపఁ గూడ నతివ్యాప్తితో నున్న మకారవడి యన్న పేరి నుంచునా? అప్పకవి మువర్ణకమునకేగాక మకారమునకుఁగూడఁ "పుపుబుభు"లతో యతి నంగీకరించినవాఁడు గావున నాతఁడు ప్రథమావిభక్తి మువర్ణయతికి మువిభక్తి యతి యనియుఁ దక్కినముద్రాది శబ్దములలోని మకారమునకుఁ జెల్లుయతికి మకారయతియనియుఁ బేరులుపెట్టి యున్నాఁడు. పై సందర్భమునుబట్టి మువర్ణకయతికి మకారయతియన్న పేరు ప్రాచీనమనియు దానిని సవరించుచున్న పోలికవళి యన్న పేరు నవీనమనియు నెవ్వరికేని తోఁచకపోదుగదా!

పింగళచ్ఛందస్సునందుఁ జతుర్మాత్రాగణ నిబద్ధము లగు నార్యాభేదము లనేకములు చెప్పఁబడి

నవి. వానిలోని యార్యాగీతి యనునదియే చాల వఱకుఁ దెనుఁగువారి సామాన్యకందపద్య మన వచ్చును. దీనిని గవిజనాశ్రయకావ్యాలంకారచూడామణికర్త లిరువురును జెప్పిరి. ఇంకను బింగళఛందస్సులో పథ్య, విపుల, చపల," మొదలగు కొన్ని యార్యాభేదములు పేర్కొనఁబడినవి. కాని తెనుఁగులోఁ బాదాంతమునఁ బదచ్ఛేదము కావలయునన్న నియమము లేమింజేసి పైంగళపథ్యాదిభేదముల కాంధ్రచ్ఛందములోఁ బ్రసక్తి లేదు. అక్కారణముననే కావలయుఁ గవిజనాశ్రయకర్త వాని నుపేక్షించెను. చూడామణికర్త యొక్క పథ్య యనుదానిని బేర్కొనెను గాని నిజముగా నది పైంగళ పథ్య యనిపించుకొనదు. పింగళుఁడు, "ఆర్య, గీతి, ఉపగీతి, ఉద్గీతి" అను నార్యాభేదములను సూత్రించి యున్నాఁడు. చూడామణికర్త వానిలో నార్యయను దానిని జెప్పియున్నాఁడు. కాని యదియుఁ బింగళుఁడు చెప్పిన యార్యకాదు. మఱి యెవ్వరును జూడామణిలోనియార్యను ఆర్యయని యంగీకరింప లేదు. చూడామణిలోనియార్య పింగళునియుపగీతి యగుచున్నది. అట్లే చూడామణిలోనిపథ్యయుఁ బింగళుని గీతియనఁ దగియున్నది. ఇంకఁ బింగళుని యార్యయు, నుద్గీతియు జూడామణిలోఁ జెప్పఁబడనే లేదు. కవిజనాశ్రయకర్త యట్లుగాక పింగళు ననుసరించి యార్యను గీత్యుపగీత్యుద్గీతులను సరిగఁ జెప్పి యక్కడితో సంస్కృతవృత్తానుకరణము ముగిసెననియు నదిమొదలుగ నాంధ్రభాషకు సహజములగు సీసములు, తరువోజ, అక్కరలు మున్నగు వానిని జెప్పెదననియుఁ బ్రతిజ్ఞచేసి యట్లేవానిని లక్షించి యున్నాఁడు. పథ్యాదిభేదములను నార్యాది భేదములను కొలఁదిచేసి సంకరముచేసిన చూడామణి ప్రక్రియననుసరించునదగుటచేఁ గవిజనాశ్రయము చూడామణికిఁ దర్వాతి దని గ్రహింపవలసి యున్నదిగదా!

కర్ణాటక చ్ఛందోలక్షణగ్రంథములే యాంధ్ర ఛందోలక్షణగ్రంథములకు మార్గదర్శకములయి యున్న వనుట యెల్లరకును విదితమే. నాగవర్మ తన కర్ణాట చ్ఛందస్సులో సంస్కృతానుసారముగా వృత్తములను మాత్రాఛందఃపద్యములను జెప్పినపిదపఁ గర్ణాటభాషా పద్యజాతులనుగూడఁ గొన్నిటిని జెప్పియున్నాఁడు అందు 'సీసము, ఆటగీతి' అనుపద్యములు పంచమాత్రాక గణములతోను త్రిమాత్రాక గణములతోను నడపి యందుఁ బంచమాత్రాకగణములను బురుహూతగణము లనియుఁ ద్రిమాత్రాకగణములను సరసిజసఖగణము లనియు వ్యవహరించెను. తరువాత "త్రిపది, షట్పది, అక్కరలు" మున్నగుపద్యములను జెప్పి వానిని బ్రహ్మ విష్ణు రుద్రగణములతో నడపి యున్నాఁడు. రెండు మూఁడునాల్గు ఛందస్సులను బ్రస్తరించి వానిలో లఘువు మొదటఁగలవాని మొదట నొక్కొకలఘువుచేర్పఁగ నేర్పడినవి వరుసగా బ్రహ్మవిష్ణు రుద్రగణములని యాతఁడు వానిలక్షణము నంగీకరించియున్నాఁడు

కం. పురుహూతగణగ ళాఱుం
సరసిజసఖగణగ ళెరడు సంధిసి బర్కుం
జరణక్కె సీసవంతదొ
ళొరగింతహాసరళతన్నొ ళొప్పువ తెఱదిం.

(కర్ణాటచ్ఛందస్సు. 269 పద్యము)

249-A fourth instance the Sisapadya; Each quarter of this consists of six Puruhuta (|| ∪ |) feet (Gana) i.e. feet of five Matras, to which the two feet pointed out by Sarasijasakha (||| ) i. e. feet of three Matras are added.

(కిట్టెలుదొరగారి భాషాంతరీకరణము)

కం. ఎరడుం మూఱుం నాల్కుం
గురువిం ప్రస్తరిసలంబునిధిగజహరణీ
శ్వరగణమొ గెగుమవర్కుం
సరసిజభవ విష్ణురుద్ర సంజ్ఞెగళక్కుం.

297 (నాగవర్మ కన్నడఛందస్సు)

వ. కరపురవార్ధియాగె గురువాగిరె తద్గురువిందధోగసాగిరె లఘుయుగ్మమాక్రిమదె ముంతె సమంకడే వట్టు బిణ్పినొళ్, బరెలఘువొందె పింతె లఘుముంతె సమం మొదలింతగుల్దు పం,కరుహాదళేక్షణేగణ మనింతిదు సర్వలఘుక్కె మప్పినం.

(నాగవర్మ కన్నడఛందస్సు. 298)

పై కన్నడమార్గమును గొంతవఱకు ననుసరించుచుఁ గావ్యాలంకార చూడామణికర్త సీసగీతములను నడుపుటకుఁ బంచమాత్రాకములగు కన్నడము వారి పురుహూత గణముల నెల్ల నంగీకరింపక వానిలో నగసలరతగణము

లను మాత్రమే యంగీకరించి యింకను జతుర్మాత్రాకములను నల, భ, గణములను గూడ శ్రుతిసుఖమునుబట్టియు నన్నయాదిమహాకవుల ప్రయోగములను బట్టియు నంగీకరించి యున్నాఁడు. అట్లే త్రిమాత్రాకములగు నల్లసగసిజసఖగణములను నంగీకరింపక నహములను మాత్ర మంగీకరించెను. వీని కినేంద్రగణము లను సంజ్ఞల నంగీకరించియుండలేదు. పిదప నేమాత్రమును మార్పు చేయక కన్నడమువారి బ్రహ్మవిష్ణురుద్రగణములకే వరుసగా నింద్రచంద్రగణము లని పేరులు పెట్టి వానితో 'అక్కరలు ద్విపది త్రిపది షట్పది' అనుపద్యములను నడుపవలెనని లక్షణము చెప్పియున్నాఁడు. కాని పద్యపునడకయందలి శ్రుతిసుఖమును బట్టి కాఁబోలు నక్కరాదులకు లక్ష్యములను జూపుటలోమాత్రము తాను జెప్పిన యినేంద్రచంద్రగణములనెల్ల నుపయోగింపక పై సీసగీతముల గణములనుమాత్రమే యుపయోగించెను. అట్లయినను బ్రాచీనులగు నన్నయాదుల యక్కరలలోఁ బయి యినేంద్రచంద్రగణముల కెల్ల వాడుక యగపడుచుండుటచేతను, (చూడుఁడు నాప్రాసిన యక్కరల వ్యాసము విజయనగరపు కాలేజీజర్నలు) దక్షిణద్విపదీ ప్రభృతులలోఁ బ్రాచీనులగు నన్నయాదుల గ్రంథములందు సీసగీతములలోవలెనే నహములను మాత్రమే సరసిజసఖ గణస్థానములందును, నలనగసల భరతలనుమాత్రమే పురుహూతగణస్థానములందును వాడుక యగపడుచుండుట చేతను, గావలయుఁ గవిజనాశ్రయకర్త పెద్దనార్యుని యినేంద్రచంద్రగణము లక్కరజాతులకే యుపయోగింపవలెననియుఁ దక్షిణద్విపదీప్రభృతులకు సైతము సీసగీత గణములే యుపయోగింపవలయుననియుఁ బద్యలక్షణములను సవరించిచెప్పియున్నాఁడు. మఱియు సీసగీతాదుల నహములకును సరసిజసఖగణములనియు, నలనగ సలభరతలకును బురుహూతగణములనియుఁ, గన్నడపువారిపేర్లనే క్రొత్తగ నంగీకరించెను. కావునఁ గవిజనాశ్రయకర్తచెప్పిన సీసగీతద్విపదీ ప్రభృతుల యినేంద్రగణములు వేఱనియు, నక్కరల యినేంద్రగణములు వేఱనియు గ్రహింపవలసియున్నది.

కం. భరతనలనగసలంబులు
పరుసనే యియ్యాఱు నెన్న వాసవగణముల్
మఱినహము లినగణంబులు
సరవిం దక్షిణవిఱెల్లఁ జంద్రగణంబుల్.

(కవిజనాశ్రయము సంజ్ఞాధికారము)

కం. వినుతద్విత్రిచతుర్గురు
జనితగణంబులు రవీంద్రచంద్రాఖ్యములై
చను నక్కరజాతుల కె
ల్లను నాదిమలఘువు మొదల లఘు విడవలయున్.

(కవిజనాశ్రయము-జాత్యధికారము)

పైవానిలో మొదటిపద్యమున "సరవిం దక్షిణవి యెల్లఁ జంద్రగణంబుల్" అని చెప్పఁబడియుండుటచే ద్వితీయ తృతీయచ్ఛందో జనితగణములలోనే మొదటి రెండేసి గణములను విడిచి యిట్లినేంద్రగణములను వేఱు విధముగ సీసగీతాదులతోపాటు ద్విపదీ ప్రభృతులకు సైతము మహాకవి ప్రయోగానురోధమున నంగీకరింపవలయుననియుఁ జతుర్థచ్ఛందోభవములగు గణముల కిట్టి ద్వైవిధ్య మనావశ్యకమగుటం జేసి యవి యెల్లఁ జంద్రగణములే యనియు వాని కినేంద్రగణములవంటి ద్వైవిధ్య మనావశ్యకమనియు విశదమగుచున్నది. కావున జంద్రగణములకుఁగూడ ద్వైవిధ్యమును బ్రతిపాదించుచున్న యీ క్రింది ప-బ ప్రతులలోని పాఠములు ఈ సంపర్కమున నవఃతామాత్యాదులు పడినప్రమాదము మూలమునఁ దత్తద్గ్రంథములనుండి ప్రక్షిప్తములయ్యెనని గ్రహింపవలయును.

కం. ద్విత్రిచతుర్గురు భవములు
ధాత్రిని రెండేసి దక్కఁ దక్షిణగణముల్
మిత్రేంద్రచంద్రు లనఁదగు
మాత్రాదిగణంబు మొదల మాత్ర లిడంగన్.

(కవిజనాశ్రయము. బ. ప్రతిపాఠము)

కం. భరతనలనగసలంబులు
సురపతినామములు నహలు సూర్యునిపేళ్లో
గురుముఖలఘుముఖచతుర
క్షరపంచాక్షరము లిందుసంజ్ఞలఁ బరఁగున్.

(కవిజనాశ్రయము. ప. ప్రతి.)

(సశేషము)

# తెలుఁగు పడవ

తురగా వేంకటరామయ్యగారు

ఏ రేవుం జేరఁగ ని
ల్పెగదవోయీ! చింతిలె
దేల పడవ నడపఁగలుగు
ధీరుఁడవయ్యున్?

ఆవిరి యంత్రము లేదని
యడలనేల బ్రహ్మాండము
నడుపువాని కేయంత్రమొ
యడుగుము ధీరా!

ఎడనెడ సుడిదిరిగి మింటి
కెగయు కడలితరంగాల
కడలిగుండె తడబడఁ జు
క్కాని విడుతువా?

కాఱుంజీకటి దిక్కుల
కడలనుండి బ్రహ్మాండము
గ్రమ్మ భయమ్మంది చేతి
గడను విడుతువా?

జగముల వడకించెడు నా
జలదభయదగర్జనముల
కడలి పడవ విడిచి మ్రోడు
పడ భీరుఁడవా?

మించుఁదీగ వెలుఁగల కా
సించఁబోకు జూదపుసిరి
యటుల సిలుగుఁ లోఁడఁజేయు
నాంధ్రకుమారా!

ఏమిట మునిఁగినఁ జింతిల
నేటికి బ్రహ్మాండభాండ
మందె యుండుగాని యెటకు
నరుగును దండ్రీ!

చీకటియనిచింతిల కీ
చీకటికడుపునఁ ద్రిజగ
న్మోహనుఁడగు నెలబాలుఁడు
పుట్టెను దండ్రీ!

చల్లనిచూపుల నమృతము
మెల్లగఁ జిల్కుచుజగముల
వలపించు రసస్వరూపుఁ
దలఁపుము ధీరా!

అడఁగును సంద్రపుటుడుకులు
సడలును జలదప్రుదుడుకులు
స్వాగింపుము తెనుఁగుపడవ
చలువ వెన్నెలన్

అవె! నీకోటలుఁ బేటలు
నివె! నీవలపుం దోఁటలు
పడవనడుపు మింకఁ దెనుఁగుఁ
బాటపాడుచున్

ఆ ప్రణయపురీతీరము
నాంధ్రనావ జేర్చి చిదా
నందడోలికావిహార
మందుము యోఢా!

# మృచ్ఛకటికము

విద్వాన్ కత్తి సాంబమూర్తిశాస్త్రిగారు

మృచ్ఛకటికమునుగూర్చి యనేకులు పండితోత్తములు చర్చించియుండిరి. అట్టివారియభిప్రాయములఁ జూచి నాకుఁదోఁచినదానిని నేనును వ్రాసియున్నాను. దీనియందలి గుణలేశములను గ్రహించి పండితోత్తములు నన్నుఁ గృతార్థునిఁ జేయుదురుగాత మని ప్రార్థించుచున్నాను.

ప్రకృతమున నే విచారింపఁబోవు మృచ్ఛకటికము రూపకాంతర్భూత మగుటచే రూపకోత్పత్తినిఁ గూర్చియించుక విచారించుట యసంగతము కాఁజాలదు.

లోకమున జ్ఞానము దినదినాభివృద్ధిం గాంచుచున్నది. చిత్రవిచిత్రము లగుకృతులు వెలువడుచున్నవి. భాషావిషయమున నేమి, శాస్త్రవిషయముల నేమి, పలువురు పలువిధముల పరిశ్రమచేయుచున్నారు.

మనుజుఁడు జ్ఞానమును సంపాదించినతరువాత గోమతల్లిక క్షీరముల నొసఁగుటకుఁబోలె యద్దాని నొరుల కెఱుకపఱుప తహతహపడుచుండును. ఇట్టులే మన పూర్వులు వారు సంపాదించినజ్ఞానమును పాటలమూలమునను, పద్యములమూలమునను, మనకు విశదీకరించియున్నారు.

జీవకోటి కనుకరణము స్వాభావికము. బాలురు తల్లిదండ్రులు సంభాషించుచుండ విని వాని ననుకరించుటకుఁ బ్రయత్నించుచుందురు. మనుజులు చేయుకార్యములను వానరాదులు చూచి యనుకరింపఁ బ్రయత్నించును. బడిలోఁ జదువువిద్యార్థులు, గురువు పాఠములు రానిబాలురను దిట్టుటను గొట్టుటను జూచి స్తంభములు గోడలు మున్నగు నచేతనములను శిక్షించుచుందురు. మఱియు నాబాలు రుపాధ్యాయులు పాఠములఁ జెప్పురీతిని జూచి వారు దాని ననుకరించుచుందురు. ఇట్లనుకరణము సర్వసాధారణమైనస్వభావ మనవచ్చును.

మనపూర్వులు తాముచూచినవాని నెల్ల ననుకరింపఁ బ్రయత్నించుచుండిరి. అట్టివారియనుకృతిసామర్థ్యము నితరుల కెఱుకఁబఱుప గ్రంథములరచియించుచుండిరని యూహింపవచ్చును. ఆగ్రంథములే కావ్యనాటకాదులు. వారు మొదట శ్రవ్యకావ్యములను రచించి కొంతవఱకు తమయభిప్రాయములను వెలిఁబుచ్చిరి. కాని శ్రవ్యకావ్యములలో వారియభిప్రాయమునంతను విశదీకరింపఁజాలరైరి. అట్టిచో సుకరమును హావభావప్రకాశమును నగు నీదృశ్యకావ్యపద్ధతి నవలంబించిరి.

ఈదృశ్యకావ్యములు పుట్టుటకు ఋగ్వేదములోని సంభాషణారూపములగు కొన్నికథాభాగములే మూలములైయున్నవని పాశ్చాత్యపండితు లభిప్రాయపడుచున్నారు. ఋగ్వేదమున "సరమ," యింద్రునిగోవుల నపహరించిన దానవులతోఁ గలహించినట్లును, మనువు చిన్నచేఁప నొకదానిని గాపాడినట్లును, యమి యమునిఁ బెండ్లాడుమని ప్రార్థించినట్లును, సంభాషణరూపములగు కొన్నికథాభాగములు కలవు. ఇట్టి సంభాషణాదులఁ జూచియే భారతీయులు తమప్రబంధములలోఁ బాత్రసంభాషణమును నెలకొల్పిరని పాశ్చాత్యపండితుల యభిప్రాయము.

ఈకాలమున దృశ్యప్రబంధములు వివిధభేదములు కలిగి యొప్పారుచున్నవి. భాగవతములు, చెంచునాటకములు, వీథినాటకములు, బొమ్మలాటలు, నాటకములు, మున్నగునవి వీనిభేదము లనవచ్చును. ఇవి యన్నియు ననుకరణసిద్ధములే. నాటకములు తప్ప మిగిలినవన్నియు నిప్పుడు గ్రామములలో నగపడుచున్నవి. నాగరికులు నాటకములను మాత్రమే యుపయోగించుచున్నారు.

ఈనాటకములతోఁ గలిపి నాగరికజనప్రయుజ్యమానములగు దృశ్యప్రబంధములు దశవిధములు. వీనికి నాటక, ప్రకరణాది భిన్నభిన్న నామములు గలవు.

శాకుంతలోత్తరరామచరితాది నాటకములును, మాలతీమాధవీయమృచ్ఛకటికాదిప్రకరణములును, వన్నెకెక్కియున్నవి. శాకుంతలోత్తరరామచరితములు భార

తీయనాటకములలో స్వాభావికములనియు, రమ్యములనియుఁ బాశ్చాత్యపండితులయభిప్రాయము.

మృచ్ఛకటికము స్వాభావికవర్ణనావిషయమునను, కథాకల్పనమునను, శాకుంతలోత్తరరామచరితాదులను గూడ నతిశయింపఁజాలిన దని మృచ్ఛకటికమును సవిమర్శముగా బరిశీలించిన పాశ్చాత్యపండితుఁ డొకఁడు వ్రాసియున్నాఁడు. ఈతఁడు మృచ్ఛకటికమే పాశ్చాత్యులకు లభించియుండిన, వారు శాకుంతలోత్తరరామచరితాదులకంటెఁ గూడ నుత్తమస్థానమును మృచ్ఛకటికమునకుఁ బ్రసాదించియుందురనియు నక్కారణమున నీమృచ్ఛకటికము నెఱింగినవారు పాశ్చాత్యులలోఁ బెక్కుమంది లేరనియు వ్రాసియున్నారు.

మృచ్ఛకటికములోని ద్యూతము, చౌర్యము, మున్నగు కళావిశేషములను మూర్ఖుఁడగు శకారుని చెయ్దములను, రక్షకభటుల పోరాటములను, వ్యవహారమండపములోని న్యాయనిర్ణయములను, జూచినపాఠకులు సంతోషతరంగముల నోలలాడకుందురా? నిజముగ మృచ్ఛకటికములో నున్నట్లేకాలమునఁ గొందఱు మహానుభావులును, కొందఱు నీచులును, నుందురనియు, నానీచులమూలమున నాయార్యులకు ఆపదలు వాటిల్లుచుండుననియు నెవ్వరు దలంపకుందురు? ఇట్టి మృచ్ఛకటికమును, స్వభావవర్ణనాసంతుష్టాంతరంగులగు పాశ్చాత్యపండితులు మేలు మే లనుట యొకవింత కాదు.

మృచ్ఛకటికము శాకుంతలోత్తరరామచరితాదులకంటెఁ గూడ మిన్నయై యున్నదని యీవఱకు వ్రాసియుంటిని. అద్దానిని దిఙ్మాత్రముగా నిటఁ జూపుచున్నాను. శాకుంతలములో వర్ణనలు స్వాభావికములై, పదములు మృదుమధురములై పాఠకులహృదయముల నాకర్షించుచుండును. కాని కథాభాగము మాత్రము స్వాభావికము కాదు. కాళిదాసు తనశాకుంతలమునఁ బ్రథమాంకములో శకుంతలాదుష్యంతుల నొకచోఁ గూర్చుండఁబెట్టి తనయిచ్చవచ్చినట్లు వర్ణనలఁ జేయ నారంభించెను. ఇది స్వాభావికముగాదు గదా. మఱియు నందు "ప్రస్థానా" విత్యాదిశ్లోకము ఔచిత్యహీనమై యున్నదనుట సాహసము కానేరదు. ఊరుపేరు తెలియని యువతుల వారియెదుట నెవ్వఁ డీరీతిని వర్ణింపఁగలఁడు.?

మఱియు నిందు పురాణములందువలె నసంభావ్యములగు ప్రభావాదులు వర్ణింపఁ బడినవి. కథాభాగముకూడ నంతవిచిత్రము కాదు.

ఉత్తరరామచరిత కథాభాగము శాకుంతల కథాభాగముకన్న వైచిత్ర్యముకలిగి స్వాభావికమై యున్నను పదసంఘటనము, పద్యరచన, మున్నగునవి యంత యింపుగా నుండవు. ఇంతేకాక యిందు రసవిరుద్ధము లగురీతు లత్యధికముగా వాడఁబడినవి. ఇందలిపద్యములు చాలవఱకు దీర్ఘసమాసభూయిష్ఠములై యుండును. గద్యయు వినుట కంత మనోహరముగా నుండదు. దీనిని బరిశీలించినవారు తఱుచుగాఁ జంపూగ్రంథమని యనకమానరు.

మృచ్ఛకటికమున వర్ణనలా స్వాభావికములు పదములా లలితలలితములు. భావమా సహృదయహృదయాహ్లాదజనకము. కథాభాగమా నవరసభరితము. ఇంతకంటె నాటకమునకుఁ గావలసినసామగ్రి యేముండును? వేయేల? ఇట్టి దృశ్యకావ్యమును బరిశీలించిన పాఠకమహాశయులు సంస్కృతాంధ్రముల నిట్టిరూపకమే లేదని యనకపోరు. నిజముగా నీగ్రంథము పాశ్చాత్యపండితులు పఠించిన, ముందు శూద్రకుని నాతనిమృచ్ఛకటికమును జెప్పి, తరువాతఁ గాళిదాసుని యాతనిశాకుంతలమును జెప్పియుందురు. శాకుంతలోత్తర రామచరితాదులకు మృచ్ఛకటికముకంటె నధికమగుఖ్యాతి వచ్చుటం జూడ మృచ్ఛకటికము లోకములోఁ బ్రచారము నొందలేదని తోఁచుచున్నది.

ఇట్టి మృచ్ఛకటికమును రచించినమహాకవి యెవ్వఁడో యీవఱకు స్పష్టపడలేదు. పెక్కుమంది విమర్శకు లీవిషయమునఁ బ్రయత్నించి విఫలమనోరథులైరి. అట్టియెడ నేను నిర్ధారణఁ జేయఁబూనుట యవివేకమే యగును.

మృచ్ఛకటికమును శూద్రకుఁడు రచించెనని "ఖలస్వభావం భవితవ్యతాం తథా చకార సర్వం కిల శూద్రకో నృపః" అను మున్నగు పీఠికలోనిశ్లోకములవలనఁ దేటపడుచున్నది.

మృచ్ఛకటికము పీఠికలో "లబ్ధ్వా చాయుః శతాబ్దం దశదినసహితం శూద్రకోఽగ్నిం ప్రవిష్టః," అని యున్నది. ఇందలి "ప్రవిష్టః" అనుశబ్దము భూతకాల

ద్యోతకమై యున్నది. కాన నేతచ్ఛ్లోకరచనకు ముందు గ్రంథకర్త యగ్నిప్రవిష్టుఁడై యున్నట్లు తేలుచున్నది. కాఁగా నీశ్లోకము ప్రక్షిప్తము గాను. మఱియు పీఠికలో నుండు నాత్మస్తుతినిబట్టి చూడ నీ విషయమే స్పష్టపడుచున్నది.

రాజులు స్వయముగాఁ జదివికొని గ్రంథముల రచించుట దుర్లభమనియు వారు తమయాస్థానకవులకో మరియెవ్వరికో ధనధాన్యాదిసంపదల నొసంగి యధునాతనులు కృతినొందుచున్నట్లు వారు రచించినగ్రంథములను తామే రచించినట్లు ప్రకటించుకొందురనియు కొందఱు మహాశయు లభిప్రాయపడి యున్నారు. కావ్యప్రకాశకర్తయగు మమ్మటుఁడు "శ్రీహర్షాదేర్ధావకాదీనా మివ ధనం" అని వ్రాసినదానినిఁ బట్టి యీ యూహ యంకురించినది. శ్రీహర్షునివలెనే శూద్రకుఁడును నన్యకృతమగు నీమృచ్ఛకటికమును దానే రచించినట్లు ప్రకటించుకొని యుండును.

కాని యీయూహ సరికాదు. విద్వజ్జనశిరోమణి యగుభోజుఁడు రసాభరణాఖ్యలంకారగ్రంథనిర్మాత యై ప్రసిద్ధినొంది యుండలేదా? సింగభూపాలుఁ డలంకారగ్రంథకర్తయని చారిత్రకు లభిప్రాయపడలేదా? రెడ్డిరాజులలోఁ గొందఱు శాకుంతలాదినాటకవ్యాఖ్యాతలై వాసికెక్కి యుండలేదా! ఇట్టిచో రాజులు స్వయముగాఁ జదివికొని గ్రంథములు వ్రాయుట యసంభవమనుట యసంగత మనక తీరదు.

కొందఱు కాదంబరీగ్రంథకర్తయగు భట్టబాణుఁడే యీమృచ్ఛకటికమును రచించియుండు ననుచున్నారు. భట్టబాణుఁడు కాదంబరిలోఁ జెప్పఁబడిన శూద్రకుఁడే యీ శూద్రకుఁడని యూహించియున్నారు. కాని యిది యంతయుక్తముగాఁ గన్పట్టదు. కాదంబరికథ యంతయు కల్పితమే యని యందఱకును దెలిసినవిషయమే. మఱియు నాగ్రంథమున శూద్రకుని మృతునిగా వర్ణించి యున్నాఁడు. మృతుఁడగుశూద్రకుని కీగ్రంథము నిచ్చుట యెట్లు పొసంగును? ఇంతకును భట్టబాణుఁడు శ్రీహర్షుని యాస్థానమం దుండినట్లు స్పష్టపడుచున్నది. అక్కాలమున శూద్రకుఁ డనురాజు చెప్పఁబడు గానరాఁడు. కాన యీయూహ యంతయుక్తముగా నున్నట్లు కన్పట్టదు.

కొందఱు దండ్యాచార్యుఁడే యీగ్రంథమును రచించెనని యభిప్రాయపడుచున్నారు. దండ్యాచార్యకృతదశకుమారచరిత కథాభాగమును, నీ మృచ్ఛకటికములోని కథాభాగమును సరిపోవుటయే యీయూహకు మూలమైయుండును. దశకుమారచరితమున ద్యూతము చౌర్యము రక్షకభటులదురాగతములును వేశ్యలవైదగ్ధ్యములును నిపుణముగా వర్ణింపఁబడినవి. మృచ్ఛకటికమున నీవిషయములు కలవు. అవియే దీనికి మూలమై యుండును. కాని యీయూహయు సమంజసముగా నున్నట్లు తోఁపదు. రెండుగ్రంథములలో నివర్ణనాంశములు కొన్ని సాదృశ్యము కలిగి యున్నంతమాత్రమున నారెండుగ్రంథముల రచించినయాతఁ డొకఁడే యనుట యంత యుక్తము కాదు.

ఇఁక మఱియొకవిషయ మీసందర్భమునఁ బరిశీలింపఁదగియున్నది. భాసనాటకము లని పదునేడు నాటకముల బ్ర. శ్రీ. త. గణపతిశాస్త్రిగారు సంపాదించియున్నారు. అందు చారుదత్తమను నాలుగంకముల నాటక మొకటి కలదు. అందలినాలుగంకములు మృచ్ఛకటికములోని మొదటి నాలుగంకములతో సరిగా సరిపోవును. రెండును నేకకవికృతములై యున్నట్లు తోఁచును. దీనినిఁ జూచి కొందఱు భాసుఁడే చారుదత్తమును రచించి దానిలో మరికొంత భాగము నధికముగాఁ జేర్చి మృచ్ఛకటికమును రచించె నని యందురు. ఇది యెంతవఱకు సత్యమో పరిశీలింతము.

చారుదత్తమిత్రుఁ డగు మైత్రేయుఁడు రత్నహారమును వసంతసేన కిచ్చివేయుటయు నామె చారుదత్తాభిసరణార్థ నిర్గమోద్యుక్తురా లగుటయు చారుదత్తమునఁ గలవు. అంతతో నాగ్రంథము పరిసమాప్తినొందెను.

కొన్నిప్రతులలో "అవసితం చారుదత్తమ్" అని యున్నది. మఱికొన్నిప్రతులలో నేమియు లేనేలేదు.

భారతీయనాటకములు శుభాంతములై యుండు ననియు, నందు నాయికానాయకుల సంయోగమో, శాత్రవవిజేత యగు నాయకుని యభివృద్ధియో నాటకాంతమున నిరూపింపఁబడుచుండు ననియు గ్రహింపవలసియున్నది.

చారుదత్తమున నాయికానాయకులసంయోగము కాని, నాయకవిజయముకాని, కానరాదు. కాన నీగ్రంథ మింకను సంపూర్ణము కాలేదనవచ్చును. ఈమృచ్ఛకటికము చారుదత్తము నుత్తరభాగమే యయినఁ గావచ్చును.

మృచ్ఛకటికమును జూచి చారుదత్తమో, చారుదత్తమును జూచి మృచ్ఛకటికమో పుట్టియుండు ననుట నిర్వివాదాంశము. అట్లు కాకపోయిన భిన్నకర్తృకములను నాగ్రంథముల కంత సన్నిహితసంబంధముండుటకుఁ గారణము కనబడదు.

భాసనాటకచక్రమును సంపాదించి యచ్చొత్తించి ప్రకటించిన శ్రీ. త. గణపతిశాస్త్రిగారు చారుదత్తమును జూచి మృచ్ఛకటికము పుట్టినదని వ్రాసియున్నారు. నాటకాదిని శ్లోకరూపనాంది లేకుండుట ప్రాచీననాటకలక్షణ మనియు చారుదత్తమున శ్లోకరూప నాంది లేదనియు, మృచ్ఛకటికమునఁ గలదనియు, నక్కారణమున చారుదత్తముకంటె మృచ్ఛకటికము నవీనమనియు, వీరియభిప్రాయము.

ఈమృచ్ఛకటికములోని ప్రస్తావన శూద్రకరచితముకాక ప్రక్షిప్తమని యావఱకు నిరూపించియున్నాను. అట్టి ప్రక్షిప్తభాగములోని నాందినిబట్టి శ్రీ. త. గణపతిశాస్త్రిగారు నిరూపించినయంశము సత్యము కాదనవచ్చును. గ్రంథమునుబట్టి పౌర్వాపర్య నిర్ణయము చేయుట కాధారము లేవియుఁ గానరావు.

ఇఁక మృచ్ఛకటికమునుబట్టి కొంచెము విచారింతును. ఈమృచ్ఛకటికమున మనయాలంకారికులు చెప్పురీతిని బీజబిందుపతాకాదులు సరిపడియుండలేదు. ఉన్నట్లుఁ గూడ కానరాదు.

నాటకములోఁ బ్రధానులు తఱచుగా నన్నియంకములలో నుండవలయును. నాయకుఁడగు దుష్యంతుఁడు చతుర్థాంకమునఁ దప్ప తక్కిన యన్నియంకములలోను కనబట్టుచున్నాఁడు. ఉత్తరరామచరితమున చతుర్థపంచమాంకములలోఁదప్ప మిగిలినయన్నియంకములలోను శ్రీరామచంద్రుఁ డగపడుచున్నాఁడు. ఒకవేళ వీరు లేని యంకములలో వీరినిగూర్చినవిషయమే యుండవలయునుగాని వేఱొకవిషయ ముండరాదు. ఇట్లు నాయికానాయకులు గాని నాయకప్రతినాయకులుగాని యన్ని యంకములలో నుండవలయును. లేదా వారినిఁగూర్చిన విషయమైనను వారు లేని యంకములలో నుండవలయును.

మనమృచ్ఛకటికమునఁ బ్రథమాంకమునఁ బ్రవేశపెట్టినశకారుని మరల నెనిమిదవయంకమునఁ బ్రవేశపెట్టినారు. ఈమధ్య యంకములలో నాతనిఁగూర్చినవిషయము లేకుండుట సరియేకదా యాతని పేరుగూడ వినఁబడదు.

నాటకములకు "నామకార్యం నాటకస్య గర్భితార్థప్రకాశకమ్" అనురీతిని గర్భితార్థప్రకాశకముగ నామకరణము చేయవలయును. ప్రథమాంకమునఁ జూపినయభిజ్ఞానాంగుళీయకముచే దూర్వాసశాపవిస్మృతి యగు శకుంతలను దుష్యంతుఁడు పాలితపట్టెఁ గాన యభిజ్ఞానశాకుంతలమను నామము గర్భితార్థప్రకాశకమై యలరారుచున్నది. ప్రథమాంకమున సంపాదించిన రాక్షసనామాంకితముద్రచేఁ గపటలేఖల, రాక్షసలిఖితములుగ నిర్ధారణ చేసి యాతని వంచించి వశీకరణము చేయఁబడెను. కాన ముద్రారాక్షసమనునామము ఆలంకారికసమ్మతమై గర్భితార్థప్రకాశకమై యున్నది.

మనమృచ్ఛకటిక మన్న నట్లుగాక షష్ఠాంకప్రభృతి దశాంకపరిమిత కథాభాగసూచకమై యున్నది. మృచ్ఛకటిక మన మట్టిబండి కలదని యర్థము. ఈమట్టిబండి యాఱవయంకమున బయలుదేరెను. రోహసేనుఁడు మట్టిబండిని నిరాకరించి సౌవర్ణశకటికకై యేడ్వసాగెను. దానిఁ జూచి చారుదత్తగుణానురక్త యగు వసంతసేన తనయాభరణములను సౌవర్ణశకటికానిర్మాణార్థము రోహసేనున కిచ్చివేసెను. ఈయాభరణములను చారుదత్తుఁడు గ్రహింప నొల్లక వసంతసేనకుఁ దిరిగి యిచ్చివేయు మని మైత్రేయు నంపెను. మైత్రేయుఁడు వసంతసేనాగృహమునకుఁ బోవుదారిలోఁ జారుదత్తునకు వాటిల్లిన యాఘోరవిపత్తును విని యాభరణముల నీయక పట్టుకొనియే యధికరణమంటపమునకు వచ్చెను. ఆ యాభరణములే చారుదత్తుఁడు వసంతసేనను జంపెనని రుజువుచేసినవి. ఇట్టియనర్థపరంపరలకు మూలము మృచ్ఛకటికయగుటచే మృచ్ఛకటికమను నీగ్రంథనామము గర్భి

తార్థప్రకాశకమే యగును. కాని యిందు మొదటి యైదంకములలోని కథాభాగము సూచింపఁబడలేదు. మొదటియైదంకములు తరువాతియైదంకములకు సంబంధించికూడ నుండలేదు.

ఇట్లీగ్రంథమున బీజబిందుపతాకాదులు లేకుండుటచేతను, ప్రతినాయకునివృత్తాంతము మొదటి యైదంకములలో లేకుండుటచేతను, గ్రంథనామము మొదటి యైదంకముల కథాభాగమును సూచింపకుండుటచేతను నీగ్రంథమును నైదంకములవఱ కొకగ్రంథముగాను, మిగిలినయైదంకము లొకగ్రంథముగాను విభజింపవలయును. అట్లు విభజించిన వసంతసేనాచారుదత్తుల సమాగమముతో మొదటిగ్రంథమును, వసంతసేనాఘాతుకుఁడని బంధింపఁబడిన చారుదత్తుని విడుదలతో నుత్తర గ్రంథమును పరిసమాప్తినొందును. అప్పుడు రెండునాటకములును శుభాంతము లగును. రెంటను బీజబిందుపతాకాదులు సరిగా సరిపడును.

మొదటి యంకమునఁ జారుదత్తుఁడు వసంతసేనను జూచుటయు, వారలొకరినొకరు ప్రేమించికొనుటయు, ద్వితీయాంకమున వసంతసేన చారుదత్తగుణగణముల నాకర్ణించి మఱియు నాతనియందు బద్ధానురాగ యగుటయు, తృతీయాంకమున గానాదివృత్తాంతములచే నాయనురాగము మాటుపడుటయు, చతుర్థాంకమున మైత్రేయునిచే రత్నహార మంపుటవలన మరల మొలసూపుటయు, పంచమాంకమున సమాగమము జరుగుటయు సరిగా నున్నది.

మృచ్ఛకటికమున నన్ననో ప్రథమాంకమున శకారనిక్షిప్తచారుదత్తహాసనపర్యవసాయి వాక్యరూపబీజము మరల నెనిమిదవయంకమునఁ గాని యుద్ఘాటింపఁబడకుండుటచే నందు బీజబిందుపతాకాదులు సరిగా లేవు. ఆఱవయంకము మొదలుకొని మిగిలిన యైదంకముల వేఱుగాఁజేసి యొకగ్రంథముగా విభజించిన నందు బీజబిందుపతాకాదులు సరిగా సరిపోవును.

రోహసేనకారిత మృచ్ఛకటిక నిక్షిప్తవసంతసేనాభరణములే బీజములు. అవియే మైత్రేయధారితములై యధికరణమంటపమున వసంతసేనను చారుదత్తుఁడు చంపినట్లు ఋజువుచేయును. అప్పుడీగ్రంథనామముకూడ (మృచ్ఛకటికమను) నుత్తరాంకముల సూచించునదై గర్భితార్థప్రకాశకమై యొప్పారును. అట్లుకాకున్న ఈ నాటకనామ మర్థగర్భితార్థప్రకాశకము కావలసియుండును. మృచ్ఛకటికమను నామమువలన నాఱవయంకమునుండి జరిగినకథయే సూచింపఁబడును గాని మొదటి యైదంకములకథయు సూచింపఁబడదుగదా ?

నాచెప్పినరీతిని విభాగముచేసి మొదటియైదంకములకు చారుదత్తమనియు, రెండవయైదంకములకు మృచ్ఛకటికమనియు గ్రంథనామము లుంచవలయును. మొదటియైదంకములను భాసమహాకవియు, రెండవయైదంకములను శూద్రకుఁడును రచించియుందురు. తరువాత నెవరో యీగ్రంథములు రెండింటినిఁగలిపి యొకగ్రంథముగాఁ దయారుచేసియుందురు. మఱియు వారే యీగ్రంథమునకుఁ బీఠికనుగూడ వ్రాసియుందు రని యూహింపవచ్చును. ప్రస్తావనలోని నాందీశ్లోకములలోను మఱియొకశ్లోకములోను వారి యీయభిప్రాయమును నిగూఢముగా సూచించియున్నారు.

మృచ్ఛకటికములోనుండెడి నాందీశ్లోకములను విపర్యస్తముగానుంచిన యీపద్యములలో మొదటిశ్లోకము చారుదత్తమునకును, రెండవశ్లోకము మృచ్ఛకటికమనఁబడు నుత్తరభాగమునకును, కావ్యార్థసూచకములై యున్నవి. చూడుఁడు,

శ్లో. "పాతు వో నీలకంఠస్య కంఠ శ్శ్యామాంబుదోపమః,
గౌరీ భుజలతా యత్ర విద్యుల్లేఖేవ రాజతే".

నీలకంఠసదృశుఁడగు చారుదత్తునికంఠమందు గౌరీసమానయగు వసంతసేనయుంచిన హస్తమని యిందు సూచింపఁబడుచున్నది. కాన నీశ్లోకము చారుదత్తనాటకకథాసూచకమై యున్నది. ఇట్లే

"పర్యంకగ్రంథిబంధద్విగుణితభుజగాశ్లేషసంవీతజానో
రంతఃప్రాణావరోధవ్యుపరతసకలజ్ఞానరుద్ధేంద్రియస్య;
ఆత్మన్యాత్మానమేవ వ్యపగతకరణం పశ్యతస్తత్త్వదృష్ట్యా
శంభోర్వః పాతుశూన్యేక్షణఘటితలయ బ్రహ్మలగ్న
స్సమాధిః."

ఈశ్లోకమున భుజగసదృశశకారపరివేష్టితుఁడై, కృతమరణనిశ్చయుఁడై, కాలుసేతులు కదల్పలేనంతటి యశక్తుఁడై, అపయశస్సునకుఁ జింతించుచు భగవద్ధ్యానాసక్తుఁడై యు

న్నచారుదత్తుఁడు సూచింపఁబడుచున్నాఁడు. కావున నీ శ్లోకము మృచ్ఛకటికకావ్యార్థసూచక మని గ్రహింపవలయును.

ఇఁక నీరెండుశ్లోకములును మృచ్ఛకటికయనఁబడు పదియంకములనాటకమునకే కావ్యార్థసూచకములం దురేని యది యంత సరికాదు. కొన్నియంకములకథాభాగమును సూచించుట కొకశ్లోకమును, మిగిలినయంకముల కథాభాగమును సూచించుటకు వేఱొక శ్లోకమును రచించుట మనసంస్కృతకవులయాచారము కాదు. ప్రస్తావనలోని

శ్లో. "తయోరిదం సత్సురతోత్సవాశ్రయం
నయప్రచారం వ్యవహారదుష్టతామ్,
ఖలస్వభావం భవితవ్యతాం తథా
చకార సర్వం కిల శూద్రకో నృపః"

"ఈశ్లోకమువలనఁగూడ మృచ్ఛకటిక మనఁబడు నుత్తరభాగములోనికథాభాగమే సూచింపఁబడుచున్నది. కాని మొదటినైదంకములలోని ద్యూతచౌర్యాదులు ఈశ్లోకమునఁ జేర్పఁబడలేదు. ఇట్లుండుటవలన శూద్రకుఁడు మృచ్ఛకటిక మనఁబడు నుత్తరాంకములనే రచించినట్లు తేలుచున్నది. భాసుఁడు పూర్వభాగమును చారుదత్తమను పేరుతో రచించి విడువగా, శూద్రకుఁడు మృచ్ఛకటికమని యుత్తరభాగమును రచించియుండును.

పరిశీలింపగా నీ దశాంకపరిమితగ్రంథమునకు మృచ్ఛకటికమను పేరికంటె చారుదత్తమను నామమే యుక్తముగా నుండును. కాని సంస్కర్తలు మొదటిభాగము వేఱొకగ్రంథముగా కూడ నుండవచ్చునని యూహించుటచేతను చారుదత్తమని గ్రంథద్వయనామములు కలసిపోవునని యూహించి నవారగుటచేతను చారుదత్తమని దశాంకపరిమితగ్రంథనామమును జేసియుందురు. ఇట్టిసంస్కర్తలే శూద్రకుని కత్యంతసన్నిహితులై యుందురు. మృచ్ఛకటికము వీరి చేతులలోనుండి ప్రఖ్యాతినొంది లోకమున వ్యాపింపకముందే యీతంత్రము జరిగియుండును. వీరిప్రస్తావనను గూడ రచించియుందురు. అట్టిచో "లబ్ధ్వా చాయుశ్శతాబ్దం దశదినసహితం శూద్రకోఽగ్నిం ప్రవిష్టః" అనునది విరుద్ధము కాఁజాలదు. ఈశ్లోకపాదమే సంస్కర్తలు శూద్రకున కత్యంతసన్నిహితకాలవర్తులని నిరూపింపఁజాలును. లేకున్న నాతనిజీవితకాలము నంతసరిగా తెలిసికొనుట యొరులకసంభవముకదా? మృచ్ఛకటికములోని మొదటినైదంకము లుత్తరాంకములతో సంబంధించియుండలేదు. పూర్వోత్తరభాగముల కవితారీతియుఁ గొంతమాఱియున్నది. అట్లగుట నీరెండుగ్రంథములను భిన్నకర్తృకములని యంగీకరింపవచ్చును. సంస్కర్తలుత్తరాంకాదినుండెడి శకారాదులు వసంతసేన ననుసరించుట యనుభాగమును ప్రథమాంకమున నుంచిరి. ఇవియే యిందుజరిగినమార్పులు. దీనినిగూర్చి ప్రబలమగు దృష్టాంతములు రాఁబోవువ్యాసమునందు నిరూపింపఁబడును.



# వాన ప్రస్థుని విభ్రమము

సాహితీసమితి సభాపతి శ్రీ శివశంకర శాస్త్రి

౧౫

దేవి, నీరమ్యమూర్తి మదీయహృదయ
పుండరీకాసనమునఁ బ్రపూర్ణభక్తి
నిష్టదైవతముగఁ బ్రతిష్ఠించి, యెపుడు
వివిధవిధముల నిన్ను సేవించువాఁడ!
అపరిమేయానురాగ తోయంబు తోడ
నీకు దివ్యాభిషేకంబు నెఱపువాఁడ!
మధురభావపరంపరామాల్యములను
లలిత భవదీయకంఠ మ్మలంకరింతు!
గాఢరసమంజుల కవిత్వ గాన ఫణితి
వీను లలర భవత్కథల్ వినుతి చేతు!
హర్షభరమున నైక్యమే యలరునట్లు
నన్ను నీకుఁ గైంకర్య మొనర్చుకొందు!

౧౬

శ్రవణములు సోకినంత దుస్సహ విషాద
కర్దమక్షాళనము చేయఁగలిగినట్టి
ధన్య భవదీయ నామామృతంబు తప్ప
ఇతర మేమియుఁ జెవిఁ జేరనీయ నొల్ల!
దివ్యగంగా తరంగిణీ తీర్థ మట్లు
భాషితావిల మార్జన పటిమ గల్గి
మధు మధురమైన తావకకథలె కాని
ఇతరమును జిహ్వవెంట రానీయనొల్ల!
చిత్తసద్మాంతరాళ సంస్థిత విషాద
గాఢ తమసంబు హరియింపఁ గల్గినట్టి
భవ్యభవదీయ రూపదీపమ్ముకన్న
ఇతరమును దృష్టిసరణి రానీయనొల్ల!
చారు నిర్మల చంద్రికా పూర మట్లు
హృదయతాపముచల్లార్చిముదముఁగూర్చు
త్వన్మనోహర మధురభావనలె గాని
ఇతర మేమియు మదికి రానీయనొల్ల!

నీనివాస మనోహర నిలయమైన
మామకామల హృదయ సద్మమ్మునందు
మాత మేకాక దేవి, నీ మధురభంగి
యన్నిదిశలఁ బ్రకాశించు నద్భుతముగ!
ప్రచురకిమ్మీరితేంద్ర చాపమ్మునందుఁ
ద్వత్తను ద్యుతి రింఛోలి తనరుచుండు
అచ్ఛకౌముదీ ధవళీకృతాంబరమునఁ
గానవచ్చును నీయంశుక ప్రభాళి.
స్ఫీత రాకాసుధాకర బింబమందుఁ
దోచుచుండు భవన్ముఖద్యుతులు దేవి!
వెలుగు నిర్మలతారకా విసరమందు
మలయు మందస్మితాంకూరమధురిమమ్ము
గాఢ కాదంబినీ చ్ఛన్న గగనమునను
దీర్ఘ భవదీయ కేశదీధితులు చెలగు.
అఖిల లోక ప్రకాశకాహస్సు నందు
వరలుఁ దావక బుద్ధివైభవము దేవి!
భాసురోరు సంధ్యారాగ పటలిలోనఁ
దావకీ నానురాగ సుశ్రీ వెలుంగు
శాంతగాఢ విభావరీ సమయములను
వెలయుభవదీయహృదయగాంభీర్యముద్ర
ముగ్ధకల్యాణ సుకుమార మూర్తిఁ దాల్చి
వరలుచున్నావు నీవె సర్వమ్మునందు:
ప్రకృతిరూపిణివై నీవు పరిఢవిల్లఁ
గానరా దన్య మేమి నీకన్న నాకు!
రమ్ము, మామకహృదయసామ్రాజ్యలక్ష్మి
నీ కటాక్షము నామీఁద నిలువనిమ్ము!
ఆర్ద్ర హృదయ ప్రపన్నుఁడ నైతి దేవి!
నన్ను నీలోన నైక్య మ్మొనర్చు కొమ్ము!

ప్రథమోచ్ఛ్వాసము సమాప్తమయినది.

# పరిణామసూత్రము

పొక్కులూరి లక్ష్మీనారాయణగారు

పరిణామమనఁగా మార్పు. ప్రపంచమందలి ప్రతిదేశమునందును ప్రతివిషయమునందును మార్పు అనుక్షణమునను గాన్పించును. అట్టిప్రతిమార్పును పరిణామమే. ఈ పరిణామము దేనినిబట్టి నడచును? ఇందలి ముఖ్యసూత్ర మెద్ది? యనునంశము తెలియఁదగినది. లోకమున ప్రవృత్తియనియు నివృత్తియనియు రెండుమార్గములు కలవు. ప్రవృత్తి చాలమందికి తెలిసినదే. స్వకీయలాభము నన్వేషించుటచే ప్రవృత్తి. నాలుగుపురుషార్థములలో మొదటివగు ధర్మార్థకామముల ననుష్ఠించుటయే ప్రవృత్తి. పిపీలికాది బ్రహ్మపర్యంతము జీవరాసులన్నియు ప్రవృత్తి ననుభవించునవే. ఇఁక నివృత్తి యననేమి! స్వార్థత్యాగమే నివృత్తి. నాల్గవపురుషార్థమగు మోక్షాన్వేషణమే నివృత్తి. ఇందుకు భక్తిజ్ఞానకర్మలే మార్గములు. ఇది కష్టములలోనెల్ల కష్టము. ఇట్టి కఠినతరమార్గమున నెవ్వరైనఁ బ్రవర్తింతురా? ఎందరు ప్రవృత్తిమార్గమునఁ బ్రవర్తింతురో అందరును నివృత్తిమార్గమునను బ్రవర్తించువారే! అంతమాత్రమున పరస్పర వైరుధ్యము లేదు. ఏలనన? ఈ రెండుమార్గములును గలిసి పరిణామమార్గమనుపేర బరగుచున్నవి. అణువునందును గీటకమునందును పశుపక్ష్యాదులందును మానవునియందును మనకు నామరూపనిర్ణయము చేయుటకు శక్యముకాని మరి యేయితరపదార్థమందైనను గల యొక్కటగు సమానధర్మమేదియో అదియే యీపరిణామముయొక్క ముఖ్యకీలకము. అందువలననే సర్వమును సర్వకాలసర్వావస్థలయందును పరిణామమును బొందుచున్నది. లోకమందలి సమస్తజీవులును సంసారచక్రమున నీపరిణామమార్గమున బ్రవృత్తినుండి నివృత్తికిఁబోవుచుండును. నివృత్తియొక్క పరమావధి మోక్షము. త్యాగమే నివృత్తి. అయ్యది యలవడుదనుక జీవు లన్నియుఁ బ్రవృత్తిమార్గముననే సంచరించును. నివృత్తిమార్గాన్వేషణము ప్రవృత్తియందలి చెడుగుల ననేకజన్మాంతరములం దనుభవించుటచే కలుగును. క్రమముగ ప్రవృత్తిక్షీణించుచు నివృత్తి యధికమగు చుండును.

2. సమస్త జీవరాసులయందలి జీవాత్మలు నొక్కటే పదార్థమనియు నొంటొంటికభేదమనియు వివిధోపాధుల యందుండుటవలన నెట్టిభేదమును గలుగదనియు అయ్యది ఘటపటభేదమేగాని వేఱుగాదనియు ఆజీవాత్మ లనఁబడునవి యెల్లను పరమాత్మయొక్క యంశలే యనియు దాన జీవాత్మలలో నొంటొంటికెట్టి భేదము లేదనియు నట్లే జీవాత్మపరమాత్మలకును నభేదము సిద్ధించుననియుఁ జెప్పఁబడియు


న్నది. ఇదియే భిన్నత్వమం దేకత్వమును దెలిసికొనుట. ఇదియే అద్వైతమునకు మూలసూత్రము. 'ఏకమేవాద్వితీయం''తత్త్వమసీ' త్యాదిశ్రుతులయం దంతర్లీనమగు హేతువాద మిదియే.

3. నీతియును, ధర్మమును పరిణామసూత్రమునుబట్టి, యేర్పడినవే. ఏది నివృత్తిమార్గానుకూలమో యది సత్కార్యము. ఏది ప్రవృత్తికి దారిఁ జూపునో యది యసత్కార్యము. అవియే ధర్మాధర్మములు. "ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మో ధారయతి ప్రజాః" యని చెప్పఁబడియున్నది. ఏది ఉన్నతపరిణామముననున్న జీవులవలన క్రిందనున్న జీవులకు బాధ లేకుండఁ జేయునో యదియే ధర్మము. పరిణామసూత్రమును బట్టి జ్ఞాని అజ్ఞానినిగాని బలవంతుఁడు బలహీనునిగాని బాధింపకుండఁ గాపాడునదే ధర్మము.

4. అనంతజీవకోటి యీపరిణామమార్గమున మోక్షము వైపునకుఁ బోవుటయే పరిణామము. అదియే సక్రమపరిణామము. అందులకు భిన్నముగ వెనుకకుఁబోయెడు జీవులపరిణామము అక్రమపరిణామము. మనగమన మెప్పుడును సక్రమపరిణామమున నుండవలయును, తిరోహితము కాఁగూడదు. అందులకు ధర్మాచరణమే ముఖ్యకర్తవ్యము. దీనిఁబట్టి యెట్టిమార్పయినను లోకకళ్యాణదాయకమగు పరిణామముకాదని స్పష్టమగుచున్నది.

5. ప్రతిజీవునకు నెట్లు ప్రత్యేకపరిణామము కలదో అట్లే సంఘమునకును వ్యక్తులయాచరణమునుబట్టి ప్రత్యేకపరిణామము కలుగును. ఒక్కొక్కప్పుడు వ్యక్తులధర్మాధర్మప్రవర్తనలవలన సంఘము ముందువెనుకలకు నడచుచుండును. కాన ప్రతిమానవుఁడునుఅధర్మము నణఁగఁద్రొక్కఁ బ్రయత్నించుచు ధర్మాచరణమును బ్రోత్సహించుచుండ వలయును. ఇది యాధ్యాత్మిక పరిణామము.

6. ఇట్లే భౌతిక, మానసిక, సారస్వత, రాజకీయాది పరిణామములును జరుగుచుండును.



# విమానము

కొత్తపల్లి సూర్యారావుగారు

(వినోదము)

(సూత్రధారుఁడు ప్రవేశించును)

గుణము నవగుణంబు గుర్తించి లోకుల
కెఱుఁగఁజేయుపొంటె నిరువు రంత
రిక్షమార్గమున నవీనవిమానాధి
రూఢు లరుగుదెంతురు గనుఁగొనుఁడ!

(విమానము ప్రవేశించుచున్నది)

(ఆకసమువంక జూచి) ఆహా! ఏమి వీరినిర్భయత్వము! కాకేమిలే! వీరింగనుంగొన్న నన్నిట నిర్భయులల్లెపొడకట్టుచున్నారు.

చ. గగనమునుండి క్రిందు గనఁ
గాఁ దిరుగుం గనులన్న భీతియుక్
సుగుణము దుర్గుణం బనుచుఁ
జూచినదెల్ల విమర్శసేయ నె
ట్టుగ గణియింతురో యని క
డు న్భయ మున్నటులేదు ధీరులై
నగరమువారి నిట్టునటు
నగ్గడఁ జూచుచునుండి రద్దిగా!

గీ. దివ్యదృష్టి నడ్డదిడ్డంబు లాడించు
దూరదర్శయంత్రధారులగుచుఁ
బక్షులట్లులయ్యుఁ బక్షవిహీనులై
సంచరింతు రగుర సాహసంబు.

హస్తపుస్తకముంగాంచుచు నేవియో ముఖ్యాంశములపై వారిరువురు సభాషించుకొనుచున్నారు. నాయడావిడిలో వారిమాటలు లోకులకు వినఁబడవు. నేను త్రిగిల్లెదను.

(నిష్క్రమించుచున్నాఁడు)

మొదటి విమానచారి:—మిత్రమా! రామరాయ!

రెండవవిమానచారి:—సఖి! వేంకటరాయ! ముఖ్యాంశములనుమాత్రమే యుగ్గడించుకొందమా, దారి నష్టపడినవానినెల్ల రేవు

పెట్టి విమర్శించుచుఁ బోవుదమా, యని విచారమా?

రామ:—అన్నిటిని మొదలుపెట్టితిమా యీ జన్మములోఁ దేలదు. ముఖ్యాంశములకే మనకుఁ బ్రొద్దు చాలినంత లేదు.

వేంక:—మఱి తొలుదొల్త నీవే యొకయంశ మెత్తుము.

గీ. దృష్టి యానునంత తేటగా సరిపుచ్చి
యంత్ర మమరఁ ద్రిప్పు మట్టె క్రింది
నట్టె మీఁదుగాక యనపాయమార్గంబు
నందు నడపు వ్యోమయాన మింక

రామ:—అంతయు నాపై మోపక నీవును గొంత భారమును బూనవలయును.

గీ. ఎదుట వ్రాయువాని యెత్తినగంటము
తుదను బట్టి వ్రాలు పదిలముగను
నాకళించురీతి నాయాయివృత్తుల
సూచనలను నీవు చూడవలయు.

ఏమందువా? మనయత్న మారంభశూరత్వమునఁ దోఁచి తుదకు నిస్సారము కారాదు.

వేంక:—నిజమే. పలుపురవ్యవహార మట్లే యున్నది. ఆ కనఁబడు పేరుబల్లలం దిలకింపుము. ఇవి గతమాసమున లేవు.

ఉ. అద్దపుఁబెట్టె లాసనము
లార్భటయానము లీడ్పుబండ్లు తో
నిద్దఱు నేపను ల్వదిప
దేశలజీతపు వ్రాఁతకాఁడు ము
క్కద్దము పిల్పుగంట గడి
యారము గొట్టపుదీప మద్దెయిల్
మిద్దెలమీఁది వాస మిటు
మిన్నును మన్ను నెఱుంగకుందురా.

రామ:—అది యెన్నిదినములు.

వేంక:—మూన్నాళ్ళపట్టుపగలు. ఎవ్వరువచ్చి నను వేత్రాసనమునుండి లేవకయే సంభాషించు వీరియవినయమే వీరిని జెఱుచును.

రామ:—దంభములు పనికిరావు.

వేంక:—దంభము లేనివా రిపు డెవ్వరున్నారు? (ఆలకించి) అదె విను మొకనాదము.

రామ:—(యంత్రసాహాయ్యము నీక్షించి) వీ రొక నాటక సమాజమువారు. బండిలోఁబత్రికలు పంచిపెట్టుచున్నారు.

వేంక:—సావిత్రీనాటకము—కటకపురివారు ప్రదర్శింతురఁట.

రామ:-కటకపురమువారో కనకపురమువారో ఎవరైనఁ గానిమ్ము నాటకములాడువారి సంగతి చెప్పకుము.

క. ఆడినదె యాడి మఱిమఱి
పాడినదే పాడి వారు ప్రతివారంబుం
బాడొనరించెద రొకటియొ
కూడదె నిరసింప వీరి గుణదోషజ్ఞా!

వేంక:—మహానాటకము లనుటకే వీరికి శక్తి చాలదు. నూతనకల్పితములు శాస్త్రవిరుద్ధములగు నాటకములైనను.

చ. కవికృతపద్యము ల్వచన
గానయుఁ ద్రోసి స్వతంత్రులై యనే
కవికృతు లందు రాగములఁ
గానములంచని చేర్చి రాగతా
ళవిభజనంబు చేయక ప్ర
లాపమురీతి నవర్థకారిగా
దివి భువిఁ గాంచుమం ప్రజల
దిక్కుగనుంగొన కాలపింతురే?

రామ:—అందఱ నట్లనవలదు. ఇపుడు పరీక్షలలోఁ దేఱినవారే నటులుగ నిల్చుచున్నారు.

వేంక:—ఆగండపెండారములు దాల్చినవాఁడే శాకుంతల నాటకములో "భ్రమరముల చేత బుంబింపఁబడియు నింతె" యని చదివినాఁడు.

రామ:—వ్రాఁతచూచి చదువ నలవాటులేక.

వేంక:—అర్థజ్ఞానము బొత్తిగాలేక—

రామ:—తనభాగము నల్లే వల్లించినాఁడు పాపము.

వేంక:—గీ. చూడవే నేఁటిపత్రిక సుందరుఁడు
తురకవేషంబుతో వచ్చె ద్రోవది యొక
రాతిబొమ్మయె భీముఁడు రాజు గంట
గంట కొక్కరుగా మాఱిరంట సఖుఁడ!

రామ:—నీమాటల కడ్డువచ్చితిని. పత్రికలంటివి. వానివిషయమై నీయభిప్రాయమేమి ”

వేంక:—పత్రికాధిపతులు లోకజాతి విద్వాంసులు.

రామ:—వీరి విద్వత్తెటువంటిది?

వేంక:—ఒకపత్రికవారు మొదటవ్రాసినవిషయ మితరపత్రికలలో నెలదాఁక వచ్చుచుండును. 9 తేదిని సిమ్లాలో గాలివాన వచ్చునట్లున్నదని 6 వ తేది నొకదినపత్రికలో నుండిన, 15 తేదివారపత్రికలో గాలివాన 9 తేదిని వచ్చుననియే యుండును.

రామ:—అగును! గోదావరిపత్రికలో బొంబాయివార్తలు, నెల్లూరుపత్రికలో రంగూను వృత్తాంతములు, ఊరిలోనివింతలు నూకొక రిట్లువ్రాయుచున్నారని, సింహళములో నిన్న భీకరవర్షముకురిసినదని.

వేంక:—స్వస్థానవిషయములు వింతలు విశేషముగ నుండవలదా!

రామ:—అట్లనకుము. రెండుపుటలకుఁబైన కోర్టుప్రకటనలు వాదిప్రతివాదుల వేలములు మొదలగునవి యుండవా?

వేంక:—దీనికేమిమందు?

రామ:—వేపాకుచేఁదు, వెల్లుల్లిగడ్డ.

వేంక:—తీఁగదండావళి. ఒకదానివెంటనొకటి బైలువెడలుచున్నది. మందులు వైద్యులు ఈసంగతి కొంత ముచ్చటింపుము.

రామ:—పత్రికాధిపతులను దిట్టిన భయము లేదు గాని వైద్యులను దూషించినను వారితో విరోధించినను—

వేంక:—భయములేదు. రసవిషగంధకములతో నౌషధము లిపుడు చేతగాదు.

రామ:—నీపట్టున నుండుటచేతఁ దెలుపెక్కుసేగాని తెల్లగలిజేరు లేదనువారుగదా యిప్పటి వైద్యులు. ఆమందులసంగతి చెప్పుము.

వేంక:—"అర్జునః ఫల్గునః పార్థః కిరీటీ."

రామ:—పిడుగునకు బియ్యమునకు నొక్కటియే మంత్రమా?

వేంక:—కాదామఱి? వైద్యశాస్త్రములో ననుపానభేదమున రెండుమూఁడు రోగముల కొక్కమందునే చెప్పిన నిప్పటివారెల్లరోగములకు నొక్కదానినే తయారు చేయుచున్నారు.

రామ:—అవియేవో నల్లమట్టిమాత్రలకుఁ గోడిగ్రుడ్డుతో మెఱుఁగువెట్టి సర్వరోగనివారిణి యని ప్రకటింతురు నీవు సజ్జనుఁ

డవుకావున శాస్త్రమెఱుఁగనివారింగూడఁ బూర్వ వైద్యశాస్త్రములు చూచినట్లు చెప్పుచున్నాఁడవు.

వేంక:—"శ్లో. అగణితసాంవత్సరికః
షడ్గుణహీనస్తు జగతియో మంత్రీ;
శాస్త్రవిహీనో వైద్య
స్త్రయః పురుషా భవంతి యమదూతాః."

ఇందుఁ గొందఱను వైద్యులనుటకే నాకు సమ్మతము లేదు.

ఉ. మందులు నూఱు, భస్మములు
మాత్రలు చేయఁగ నొక్కపెద్దవై
ద్యుం బోలుదొల్లఁ జేరి తెలి
యుం దెలియం డొకకొన్నిరీతులన్
దొందరచే స్వతంత్రముగ
దోఁచికొనంగల లోకమెల్ల నం
చుం దలపోసి తాను నొక
చోటను నంగడిదీర్చు వెఱ్ఱియై.

రామ:—వీరికంటెను వెఱ్ఱులు ప్రకటనలం గాంచి మోసపోవు జనులు.

వేం:—కారణము లేకుండదు. మోసగాఁడు—

మ. హిమవత్పర్వత మెక్కినప్పు డొకయో
గీంద్రుండు సన్గాంచి ప్రా
ణముతోఁ దుల్యము యోగ మొక్కటి దయ
న్నాకిచ్చె లోకోపకా
రమతి న్యాస్యము నిల్లు నమ్మికొనియ
ర్థంబెల్లఁ బోనాడి యి
ట్లమృతం బమ్మెద వేగిరింపుఁ డని మి
థ్యల్వల్కి జీవించెడున్.

రామ:—ఈయోగమువలన బాగుపడువారికి మూఁడునెలలే గడువు. పిమ్మట నే నీవైద్యవృత్తిని మానుకొందును. నానినై యెందో పోదునని బెదరించును.

వేంక:—ఇట్టిమోసగానికిఁ బ్రపంచజ్ఞాన మున్నదా? లోకులు వీనికంటె మూఢులు. అతఁడేయొక్క వేయిమందుల పేరులు దాని ప్రక్కనే ప్రకటించును.

మ. సకలార్త ల్దొలఁగింప యోగము ప్రపం
చక్షేమదం బుండ "వృ
శ్చికకుట్టామృత" "మాఁకలి ప్రబలి" "సు
స్త్రీకంఠ పర్గంబు" ని
ట్లొకనూఱాఱులమందు లమ్మెదురె యం
చూహింపఁ డొక్కండు వీ
రికి దేవుండును నచ్చఁజెప్పఁగలవా
రిం దేసమర్థుండొకో?

వేంక:—వ్యాఘ్రతైలమన నాఁడు పెద్దపులి తైలమని యర్థము చెప్పుదురు.

రామ:—అయ్యో! మొన్న "మాదవకబల మమ్మా" యని యొకఁడు వచ్చిన నొకరు చెప్పినయర్థము వినలేదా?

వేంక:—మనము కప్పదాట్లు వేయుచు నేమో మాటలాడుకొనుచున్నాము ఏదీ? దాని కర్థమేమని చెప్పిరి?

రామ:—మాదవకబళము గాదు, మాధవ కర మనవలెనట. మాధవాఁ=ఓదేవుఁడా. కరముఁ= చెయ్యి: అనఁగా స్వామీ (ధర్మము) చెయ్యి (చేయుము). ఇట్లుండవలెనఁట.

వేంక:—ఎవ్వ రీయన పేరు?

రామ:—వ్యాపారముచే సుఖియై యరుగు మీఁదఁ గూర్చుండి చక్కట్లు దిద్దువా రొక్కరు.

వేంక:—ఏదీ వ్యాపారుల ప్రసంగము కొంత.

రామ:—ఇదిగో మనవిమానము వర్తకపు వీథికే వచ్చినది. చూడు పెద్ద పెద్దబల్లలు, పేరులు.

వేంక:—వర్తకపుబల్లగా దది పఠనాలయము బల్ల. పఠనాలయము, విద్యాశాఖయునఁట.

రామ:—విద్యాశాఖకూడనా! వీరు చేయుచున్నపని?

వేంక:—ఎవ్వరో చెప్పినారు. ఇపుడున్న వ్యాకరణములు చాలక పెద్ద వ్యాకరణము వ్రాయించుచున్నారని.

రామ:—ఉన్న వ్యాకరణములన్నియు (తెనుఁగునకు) జదివినారా? చక్కఁగాఁ దెలిసికొన్నారా?

వేంక:—ఉన్నది తెలియకయేకదా క్రొత్తది వ్రాయఁబోవుట.

రామ:—ఉన్నది లేనిది తెలిసికొనక క్రొత్తగా నేమివ్రాసెదరు?

వేంక:—కొన్నిసంధులు, పదములు, ప్రయోగములు క్రొత్తవి చేర్చుచున్నారు. కొందఱు దానికై నడుముకట్టినారు.

రామ:—ఎట్టివో నీకుఁ దెలిసినదా?

వేం:—పూనునకు, ఊను రూపము గలదు గదా. అట్లే పట్టునకు. అట్టు. ఇట్టివి.

రామ:—విజయనగరములో నేను వింటిని. ఇందునోనెట్టు=ఇందులోఁ బెట్టుమనుటకు. పట్టునకు అట్టుగదా—చెంబు పట్టుకొని చెంబట్టుకొని.

వేంక:—తప్పేమి? అనవచ్చును. వేయుము. ఏయుము. చూచ్చివచ్చినాను, చూచివొచ్చను, చూచొచ్చాను, చూచొచ్చా. కాపాఁడు, బ్రాహ్మణాఁడు, ఇత్యాదులు గణము.

రామ:—వేయునకు, ఏయు, ఏయునకు, వేయు, వకారమున కచ్చు రావచ్చునుగదా. వీసె నైదణాలు, వారణాలు, వేడు వెనిమిది. వెక్కడికి వెళాబడితే వలాగే విచ్చారు. అనుట నిర్బాధకము.

వేంక:—ఏఁడీ యనుటకు వేఁడీ యని ప్రయోగము లేదా? పై విధి నిరవకాశము గావున వాయన, వీయన, వితఁడు ననిన బాధింపదు. శిష్టసమ్మత మగును. ఇంగ్లీషు చదువరు లిందు సభ్యులు. ఇఁకకు ఇంక, అఁటకు అంట, చుఁడుకు చుండువలెనే కదకు కంద యని రాదుగద రాదుగంద యనదగునట.

రామ:—ఇంగ్లీషుపట్టభద్రులు తెనుఁగునకు శాసకులా?

వేంక:—ఆనల్లకోటు బి. ఏ. గా రెక్కడసభలోను నెక్కటేవాదము. సంస్కృతములోనున్న వన్నియు నాటకరూపమునఁ దెనుఁగున వ్రాయవలయునని.

రామ:—ఏరీతిగా వ్రాయుమనును?

వేంక:—భారత భాగవత రామాయణాదులలోనిగాథ లిదివఱకే నాటకములు వ్రాయఁబడినవి. చారిత్రికనాటకము లున్నవి. ఇంక నలంకార శాస్త్రాదులు నాటకములలోనికి దింపవలెనని.

రామ:—అది యెట్లు కుదురునయ్యా స్వామీ!

వేంక:—వినుఁ, ఆయనమాటలు—సుప్రసిద్ధకవులు ప్రతాపరుద్రీయము నాటకము చేయ

లేదా. అశ్లీకువలయానందము, చంద్రా
లోకము చేయవలెను.

రామ:—చాలసంతోషము. అలంకారశాస్త్ర
ములు కొన్నిటిపేరులైన సరిగాఁ దెలిసి
కొన్నాఁడు. అష్టకవీయమునకుఁ దాను
నాటకము వ్రాయరాదా? ఇది యేదో మన
తెనుఁగుపుట్టి ములుఁగుటకే వచ్చినది.

వేంక:--ఇంకొకబొడ్డూడనికుఱ్ఱవాఁడున్నాఁడు.

రామ:—అతఁ డెవ్వరయ్యా మాచిట్టిబాబు
గాఁడుగద!

వేంక:—అతనికిఁ దెనుఁగు భారతమనినఁ దన
సొమ్మనిగర్వము.

రాము:—పాపము. కావచ్చును, చదివినాఁ
డేమో?

వేంక:—అతివెఱ్ఱి—తలతిక్క—. భారతము జేబు
లో నిముడునంతటి చిన్నదిగా నచ్చువే
యవలయునని సంకల్పము. దానివెంటనే
పెద్దయచ్చులో సంపుటములు బండ్లమీఁ
దఁ గట్టవలయునని.

రామ:—మంచిదే. శక్తి యున్నదా ?

వేంక:—దరిద్రదేవత. భారతమన సర్థమే తెలి
యదు. ఏనకేనాపి గాఁడు. యుద్ధానంత
రము భారతసంస్కరణము జేసెదరట.
పాశ్చాత్యులు బహుప్రతులు శోధించి
యచ్చువేసెదరు. దానికై యెదురుచూ
చుచున్నానని యెగురును.

రామ:—బళిర! మాకుఱ్ఱవాఁడు "టు మి" అను
నింగ్లీషుపదములకు 'నాకు' అనిబడిలోచదివి
వచ్చి "నాయనా! (Honey to me) తే నాకు"
మనునర్థములో వాడినాఁడు.

వేంక:—ఒక్క-యాదిమాంధ్రుల పక్షమువాఁ
డైన చదువరి "లెండులెండు! మీరోజులు
బైటఁ బడినవి. మీకు వేదము నేర్చుకొ
నుటకు వ్యాసుఁడే యాజ్ఞ యిచ్చినాఁడు.
"భారతఃపంచమో వేదః" భారతము పంచ
ముల వేదమఁట! మీరూరులు కీయవలదు.
యిట్లే పెద్దకులము వారమని యెన్నో
మంచిహక్కులను మీచేతిలోనుండి మన
వారు లాగుకొన్నా" రని యఱచినాఁడు.
రామా! శ్రీరామా! శ్రీరామా! ఎంత
యజ్ఞానము?

వేంక:—పట్టభద్రులు కొంద ఱున్నారులే.

రామ:—"తెనుఁగెఱుఁగఁడు సంస్కృతంబు
తెన్నెఱుఁగఁడు" వారా?

వేంక:—సంస్కృత పండితులు పదిమందికిఁ
దెలియు సంస్కృతము మాటలాడలేరట,
"మువ్వంకాయ పిండిమిరియము చేయు"
మని భార్యతో సంస్కృతమున ననలేఁ
డట.

రామ:—తా నింగ్లీషులో నింగ్లీషు నేర్చినత
నముగువతో 'రెండుకోటలకు' రకాఁడలడ్డు
వేసి చల్లపులుసు కాచినావరే మించల్ల
పోగించినావరే' యనఁగలఁడా.

వేంక:—ఆక్షేపింపకుము విద్యావతులు వంట
చేయు గ్రహచారమేమి ?

రామ:— సంస్కృతపండితులు భార్యలతో
మాటలాడుటకా నేర్చినారు ?

ఇవి యున్నస్థితిని దెలుపుటకుఁ గాని
యాక్షేపణకుఁ గాదులే. నడుపుము నడుపు
ము. ముందేమికలదో ?

వేంక:—నాకుఁ దెలియదా యేమి? చూడు మాంకోలుపు.

మ. తెలుఁగే నోఁ భగవంతుఁడే యెఱుఁగు న
  త్తీర్ణాంగ్లభాషార్ఘటిక
బలుబాస ల్గల 'కాల్డువెల్లు' రచిత
  వ్యాఖ్యానముల్ సూచి తా
మిల సర్వంబును సృష్టిచేసినటు లే
  యిం దిట్టు లం దట్టులం
చు లఘూక్తిన్ వ్రేలిపుచ్చు పీరికోలుపి
  చ్చు న్నీకు నాశ్చర్యముణ్.

రామ:—ఇట్టి బైటికోలుపు లనేకములు చూచితిని. ఇందలి విశేషము లేమియో కనిపెట్టుము.

వేంక:—పీ రెందు చెప్పిన నెక్కటే పాట.

రామ:—(విని) అగును నేనీమాట రా. బ. వీరేశలింగము పంతులుగారు వ్రాయఁగాఁ జదివితిని.

వేంక:—"వానినే కఱుకుమంగలివాని కత్తి కత్తి" యని మంగలివానిపైఁ బండ్లుగీటుచు నెందఱో చెప్పుచున్నారు.

రామ:—నిజమున కాయన వ్రాసినది దేనిని జూచి వ్రాసెనో—ఆదిగో అఱవములోనికి దిగినారు.

వేంక:—(విని) సరి, కనుక యని కంబఁడు తెనుఁగుపదమును తన రామాయణము లోఁ బ్రయోగించినాఁడఁట.

రామ:—(నవ్వి)

శా. ఏదీ చూతము కంబపండితుఁడు తా
  నెచ్చోఁ బ్రయోగించెనో
వాదార్థం బఱుగక స్వతంత్రమునఁ జూ
  పం జాలువారేమొ దారు.

వేంక:—సఖుఁడ నీవెట్టి.

ఆదిం జెప్పిన దెవ్వరో విదితవృత్తాంతుల్
  సరే చెప్పఁగా

రామ:—మిత్రమా!

రాదో వారినిఁ బోలుపీరి కిది గ
  ర్వగ్రంథు లిక్లేకదా!

వేంక:—విను వినుము. ఇట్టి వెన్నియో చెప్ప వచ్చును. సంస్కృతపదము లరవములో నుండుటచే నరవము సంస్కృతముకంటె మొదటిదఁట.

రామ:—మన తెనుఁగునతిప్రాచీనము. (ఆలకించి) అదిగో వినుము "ఎంతప్రాచీనమో చెప్పఁ జాలముకాని" యఁట—

వేంక:—ఏల చెప్పఁజాలము? దీనికర్థములేదు.

రామ:—స్వబుద్ధి నుపయోగించుశక్తి మనకు లేదు. పూర్వ మేదొరగారును వ్రాయలేదు.

వేంక:— ఎవ్వరు ననని యింతమాత్రం చెప్పిన వీరిని నవ్వెద వేమి? ఏదీ నీవు చెప్పఁబో యిన తెనుఁగు ప్రాచీనత.

రామ:—అఱవపదములే సంస్కృతము క్రింద వాడినారనిగదా వీరివాదము?

వేంక:—ఎందున్నవి? యెక్కడవాడఁబడినవి?

రామ:—అదిగో చెప్పుచున్నాఁడు, వినుము: ఉత్తరరామచరిత్రములో "విరలవిరలాః" అను సీతదంతములంగూర్చిన శ్లోకముచదివి అఱవములో 'విరల్' అనఁగా వ్రేలఁట; విరల్ విరల్ అనఁగా వ్రేలుకు వ్రేలునకు దూరమున్నట్లు అని విరల్ అను నరవ పదమునే సంస్కృతములో విరళవిరళ క్రిందఁ దీసికొన్నాఁడట.

వేంక:— ఏదీ మన తెనుఁగుగూడ సంస్కృత ములో నున్నదందువా? ఎందులో?

రామ:—పురాణములలో ధర్మశాస్త్రములో గావ్యములలో.

వేంక:—కొన్ని మచ్చుముక్కలు కనఁబఱుపుము.

రామ:—1 నైవేద్యం భక్తితో దద్యాత్, 2 కృపితోనాస్తి దుర్భిక్షం, 3 నిరుద్ధబాష్పోదయసన్నకంఠం, 4 దేవేభ్యః ప్రాంజలిర్భూత్వావేపమానేన మబ్రవీత్, 5 మనోవాక్కాయకర్మభిః.

వేంక:—అబ్బో! చాలుఁజాలు, కట్టిపెట్టుము. వీరి రెండుముక్కలు వినిపోదము.

(వినుట నభినయించుచున్నారు)

రామ:—ఏమిరా! ఈయన యొకక్రొత్తగ్రామ్యవాది. ఆహా! మాటలాడినట్లే గ్రంథములు వ్రాయింపవలయునఁట.

వేంక:—అదిగ నక్కఱలేదు. "జలజనయన ముఖము చంద్రసఖము" దీనికర్థము, చంద్రసఖమనఁగాఁ జంద్రునిలో (సఖము) సగమఁట. మానాయన! దేశము నుద్ధరింపుము.

రామ:—బహువచనములమీఁద బహువచనములా? "అరే. యిది యేమిటి ?"

వేంక:—అదిగో వినవేమి? ఉదాహరణ మాయనయే యిచ్చుచున్నాఁడు చమత్కారములు కొన్ని యనుటకు, చమత్కారకొన్నులు. ఇట్లు కల్పింపవచ్చునసుట.

రామ:—గంగలో దిగిన భాషావ్యాసము, నేనువినను.

వేంక:—(విని) వినవయ్యా! మంచిమాటలు.

రామ:—భల్లూకపుఁబట్టు కుజ్ఞవాద్రకు మొదటనే వలదఁట.

చ. తెమవలె నన్నిసంగతులుఁ
దత్పరులై గ్రహియించి పిమ్మటన్
విమలమతి న్విచారమున
వీడిన వీఁడదు రంతే కాని మొ
ట్టమొదటనే త్యజించి యక
టా! యతిమూర్ఖులు బాలురైన నిం
క మును రచింపఁబడ్డ యొక
గ్రంథము నర్థము గాదురా హరీ!

ఇఁకఁ గుజ్ఞవాంత్రు గన్వకుమాఱుదురా?

వెంక:—చ. చదివిరి కావునం దమరు
చాలదు వ్యాకరణంబు పూర్వపుం
జదువులు బాలకు ల్గఱవఁ
జాలరటంచని చెప్పి నర్దెసల్
కదలికఁ బుట్టఁ జేసి రటు
గా కెవి తాము వచించి రద్దియే
మెదపుచు నందఱు న్కలఁప
మేటివిధాతలె మీరు నెచ్చెలీ!

రామ:—అయ్యో; మనము వచ్చినట్లే లేదు. ప్రొద్దు గ్రుంకినది.

వేంక:—పిల్లల నజ్ఞానులం జేయఁ గంకణము కట్టుకొన్నారా?

రామ:—సుజ్ఞానులను జేయుటకే నఁట—

వేంక:—లోకమోపాడో యన్నారు. శివ!శివ!

రామ:—విద్యాశాఖ లిట్లున్నవి. పఠనాలయములమాట—పఠనమందిరము లనినపుడెల్ల నాకు బంతులాట యేపఠనములోనిదిరా యని యోజన.

వేంక:—ఇప్పు డూర నూర నింటనింటఁ బఠనాలయములే.

రామ:—ఒక్కపఠనాలయములోను నొక్కనికి జ్ఞానము కుదురునని నేను దలంపను.

# శ్రీ కృష్ణ భారతము

వ ............అట్లు కృతార్థుం డయినమాతీర్థపాదుండు లోకహితార్థంబు గాఁ జతు
ర్వేదంబులును విభజించినవెనుక నేకతంబ హిమవత్కందరంబున దర్భాసనాసీనుం
డై తనహృదయపద్మంబున సమస్తప్రపంచోత్పత్తి స్థితిలయాదులనెల్ల యోగ
దృష్టిం బరిశీలించి ధర్మార్థకామమోక్షప్రదంబును వేదవేదాంగసమ్మతంబును
నానావిధపురాణేతిహాసధర్మసహితంబును బంచమవేదంబు నగుభారతాఖ్యానంబు
సంగ్రహంబుగను సవిస్తరంబుగను మనంబునందలంచి దీని నెట్లు జగంబులవ్యాపింపం
జేయుదునో యని చింతించు చున్నంత. ౧౮౦

చ. నలినభవుండు వోల్చి మునినాథునిపజ్జ వివేక మొప్ప నీ
సలిపినదాని విఘ్నపతి చక్కఁ లిఖించెడు నట్లు చేయు మం
చలర వచించి వోవ నతఁడాగణనాథుని వేఁడి వానిచేఁ
గల మది యాఁగకుండ వడిగాఁ గవనంబునఁ గూర్చె నంతయున్. ౧౮౧

క. వెనకయ్య చేతివడికిన్, వెనుకం దననోడువు వడిన వేదవ్యాసుం
డును నర్థ మెఱిఁగి వ్రాయుమి, యని ఘట్టము లందునందు ననుసంధించెన్. ౧౮౨

* * * *

తే. ఐతిహాసికు లితిహాసమంచు లాక్షణికులు లక్షణ మంచుఁ గార్మికులు కర్మ
కాండ మంచు జ్ఞానులు జ్ఞానకాండమంచుఁ, జదువ భారతకల్పవృక్షంబు వొదలు. ౧౮౮

సీ. సంగ్రహాధ్యాయబీ జమ్ము పౌలోమమూ, లము సంభవస్కంధ సముదయమ్ము
విమలసభావిటంకము వనపర్వరూ, పము విరాటోద్యోగ పర్వసార
మాభీష్మపర్వమ హాశాఖము ను ద్రోణ, పర్వపర్వము కర్ణపర్వసుమము
శల్యపర్వసుగంధ సహితంబు స్త్రీపర్వ, సాధువిశ్రామము శాంతి ఫలము.
తే. అశ్వమేధామృతం బాశ్ర మాధివాస, సంశ్రయం బైనభారతా క్షయకుజంబు
భూతములకుఁ బర్జన్యుండు వోలెనెల్ల, ద్విజుల కుపజీవ మై యొప్పు బృథివియందు

ఆదిపర్వము ఆ. ౧.

# భారతరచనము

కవి: వేదవ్యాసుడు — లేఖకుడు: గణపతి



చిత్రకారుడు: శ్రీయుత్, ఎ. రామమోహనరాయుగారు

[illegible]

పత్రికలభాష యొకభాష. ఆమూలనవలల భాష యొకటి. ఈరెంటిం జదివిన మన వారు భాషాభిమానులు. అడుగ నక్కఱ లేదు.

వేంక:—లాభ ముండదనియే తలంచెదను. (ఆలోచించి) గ్రీసుదేశములో నొకకన్య 12 అడుగుల యెత్తుగలది యున్నది. ఆమె సిగరెట్టు దారిలో దీపపు స్తంభము లాంత రుమీఁత తెఱచి వెలిఁగించుకొననఁట. ఈమెవయసు 10 సంవత్సరములు. ఇది భాష కేమూలనైనఁ గలసికొనునా? నీటి తీర్వ, కలగూరగంప, ఇండియా సమస్య, సరిహద్దుల ఘోరసంగ్రామము, రెండవ వార్డు యెన్నిక, ఇట్టివి యేభాషాభాగము లోఁ జేరును?

రామ:—నవలలభాష నేను జెప్పెదను. మా మేనఁగోడలు నవలలంటే తిండికూడా వల దనును. మాభావ కళరములే రావు, గాని వడ్డీవ్యాపారములు డోకడాలు అర దమ్మిడిపోకుండా నోటితో—లెక్క.

వేంక:—కొని యిచ్చును, కూఁతురు చదువును.

రామ:—1. సుబ్బమ్మొదినా! చిట్టెఁడుప్పు బదు లిమ్మంటే మొన్నటి రెండు కుర్చీల మిరె పకాయ లియ్యండేనా అని చెప్పింది. 2 కుర్చీమీది సుబ్బరావు వంట్లైతే భోంచేసి వెళ్లాలి అని భార్యనుద్దేశించి కేకవైచెను. ఇది నవలాభాష. ఒక్కసారి మూచూచి పాటవేయుటకైనా తగదు.

వేంక:—మఱియేమిటి—మన కుపాయము?

రామ:—నీవుకూడ నవన్యాసములు మొదలు పెట్టెదవా? వలదు.

వేంక:—ఇవి చదువనట్టి కాలములో నూఱు వవంతులో వసుచరిత్రము, మనుచరిత్ర ము మొదలైనవానిలో వ్యయపఱిచి చదివిన.

గీ. వారము నకొక్క పద్యము వచ్చెనేని
జాలు నాలుగు నెలవు వత్సరమునందు
నేఁబదియు శబ్దజాల మెంతేని నోదవు
తోఁపదొక్కరికీ మాట దుఃఖకరము.

వేంక:—నిజముగానట్టిదియే.

చ. దినమున కొక్కసారిగఁబ
దింబదియేను దినంబులొక్కచ
క్కనికథ భారతాదులను
గాటపు మక్కువ ఫల్లెవేసి యం
దునగలగాథ, యర్థమును
దొడ్డప్రయోగము లాకళించుచుం
డినఁ జదినూర్ల పత్రికలు
సేర్పినభాషకు నీడుగాదొకో.

రామ:—ఇంక నొకటి. పనిలేక తిరుగు బీద శాస్త్రి నొక్కనిం బిలిపించుకొని యేదైన నొక్కపుస్తక మొకగంట చదువరాదా! ఒక్కపఠన మందిరములో నందఱుగూడి యొక్క మారుగానే తెలిసికొనరాదా!

వేంక:—దానికి నొక్కచిక్కువచ్చినది. ఆంధ్రులదుస్థితి యట్లేయున్నది. ఈ మాట గట్టిగా ననఁగూడదు.

రామ:—ఏమంత పరమరహస్యము?

వేంక:—ఆయూహ పఠనాలయములవారికిఁ బుట్టనేపుట్టదు. పుట్టిన—

రామ:—తగిన శాస్త్రి దొరకఁడందువా? నేను నుగొంత యీవిషయ చర్చచేసినవాఁడనే.

వేంక:—చక్కగా రెండుభాషలు వచ్చినవారులేరు. ఒక్క యుత్తరదేశపండితుండు వచ్చినాఁడు. పఠనాలయములో సాయంకాలము సభయన్నారు. నేనును బోయితిని.

రామ:—ఇది యంతయు మెప్పులకు గొప్పలకేగాని విషయమొక్కరికి నక్కఱలేదులే.

వేంక:—నీకుఁ దెలియనిదేమి? ఉపన్యాసము సగమైనఁ గాలేదు.

ఉ. ఒక్కఁడు లేచిపోయెను మ
ఱొక్కఁడు నాఁటునఁ జుట్టగాల్చె
నొక్కఁడు పత్రికల్ చదువ
నొక్కఁ డిఁకొక్కని లేవఁదీసియా
ప్రక్కదశావతారికని
బల్లనఁ బోయిరి, బంతులాడఁగాఁ
బక్కన నార్గురేగిరి ర
వప్రకటాంగ్లకపాదరక్షులై.

రామ:—గడియలో లేచిపోవుపండితుని మాటలే వినలేదు—కుదిరి కూర్చుండి చదువుదురా? ఈ గడియలోనే యాటపాటలు కాకున్న నిత్యవిధికిహానియా?

వేంక:—దీనింబట్టియే వీరి నిలుకడ విశదమగును.

రామ:—ఆ బంతులాటయైనను జేతఁగాదు—గ్రహచారము!

వేంక:—కాలుజాఱకుండుటకై మడిమలులేని చెప్పులు, చెమట తుడిచి నాను చిన్నగుడ్డలు మొలలో. చేతికడ్డురాకుండ దండలమీఁదికి మడఁచిన కంచుకములు గలవీరు.

చ. ఇలపయిఁబడ్డ బంతి నెగ
నెత్తెడు నేరుపు బంతిఁగొట్ట
జాలు పడిఁద్రిప్పు నేరుపు బి
ఱానఁ జివాలునఁ గందుకంబుల
ట్టులు పుటము ద్రవించెడు ప
టుత్వమె కాని టకీటకీయటం
చు లఘుత నెన్నఁడే నయిదు
మట్లయినం బడకుండఁగొట్టిరే.

రామ:—ఇవి యన్నియు దురభ్యాసములు గాని వ్యాయామములుగావు.

వేంక:—చీకటిపడుచున్నది. మరల రేపువత్తము. అదె కొలనుగట్టున నక్షత్రములవలె మెఱయుచున్న వేమో చూడుము.

రామ:— ఏలయడిగెదవు? నిరుద్యోగులగు బ్రాహ్మణబాలుర సంఘమది.

వేంక:—నేను వారిం గూర్చి యత్నించినాను గాని లొంగలేదు.

రామ:—అదిగో నా ప్రక్క వెలుగు వచ్చుచున్నది.

వేంక:—ఈశ్వరుని కృత్తికోత్సవములో మాలెతలు నెత్తిఁ బెట్టుకొని వచ్చు వాయుదీపముల వెలుఁగు.

రామ:—శివశివ! అన్ని యొగ్గులును బోయినవి. కాని యీ వెలుఁగులోనే దిగిపోవుదము రమ్ము.

(ఇరువురు విమానముతో నిష్క్రమింతురు)

# ఈశావాస్యోపనిషత్తు

కవిరాజు మల్లాది వేఙ్కట విశ్వనాథశర్మగారు (నాటకకళా సంపాదకుఁడు)

ఈశుఁడు వసించు జగతి నెల్లెడల-సర్వ
వస్తువులయందు 'అనీశ' భావన వహించి
యాత్మపాలించుకొనుము సన్న్యాసవృత్తి,
కోరకుండుము ధనము—ఎవ్వారిదైన.

అగ్నిహోత్రాదిసత్కర్మ లాచరించు
చిలను నూఱేండ్లు జీవింప నిచ్ఛగింపు;
మింతకంటెను నీకు గత్యంతరమ్ము
కానఁగారాదు—అదిబంధకమ్ముగాదు.

అసురములనులోకంబు లంధతిమిర
బంధురమ్ములు; వానిలోఁ బడుచు నుంద్రు
జ్ఞానసత్కర్మ సంస్కారహీనులగుట
నాత్మహంతకులౌ జను లంతమందు.

చలన మెఱుఁగక యేకమై వెలసి—మనసు
కంటె వడి గల్గి యంతటఁ గ్రాలుచుండి—
యింద్రియాగ్రాహ్యమగుచు దీపించు 'ఆత్మ'
ప్రాణమం దుండి ప్రాణికర్మల ధరించు.

అది చలించుచుండు—అది చలియింపదు
అది సమీపవర్తి—అదియు దవ్వు
అది సమస్తమునకు నంతరంబున నుండు—
అది సమస్తమునకు నవలఁ దోఁచు.

అఖిలభూతసమితి యాత్మయందున—ఆత్మ
యఖిలభూత సమితియందు—సమత
నెవఁడు చూచు నాతఁ డెనయఁ డెన్నండును
క్రోధబుద్ధియును జుగుప్స మదిని.

ఎవ్వఁ డెల్ల యెడల నేకత్వమును జూచు
నఖిలభూతసమితి యాత్మ యగుట
వాని కాత్మవేది యైన విజ్ఞానికి
మోహ మేడ? శోక దాహ మేడ?

శుక్ర మవ్రణమ్ము శుద్ధ మకాయ మ
స్నావిర మ్మపాపకమైన
యాత్మ యెల్లయెడల నావరించి రహించు
నిర్వికారవృత్తి నిశ్చలముగ.

కవియు మనీషియును స్వయం
భువు పరిభువు నైన వాఁడు భూయశ్శక్తి
సవిరుం డర్థంబుల నను
వప్రనటు లేర్పఱచె శాశ్వతాబ్దంబులకై.

ఏ రవిద్య నుపాసింత్రు వారు పడుదు
రంధకారంబునందు దేహాంత మైన;
ఏరు విద్య నుపాసింత్రు వారు పడుదు
రంతకంటెఁ బ్రభూతమౌ ధ్వాంతమందు.

విద్యచేత మఱి యవిద్యచేతను గూడ
నితరఫలములే లభించుననుచు
వ్యాహరించినట్టి యాచార్యులవచస్సు
శ్రవణసేయ మయ్యె మిత్రుల మాకు.

'విద్యయు నవిద్య రెండును విహితములకుఁ
బురుషున' కటంచు నేసునం దెలుఁగు వాఁడ
విద్యచే మృత్యువ్రదరించి, విద్యచేత
నమృతసిద్ధి చిరమ్ముగా ననుభవించు.

ఏ రసంభూతి సేవింత్రు వారు పడుదు
రంధకారంబునందు దేహాంత మైన;
ఏరు సంభూతి సేవింత్రు వారు పడుదు
రంతకంటెఁ బ్రభూతమౌ ధ్వాంతమందు.

సంభవమున మఱి యసంభవమ్మునగూడ
నితరఫలములే లభించు ననుచు
వ్యాహరించినట్టి యాచార్యులవచస్సు
శ్రవణసేయ మయ్యె మిత్రుల మాకు.

ఎవఁ డసంభూతియు వినాశ మీయుభయముఁ
బురుషునకు ముఖ్యమగు నంచు నెఱుఁగునాతఁ
డొగి వినాశముచేత మృత్యువ్రుఁ దరించి
పొందు నమృతపద మ్మసంభూతిచేత.

నీయందు వెలుఁగు బ్రహ్మము
డాయంబోయెనను పూష! డాఁగె నదియు దే
జోయుతపాత్రమ్మున — అది
తీయుమ వెస సత్యధర్మనృతినగునాకై.

పూష! ఏకర్షి! యమ! బ్రహ్మభూ! దినేశ!
తేజ ముపసంహరింపు; బంధింపు ఘృణుల;
నీదు శుభతమరూపమ్ము నేను గాంతు;
నీశఁ డెవ్వఁడో యాతఁ డే నేను నగుదు.

గాలి తుదిలేనిగాలిలోఁ గలియుఁ గాక!
తగ శరీరమ్ము భస్మాంత మగును గాక!
క్రతుమ! 'ఓము'ను 'ఓము'ను క్రతుము స్మరణ
చేయునట్టులు పరమాత్మ! చేయుమయ్య!

మమ్ము సన్మార్గమునఁ గొనిపొమ్ము అగ్ని!
మాకుఁగువచోభయ మ్మంటనీకు దేవ!
తెలియుదువు మా మొనర్చుకర్మల మహాత్మ!
ఒనరుతుము నీకిదే నమ ఉక్తి యీశ!



# దేవవ్రతచరిత్రము సవిమర్శ పఠనము

## ఉ పో ద్ఘా త ము

దేవులపల్లి అప్పలనరసింహము గారు, యమ్. ఏ. యల్. టి.

ఆంధ్రకవిత నూతనమార్గముల నన్వేషించుచుండు నీ సమయమున పూర్వకావ్యరీతి నుద్ధరించుచు వ్రాయబడిన "దేవవ్రతచరిత్రము" మూడుసంవత్సరములనుండి విద్వాంసులచే మన్ననపడయుచు విశ్వవిద్యాలయాధికారులవల్లగూడ నంగీకృతమై బి. యే. పరీక్షకు పఠనీయగ్రంథముగా నియమించబడినది. ఇట్టి ఘనకావ్యమును పఠించి నేను అనుభవించిన సంతోషమును సహేతుకముగా సహృదయులకు నివేదించుటకు జేయు యత్నము సారస్వతానందమును అభివృద్ధిపఱచుటకు తోడుపడునని యూహించుచున్నాను. సారస్వతప్రియులిట్లన్యోన్యపరితోషమును తెలుపుకొనుట విధియని ఎంచెదను.

ఇదిగాక ఈ విమర్శనకు నన్ను ప్రేరేపించు కారణములు రెండు. అందు మొదటిది శ్రీమద్గ్రంథకర్తయొక్క ఆనతి. మహాపండితులును, కాలేజీలో చదువుకొనుచున్న కాలమున నాకు సంస్కృతవాఙ్మయమునందు అత్యంత ప్రేమోత్సాహములగలిగించిన దేశికోత్తములును అగు శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారిచే రచింపబడిన ఈ మహాకావ్యమును నేను విమర్శింపగడంగుట ఎట్లుజూచినను సాహసకార్యమని చదువరులకు దోచును. అయినను, వారి యాజ్ఞయే ఆశీర్వచనము. వారి ఆజ్ఞయే నా కీయుద్యమమున తారకనౌకయనియు యెంచి యీ వ్యాసమును వ్రాయుచున్నాను. వారిలేఖలోని వాక్యముల నిచ్చట పొందుపఱచుచున్నాను.

"మీకు నేను పంపిన దేవవ్రతచరిత్రమును సావకాశముగా Critical (విచక్షణ) గాచదివి దానిపై నొక Review (విమర్శన) నాలుగయిదు పేజీలు printed matter (అచ్చుకూర్పు) అయ్యేటట్లువ్రాసి భారతిలో ప్రకటింపవేడెదను. ఈపని మీరుచేసి తీరవలెను. విమర్శన వ్రాయునపుడు అందలి లోపములను దాచవలదు. ..."

ఇట్టి యౌదార్యము గ్రంథరచయితలలో సామాన్యముగా గనుపడు భావముగాదు. అనుల్లంఘ్యమగు నీదేశికవరు నాజ్ఞను శిరసావహించుచు, వారియాజ్ఞావాక్యములయందలి నిర్మలోదారభావములవల్ల భక్త్యుత్సాహపూరితుడనగుచు, పరమగురుచరణములను తత్త్వైకజిజ్ఞాసువగు మనంబున మననంబుజేయుచు, నేనుజేయబోవు విమర్శనలోని లోపములను మన్ననతో సవరింప ప్రాజ్ఞులగు చదువరులను సబహుమానముగా వేడుచు, యథాశక్తిని నాకు దెలిసినపౌరస్త్య పాశ్చాత్య కవితాశయముల వెలుతురునందుగాగాని ఈకావ్యరాజ పఠనమందు నాకుగలిగిన సంతోషాదిభావములను సకారణముగా తెలుపుకొనుచున్నాను.

రెండవ కారణమిది. ఇప్పటి ఆంధ్రసారస్వత నూతన యుగమునం దిట్టి పూర్వసాంప్రదాయముల ననుసరించు కావ్యము వ్రాయబడుట యొకవింతగా కొందరు విద్వాంసులకు దోచినట్లు ఈగ్రంథమును గురించి వ్రాయబడిన అభిప్రాయములను బట్టి గ్రహించితిని. ఇది పండితతోషణముకొరకే వ్రాయబడినదిగాని జనతోషణముగా నేరదని వారి యభిప్రాయము. శైలి సంస్కృతభూయిష్ఠమని సూచించబడినది. గీర్వాణభాషయందమిత పాండిత్యముగలిగిన కవికి యిది సహజమని మన్నింపబడినది. "గీర్వాణమును లంఘించు" అచ్చతెలుగు పదములను అధికముగా ప్రయోగించు కావ్యములుగూడా యిప్పటి విద్వద్వరుల మన్నన బడయుట కష్టము. అమరకోశమును ఆంధ్రనామ సంగ్రహమును ఆధారముగాగైకొని వ్రాయబడు కావ్యములు ఈయుగమున దుర్గ్రా

హ్యములై వ్యాప్తినొందనేరకయున్నవి. అయితే వ్యావహారికపదములను వాడుచో నట్టి శబ్దములకు హాస్య నీరసత్వములంటకుండ ఉన్నతభావస్ఫూర్తిగలిగించి ఉదారకావ్యముల కుపయోగించుటయును కవికి బహు శ్రమదాయకమగును. ఆబంఢ యీకొండనడుమబడి కవియొక్క ఆశయములు ఈక్లిష్టసమస్యల నెదుర్కొన జాలక సన్నగిల్లుటయు సంభవించును. ఆంధ్రకవితావాహిని ఇప్పుడీ యవస్థయందున్నదని నేనూహించెద. దీని కిగల అనేక కారణములలో శైలియందలి ఆపర్యముల లోనున్న సందిగ్ధస్థితి ఒకటి యని యెంచెదను. ఇమ్మహాకావ్యము ఈస్థితిని ఎట్లు తప్పించుకొనె ననుకుతూహలముతో పరికించితిని. మొత్తముమీద సులభశైలినే వ్రాయబడినదని తలంచుచున్నాను. వేయి సంవత్సరములనుండి ఆంధ్రలోకమునకు సుపరిచితమైన సారస్వతసాధనమే ప్రయోగింపబడినది. శైలినిబట్టికూడా ఈ కావ్యము స్వర్ణాదరణపాత్రమని నాదేశీయులకు దెల్పు కుతూహల మెుకకొంత నన్నీవిమర్శనకు పురిగొల్పినదని తెలుపుకొనుచున్నాను. ఈ శైలిని గురించి యీ వ్యాసమునందాఖరుభాగమున నాయభిప్రాయములను వివరముగా వ్రాసియున్నాను.

## II కావ్యవస్తువు

ఈ "దేవవ్రతచరిత్రము"నకు ధీరోదాత్తపురుషుడగు భీష్ముడు కథానాయకుడు. ఏ యుగమునకైనను ఆపర్యముగనుండనోపును. తండ్రిమనస్సునుఅనువర్తించుటయందును స్వార్థత్యాగమునందును ముఖ్యముగా శ్రీరాముని దలపించునా, ధైర్యశౌర్యములయందును, యుద్ధకౌశలమందును పూర్వయుగవీరులలో ముందువరుసలో నెన్నతగినవాడు. ధర్మజ్ఞానమందును, దూరదృష్టియందును, ఆత్మనిగ్రహమందును మహాయోగపురుషులతో పోల్పదగును. ఈమేటిధీరుని చరిత్రము మహాకావ్యవస్తువుగానుండుట కత్యంతము తగినది. వీరులు, బుద్ధిశాలులు, దేశాభిమానులునగు ఏనియస్ (Aeneas), ఒడెస్సియస్ (Odysseus), అను గ్రీసు దేశపు మహాపురుషులజీవితములు ఘనకావ్యముల కాధారమైనవి. బుద్ధియందును, వీర్యమునందును వారిని బోలి, ధర్మైకనిష్ఠయందును, ప్రతిజ్ఞాపరిపాలనమునందును వారినిమించి యున్నటువంటి శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, బుద్ధుడు, శిబి, దేవవ్రతుడను భీష్ముడు మహాకావ్యనాయకులుగా లభించుట మనదేశసారస్వతముల భాగ్యమని చెప్పవలయును.

భీష్మునికథ మహాభారతములోని కథనంతటిని దనుత్రాణమువలె గప్పియుండుటచేత ఈకావ్యవస్తువు "సంక్షిప్తభారత" మని చెప్పినను దప్పుగాదు. నాలుగవయైదవ ఆశ్వాసములు పాండవుల జననము మొదలు గురుక్షేత్ర యుద్ధావసానమువరకుగల మహాభారతకథను సంక్షేపించి చెప్పుచున్నవి. గ్రంథకర్త భీష్మపతనము తరువాతి యుద్ధకథను రెండుపద్యములలోను, ధృతరాష్ట్ర, పాండురాజుల పుట్టుకమొదలుకొని ధర్మజ రాజసూయమువరకుగల కథను అయిదారుపద్యములలోను ఇమిడ్చిరి. భీష్మునిచే కృష్ణస్తుతిచేయించుటకై రాజసూయకథను కొంచెము విరివిగా నాలుగవ యాశ్వాసమున ప్రదర్శించిరి. ఇట్టి సంక్షేప చతురత అనేకచోట్ల జూపబడినది. పంచమాశ్వాసమున భగవద్గీతా బోధమునందును గాననగును. ధర్మజునకు భీష్ముడు బోధించిన ధర్మములను ఒకటి రెండు పద్యములలో ముగించి కవి యిక్కలపు చదువరికి ఖిసువు జనింపకుండజేసెను. ఇట్లే భగవద్గీతాబోధమునుగూడ రెండుమూడు పద్యములలో ముగింపకుండుటకు కవియొక్క భక్తిపారవశ్యము కారణము. ఇందలి విశ్వరూప వర్ణనములోని పద్యములు (V. 227, 230;) వీరిచే నిటీవల రచింపబడిన "పార్థసారథి" శతకమునందును (103, 105,) గనబడుచున్నవి. నిత్యమును కవిహృదయమునందు వగలుమండు భావములగుటచేవాటినంటియుండు పదజాలములు తమంతటతామేప్రాప్తనజన్మబిన్ద్వులవలె పునఃపునః స్వయముగా నాయాయెడల ప్రాదుర్భవించుచుండుట అన్ని దేశపు సత్కవుల కృతులయందును గాననగును.

పంచమాశ్వాసమందు భీష్ముని యుద్ధనాయకత్వము కథావస్తువైయున్నను, ఆయన మరణముతో యీసత్కావ్యమును ముగింపనొల్లక వారిమనుమడగు ధర్మరాజుయొక్క పట్టాభిషేకకథను పదునెనిమిది పద్యములలో గూర్చి చివర నతికిరి. కథావస్తువునందు

"ఐక్యత" (unity) అనగా ఇతర కథలకు ప్రాముఖ్యము నీయకుండుట ముఖ్యావసరము. ఇందుకే, నాటకమునందు ప్రతియంకమును ప్రత్యేకసేతృచరితమైయుండవలయునని లాక్షణికులు శాసించియున్నారు. అనగా కథానాయకుడు ప్రతియంకమునందును ప్రాముఖ్యము గలిగియుండవలయునని వారిఅభిప్రాయము. లేనిచో కథ చెదిరిపోవును. విరివిగా వర్ణనములుచేసి కథను పెంచు శ్రవ్యకావ్యమునందు ఈనిబంధనమంతగా పాటింపనవసరము లేదనుకొన్నను, అన్యకథలకుగాని, అన్యపురుషులకుగాని ప్రాముఖ్యము నీయరాదు. అంత్యమున యుధిష్ఠిరునకు ప్రాముఖ్యము నిచ్చుటచే నీకావ్యవస్తువు ఇంచుకబలహీనమైనదని చెప్పవచ్చును. కాని భీష్ముని మనుమడగుటను, ఆతనిచే నెల్లప్పుడును మెప్పువడసి ఆశీర్వచనమును గొనినవాడగుటను, ఆతనిధర్మబోధలనొంది ఆ ప్రకారము భారతరాజ్యమేల గడంగినవాడగుటచేతను, ధర్మరాజుయొక్క పట్టాభిషేకము భీష్మునియొక్క వంశాంకురవిజృంభణమై ఆయన నిర్యాణమునకు ఉచిత శోభనొనగూర్చుచున్నది.

ఆదాము, ఈవా, అను నాయకుడును నాయకియును విచారముతో తమ "నందనవనము"ను (Paradise) విడుచుట యను కథాంశముతో మిల్టను (Milton) మహాకవి తనకావ్యమును ముగించెను. కావ్యమునకు శోకాంతము హైందవ సారస్వతములయందు ఒప్పుకొనబడదు. ఆంగ్లకవులలోగూడా నిట్టిభావన మక్కడక్కడ గాననగును. మీదజెప్పిన "నందనవననష్టము" (Paradise Lost) అను కావ్యాంతమున నాయికానాయకు లిరువురును "చేతిలోచేయివైచుకొనినందున వనభూములను విడచుచు నడచిరి." అనుటలో ఆ నష్టమున గలిగిన శోకము నణచు మహౌషధియగు అన్యోన్యప్రేమ వారిలోనే ఉన్నదని ద్యోతమగునట్లు కవిసూచించియున్నాడు. ఆర్నోల్డ్ (Arnold) అను కవియొక్క సోహ్రాబ్ అండ్ రుస్తుమ్ (Sohrab and Rustum) అను చిన్నకావ్యములో తండ్రియగు రుస్తుమ్ తనయుడగు సోహ్రాబ్‌తో తెలియక యుద్ధముచేసి వానిని జంపెను. నిజము తెలిసి శోకాంబుధిలో మునిగెను. కవి ఈ శోకముతో ముగింపక చదువరి మనస్సునకు శాంతి కలిగించుటకొరకు అప్రక్కను ప్రవహించుచున్న ఆక్సస్ (Oxus) అనునదియొక్క వర్ణనము విపులముగా జేసి, జీవితప్రవాహముయొక్క గాంభీర్యము, విస్మయము గలిగించు వింతపోకడలు మనస్సుకు స్ఫురించునట్లు ముగించినాడు. ఆంగ్ల, ఆంధ్ర, గీర్వాణభాషలలో పాండిత్యముగలుగు ఈదేవవ్రతచరిత్రకారులు ఇట్లు కావ్యవస్తువుకు ప్రత్యక్షసంబంధములేని ధర్మరాజపట్టాభిషేకమును చివరనుజేర్చుట యొక వింతగాదు.

అయితే, కల్యాణమువలె దేవతలకును మనుష్యులకును ఆనందమును గూర్చు ఈవృద్ధవీరుని నిర్యాణము విషాదకరమని భావించ నక్కరలేదు. స్వచ్ఛందముగా యోగమార్గమున విడువబడిన

"ఉ. ఆతనియాత్మ కొంతవర కాకసమందు మహోల్కచాడ్పునన్, స్ఫీతశిఖాకలాపముల వెల్గుచుబోయి యదృశ్యమయ్యెం గం, జాత దశాత్ముడు న్మునులు సాధ్వితులై కనుచుండఁ బుష్పవృ, ష్ట్యాతత మయ్యె భూమి దివమందు జెలంగెను దుందుభిధ్వనుల్."

ఈపద్యముతో నీకావ్యమును ముగించినను మన లాక్షణికులు తప్పుబట్టుటకు వీలుండదని భావించెదను.

ఈ సందర్భమున నొకచిన్న విభేదము గమనించదగును. శిశుపాలునిఆత్మ కృష్ణునియందు జొచ్చెనని నాలవ యాశ్వాసమున 134-వ పద్యమున జెప్పబడెను. ఇమ్మహాపురుషునియాత్మ కృష్ణుడును తదితరులును జూచుచుండ యాకసమార్గమున బోయెనని ఇచ్చట జెప్పబడెను. ఆత్మకు కృష్ణసాయుజ్యము నకన్న యాకసగమన మెక్కుడైన గతియా యని నాకు సందేహము కలుగుచున్నది. పాశ్చాత్య సారస్వతమున, ముఖ్యముగా గ్రీకు సారస్వతమున పెర్సియుస్ (Perseus), ఏండ్రోమెడా (Andromeda) వంటి నాయక నాయికలకు దేవతల కృపవల్ల యిట్టి తేజోమయమగు మార్పులుగలుగుట అచ్చటచ్చట గాననగును. పోప్ (Pope) అను నాంగ్లకవి యొక హాస్యప్రబంధమున బెలిండా (Belinda) యను నాయికయొక్క ఒక పోకిరిచే కత్తిరింపబడిన శిరోజములకు "మహోల్కాచాడ్పున" నాకసమునకెగసిపోయి నక్షత్రమువలె నంబరతలమున నిలుపబడుయోగ్యతను కావ్యాంతమున గల్పించినాడు.

## III. కావ్యరచన-ఆశ్వాసములు

ఈ భీష్ముని చరిత్రమున ప్రథమాశ్వాసము ఎంతే మనోహరముగనున్నది. నాయకుని జననవృత్తాంత మిందలి వస్తువు. ప్రాముఖ్యము యీయాశ్వాసములో నాయకుని తల్లిదండ్రుల కీయబడినది. గంగాశంతనులయొక్క సమాగమము పూర్వతెలుగుకవుల వర్ణనల నందంద తల పించుచు, గంగాదేవి తనప్రతినను తెలియ జేయుసందర్భమున స్త్రీస్వాతంత్ర్యమును బోధించు (176-183) ఎనిమిది పద్యములలో ఇప్పటి కాలపు ఆశయములకు యుక్తమగు నూతనకళను బొంది శోభిల్లుచున్నది;—

"మ. వసుధన్ స్త్రీలును బూరుషుల్ కరశిరఃపాణ్యాది
మత్యంబునం,దు సుఖాసక్తిని బుద్ధివైభవమునం దు
ల్యుల్ విభేదంబు లే, దిసుమంతైనను గాని మూఢపు
రుషుల్ హీనాత్ములై స్త్రీలఁగ్రై, నసమైనట్టి మృగద్వి
జావళిబలెన్ బాధింతు రుర్వీధవా!

* * * *

క. కావున మగువల మగవా
రేవను నసమాన దృష్టి నెంచక మదిలో
నేవికృతి లేక వారికి
నీవలయు స్వతంత్రవృత్తి నేగతినైనన్."

"న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" యను,నట్లో ఉద్భవించి పునఃపునః పఠనమున గురుత్వము గాంచిన, లోకోక్తిని పాత్రోచితభాషణముల నండగా జేసికొని ఈకవి నిరసించుచున్నారు. కావ్య మనేకస్థలముల సంస్కృతసమాస భూయిష్ఠముగనున్నను ఆంధ్రభాషను ఎటుల సరసమృదులముగ ఈకవి ప్రయోగించిరో ఈ గంగాశంతనుల కథలో జూడనగును. ఒక పద్యమును మచ్చుకై యిట బొందుపఱచెద:—

"సీ. అనిపల్కు నయ్యింతి కత్యంత
సంతుష్టమానసుండగుచు నమ్మనుజనాథుఁ
డిట్లనె సుందరి యీపాటిపని కిట్టి
ప్రతిన యేటికి నిది బహుసులభమ
పుడమి నేరసికుడు పూఁబోఁడి యుత్సాహ
భంగంబు గావింప బాలుపడును
నీయిచ్ఛకొలఁదిని నెరవారనుండుము
వారింపఁబోన నిన్ వారిజాక్షి
యనుచు దెల్పిన ముదమంది యువని నాథు
తోడ హస్తినపురికేగి తోయజాక్షి
సర్వసంపత్సమృద్ధ తత్సదనమందుఁ
జిరముగా నిల్చె భోగతత్పరత నెగడ."

ఈ యాశ్వాసము వసువుల శాపవృత్తాంతము భీష్ముని జననకారణమును శంతనుని విడనాడబోవు గంగాదేవిచే జెప్పించి ముగిసినది.

రెండవ ఆశ్వాసము భీష్ముని యౌవరాజ్యసంపదను ప్రపర్శించుచున్నది. తల్లివలన వినినధర్మబోధ మనంబున నాటి, తాను ప్రజలకు ధర్మబోధజేసి గురువై పితృశుశ్రూషకొరకు అపూర్వమగు ప్రతిజ్ఞలతో స్వార్థత్యాగము చేసి ధర్మాచరణమం దెల్లరకు నాదర్శమై, అసంతతపరాక్రమమున సర్వజన సంరక్షకుడై పెంపొందెను. చిన్నవయసుగలవాడైనను తండ్రియొక్క వ్యాధికి కారణమేమని యరయుటయందు చూపిన పితృవాత్సల్యము, నేర్పు, ఆర్జవము గమనింపదగియున్నవి. తరువాత దాశరాజుతో వ్యవహారము జరుపునపుడు సహజమైన ధారాళము, సత్యప్రియత్వము వహించియుండెను. దాశరాజుయొక్క సంభాషణయందు చతురతను, ఆతడు తన కన్యకయొక్క భాగ్యమును దృఢపఱచుటయందు చూపిన దూరదృష్టిని మెచ్చుకొనుట ఈ రాజకుమారుని విశాలభావమును ప్రకటించుచున్నది.

"క. కార్యమున నీకు గల్గిన
భార్య విమర్శంబనర్థభావనయును నా
శ్చర్యంబు సంతసంబును
నార్యస్తుత! నాకు నించె నధికముగాఁగన్."

ఈతని కఠిన ప్రతిజ్ఞలకలరి దేవతలు "భీష్ముడు" అని పిలచిరి. రానురాను అదియే ముఖ్యనామమాయెను. యిట్టి యపూర్వసేవవలన సంతోషితుడైన తనతండ్రివలన స్వచ్ఛందమరణము వరముగా బడసెను. ఈ నాయకుని నడువడిని నాటినాటికి వృద్ధియగు నౌదార్యమును నిరూపించుటలో కవియొక్క నేర్పు ప్రశంసనీయము.

ఈ కథానాయకుని నడువడికిని, చారిత్రమునకును బీజములు ఈతని తల్లి శంతనున కీతని నొప్పగించు సందర్భమున గాన నగును. ధర్మపరత, ఇంద్రియ నిగ్రహము, విష్ణుభక్తి, ఇవి యామెచేసిన ఉపదేశాంశములు. వాని

పూర్ణ విజృంభణమే ఈతని చరితము. ఇవి ఇతని చరిత్ర మందంతటను గననగును. వీని ధర్మపరతను ప్రజలయెడను దండ్రియెడను, దమ్ములయెడను జూపించుట రెండవ మూడవ యాశ్వాసముల ముఖ్యాశయమని చెప్పవచ్చును. పరశురామునితోడను, అర్జునునితోడను చేసిన యుద్ధమందీతని పరాక్రమప్రదర్శనము జేయబడినది. రాజసూయ యాగమందు అగ్రపూజనొందుటకు తగినవారెవరని నిర్ణయించు సందర్భముననను, తన నిర్యాణ సమయమందును, ప్రత్యక్షముగ నవతరించిన మహావిష్ణువగు శ్రీకృష్ణునియందీతనికి గల భక్తి ప్రదర్శింపబడినది. నాయకుడు నాలుగవ దైదవ యాశ్వాసములయందు ముఖ్యపాత్రము గాకుండుట కొంతవరకు కావ్యవస్తువుకు నీరసతగల్గినను ఇట్టి విశాలవస్తువును సాధ్యమైనంతవరకు నాయకుని యందు కవి కేంద్రీకరించియున్నారని చెప్పవలసి యున్నది.

## IV కావ్యరచన—ఉపకథలు

రెండవ యాశ్వాసమునందు చక్కని ఉపకథలు రెండు ప్రాసంగికముగా నిముడ్చబడియున్నవి. శంతనునికి "ఉపరిచరవసువు" వృత్తాంతమాతని వీర్యజాతయగు సత్యవతిచే జెప్పబడినది. ఈయుదంతమాశ్చర్యజనకము. రమ్యముగా నల్లబడియున్నది. "అష్టావక్రుని" కథ కృతజ్ఞుడైన శంతనునిచే భీష్మునకు జెప్పబడినది. అష్టావక్రుని కుమారుడు తన తండ్రియగు ఏకపాదుని పరాభవమును మాన్పి ఉద్ధరించినరీతి, తనను తనకుమారుడగు భీష్ముడు రాజ్యత్యాగము, శాశ్వతబ్రహ్మచర్యము అవలంబించి ఉద్ధరించినాడని తెలుపుకొనుటకు జెప్పబడినది. ఈరెండవ "ఉపకథ" కథాసందర్భమునకును అత్యుచితము. శంతనుని మనోభావములను బహుసరసముగా సూచించుచున్నది.

తృతీయాశ్వాసము కథానాయకుని చరిత్రను అత్యుచ్ఛస్థితికిఁ గొంపోవుచున్నది. తన తమ్ములను బెంచి పెద్దలనుజేసి, మంచి కన్నియలదెచ్చి వివాహముచేసి, వారి కన్నివిధముల సహాయముజేయుచు విఖ్యాతయశముగాంచెను. స్వయంవర సమయమున సాళ్వాదులను గెలుచుటయందును, తరువాత "బ్రహ్మచర్య ప్రతిజ్ఞను విడిచి యంబను జేపట్టుమని కుమార్గోపదేశము జేయు గురువుతో గౌరవవినయములు దప్పకుండ యుద్ధముచేసి గెలిచి, తనప్రతిజ్ఞ నిలువబెట్టుకొనుటయందును ఈతని కీర్తి మిన్నుముట్టెననుట అతిశయోక్తికాదు. ఈతని న్యాయపరత్వము నెరిగియు, ఒప్పుకొనియు, దీనయై, ఉభయభ్రష్టయై, అంబకరుణా పరిదేవనములతో పగబూనెను. స్వార్థపరుడనియు దొంగప్రకృతి దాల్చినాడనియు లోకులతోబాటు తన గురువుగూడా తనను నిందింపసాగెను. గురువుతో బవరమువలదని తనతల్లియగు గంగ బ్రతిమాలెను. ఏది ఎట్లు జరిగినను "ధీరులు తాముబూనిన న్యాయమార్గమును ఏమాత్రమును విడువర"ను భర్తృహరి వాక్యమునకు సంపూర్ణోదాహరణము ఈఘనుని చరితము.

" శ్లో. నిందంతు నీతినిపుణా యది వా స్తువంతు
లక్ష్మీ స్సమావిశతు గచ్ఛతు వా యథేష్టమ్;
అద్యైవ వా మరణ మస్తు యుగాంతరే వా
న్యాయ్యాత్పథః ప్రవిచలంతి పదం నధీరాః.

ఇట్టి అత్యుచ్ఛస్థితియందే ఈనాయకుని పతన హేతువగు బీజముగూడా నాటబడినది. ఇది అంబోదంతములో నిమిడియున్నది. నిరపరాధిని యగు కన్యకు భీష్ముని మూలకముగా తీరని అపకారము వాటిల్లినది. మనకవి భారతము ననుసరించి అంబ తనస్థితికి తానే కారణమని నిరూపించియున్నారు. సాల్వునియందు మనసు దగిలిన యతివ, భీష్ముడు తనను రథముపై నిడకమున్నే తన పరాధీనమానసము నెరింగించిన భీష్ముడు విడిచియుండును. సాల్వుడంగీకరించి యుండును.

ఈమాట ఆమె విలాపములోనే ఆమెచేత కవి పలికించియున్నారు. భీష్మసాల్వయుద్ధములో నాలోచించుకొనుటకు తగిన సావకాశముగూడా యుండెను. లేదా తన చెల్లెండ్రవలె "మానం సర్వార్థసాధనమ్" అని ఏమియు ననకయుండిన విచిత్రవీర్యుని కగ్రమహిషియై యుండెడిది. భీష్మునికి ధర్మసంకటమును గలుగఁజేసి తన బ్రదుకును దుర్గమసంకటమున బెట్టుకొనియెను. అంబయొక్క నిర్వ్యాజనర్తనమును, మాటిమాటికి ఆమెయొక్క మనోభావములయందు గలుగు మార్పులును నాటకవ్యక్తతతో నిరూపింపబడియున్నవి. ఇట్టి ప్రబల నిరూపణచేత యీ తృతీయాశ్వాసమునందు ఈ రాజ

కుమారికకు నాయకునికన్న ఎక్కువ ప్రాముఖ్యమును కవి యిచ్చినారాయను భ్రమ జనింపవచ్చును.

ఈయంబ నడువడిని నిరూపించుటయందు కవి భారతమునుండి కొంత భేదము గనుపర్చుచున్నారు. సాల్వుడును భీష్ముడును ఈమెను పిచ్చిదానిని వలె జూడ సాగినట్లు, మతిపోయి యామె వీరిరువురు నడుమనునట్లే తిరిగినట్లును నిరూపించినారు. సాల్వుడు క్రూరుడై నిందోక్తులతో పొమ్మనెను. భీష్ముడు బెర్లించి పంపివేసి, యికనీమెను తనదరికి రానీయవలదని దనమందిరభటుల కాజ్ఞాపించెను. మరల సాల్వునికడకు జన వాడును పిచ్చిదానిని మరల్చినట్లు బెర్లించి పంపివేసెను. అంబ ఇంతబుద్ధిగోల్పోయినట్లు భారతమున గానము. ఇన్నిసారులు వీరిరువురి మధ్యను దిరిగినట్లును గానము. భీష్ముడు తొలుత నామెను తగిన బలగమునిచ్చి ఆదరించిపంపెను. సాల్వ తిరస్కృతయై యామె తపోవనమునకు బోవుటవిని ఆమె చెయిదముల నరయుటకు మనుజులనంపెను, కాని హేళనయొంతమాత్రము గానరాదు. భారతములో జూడగా అంబ వీరిద్దరిలో ఎవడు నింద్యుడు, ఎవడు దనయాపదకు బాధ్యుడని తాను నిర్ణయించుకొనలేదు. తనను, తండ్రిని, భీష్ముని, సాల్వుని, విధిని, యందరను దూరుచు మునుల యాశ్రమమును జేరెను. తనకు దపస్సే శరణమని వారికి విన్నవించెను. తండ్రియింటికి బోనొల్లనైెను. తరువాత నక్కడకువచ్చిన మాతామహులు "పరశురాముని శరణు బొందుము" అని బోధపరచగా తపఃకాంక్షనువదలెను. అంతట అక్కడకు ఆకస్మికముగా వచ్చిన పరశురాముని అనుచరుడగు అకృతవ్రణుని యాలోచనపైని భీష్ముడే తనకు అపకారియని నిశ్చయించుకొనెను. ఈకావ్యమున జూడగా అంబతపోవనమునకు బోవకమున్నే భీష్ముని దూషించుట, వాడే నింద్యుడని నిశ్చయించుకొనుట గనుపడును. మునులు సందియపడిరేకాని ఆమె సందియపడలేదు. పరశురాముడడుగగనే "భీష్ముడు తొలిన్ హంతవ్యుడా"నని తన మనంబుననున్న కోర్కెను "ఉన్మత్తక్రుధగా" బల్కెను. ఎవడునింద్యుడో, ఎవడు శిక్షార్హుడో మీరే నిర్ణయించి వానిని శిక్షింపుడని ఈ రాజకుమారి పల్కినట్లు భారతమున గందుము. మాతామహుడు దనయింటనుండుమని కోరినట్లు భారతమున గానము. ఈ కల్పన ఉచితముగా నున్నది.

ఈభేదములెట్లున్నను ఈమె నడువడిని నిరూపించుటలో మంచి చాతుర్యమును, మనోభావ గమనికయును ప్రదర్శింపబడినవి అని నేను తలంచెదను. కొంచెము హాస్యములోనికి దింపకుండినచో ప్రేమయందు ఋజుత్వము, క్షాత్రతీవ్రతయు గల యీరాజకుమారిక ఉన్నత విషాదనాటకమునకు నాయికగానుండదగినది. భీష్మునిచరిత్రకు ప్రత్యక్షసంబంధము లేనందున ఈమె యొక్క తరువాతివృత్తాంతమును, శిఖండినీరూపమున జననాది వృత్తాంతములును చతుర్థాశ్వాసారంభమున నాలుగుపద్యములలో ముగించబడినవి. వాటి ఉపయోగము "పూర్వము స్త్రీగాయున్న శిఖండితో యుద్ధముజేయను" అను భీష్ముని రెండవప్రతిజ్ఞకు కారణమగుటయే. ఇదియే భీష్మునివధసూత్రము. ఈరహస్యము తెలిపియే పాండవుల నుద్ధరించెను. లేనియెడల స్వచ్ఛందమరణవరమును బొందియున్న ఈమేటి వృద్ధయోధుని జయించుటకు చక్రముచేపట్టి శ్రీకృష్ణుడు తనప్రతిజ్ఞను వీడవలసియుండెడిది.

## V. నాయకుని నడువడి

ఈమహాపురుషుని వధకు ఈతని కృత్యముననే బీజమేర్పడియున్నదని చెప్పితిని. ఈసందర్భముననీతని నడువడిని కొంచెము విమర్శించవలసియున్నది. మొదటి యంశమిది. అంబను తీసుకొని వచ్చుటలో క్షత్రధర్మ ప్రకారము నడుచుకొనుటవలన తప్పులేదని తానే చెప్పుకొనుచున్నాడు. ఆనాటిరాజులందరు అతని నిందించి యుద్ధముజేసిరి. వీగినందున ఆతని చర్య వీరధర్మానుసరణమేకాని వేరొండుగాదని యొప్పుకొనినట్లు తెలియుచున్నది. క్షత్రియకన్యలు వీర్యశుల్కలు. అంబయొక్క చెల్లెండ్రు ఈకారణముననే మారుమాటాడక విచిత్రవీర్యుని వరించిరి. అంబ ప్రేమ సాల్వునిపై నదివరకే యమరియుండుటచేత ఆమె ధర్మశంకనుజేసి విడిపించుకొనెను. స్వాతంత్ర్యము నొందెను. కాని ఆకాలమున ఎవరును ఆమను ఆదరించరైరి. ఆమెకోరిన ప్రకారము పెద్దలతో యోచించి యామెను సాల్వునికడకు బోవనను మతించిన భీష్ముని నడువడిలో ఏమితప్పుగలదు? ఆయన

వధ దీనికి ఫలితమన నెట్లు సమ్మతింపగలము? అయితే, మనుజుడు తెలిసిచేసిన తప్పులకును, తెలియకచేసిన తప్పులకును గూడ ఫలమనుభవించును. ఇక్కడ భీష్ముడు తెలిసిచేసిన తప్పులేదు. తెలియకచేసిన తప్పున్నదా? యని పరిశీలింపగా స్వయంవరకన్యలను పట్టుకొనుటకు పూర్వము వారియొక్క చిత్తవృత్తులను గురించి యరసి యుండిన నిట్టి విషాదపర్యవసానము వారింపబడియుండును. కులశీలరూపవయోవిలాసాదులను గురించి విచారించునపుడు ఈభాగముకూడా విచారించియుండినచో తన ధర్మప్రవర్తనకు సరియగు త్రోవయేర్పడియుండెడిది కృష్ణుడు రుక్మిణియొక్క మనోవృత్తి తెలియునంతవరకు పిలువని పేరంటముగ నామె వివాహమహోత్సవమునకు వెళ్లదలచుకొనలేదు. తెలిసిన తరువాత పురుషునకు దగిన రీతిని నడుచుకొనెను. స్వయంవరమహోత్సవముగనుక భీష్ముని నడువడికి ఈయుపేక్ష కళంకము గాదు. కాని మనుష్యుని యొక్క జీవితము అన్యులతో సంపర్కము గలిగించుకొనుపట్ల యెంతవిమర్శతో నడుపబడవలెనో యిందువల్ల తెలియనగును. ప్రకృతి ఏ తప్పులను సైపదు. అందులకే కాబోలు మన పెద్దలు జ్ఞానాజ్ఞానకృత దోషములను క్షమించుమని సర్వజ్ఞుడగు పరమాత్ముని వేడుకొనుచుందురు? టెన్నిసన్ (Tennyson) అను ఆంగ్లకవి "నాతప్పులను క్షమించుము. ఓపరమాత్మా! నా ఒప్పులనుగూడా క్షమించుము" అని ప్రార్థించినాడు. మన మొప్పు లనుకొనెడివానిలోనుండు లోపము లాసర్వజ్ఞునకే గోచరించును. పరిణామమున మనకు అనుభూతమగును. కాని తెలియకచేసిన తప్పులకు నైతిక నిందమాత్రము విశాలభావముగలవారు చేయ నొల్లరు.

రెండవయంశము: ఈతడు పాండవులకు తనమరణ సాధనమును జెప్పుట. అట్లుచేసినందున ఎదిరి పక్షమునకు సహాయముచేసి స్వామిద్రోహి యగుచున్నాడు. ధర్మరాజును ఇట్టులే కొంచె మసత్యద్యోతకముగ యుద్ధమధ్యమందు "అశ్వత్థామ యను ఏనుగ చంపబడెను" అను వాక్యమును ఏనుగశబ్దము స్పష్టముగా వినబడకుండునట్లు ఉచ్చరించెను. ధర్మరాజునకిది తగునా? అయితే, "ప్రాణవిత్తమానభంగమందు" అనృతమాడవచ్చునని, పాపములేదని మన నీతిశాస్త్రము చెప్పుచున్నది. ఇట్టి స్వల్పములలో తప్పులు పట్టుటకు వాదతర్కములకు, స్తనశల్యపరీక్షలకు జెల్లునేగాని విశాలభావములతో జేయు విమర్శలయందు ఇట్టి రంధ్రాన్వేషణకు ప్రాముఖ్యము నీయకూడదు. తాను దుర్యోధనునికి యుద్ధసహాయమేకాని ఆశీర్వచనసహాయము జేయనని మొదటినుండియు ఘంటాపథముగ చెప్పుచునేవచ్చినాడు. అందరకును దెలిసినదే. తాను దుర్యోధనునికి జేయవలసిన విధియంతయు పదిదినముల యుద్ధములో జేసి తక్కిన మహావీరులకు మార్గదర్శియాయెను. దుర్యోధనుని యనుమాన సహితములును, నిందాగర్భములును నగు మాటలనే మనంబునొచ్చి యుద్ధమున విసుగనొందెను. ద్రోణకర్ణాదులున్నారు? రారాజునకేల కొదవ? శిఖండితో యుద్ధముచేయనని దుర్యోధనునితో ముందే తెలిపియుండెను. తనకు జీవితమందు విసుగు జనించి ప్రచండరీతిని యుద్ధముజేసెను. చావురాదాయెను. గాని మరణకాల మాసన్నమైనదనియు నర్జునునిచేతనే తనకు చావనియు నెరుగును. ఇట్టి సమయమున తన పూర్వవాక్యము ప్రకారము మంత్రసహాయము నపేక్షించివచ్చిన యుధిష్ఠిరునకు ఈ శిఖండి రహస్యమును జెప్పి తనకు జీవనవిముక్తిని గలుగజేయవలయునని శాసించెను. ద్రోణుడును యుద్ధారంభమున తనను జయించుత్రోవను ధర్మరాజునకు జెప్పెను. దాయాదుల యుద్ధమందు ఉభయపక్షములకును శ్రేయస్సు గోరెడువారు ఖండనగా శత్రుత్వమిత్రత్వభేదములను జేయుట పొసగదు. శరణాగతులకు అభయమిచ్చుట రాజనీతిని మించిననీతి. భీష్మద్రోణులకు ఉభయపక్షములయందును ప్రీతి సమానమని అందరు నెరుగుదురు. ధర్మరాజు వారిసహాయము కోరినప్పుడు "మంత్రసహాయముమాత్రము చేయుదుము; దీనితో తృప్తినొందుము" అని ధర్మరాజునకు ఆశీర్వదించి చెప్పిరి. ఆతడు నట్లే తృప్తినొందెను. ఆడినమాటతప్పకుండా మంత్రసహాయము జేసిన భీష్మునియందుగాని ఇట్టి మహానుభావులను గెలుచుటకు వారుచూపిన త్రోవతప్ప వేరొండులేనందున ఆ రీతినే విధిలేక నడుచుకొనిన ధర్మరాజునందుగాని దోషారోపణము సంకుచితమనస్సును దెలియజేయును. ధర్మయోధులగు పాండవులకు తానీపాటి సాయముజేయకుండుట భీష్మునికివారితో

గల సంబంధమునకుగాని ఆతని ఉదారబుద్ధికిగాని తగకయుండును. తాను జెప్పకపోయినచో సర్వాంతర్వేది శ్రీకృష్ణు డరయలేడా? తనకు శిఖండిరహస్యమును తెలియజేసిన లోకానుగ్రహ కాంక్షియగు నారదమునివరుడు లేడా? భీష్మునడుగకముందే అర్జునుడు శిఖండిని భీష్మునిపైకి పురికొల్పియుండెను. భీష్మునిమాటలువిని ఆత్రోవను దృఢముగానే యవలంబించెను. అంతేకాక, కౌరవవీరులంద రిదియెరిగి భీష్మునిచుట్టి కాచుకొనియుండిరి. ఇట్టిపరిస్థితులలో నీరహస్యము తెలుపుట భీష్మునినడవడికి కొఱతగాదు. అర్జునునిపరాక్రమమునకైనను కొఱతగాదు.

సూర్యునిలో మచ్చల నెన్నదలంచిన కంటికివచ్చు పాట్లను జ్ఞప్తికిదెచ్చుకొని ఈవిమర్శన చక్షువు నింకొకవంక మరలింతును. భారతకథ ననుసరించి భీష్ముని యుదారచరిత మంతయు నీకావ్యంబున ప్రదర్శింపబడినది. తల్లిదండ్రులయెడను, సాటివీరుల యెడను భీష్ముని నడువడియును, భావములును మాటలును ఉచితరీతిని నిరూపింపబడియున్నవి. నాయకపాత్రము మహాదర్శప్రాయముగ ప్రదర్శింపబడి యున్నది. ఇంతటితో ఈవిషయమున నేజెప్పదలంచినది ముగించుచున్నాను.



# అలతిసేయకు నా ప్రణయంబు నాథ

అధికార్ల సూర్యనారాయణరావుగారు, బి. ఏ., బి. యల్.

అణువుకంటెను నణువుగా నగుపడినను
మహితమౌ వానికంటెను మహితమిద్ది!
హృదయ గర్భంబులోపల నిమిడియున్న
సకల బ్రహ్మాండమును ముంచజాలునుసుమ!
అలతిసేయకు నా ప్రణయంబు నాథ!
నేల నింగియు వెన్నెలపాలలోన
ముంచుచందురు నెమ్మోము గాంచలేదె?
మంచు కొండలయందె జన్మించె గాని
అరయగాలేదె గాంగనిర్ఝరము పెంపు?
అలతిసేయకు నా ప్రణయంబు నాథ!
విరులపోలిక జీవముల్ విడును, వాడు,
కల్పములు దివసంబులై గడచు, గాని
జన్మజన్మాల నిను నన్ను జంటసేయు
మరణమే లేని మహితసద్బంధన మిది
అలతిసేయకు నా ప్రణయంబు నాథ!

# కుటుంబరావుగారి సంసారగోష్ఠి

వే. వీరరాఘవస్వామిగారు, బి.ఏ., యల్.టి.

(గత సంచిక శేషము)

"డబ్బిచ్చి తద్దినంకొనుక్కున్నట్టు, ఈనిచ్చెనతెచ్చి నెత్తినెట్టుకున్నాం. దీన్నెట్లావదుల్చుకోవడంరా?" అనిగట్టి ప్రాబ్లం (rroblem) పడ్డది. ఏదైనా మ్యూజియమ్‌కిస్తే మనపేరుతో పడుంటుందని కలకత్తా మ్యూజియమ్‌వారికి "నాదగ్గరున్న వింతవస్తువును వచ్చి తీసుకుపోవలసింద"ని ఉత్తరం వ్రాశాను. వాళ్ళెవళ్ళూ ఇంకా రాలేదు. ఇదేదో మహాభాగ్యం అనుకొని "మేం వొస్తున్నాం. మీదగ్గర ఉన్నవింతవస్తువును మరెవరికీ ఇచ్చెయ్యొద్దు. వస్తువునిబట్టి దాన్ని చూసింతరవాత మీకు మంచిప్రెజెంటుకూడా ఇస్తాం" అని ఉత్తరంమట్టుకు రాశారు. ప్రెజెంటూ వొద్దు, ఏపల్లకాదూ వొద్దు. ఇది ఒదిత్తే చాలునని నేను చూస్తున్నాను.

౨

ఈ నిచ్చెన్నుంచి, ఈ క్రొత్త ఇంట్లో కొచ్చిన నాలుగు నెల్లలోనూ, తొమ్మండుగురు దాసీగుంటలు వెళ్ళిపోయారు. ఒక్కర్తేకూడా పట్టుమని పదిహేను రోజులు పనిచెయ్యలేదు. ఇప్పుడున్న గుంటపేరు ఎరికి. అదిమాచెడ్డ పిరికి. ఆగదిలో ఏదో బ్రహ్మరాక్షసి ఉందని దడిసి రోజూ వెళ్ళిపోతానని అంటూంది. మా ఆవిడ—"పోనీ పోతే పోయింది. ఈ ఏడుజెవుల వెధవగుంటకి పనిపాట్లేవీ చేతకావు. దానికి పనిచెప్పేకన్న చేసుకుంటేనే నయం" అందిగాని, నాకు, ఏచేతకాందో ఒహర్తె ఉంటేనేగాని, పిల్లల్తో ఇంట్లోపని, పైపనీ కూడా ఒక్కర్తా చేసుకోలేదని, మరోపావలా ఎక్కువిస్తానని ఈ ఎరికినే బతిమాలి, ఇప్పటివరకూ పనిచేయిస్తున్నాను.

మరోసంగతి ఏమిటంటే, కేవలం అన్నిపనిపాట్లూ నేర్పుగా చేసేదాసీ దొరికినా ఒహవిబ్బందుంది. "అదిసరీగా చేశావుకావు, ఇదిసరీగాచేశావుకావు. ఇల్లా చేశావంటే నీజీతంవిరగ్గొట్టేస్తాం. నువ్వేమనుకున్నావోగాని" అని కోప్పడ్డానికి అవకాశంవుండదు. మనతాతవాళ్లకి దాసీదానిమీద కోప్పడ్డంకూడా అదోసరదాగనక, మంచిదాసీని కుదర్చడంవల్ల ఆసరదా మనం పోగొట్టిన వాళ్ళం అవుతున్నాం. అదీగాక, మంచిదాసిదాన్ని కుదిర్తే దానిమీద వెయ్యవలసినకేకలు రిజర్వులో ఉండిపోయి మనమీదకే ట్రాన్స్‌ఫర్ అవుతాయేమో అని నాలో పలీభయం చెప్పొద్దూ మరి అసలుసంగతి.

భోజనాలయినతరవాత ఇరుగుపొరుగు అమ్మలక్కలందరూ మా చావిట్లో మీటింగు చేస్తారు. నేను ఆదివారం అయినా మూడోశనివారం అయినా అయితే ఆఫీసుకి శెలవు గనక భోజనం అయినతరవాత గదులో పడుకుని వింటూనే ఉంటాను.

"మీయింట్లో ఏంవండుకున్నారు? వంటనువ్వా? మీఅత్తగారా? పగలావిడా రాత్రినువ్వూనా?" మామూలు ప్రశ్నలతో సంభాషణ ఆరంభమై—"ఈకొన్నాటుచీర ఎంతకికొన్నారు? నీకంటె ఎన్నితులాలు? ఈవడ్డాణం ఎప్పుడుచేయించుకున్నావోవోడా?" అని ఈవిధమైన కొన్నిప్రశ్నలు పడ్డతరువాత ఇంట్లోపనిచేసేదాసీగుంటమీదకి సంభాషణదిగుతుంది. అదిఅంట్లువదిలెయ్యడం, కూరకి బజారుకిపంపిస్తే అణాకికానీ స్వంతంకింద వాడుకోవడం పిల్లణ్ణి అరుగమీదనుంచి ఎత్తెయ్యడం మొదలైనఘనకార్యాలు ఒహళ్లని మించి ఒహళ్లు చెప్పుకుంటారు. మంచి కాపగుంట గల ఇల్లాలు, పాపం! తనకష్టాలుచెప్పుకోడానికి వీల్లేక నోరుమూసుక్కూచో వలసిందేనా? అందుకు చేతనే కేవలం మంచిదాసీదికూడా పనికిరాదన్నాను.

ఈసంగతి మాఆవిడతో ఓపర్యాయం మనవిచేశాను. "మీసంబులు మాఅందంగా ఉన్నాయికాదూ? అందుకుచాతనా ఈ ఏడుజెవుల వెధవగుంటని కుదిర్చారు?

మరోగంటనికుదిరి స్తేనే కుదిర్చారు లేకపోతే మానారు. దీనితో మాత్రం నేను వేగలేనుసుమండీ." అంది.

"అయితే, ఆంధ్రపత్రికలో మంచిదాసీదానికో సం ఎడ్వర్టయిజు చేస్తా" నన్నాను. "ఏమని"? అంది. "ఏమనా? ఒక అరగంట పోయాక మళ్ళీరా ఎడ్వర్ట యిజ్ మెంటు రాసుంచుతా" నన్నాను. అరగంటా అయేటప్పటికి మళ్ళీ వొచ్చింది. ఎడ్వర్టయిజ్ మెంటు ఈవిధంగా చదివి వినిపించాను.

"కావలెను! కావలెను!!

పనిపాట్లు చక్కగాచెయ్యగలదాసీదికావలెను. దాసీ దాన్ని ఎట్టిఇబ్బందీ పెట్టేవాళ్ళము కాము. ఇంట్లో ఉన్న సామాను ఇష్టంలేకపోతే వద్దనిన సామాను తీసి వేయుదుము. ఉదహారణ:-—త్రిగుణ నిచ్చెన-పఠాలూ, గ్లోబులూ, చిమ్నీలు, తుడవడంలో బద్దలయి పోయి నా కోప్పడం. ఏమే ఆలస్యంగా వొచ్చావు? అని అడిగి తే, వాకట్లో ఉన్న పెద్దగడియారం చీపురుకట్ట తిరగేసి బద్దలుగొట్టెయ్యొచ్చును. ఎప్పుడూకూడా మాగడియారం వేతప్పతిరుగుతుందిగాని, దాసీది ఆలస్యంగా రాదని మా కు తెలుసును. తుడిచినజాగాలో, ధూళీ గడ్డిపరకలూ, కాయితమ్ముక్కలూ, ఉంటేనే మాకళ్ళకి ఇంపుగా కనబడు తుంది. అంట్లుతోమేటప్పుడు, అక్కడక్కడ మసీ, పక్కలూ, వదిలి, స్తానాలుచేయిస్తే మాకేమంచిది. ఎం చేతంటే, మాఆవిడికి కోపం లావు. స్తానంచేస్తే కొంత కోపంచల్లారుతుంది. గరిటెలు, సిబ్బులు, అట్లకాడలు ఎన్నిపారేస్తే అంతమెచ్చుకుంటాం. మాయింట్లోనే పడు కోవాలని నియామకంలేదు. ఊరుమీదకి రాత్రిళ్ళు పెత్తనాలకి వెళ్ళొచ్చు. రాత్రి ఎన్నిగంటలప్పుడొచ్చి తలుపుకొట్టినా, తలుపుతియ్యగలవారమేగాని విసు క్కోము. వాళ్ళవాళ్ళకి ఎవరికైనా, బియ్యంగాని, పప్పులు గాని కావలిస్తే విసిరేటప్పుడు, మేంచూడ కుండా వొళ్ళోపోసుకు పోవచ్చును. ఆవుకి ఉలవలు ఉడక వెట్టేటప్పుడు పాక అంటిస్తే ఆవైభవం కళ్ళారచూడ్డం మాకుసరదావే. ఎంచేతంటే, ఇరుగుపొరుగువాళ్ళంతావొచ్చి మానూతులో నీళ్ళు తో డెయ్యడంచాత నుయ్యి శుభ్రపడుతుంది. పెరటిగోడ దగ్గిర నిలబడి, పక్కింటి నౌఖరీవాడితో ఎంతసేపు మాట్లాడినా అభ్యంతరపెట్టేవాళ్ళము కాము. ఇంట్లో మేం అనుకున్న సంగతులన్నీ వీధులోవాళ్ళతో చెప్పి, మాటలు శ్వేచ్ఛగా మొయ్యొచ్చును. బజారుఖర్చు ఎంత చేసినా, పుచ్చొంకాయలు పట్టుకొచ్చినా, జమాఖర్చు చెప్పమనడంగాని, వంకాయలుతిరగ్గొట్టడంగాని, చెయ్య గలవారము కాము. నెలజీతం నెలకుముందే ఇచ్చెదము అప్పుడప్పుడు కానీ, అర్థణా చుట్టముక్కల కిస్తూనే ఉంటాం. మంచంపట్టేమీదచుట్టలుగాని, జేబులోచుట్ట లుగాని, మాయంఅయితే, ఏదెయ్యమో పట్టుకుపోయిం దనుకుంటాంగాని దాసీగుంటమీద అనుమానమైనాపడం. పిల్లలచేతుల్లో కానీ, పరకా, ఉంటే వాళ్ళని బెల్లించి తమాషాగా ఆడబ్బులుకూడా పుచ్చుకోవచ్చును. రోగం వొచ్చి పడిపోతే, మందిప్పించి సకల ఉపచారములూ చేయుదుము. కాలూచెయ్యి బెణికితే అమృతాంజనం రాసి స్వయంగా తోముదుము. పనిలోకి రావడానికి ఇష్టంఉన్నవాళ్లు పెద్దవీధిని, 309 నంబరు ఇంటికివచ్చి చూసుకుని, ఇంకాఏమైనా కావలిస్తే అడిగి తెలుసుకో వలసింది" అని ఈమోస్తరుగా, చెయ్యవలసినపనులూ, ఉన్న లాభాలూకూడా తెలిసేటట్టు ఎడ్వర్టయిజ్ చేస్తా నన్నాను.

"చాల్చాలు! ఇది పేపరులో వేస్తారా? మాఅం దంగా ఉంటుందికాదూ? ఊళ్ళోఉన్న గుంటలందరూ, నిజమేఅనుకొని రేపు మనింటికొచ్చి పడతారు. అమ్మో! మీరెంత పెంకెమనుషులండీ!!" అని పెదవి విరిచి, తల తిప్పి, తీక్షణంగా చూసి, దూకుడుగా ఇంట్లోకివెళ్ళి పోయింది. నాకు, కూడావెళ్ళాలని బుద్ధిపుట్టింది గాని ఆతరవాతసంగతి మరోపర్యాయం మనవిచేస్తాను.

# చిన్నముచ్చట

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు

సమముగఁ గత్తిరింపఁబడి చక్కఁగఁ బార్శ్వయుగంబునందుఁ గృ
త్రిమముగఁ బాతఁబడ్డ తరుబృందక వాటకముల్ వసంతు కం
ఠమును గవుంగిలించెడు వనప్రమదామణి బాహువల్లులై
ప్రమదముఁ గూర్పఁ దత్సరణిఁబట్టి యొకించుక దూరమేగితిన్.

గీ. ఆకుఁబచ్చనిచీనిచీనాంబరంబుఁ; జారు సుకుమారపుష్పభూషలను దాల్చి
కుంజసుందరియొక్కతె కూరుచుండె, లలితశాద్వలశయ్యాతలంబునందు.

గీ. అంత నేనేగఁగానె తదంతికంబు, మధుపమధురోక్తి నాదుక్షేమంబులడిగి.
మృదులతా బాహుబంధంబు మెడకుఁజుట్టి, కదల నీకుండఁ జేసె నక్కాంత నన్ను.

గీ. చని పదంపడి శాంతి నిర్ఝరిణి కందుఁ, గల మహానంద రూప నౌకపయి నెక్కి
నేను నాకుఁజరమశితో నేగినాఁడ, నెఱుఁగలే నైతినెంతద వ్వేగినాను!

సీ. గండుఁగోయిలపిండు గానామృతంబుచేఁ, జిగురువెట్టుచునున్న చెట్లగుంపు
ప్రణయమంత్రములచే వశవర్తులై పర,స్పరము ముచ్చటలాడు పడుచువాండ్రు
వేణునాదంబుచే వెనువెంటఁబడి వచ్చు, పసులతోఁ జను గొల్లవాండ్రమూఁక
మముఁ జూడనెత్తెక్కి తమలోన నవ్వుచు, నేలపాటలుపాడు నింపుకాండ్రు

గీ. ఇంక నానావిధులవారలెంతమందొ, మూఁకఁగన్పట్టియున్నారు మందమారు
తముల మరకాండ్రులాగు తన్నావనెక్కి, యరిగినట్టి యారమ్య సాయాహ్నమందు.

గీ. చెట్లసందులనుండి సూచికలువోలెఁ, బైఁడితంతుల విస్వదిఁబఱచినట్లు
భానుని సహస్రకిరణముల్ స్పష్టముగను, గానఁబడుచుండె లెక్కింపఁగలుగునట్లు,

మ. చినుకుల్ చిమ్ముచు వారియంత్ర మొకఁడా చెంతం దగున్, దాని చు
ట్టును సోపానములందుఁ దొట్లపువుఁజెట్టుల్ పొల్చు రమ్యంబులై

వనకాంతామణి పేరటాంత్రురకౌఁగిం బన్నీరముం జల్లుచుం
దనదాచుట్టును గూరుచుండ నిడెనాఁ దర్శింప శక్యంబగున్.

గీ. పూలపందిరి నాల్గుకంబాలయొద్దఁ, బొలుచుచుండి చక్కని తోఁటపూలచెట్లు
నాల్గుకంబాల యాటాడు నారులవలె, నేత్రపర్వంబుఁ జేయుచుండెను గడింది.

సీ. కోకిలికిగా గీయఁబడిన గీతలువోలెఁ, గలసిపెనంగు శాఖాచయంబు (*)
అడ్డదిడ్డముగఁ జేయంబడ్డ ప్రతిమల, చందానఁ దగు శిలాబృందకంబు
చెయి వచ్చినట్లు వ్రాసినచిత్తువ్రాత పద్ధతి నున్న నిమ్నోన్నతస్థలంబు
తోఁచినట్లెల్ల విత్తులువోసినట్లు సాంద్రాసాంద్ర రూపంబులైనతరులు
గీ. సతుల వీడ్వచ్చి యొంటిపై సంచరించు, పాంథుల ట్లచ్చటచ్చటఁ బరగుతాళ్లు
కాంచినాఁడను గన్నుల కరవుదీర, నయనయుగ్మక మున్నందునకుఫలంబు.

గీ. అంతయును జూచివచ్చితి నడుగుమాత్ర, కాలుకదలంగలేద యక్కడనెయుంటి
నింతలోన నేమయ్యెనో యేమొ? తెలియ, మరలిచూడంగ సూర్యుండుమాయమయ్యె.

ఉ. చీఁకటిపడ్డదంచును వచించి లతాగృహకాంత వల్లికా
నీకము చిట్టచివ్వరల నెక్కొను పుష్పతటిత్ప్రదీపముల్
తేఁకువ వెల్గజేయఁగఁ దదీయవిలాసరుచుల్ సమస్తమా
లోకనముం బొనర్చితిని లోచనముల్ తనివొందలేదటన్.

మ. సెలవీయంగదె? పోయివత్తునని నేఁ జెప్పన్ వడిన్ నాదునె
చ్చెలి దాగ్రుడ్డులనీరు గ్రుక్కుకొనుచుం జెప్పంగనేమున్నదో
చెలికాఁడా! యెపుడింకఁ గ్రమ్మఱను నీ చిత్తంబు నాభాగ్యమున్
ఫలియించున్ సవి పల్కి ప్రమ్రానుపడియెన్ మారాడ కాపిమ్మటన్.

# చదువు సంధ్యలు

### శంకరదీక్షితులు గారు

## I

రామన్న దీక్షితులుగారి కొక్కడే కొడుకు. అందులో లేక లేక నలుబదియారవ యేట బుట్టినకొడుకు! పాప మాయన కదివఱ కెందఱో పుట్టి రెండుమూడేండ్లు జీవించి గతించుటచే ఈకొడుకనిన ననురాగము మెండు. ఆయనకొక్కడికే కాదు; ఆయన భార్యయగు అచ్చమ్మకుగూడ నంతే! సాధారణసంసారుల యింట బుట్టినబిడ్డకు వీలగుగారాబములతో నీదంపతు లీకొడుకు నైదేండ్లుగడచుపర్యంతమును బెంచిరి. అంతవఱకు నాతని కేనామధేయమును వా రిచ్చియుండలేదు. ఇక విద్యాభ్యాసమున కాతని బడి కంపవలసివచ్చుటచే, నేడైన నామధేయ మాతని కీయవలసి వచ్చెను.

“ఏమే! అబ్బాయిని రేపు చదువునకు వీరేశలింగముబడిలో ప్రవేశపెట్టవలెనని అనుకొనుచున్నాను. వానికి పేరుపెట్టవలె నని యింతవఱకు నాకేమియు నాలోచన లేకపోయినది. ఇక నేడైన బేరుపెట్టకపోయినచో వానిని బడిలో చేర్చుటెట్లు? ఏమని పేరుపెట్టితే బాగుండునో!

“సరే! నన్నడుగు టెందులకు? ఇదివఱ కేవిషయములోనైన, నేను చెప్పినమాట వినుట కలదా యేమిటి? ఏమి? పేరు లేకపోయినచో, లోకములో కుఱ్ఱవాడు బ్రతుకలేడా ఏమిటి? ఈమాత్రము దానికి, అంగవస్త్రమును నడుమునకు మోకాళ్లకు బిగించి, పనిగా కూర్చున్నారు!” అని రుసరుసల కచ్చమ్మ నాందీపూజ నారంభించెను. కాని రామన్న దీక్షితులు చాల యోరిమిగలవాడు. లేనిచో, అచ్చమ్మమాటలకు బౌరుషము గలపెనిమిటి యైనచో, దినదినమును నాలుగైదు పేషమండలు విరుగగొట్టుటయో, ఘడియఘడియకు నిరుగుపొరుగువారల మాధ్యస్థమో సంభవించుచునే యుండియుండును. కాని దీక్షితులును భూదేవియు నోర్పున సమానులు. అందులకు గారణము మీరడుగనురాదు. మేము దెలుపనురాదు.

“అదికాదే! బడిలో చేరిన తర్వాత ఏ పేరును లేనిచో వానిని పంతు లేమని పిలువవలెను? ఇన్నాళ్లును, మన కొక్కడే పిల్లవాడు; కాబట్టి, మనము వాని నెట్లుపిలిచినను బలికెడివాడు. బడిలో వానికి, నాయనా, బాబూ, అబ్బాయీ, చిట్టిగా—అని పేరున్నచో తోడికుఱ్ఱవాండ్రందరును, వేళాకోళ మారంభించెదరు. అందుచేత, గతించి నలుబదియేండ్లయినది. పేరు శాశ్వతముగా వంశములో నిలువగలదు. మాతండ్రిగారి పేరు

పెట్టదలచినాను. 'కామావధాన్లు' అని పేరు వ్రాయించినచో, నాకును నాపూర్వులకును గూడ, చాలాతృప్తి.

"ఈసిద్ధాంతమె పెట్టికొని, మరల నా యొద్ద నీవిచారణ మంతయు నెందులకు? వాడు పుట్టినప్పుడే ఆపాడుపేరు వాడినొసట వ్రాసి యున్నదికాబోలును! లేకపోయినచో, నిక్షేపమువలె నున్న కుర్రవానికి కామన్న, రామన్న, వెంకన్న, భీమన్న అని పేర్లెక్కడైన నుండునా? చాలు చాలు! పెండ్లి చేసియొక యింటివారిని జేసిన మామగారియం దింతమాత్రము కృతజ్ఞత అక్కరలేదా? మీకామావధాన్లుగా రెట్లుండిరో మీ రెరుగుదురా?" అని అచ్చమ్మ ధుమధుమలాడుచు నింటిలోని కేగెను. ఎట్లైననేమి? బాలునకు రామన్నదీక్షితులుగారి తండ్రి మామలపేరులు కలిపి యుంచబడెను. అప్పటికైన నచ్చమ్మకు బూర్తిగ దృప్తికలుగ లేదు.

పదునైదేండ్ల ప్రాయమునకు వేంకటరామలక్ష్మీనరసింహ కామోజీరావు స్కూలు ఫైనలుక్లాసులోనికి బ్రాకెను. తఱచుగా నీదినములలో స్కూలుఫైనలు క్లాసువఱకును బైకెగబ్రాకుటకు బాలునిబుద్ధికుశలతతో నవసరము లేదు. విద్యజెప్ప నేర్పఱుపబడిన గురువును, బాలుని తల్లిదండ్రులు నాపని వానికొఱకు నిర్వహింపగలరు. కథానాయకుని విషయమున నీప్రక్రియ, సమంజసముగా సార్థకముగా, సంపూర్ణముగా నెరవేరినది. ఇట్లంటిమని విద్యార్థులుకాని, వారి జననీజనకులు గాని, మాపై నాగ్రహము బూనవలదు. మేము లోకసామాన్యమును గుఱించి చెప్పుచుంటిమి. కాని, నిదర్శనప్రచారమువంక బోము. చదువుకొను విద్యార్థులలో నిజముగా బాటుపడి తమ బుద్ధికుశలతయే యాధారముగ, పైతరగతులలోని కేగువారలే లేకున్న నీనరికి కళాశాలలలో కొన్నిటికి స్వస్తి చెప్పవలసినదే! అందఱు నొక్కటే తెగవారైనచో వాహనము సాగు టెట్లు?

"మన రామన్నదీక్షితులుగారి కుమారుడు" కాబట్టి నాల్గవక్లాసు గడచువఱకును, దినదినమును వైదికతంత్రములయందు దీక్షితసహాయ మపేక్షించిన ప్రారంభపాఠశాలోపాధ్యాయులు వెనుకముందరయకుండ నీ—కామోజీరావును "ప్రమోషను" చేయుచుండిరి. ఏమైననేమి, కుర్రవాడు పెద్దపాఠశాలలో జేరవలసినదినములు వచ్చెను. తండ్రియును, వేరుప్రయత్నములను బ్రారంభింపవలసినయవసరము గలిగెను. స్వల్పజీతగాండ్రైన ప్రారంభపాఠశాలోపాధ్యాయులదారి వేరు; దినమున కధమము "రూపాయ" జీతముగను, "రూపాయ" నగటున "ప్రైవేటు టీచింగు" వలనను సంపాదించుచు కొంచెము వెగటుదనమును నేర్చిన ఉన్నతపాఠశాలోపాధ్యాయుల దారి వేరు. దాని కనుగుణముగనే దీక్షితులుగారు తనపద్ధతులగూడ మార్చెను.

## II

ప్రతిదిన ముదయమున స్నానసంధ్యాదులనెల్ల దీర్చికొని దీక్షితులు బజారున కేగుచు "సత్యనారాయణగారింటికి," "రామదాసు

గారింటికి" "నరసింగరావుగారింటికి" బోయి, "పంతులుగారూ బజారుకు పోవుచున్నాను, ఏమైనగావలెనా?"అని ప్రశ్నించి వారికి గావలసినసరకులు వారిచ్చినధనముతో దెచ్చియిచ్చుచుండును. అదిమాత్రమెంతకాదు! ఇంటియొద్దకు "ప్రైవేటుటీచింగు"కై వచ్చిన బాలురను గూలవైచికొని నాలుగురూప్యము లార్జింప నుత్సహించు నీయుపాధ్యాయుల కింటిలోనికి సామానులు నిలువయుండి చెడిపోకుండ ననుదినమును దెచ్చిపెట్టుట కయాచితముగా నేర్పడిన యీదీక్షితులుగారి కుమారున కుచితముగా విద్య నిచ్చుట కీయుపాధ్యాయుల కేమి లోటు! నలుగురతోపాటు వడ్డించుట కష్టము గాదుకదా!

సంవత్సరాంతపు పరీక్షలకు ముందు పిలువని పిలుపుగా నచ్చమ్మ వారి, వీరియిండ్లకు బోయి, యాయీపనులకు దోడ్పడుటకూడ కలదు. ఇకని—కామోజీరావునకు పరీక్షలలో నిరాఘాటముగా ప్రమోషను లభింపకుండునా?

ప్రమోషను లభించుచునే యున్నది. కాని, కథానాయకుని తెలివితేట లెట్టివో మీకు గొంచె మెఱింగింపవలయును గదా? ఉన్న దున్నట్లుగా వ్రాయువారమే కాని మాకు ప్రత్యేకదురభిప్రాయ సదభిప్రాయము లుంచుకొనుటకు లేశము నవసరము లేదు.

ఈతడు స్వచ్ఛముగా నుచ్చరించి మాటలాడు స్వభావము నెరుంగడు. మాటలాడునప్పుడు సగమక్షరములను మాటలను దిగమ్రింగుచుండును. మిగిలియున్నవాని నైనను ధైర్యముగా నెదుటివారికి వినబడున ట్లుచ్చరింపనేరడు. తల నొకప్రక్కకు వ్రేలవైచికొని, ఎదుటనున్నవా రులికిపడిపోవుదురేమో యను భయముచే గాబోలు నీతడు గుసగుసలాడినట్లు మాటలాడును. ఈత డీపద్ధతి నేల యవలంబించెనో మేమెఱుంగము. కాని పాఠశాలలోనైతే మీరత డిట్లే మాటలాడుచుండునని వానిగురువు లొకరిద్దఱు తమలో తామనుకొనుచుండగా మావీనుల బడినది. ఇంటనేమి, వీధినేమి, బడిలోనేమి, ఈత డీవరుసనే కోపమునందును, దైన్యమునందును, సరసమునందును మాటలాడుచుండును. తల్లిదండ్రు లెన్నిసారులు నిందించినను, గురువు లెన్నిసారులు దండించినను, స్నేహితు లెన్నిసారు లెక్కసక్కెము లాడినను, ఆతడు లక్ష్యముజేయలేదు. వాక్స్థానమున నేపాపగ్రహము దాపరించినదో యని చెప్పదలచుకొనువారు విసిగి యూరకుండిరి.

ఈత డాధునికవిద్యాభ్యాసకుడే యైనను, ప్రాచీనపద్ధతినే పాఠపఠనమం దిప్పటికి నవలంబించుచుండును. "Kingsley's Heroes" ను కూడ నీతడు వేదపనసవలె వరుసబెట్టి వల్లనవేయుట కలవాటుపడినవాడు. లెక్కలైననేమి, ఆంధ్రగ్రంథమైననేమి, Asia Political Geography యైననేమి, మరే "సబ్జక్టు" నైననేమి ఈత డీవేదపుబుక్కుపద్ధతినే సాగదీసి, మెలవైచి, మెడకుజుట్టి, గిరగిర చరచర నర్తించును. ఒకనియమములేదు, ఒకజాతిలేదు, ఒకమార్గము లేదు. ఆత డీపద్ధతి నెన్నిదినము

లైనను వినుచున్నట్లు లేదు. ఈతడు చదువునప్పు డరమైలువఱకు నింకొకడు చదువుకొన దోచకుండనీయీపాటకును రెండంగుళముల దూరమున నున్నను వినబడని యీతనిమాటకు నేమిదాంపత్యమో ఎట్లు సమకూరెనో చెప్పలేము. చదువునప్పటిధాటి మాటలాడునప్పుడును మాటలాడునప్పటి పిఱికితనము పాఠపఠనమునందు నుండిన మా కీపాట్లేల? ఈపాటవరుసలో జదువున దేదియో యెదుట నున్నవారికి దెలియదు సరేకదా, ఆతనికి గూడ రవంతైనను గ్రాహ్యము కాదని వేఱు చెప్ప నవసరము లేదు. గ్రాహ్యమైనచో నాతని సంవత్సరాంతపు బరీక్షాసమయమున తల్లిదండ్రుల కీపాట్లేల?

సాధారణముగా నాతడు విశేషబుద్ధికుశలత కలవాడు కాడని మేము వేఱుగా వచింప నవసరము లేదు. రెండుమూడుపర్యాయములు చెప్పినగాని ఆతని కేవిషయమును జ్ఞాపకముండదు. తండ్రిగారుకాని, గురువుగారుకాని, ఏదైన బనిమీద నాతని బంపినచో, నప్పుడప్పు డాతడు తిరిగి యరుదెంచి, అతివినయముగా పంపించినపని యేమని కనుగొని పోవుటకూడ గలదు. అవసరమైనగాని, ఈతడు నలుగు రుండుచోట నుండుస్వభావము గలవాడు కాడు. ఆటలన్న నీతని కసహ్యము. కారణము వానివలన చదువునకు భంగము గలుగుననిమాత్రము కాదు.

## III

పదునేడేండ్లు ప్రాప్తించుసరికి మెట్టుమెట్టుగా సీతామోజీరావు స్కూలుఫైనలుక్లాసులోని కెగబ్రాకెను. ఈక్లాసులో నంతగా మాతాపితృసహాయమునకు వీలులేకపోయినను, వత్సరము పొడగున నుపాధ్యాయుల సూటిమాటలకును ధాటిదెలుపు చేష్టలకును గురికాగల కుమారునిమార్గమును వారు కొంత నునుపుగా జేసిరి. రానురాను కుమారుడుకూడ క్లాసుయొక్క యుపాధ్యాయులపరిచర్య కందుకొనుటయు నీనుఱుపునకు గారణము కావచ్చును. ద్వాదశీభోజనములకు, కాఫీహోటలు రాయబారమునకును, Exercise పుస్తకముల యింటిమోతకు నుపచరించు నీమృదుస్వభావునియం దేయుపాధ్యాయునకు గోపముండును? బడిపరీక్షలలో ప్యాసుమార్కుల కేలోటును లేకుండ జరిగెను. ఇంతలో నొకసోమయాజిగారు వరాన్వేషియై యాగ్రామమునకు విచ్చేసి వాకబువలన రామన్నదీక్షితులుగారి పుత్రరత్నమును గుఱించి తెలిసికొని దీక్షితులుగారి కులగోత్రాదులను గుఱించి విచారించి తృప్తిజెంది, బడిలో నుపాధ్యాయులవలన నాయన కుమారు డల్లరిచిల్లరివాడు కాడనియు, నెమ్మదియైన వాడనియు గ్రహించి యొకసుదినమున దీక్షితులుగారి యింటికరుదెంచి, వీథియరుగుపై నుపవిష్టుడాయెను. ఉదయ మెనిమిదిగంట లాయెను. అనుష్ఠానము లన్నియు దీర్చికొని, తడియంగవస్త్రమును జేతధరించి నీర్కావిపంచయు నుత్తరీయముతో నూరిలోనికి బోనుద్యుక్తుడైన దీక్షితులు వీథిగుమ్మము దాటుసరి కరుగుపై నున్న కుండలధారిని జూచి అనుమానించి ఏమైననేమి యని తెగువదెచ్చి

కొని, కొంచెము దగ్గుచు నాగంతుకుని దృష్టి నాకర్షించెను.

"రామన్న దీక్షితులుగారియిల్లిదియే నాండి?" అని సోమయాజులుగారు లేచి నిలిచి ప్రశ్నించిరి.

"చిత్తమిదేనండి! నేనే, రామన్నదీక్షితులను. మన దేయూరు?"

"నాది కంచంపాడగ్రహారము. నాపేరు విశ్వనాథసోమయాజులంటారండి!"



"లోనికి దయచేయిండి!' ఏమే కాళ్లు కడుగుకొనుటకు నీళ్లు తీసికొనిరా," అని రామన్నదీక్షితులు భార్యతెచ్చిన సీటిని, తనచేతిలోని అంగవస్త్రము నాయనకిచ్చి, లోనికేగి, తివాసి దులిపి, నేలపై బఱచి, సోమయాజిగారితో దానిపైగూర్చుండెను. భోజనార్థము వచ్చిన ముఖమేమోఅని, అచ్చమ్మ యొక్కసారి తొంగిచూచి, లోనికేగెను. ఇంతలో దీక్షితులుగారి పొరుగింటి యజమానియైన నరసన్నగారుకూడ, సోమయాజులుగారికి జేసినవాగ్దాన ప్రకారము లోనికరుదెంచి యుపవిష్టుడై, "సోమయాజులుగారు తమకూతురిని మనకామోజీ కీయవలయు ననునుద్దేశముతో నరుదెంచినారు." అని యుపోద్ఘాతము నను గ్రహించెను.

ఆసాయంకాలమునకు వివాహము నిశ్చయమై పెద్దలసమక్షమున వియ్యంకులిద్దఱును తాంబులముల నిచ్చికొనిరి. ఇరువురి సాంప్రదాయములును సుప్రసిద్ధములే కావునను ఇర్వురకును ధనాపేక్ష లేశమును లేకుండుట చేతను, కార్యభంగమున కవకాశము లేకపోయెను. కొంచెముగా లాంఛనములవిషయమై పట్టుబట్టిన అచ్చమ్మకూడ, త్వరలో పరిణయశుభమును రుచిచూడవలెనని కాబోలును గ్రంథమును బెంచలేదు.

ఒక శుభముహూర్త సమయమున కామోజీరావునకును లక్ష్మమ్మకును బరిణయము కంచంపాడగ్రహారమున శుభప్రదముగా, సలక్షణముగా జరిగెను. గృహప్రవేశాదులన్నియు దీరినతర్వాత కామోజీ తిరిగి బడిలోనికి బోవ బ్రారంభించెను. పరిణయపు దొందరల వలననో వధూపదనిక్షేప సంపదనో పాపము దీక్షితులుగారు రోగగ్రస్తులై మంచమెక్కి యౌషధసేవ చేయనారంభించిరి. గ్రామభిషక్చక్రవర్తియగు ప్రతికక్షికుతారం తిరువేంకటాచార్యులుగారు సర్వవిధముల బ్రయత్నించుచుండిరేకాని దీక్షితులుగారి వ్యాధిమాత్రము మరలు మొగము జూపలేదు. క్రమ

ముగా దేహమున నీరుపట్టి రోగి కదలుటకు గూడ నవకాశము లేకుండ జేసెను. దేశములోని దేవతలకెల్లరకు నచ్చమ్మ మ్రొక్కులిడుచుండెనే కాని ఆలకించువారెవ్వరును లేరైరి.

“ఆయన కేమిభయమమ్మా! నిన్నటికన్న ఈదినము కొంచెము సుగుణముగానే కన్పడుచున్నది. మీరు జడియ నవసరము లేదు. నాయొద్దనున్న యౌషధములు సామాన్యమైనవి కావు. అందులో చిన్ననాటినుండియు నొకచోట పెరిగిన దీక్షితులుగారి తత్త్వము నేనెఱుగనిది కాదు. మందు క్రమేణ గుణమిచ్చును. త్వరలో వ్యాధి నణగద్రొక్కుట కూడ మనకు శ్రేయము కాదు” అని వైద్యుడన్నివేళల నచ్చమ్మకు ధైర్యము జెప్పుచుండెడివాడు.

కామోజీరావునకు పరీక్షా దినములు. ఇంట తండ్రిగారికి పరిచర్య చేయుటచేతను, తత్పూర్వము సుమారు నెలదినములు పరిణయపు తొందరలవలనను పాప మాతనికి చదువుటకు దగిన సావకాశము లేకుండుటచేతనే కాక మనస్స్థిమితము లేకపోవుటచే పరీక్షలో తాను తృప్తికరముగ వ్రాయలేదని కామోజీ యుపాధ్యాయులతో చెప్పుకొనవలసి వచ్చెను.

## IV

ఇటుండగా వేసవికాలపు శలవులయందొకనాటిరాత్రి దీక్షితులుగారికి హెచ్చుచేసెను. తిరువెంకటాచార్యులుగారు తొందరపనియున్నదని నాటిసాయంకాలమే రోగిని జూడ వచ్చినప్పుడు శలవిచ్చి, పయనమై పోయిరి. గ్రామములోనున్న యితర వైద్యులసహాయమున తెల్లవారువఱకును జీవములు నిల్చినవి కాని, అటుపిమ్మట సాధ్యము కాకపోయెను. ఉదయ మెనిమిదిగంటల కాయన పరమపదించిరి. సంసారబాధ్యత కామోజీనెత్తిపై బడెను.

ఎట్టెట్లో పండ్రెండుదినములను గడిపి కామోజీ నూతనవైధవ్య క్లేశముచే కృశించియున్న అచ్చమ్మయొద్దకు జేరి హోరున నేడ్వసాగెను. తనదుఃఖమును దిగమ్రింగ యత్నించుచు నామె కుమారుని సమాశ్వసింపదొడగెను.

“నాయనా! ఆయన కేమి అదృష్టవంతులే. భారమంతయు నీపై బడినది. ఎట్లు భరింతువో! కోడలు కాపురమునకు వచ్చినతర్వాత నాలుగేండ్లపాటు జీవించియుండిన యెడల, నీ కింతకష్ట మనుపించకపోవునేమో? ఏమిచేయగలము? చదివినంతవఱకు జాలును. నాయనా! ఏదైన ఉద్యోగప్రయత్నము చేయుట మంచిది. ఆయన నిన్ను కేవలము నిరాధారునిగా చేసిపోలేదు. సాలునకు గరిసెడుధాన్యమువచ్చు పొలమును, ఈకొంపయు, ఆయనస్వార్జితమే. దీనిని ఆధారముగా చేసికొని, ఏదైన చిన్నఉద్యోగములో చేరినయెడల సంసారము గోప్యముగా జరుగవచ్చును. ఆయన పేరెరుగనివా రీపట్నంలో ఎవరునూ లేరు. ఫలానాఅంటే నీ కుద్యోగమునకు కొదువ యుండకూడదు. బెంగపెట్టుకోక. ధైర్యము తెచ్చుకో. మొన్న నీ మామగారు తిరిగివారము దినములలో వచ్చెదమని చెప్పిపోయినారు.

ఆయనవచ్చినతోడనే ఆలోచించి, ఏదైన ప్రయత్నము చేయుదువుగానిలే! ఇంట్లో కూర్చుండి, ఊరకే కుళ్లికుళ్లి ఏడ్చిన ప్రయోజన మేమున్నది. ఒకసారి వీథిలోనికి పోయి రా నాయనా?"

సోమయాజులుగారు కూడ పదిదినములలో వచ్చి యల్లునకు ధైర్యము జెప్పి యుద్యోగప్రయత్నములకు తానుకూడ దోడ్పడసాగెను. ఇంతలో పరీక్షాఫలితములుకూడ వచ్చినవి. కామోజీరావునకు పంచాంగమువంటి సర్టిఫికెట్టు చేతికివచ్చినదే కాని లోనిమార్కులపట్టికమాత్ర ముత్సాహకరముగా లేదు. రెండుముఖ్యమైన సబ్జక్టులో రావలసినమార్కులకన్న తక్కువవచ్చినవి కాబట్టి "కలెక్టరాఫీసులో" ప్రవేశము దొరకుట దుర్లభమని ఆకచ్చేరీ శిరస్తాదారుడు మొదటనే దీవించెను. ఏమైననేమి యని అర్జీ నొకదానిని వ్రాసికొని, సప్తపింజలను సరిగా మడచి, ముఖమున దళముగా విభూతిబూసికొని, కామోజీరా వొకనా డుదయము తనమార్కులపట్టీతో, కలెక్టరుదొరను చూడబోయెను. ద్వారమును గాచువాని మామూలుచెల్లించి దొరను చూచుసమయమునకై యొకగంట నిరీక్షించి, అనుజ్ఞాతుడై లోనికేగి సలాముచేసి, తనచేతిలోని అర్జీయును, పుస్తకము నాయన కొసగెను. దొర దాని నందికొని క్షణమాత్ర మది పరిశీలించి, పుస్తకమునువిప్పిచూచి, కామోజీ నెగాదిగ బరీక్షించి, చిరునగవుతో నాంగ్లమున "నీవు" బ్రాహ్మణుడవు కాబోలు" నని విమర్శించి, యాతని కీయదగినపని లేదని చెప్పి పంపివైచెను. మారుమాటాడనేరక, కామోజీ తిరిగి సలాముచేసి దైన్యమును వెదజల్లు మోముతో నిల్లుజేరెను.



ఇట్లుండగా మునసఫుకచేరియం దొకటి న్నరనెల కాళీకలదని యాతనికి దెలిసెను. వెంటనే యాత డర్జీ నివ్రాసికొని ఆకచేరిహెడ్డుగుమాస్తాగారిని దర్శించెను. స్వలాభ మావంతయు లేకుండ సహాయము చేయనేరని మానవప్రకృతికల ఈకాలములో, నాతడు తనకొకనెలలో సగముజీత మిచ్చినచో, రెండుమూడుదినములలో పని నిప్పించెదనని వాగ్దానమొనర్చుట వింత కాదు! చిత్తమనిచెప్పి కామోజీ శలవుదీసికొని "చచ్చినవాని పెండ్లికి వచ్చినదే కట్న మన్న" ట్లూహించికొనెను. నాలుగుదినములలో కామోజీ పనిలో బ్రవేశించెను. స్వబుద్ధిప్రయోజకత్వములచే కాక, వేఱు కారణములచే బైకివచ్చిన అధికారి యొద్దపనిచేయుట బుద్ధిమంతులకు కష్టముకాని కామోజీవంటివారలకు కష్టమనిపించదు. వినయగుణసంపన్ను డగుటచేతను, కొంచెముగా దస్తూరీ బాగుగా నుండుటచేతను, హెడ్డుగుమాస్తా తనపనినిగూడ నీతనిచేతనే కొంతవఱకు చేయించుకొనుచుండెను. ఉదయ మారుగంటలకు విడిచినయింటి కాతడు తిరిగి

గంటల కరుదెంచి, 11 గంటలకే ఆఫీసున కేగవలసివచ్చెడిది. తిరిగి రాత్రి 9 గంటలకే యింటికివచ్చుట కవకాశము కలుగుచుండెను. ఒక్కొకప్పు డింటికిగూడ నాఫీసుకాకితములను దెచ్చి రాత్రి యొంటిగంటవఱకు గూడ పనిచేయుచుండుట తటస్థించుచుండెను.

ఈరీతిగా నొకటిన్నర మాసము గడచెను. పనికూడ ముగిసెను. తిరిగి యుద్యోగమునకు ప్రయత్నము చేయవలసివచ్చెను. 15 దినము లొకపాఠశాలయం దుపాధ్యాయుడుగా పనిచేసెను కాని, తిరిగి ఖాళీకలిగినప్పు డాతనిపని తృప్తికరముగా లేదని పాఠశాలాధికారి వానికుద్యోగమీయక వేఱొకని నాపనిలో బ్రవేశపెట్టెను. తాలూకా కచ్చేరియం దొకమాసము పనిచేయునప్పటి కాతని కనారోగ్యము కలుగుటచేతను, తిరుగ నచ్చట ఖాళీలు లేకపోవుటచేతను కామోజీరావునకు దిరుగ పని లభించుటకు గొంతకాలము పట్టెను, ఇంతలో లక్ష్మమ్మ కాపురమునకు వచ్చుటచే నింటిఖర్చుకూడ పెరుగజొచ్చెను. వైదికాచారమున క్లుప్తముగా ఖర్చుజేసికొనుచు, వచ్చిన రాబడియందే కుమారునకు విద్యలు చెప్పించి యొక గృహమును, కొంతభూమిని నిలువచేయగలిగిన దీక్షితులుగారి కొమారు డార్జననారంభించిన మూడు సంవత్సరముల నాటికి, నవీనవిద్యాప్రాగల్భ్యముచే మున్నూరురూపాయీ లప్పుచేయవలసివచ్చెను. ఖర్చు తగ్గించు మిషచేతను, తదితరకారణములచేతను, కాయమైనను, తక్కువసర్వీసుకలగుమాస్తాల నన్నికచ్చేరిలయందును దీసివేయుచుండిరి. ఈయొత్తిడి ముఖ్యముగా కామోజీకులస్థులకు తగిలినది. వినుటచే నాతడు చాల నిరుత్సాహపడెను.

"అయ్యో! ఇన్ని దినములనుండియు గులవృత్తిని గర్హించి తదర్థశాస్త్ర పఠనాదులను చేయక, కిరీటము లభించునని నాకరణములేని విద్య నభ్యసించి ప్రయోజనము లేక "రెంటికిని జెడిన రేవడి నైతిని!" ఇప్పు డయ్యవి నేర్చుటకు మనస్సు కొంచెమైనను ఇష్టపడుట లేదు. జీవనోపాధికి మార్గము కనుపించదు. కష్టపడి పూర్వు లార్జించినదానికే నేను విఘాతము కలుగజేయుచున్నాను. తండ్రి తాత లవలంబించిన వృత్తిని బోనాడుకుంటిని. ఇప్పుడు నా ముఖముజూచువా రెవ్వరు? గుమాస్తాపనికి తప్ప మరేవృత్తికిని బనికిరాని నావలన నావారల కేమిప్రయోజనము కలుగగలదు? ఏవృత్తినైన నేర్చికొని యుండినచో, ధైర్యముగా నీవఱ కొకరిప్రేక్ష్యము లేకుండ కాలూనికొని సంసారపోషణ మనిన నింత బెంగపెట్టికొనక యుందునుకదా? నావలనే భ్రష్టులైనవా రింక నెందఱున్నారో?" అని పాపమాతడు చాల కళవళపడుచుండుట విని ఆగ్రామవాసియగు నొకవర్తకశిఖామణి, తనహృదయమునందికను నిలిచియున్న బ్రాహ్మణగౌరవమువలనను, ముఖ్యముగా దీక్షితులుగారియెడ గలసదభిప్రాయముచేత నాకామోజీని బిలువనంపి యధైర్యము నొందవలదని బోధించి, తన యొద్ద నుత్తరప్రత్యుత్తరములను నడపుటకును, లెక్కలను వ్రాయుటకును నెల కొకపదునైదురూప్యముల వేతనముపై నుండవలసినదనియు, కాలక్రమమున దగినప్రోత్సాహమును జూపెదననియు దెలిపెను. కామోజీరావు నేటికి నదేపనియం దున్నాడు. భగవదిచ్ఛ ముం దెట్లుండునో ఎవ్వరు చెప్పగలరు?

# అశ్రుదేవి

పాపినేని వేంకటేశ్వరరావుగారు

చిఱుతటాకుల నశ్రువే సవదరించె
పవన వీచిపై నశ్రువే పవ్వళించె
నాకమంతట నశ్రువే నాట్యమాడె
ఈకనుల, నశ్రుదేవి! పాలింపవేల?

కమ్మనౌ చంద్రికల జలకమ్ములాడి
పూప మేఘాల తోడ దోబూచులాడి
ముగుద పూలతో దాగుడు మూతలాడి
పసరుపచ్చిక నేల పూబంతులాడి
అశ్రుదేవి! నాకందోయి నందగింప
వేల? చండాంశువుల నంతరింపనేల?

అన్నిటికి నీవె యంతంబటంచునెంచి
ప్రణయరక్తిని అడుగంట వ్రయమొనర్చి
శిథిలహృదయుఁడనౌచు కృశించుచుంటి
నశ్రుధారల నింపవే, యశ్రుదేవి!

ఆకసమ్మున నీవింత యందగించి
నంత, పురివిప్పి నెమ్మి నృత్యములొనర్చె;
కులుకులేనవ్వు ముత్యాల గురిసినంత
భూరుహాంగన పూలతో బూజలిచ్చె;
ఇమ్మహీతలంబును గౌగిలించినంత
ప్రళయ గాఢాంధకారంబె జలదరించె
ఔను—నీలోన నిట్టి మాహాత్మ్యముంట
నీకె శరణంటి, నిన్నె ధ్యానించుచుంటి.

నాయెఱుక లేక యెప్పుడో నాయెడంద
జేరుకొంటివా? కందోయి జేరినావొ?
ఈ భవనమందె మూర్తీభవించియున్న
అశ్రువాక్కింత యెఱలదో, యశ్రుదేవి!

పాఱదెఱచి నీహృదయకవాటములను
ప్రేమరక్తిని సుంత వర్షింపకున్న
ఎటుల నీ జీవలత వికసింపగలదు?
ఎటుల ననుతాపములు బ్రసవింపగలవు?

ప్రళయ నయనాగ్నిజ్వాలా పరంపరముల
జిమ్ముచున్నాఁడు రాజరాజేశ్వరుండు;
వేనవేల్ జిహ్వికలదాల్చి వెడలుచుండె
మృత్యుమోహనమూర్తి గ్రసింపనన్ను;
ప్రణయసామ్రాజ్యశాంతాభ్రపథమునందు
స్వాదుఘంటారవంబులు సంక్రమించె;
సమయమే తెంచెనేమొ, అంజలి ఘటించి,

స్వామి నిర్మలపాద దేశముల చెంత
నశ్రుజమ్ముల నీపాపియందగింప
అశ్రుదేవీ! అహా!! మధురాశ్రుదేవి!!!
పావన మొనర్పవే భుజాబంధనమున.

# వరూధిని మాయలు

ఆండ్ర శేషగిరిరావుగారు

'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్.'

మనుచరిత్రమందలి స్త్రీపాత్రములలో వరూధిని శృంగారపుఁ బ్రోవు. ఆమె గంధర్వాంగన. అందును వేశ్య. అట్లగుట హావభావశృంగారాదిసుకుమారచేష్టలచేఁ బురుషునివశ్యము కావించుకొనఁగల్గిన చదురాలు. వైషయికేచ్ఛావిముఖుఁడగు ప్రవరుని దనటోపీలోఁ బడవైచుటకై ఆమె సల్పినమోహంపు నటలు, చేసినయుక్తివాదములు, పోయిన పోఁకలు, పచరించినమాయలు వరూధిని శృంగారరసాలవాలమనుటకు నిదర్శనములు.

నలకూబరసన్నిభుఁడగు ప్రవరుని దిలకించినతోడనే 'ఝుళంఝుళత్కటకసూచితవేగపదారవిందయై' లేచినది. ఇది ముందు వరూధిని చేయఁబోవుమాయలకు మచ్చు. తెచ్చికోలునునుసిగ్గుదొంతర లాందోళింప వెనువెంటనే 'పూచిన యొక్కపోఁకనునుబోదియ మాటునఁ' జేరినది. తా నచ్చటనుండి తనివార 'విలోకనప్రభావీచికలం దదీయపదవీకలశాంబుధిని వెల్లిగొల్ప' వచ్చును. పైఁగాఁ బ్రవరుని ఊరింపవచ్చును. త్రిలోకమోహనకరమగు సౌందర్యరాశి మెఱపువలెఁ గనిపించి అంతలో దృష్టిపథమునుండి తొలఁగుటచేఁ జూపఱు కారూపరాశిని మరలఁ జూడ నాసక్తియు నాతురతయు నెసఁగును. అతిపరిచయముచే నెట్టిదాని విలువయైనను సన్నగిల్లుననుట వరూధిని ఎఱిఁగినపాడి. కావుననే ఆమె తనరూపము ప్రవరునకు ఊరించి ఊరించి చూపవలెనని పోఁకబోదియఁ జేరినది. ఊరఊరనిఊరుగాయవలెఁ గనిపించియుఁ గనిపించని సౌందర్యరాశి అత్యంతసౌఖ్యావహముగదా! తన్నుఁ జూడఁ బ్రవరున కాసక్తియు నాతురతయుఁ బుట్ట నాయొనపరి బాగులాడి వేసిన ఎత్తుగడ ఇది.

కొంతతడ వాతనిరూపరేఖావిలాసములకుఁ జొక్కుటతోడనే ఆమెకు లజ్జాపరిత్యాగమునకు వలయురసపారవశ్యము గల్గినది. 'కాముకస్య కుతో లజ్జా' అని కదా పండితోక్తి. అట్లగుట నామె స్త్రీజనస్వభావసిద్ధమగు లజ్జ వీటఁబుచ్చి, 'అంఘ్రికటకంబుల్ మ్రోయ' నడచివచ్చి, అడ్డము నిల్చినది ప్రవరుఁడు ముందునకు సాగిపోకుండుటకై. వచ్చినవారికి నెదురుసన్నాహము చేయుట లోకమర్యాద.

విభ్రాంతుఁడై ప్రవరుఁడు తనకథ నెఱిఁగించినాఁడు. అంతట నామె ఒసపరివన్నెలు చిన్నెలు నెఱపి సెలవివాఱ నవ్వినది. నూత్నపురుషునితో సంభాషింప నుంకించు మటుమాయలాడి పచరించు నెఱసీటులేకదా ఇయ్యవి... నర్మగర్భముగా నిట్లన్నది.

ఉ. 'ఇంతలు కన్నులుండఁ దెరు
వెవ్వరి వేఁడెదు? భూసురేంద్ర! యే
కాంతమునందు నున్న జవ
రాండ్ర నెపంబిడి పల్కరించు లా
గింతియ కాక, నీ వెలుఁగవే
మునువచ్చిన త్రోవచొప్పు; నీ
కింతభయంబులే కడుఁగ
నెల్లిదమైతిమె? మాట లేటికిన్?

ఈవచనములచే నుత్తరకథావిస్తృతికి మూలసాధనమగు శృంగారరసోద్రేకము గల్గించుటకు బీజములు విత్త యత్నించినది. 'ఇంతలుకన్నులు' అనుటచే నాతనిరూపుపైఁ దన చూపు నిలిచినదని సూచించినది. 'ఏకాంత' మనుటచే భయసంకోచాదుల కిసుమంతయుఁ దావులేకుండుటయు, 'జవరాండ్ర' ననుటచేఁ దనభోగ్యతాసౌభాగ్యమును దెలియఁజేసినది. అంతతో నిల్వక నిజాభిజాత్యమునే కరుపుపెట్టి తనఅతిశయముల నభివర్ణింప నారంభించినది. పుట్టుక సుధాబ్ధిలో; చంద్రుడును లక్ష్మియుఁ దోడఁబుట్టినవారు; తాలనుగూడఁగరఁగించునది విద్య; కళాశాస్త్రమర్యాద దొండాకుపసరుతో నేర్చినది; యజ్ఞకర్మలు ఉంకువలు; మేరు పర్వతప్రదేశములందుఁ గల్పవృక్షములనీడఁ బచ్చరాచట్టుగమి రచ్చపట్టు; పద్మసంభవవైకుంఠభర్గసభలు సాముగరిడీలు; ప్రాణసఖులన్ననో? ఉదారగుణాఢ్యలు, శృంగారరసాలవాలములు నగురంభాదులు; విహారవనసమూహములో? 'నభోవాహినీలహరీశీతలగంధవాహపరిఖేలన్మంజరీసౌరభగ్రహణేందిందిరతుందిలంబులు.' ఇట్లు అతిశయములు వర్ణించి తన అభిలాష నర్మగర్భముగా వెల్వరించినది. ఈయతిశయవర్ణనము చొక్కపొడివలెఁ బని చేయకుండునా? కోరినదే తడవుగాఁ బ్రవరుఁడు తనఇంట నాతిథ్యముఁ గైకొనకుండునా? అనుకొన్నది,

'కుసుమశరాసన!'- అని సంబోధించినది. ఇది సాభిప్రాయమైనసంబోధనముగాని అటుకొటుమాట కాదు. 'సముదంచన్మణిభవనాసీనత' సేదదేఱు మన్నది. ఆహ్వానములోఁ గూడఁ దనఅతిశయవర్ణనము మేళవించినది. "మాయింటివిందవైతివి" అని తానే అనివేసినది. మఱియు

"తే. కుందనమువంటిమేను మధ్యందినాతి
పోష్ణమహతిఁ గందె నడదాఁకె నొప్పులొలుకు
వదన మస్మద్గృహంబు పావనముచేసి
బడలికలు వాసిచనుము."

అని వేఁడికోలు. కుందనము వంటిమేనుఁ, ఒప్పులొలుకువదనము'. అతిథిసత్కారము చేయునతివకు బ్రాహ్మణుని అంగసౌందర్యప్రశస్తి యేలనో? ఏమో? గంధర్వాంగనలలో గుట్టు విమరకుల్కెట్లు తెలియును? ఎంతవఱకు నరుగుచున్నది వరూథినీవాక్యానసానము? ఈ అతిశయవర్ణనముచేఁ బ్రవరుని ఆశగొల్పం జూచినది. చక్కనిమాటలాడి సత్కరింపనెంచినది. ఇంతదనుక మాటలఁదేటల మరపి మెప్పించి బుట్టలోఁ బెట్టఁ దలఁచినది. కాని ఈ పలుకులన్నియు సముద్రమధుబిందువులైనవి. పరమశ్రోత్రియశిఖామణి యగు ప్రవరునిచిత్తమునకు వరూథిని మహిమాతిశయము, అభిలాషవిశేషము, అత్యంతభోగిత్వము, ఇది యేదియు గ్రాహ్యము కాలేదు. అతనిమనమున

శృంగారరసము మొలకలెత్తించుట కుంపటిలోఁ దామర మొలపించుటయే. వరూథిని అంతతో నిరుత్సాహము చెందినదా? లేదు. వాని బేలతనమునకు లేఁతనవ్వాననసీమఁ దాండవింపఁ జేసినది. అక్కడి విశేషములఁ జూపి భ్రమపెట్టఁ దలంచినది. 'ఎక్కడియూరు? కాలునిలువ కింటికిఁ బోయెదనని కలవరించెదవు. ఇక్కడి రత్నకందరములు, నందనచందనోత్కరములు, గాంగసైకతములు, లవలీనికుంజములు, మీకుటీరనిలయములకు సరిరాకపోయెనా?' అని చచ్చు తెగవేసి అడిగినది. దీని కాశపడి బ్రాహ్మణుఁ డుండకపోఁడని ఆమె అభిప్రాయము. అంతతో నూరకున్నదా? లేదు. అడుగఁబోయెడుఅంగనకు సిగ్గెందులకు? లజ్జించిన కార్యము సానుకూలము గావలదా? చల్లకుం బోయి ముంత దాఁచిన లాభమేమి? వ్యవహారముపట్ల లజ్జ కూడదని నిర్ణయించి స్త్రీజనస్వభావసిద్ధమగు బెట్టుసరి తీసి గట్టునబెట్టి కుండబ్రద్దలుకొట్టినట్లు.

'ఉ. నిక్కము దాఁపనేల? ధరణీసురనందన!
యింక నీపయిం జిక్కె మనంబు నాకు.'

అని చెప్పివైచినది. మాయమర్మములు చంకఁబెట్టి పల్కిన ఈమాటలకైన 'దమ్మఁడు చిక్కకుండునా?'

అబ్బే! ముదిగొమ్మవంగునా? 'క్రతులై దినములు గడపెడువిప్రులఁ గామింపఁజనునే? నేను ఆహితాగ్నిని. నేఁ డిల్లుచేరకుండిన సమస్తధర్మములు దూలును.' అని ప్రవరుని ప్రతివచనము. ఈయడ్డగట్టుమాట లామెకు రుచించునా? వానివైరాగ్యభావమునకు వరూథినికి వదనమున విన్నఁబాటు 'ఇంచుక' దోఁచినది. విన్నఁబాటైనను 'ఇంచుకయే' ఏలయంగరా? ఎట్లైన బాఁపని మోహసముద్రమున ముంచలేక పోవుదుమా అను ధైర్యము ముండఁబట్టి. సాభిప్రాయసంబోధనలు, అతిశయవర్ణనలు, మర్మవచనములు ఇవి అన్నియుఁ జెవిటికి సంకూదినట్లగుట ఇఁక వానితోఁ బ్రసక్తియుఁ బ్రయోజనము లేదయ్యెను. యుక్తివాదములో బోల్తా వేయించవలెను.

"ఉ. భావజరూప! యిట్టియెల్ల
ప్రాయము వైదికకర్మనిష్ఠలం
బోవఁగ నింక భోగములఁ
బొందుట యెన్నఁడు? యజ్ఞకోటులం
బావనులౌటకున్ ఫలము
మాకవుఁగిళ్ల సుఖించుటేకదా!"

'అప్రయత్నలబ్ధమగు గంధర్వాంగన పొందేకాదు. కామోద్రేకములగు కస్తూరి, జవాజి, పచ్చకప్పురము, పన్నీరు, ఫలపుష్పములు, రత్నభూషణములును గలవు. కావున భోగపరుఁడవై అనుదినము నన్నుఁ గూడి రమింపుము.' అని చాటుమాటు లేక వచించినది.

ఆపై నిందనమునకు దొరకొన్నది. విషయలోలత్వము మంచిదని నిరూపింప విశ్వప్రయత్నము లొనర్చినది. 'గంధర్వాంగనల పొందు గాదని సంసారాంధుఁడనఁ బడియెదవు' అన్నది. 'వెన్నవలెఁ గరంగునలివేణులఁ గౌఁగిటఁ జేర్చుభాగ్యములు ఎన్నిభవములఁ గలుగును?' అని ఊరించినది. 'మీకర్మనిష్ఠలు యజ్ఞకోటులును మాకవుఁగిళ్ళ సుఖింపనేకదా?' అని పృచ్ఛించినది. 'సశరీరస్వర్గసుఖము' పోనాడకుమన్నది. ఇహలోకమునందే ఇంద్రియ

వాంఛలు దనివిదీరఁ జూఱఁగొనువాఁడే ఉత్తముఁడని నిరూపింప సాహసించినది. కంటిరా? కాముకురాలి మిట్టవేదాంతములు! విషయాపేక్షఁదగిలి 'బ్రహ్మానందాధిరాజ్యపదవీచ్యుతుఁ డగుటకు వ్రతనిష్ఠ, వైరాగ్యము గల ప్రవరుఁ డొప్పుకో లేదు

యుక్తివాదముకూడఁ జెడినది. ఇఁక నీశ్రోత్రియబ్రాహ్మణుని పట్టికొట్టించుటకు శరణ్యము శాస్త్రవాదమే. 'బ్రాహ్మణుఁడు, అందును శ్రోత్రియుఁడుకదా! ఒక్కసారి శాస్త్రవాదమునం దూఁపిచూచెదము; అప్పుడైన మనవలలోఁ బడకుండునా?' అని ఆలోచించినది. 'డెందము నిశ్చలమై యెక్కడ నిర్వృతినొందునో యట్టి ఆనందమే బ్రహ్మముగాని నీవుచెప్పు బ్రహ్మానందము లేదని ప్రవరునివాదమునకు ఖండనము చేసినది. ఇందులకు 'ఆనందో బ్రహ్మ' అను శ్రుతివాక్యప్రమాణముఁ జూపినది. దీని కాతఁడు ఏమిబదులాడెనో తిలకించితిరా? 'నాకరణుల్ దర్భలు నగ్నులు బ్రియములైనట్లన్యముల్ గావాడల్ తిరమే? చెప్పకు మిట్టితుచ్ఛసుఖముల్ మీసాలపైఁ దేనియల్' అని ఖండన మండన మొనర్చి తనవిషయభోగవైముఖ్యమును వైరాగ్యమును వెల్లడించినాఁడు. శాస్త్రవాద మిట్లు చట్టుబండలై పోయినది. ప్రవరుఁడన్ననో నమలరాని నారికేళమై పోయినాఁడు. కామశాస్త్రోపాధ్యాయిని యట్లు వచించియు శాస్త్రవాదమునఁ బ్రవరునితో నెదిరి యొడ్డారింపలేకపోయెను! వరూథిని కామశాస్త్రోపన్యాసము ప్రవరుని వేదాంతోపన్యాసమెదుట చిచ్చుపొంత వెన్నయైనది. ఆమె కేమియుఁ దోఁచినది కాదు. మాట లేకపోయినది. హృదయాబ్జము జల్లనినది. మోము వెల్లనైనది. 'వనిత తనంతఁ దా వలచివచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అని తన్నుఁ దా నిందించుకొన్నది. స్త్రీలకుఁ బెట్టని భూషణమగు బెట్టుసరియూ! పోయినది. కార్యమా! నెరవేరలేదు. వ్రతము చెడినను ఫలము దక్కకపోవుట అభాగ్యముకాక మఱియేమి?

సామదానభేదోపాయము లిట్లు పోఁకకుఁ జెల్లకుండుటచే నామెకు ఆదుర్దా అతిశయించినది. ఇఁక బలవంతమాఘుస్నానమట్లు చేయఁగూడదా అని సమాలోచించుకొన్నది. బలాత్కృతియే కాని వేఱుదారి లేదని నిశ్చయించినది. మితముదప్పిన 'రతిసంరంభము' నిల్వనిచ్చినది కాదు. 'కామాతురాణాం నభయం నలజ్జా' అని ఆర్యోక్తి. పట్టలేక 'ప్రాంచద్భూషణబాహుమూలరుచితోఁ,' మెరమెరపాటుతో మోహోద్రేకముతోఁ బైపాటునఁ గౌఁగిలించినది. పరిరంభణప్రయోగము బ్రహ్మాస్త్రమువలెఁ దిరుఁగులేనిదని ఆమె తలంపు. అవును, నిజమే! పరిరంభణముకంటె బలవత్తరమైన మోహాశపరికర మేది? వశ్యాంజనమువలె నిది పనిచేయునని వరూథినియూహ. ఆమెయూహ సరియైనదా? కాదు. సతులమాయలు ధీరచిత్తములఁగలంచునా? రోఁకటికిఁ జిగురులు పుట్టునా? అకాముకుఁ డగుట ఆతఁ డామెను త్రోచివైచినాఁడు.

అందులకుఁ గోపము పెటల్తినది వరూథినికి. గ్రేటుకొని మురమురలాడుచు

ఉ. పాయున కింతు లోడ్తురె!
కృపారహితాత్మక! నిర్దోవ ని
చ్చోటు [illegible] భాంకురము
[illegible] కనుంగొనుమంటిని"

బూపి (సమీరా [illegible] [illegible] త్యంగా
ర మనునట్లు) వేదనాపమిడి కలస్వనముతో
పిలపించినది. తనకుఁ దానై వలపుగొనినపురు
షుఁడు దనకుఁ బ్రతికూలవృత్తి నున్నతఁడే ఆ
తనిహృదయము తనయందు అనురాగాయ త్త
మును, ఆతనిమనము తనయందు లగ్నమును.
[illegible] బ్లొనర్చుటకు, అంగనలకుఁ గల అంతి
మోపాయము కంటఁ దడిపెట్టుటే కదా! ఈవి
ధమున 'కన్నుఁగవ ధవళరుచులు కావిగొన
నలికదుఃఖముగాఁ' బ్రలాపించినది. అంతతో
[illegible] లేదు. ఆ ప్రవరుని [illegible] యలమటఁ
బల్కినది. అలమటయే కాని ఆశాభంగ[illegible]
[illegible]. 'ఇనునకచ్చు [illegible] [illegible] కొనుముని [illegible]
చ్చుతల్లిఁ [illegible] బంధు' లని [illegible]
[illegible] కంఠలో ఆశాభంగ
మగునా?

"ఉ. ఆశువారిఁ గన్న [illegible]
[illegible] గన్న
[illegible] గలుగనా!
[illegible]
[illegible] పైనను
[illegible] తెగలు
[illegible] విశుమ దోర [illegible]
[illegible]! వినరవేమ!"

[illegible] గానము చేయుచున్నాఁడు. అట్టి
[illegible] నాశాభంగ మగున [illegible]?
[illegible] కుం దే
లువంటివాఁడు కదా! [illegible] నను

నుండి ధైర్యము. ఒక్కింతతడవున కైన బుద్ధి
తిరుగక పోవునా? మనసు కరఁగక పోవునా? [illegible]
అడియాస. అట్లగుట ఆమెకు అలమటయే
కాని ఉత్సాహభంగము కల్గలేదు. ఆశ [illegible]
చేసికొనలేదు. నక్కాశపెట్టుకొని ఉవ్విళ్లూరి
నది. కామశాస్త్రోపన్యాసముచే నామెకు [illegible]
[illegible] లబ్ధి లేకపోయినది. పైఁగా [illegible]
[illegible] విసికిపోయినది. అందుపై నాయుపన్యాస
ము ఉట్టిమీఁదఁ బెట్టి అహింసయే పరమధర్మ
మని ఉపన్యసించినది. తిలకింపుఁడు.

ఉ. చేసితి జన్మముల్; తపము
చేసితి నంటి; [illegible] విహీనతం
జేసిన పుణ్యముల్ ఫలము
[illegible] లెన్ని [illegible]
[illegible]
[illegible]
భూసురవర్య! [illegible]
[illegible]!

సద్గతికి దయ [illegible] ధానమని నిగ్గుతేల్చినది.
ఈనీతి నిసుమంతయుఁ దలఁపోయ[illegible] ఆతనిపదు
వు [illegible] ప్రాయమగుటకుఁ [illegible] నా
[illegible] చినది. అంతతో [illegible] రంకుపురాణము
[illegible] అంకుతనము [illegible] చూ
[illegible] చాటినది. చూడుఁడు:

సీ. [illegible] చాడబులు [illegible] పట్టి
[illegible] కన్యా [illegible]
[illegible] నన్నె [illegible]
పట్టికి మేనక [illegible]
[illegible] నాగవాసముఁ గూడి
మహిమ [illegible]
స్వారాజ్య మేలంగ [illegible]
ల్యాజాయుద్దన జంభాసురారి.

గీ. వారికంటెను నీమహత్త్వంబు ఘనమె?
పవనపర్ణాంబుభక్షులై నవసి యినుప
కచ్చడాల్ గట్టుకొను ముని ముచ్చులెల్లఁ
దామరసనేత్రలిండ్ల బందాలుగారె!

జారత్వము సర్వవిధముల సమర్థనీయమును, ఆచరణీయమును, శ్లాఘాపాత్రమును అని బోధించి సాధించుటకై వరూధిని పురాణములనుండి నిదర్శనముల నెత్తి చూపి ప్రవరుని జయింపఁ దలఁపుఁగొనినది. ఈకాముకవచనములకుఁ బ్రవరుఁడు ఏమని మాఱువల్కును? మౌనమే భూషణమనుకొని చల్లఁజల్లగా జాఱినాఁడు.

ప్రవరుని మోహములోఁ బడవేయ వరూధిని ఎన్నిపోఁకలు పోయినదో చూచితిరిగదా! తొలుత చక్కనిమాటలాడినది. అటుపిమ్మట తనఆభిజాత్యమును, వైభవాతిశయమును వివరించి వర్ణించినది. ఆపైఁ బ్రవరునికుటీరనిలయములకుఁ దనతావునకును గలతారతమ్యము వ్యక్తీకరించినది. అతఁడేదియు లక్ష్యపెట్టకుండుటచే బలాత్కారముతో మీఁదఁబడి ఆశ్లేషించినది. అప్పుడుకూడఁ బ్రవరుఁడు కొఱుకుపడలేదు. అంతవరూధిని దయాదాక్షిణ్యములు చూపుమని వానిని వేఁడికొన్నది. కాని కార్యము లేకపోయినది. ఆమెపన్నుగడలన్నియు విఫలములైనవి. తుదకు వరూధిని అనురాగము 'దుర్లభజనానురాగమై' నది. అట్లగుటనే కవి ప్రవరునిగూర్చి ఇట్లని పాడుచున్నాఁడు.

ఆ. వాని చక్కఁదనము వైరాగ్యమునఁ జేసి
కాంక్ష సేయుజార కామినులకు
భోగబాహ్యమయ్యెఁ బూచినసంపెంగ
పోలుపు మధుకరాంగనలకుంబోలె.

# అభీప్సితము

నాయని సుబ్బారావు, సాహితీసమితి

అది నడచువేళ నేలఁ జీరాడు కుచ్చె
రేపు దుమ్మున నొక త్రసరేణువునయి
దాని తనువునఁ బుట్టు స్వేదమునఁ గలసి
కరఁగి పోదును రూప మేర్పఱుప రాక!

అది యుషస్స్నాన మొనరించి యంతఁ గట్టు
కొనిన పచ్చని పట్టుదుకూలమందు
ఆర్ద్రమగు లే జరీ యంచునై తదీయ
దేహమున గగుర్పాటులు దిద్దుకొందు!

అది శుచిర్భూతయై దేవతాళి పూజ
లైన వెనువెంట తన పూతహస్తమంటి
హారతికి వెలిగించు కర్పూరమునయి
వాసనలు చిమ్ముదును దాని వదనమందు!

అది సుధారస మొలుక మాటాడునపుడు
దాని నాభిమూలమున నుద్గత మనోజ్ఞ
ఫణితులందొక్క ప్రణయభాషణమునగుచు
త్రోవలో దాని రసన కంటుకొని పోదు!

అది త్రికాలమ్ము సేవించు నాకుమడుపు
నై తదీయాచ్ఛదంతసంహతుల నలగి
యైన రాగమ్మునక దాని యధరమునకు
నిత్యనైవేద్య పాత్రికల్ నింపుకొందు!

అది చిదుమరాని సిగ్గుచే నదుమఁ బడియు
నధికమౌ ప్రేమపారవశ్యమునఁ దీయు
కూనరాగమ్ము లోని సంకుచిత సూక్ష్మ
భావ నిర్దిష్ట మవ్యక్త పదము నగును!

అది ప్రతినిమేషమును పీల్చు నట్టి గాలి
నై తదీయోష్ణ రక్తనాళాంతరముల
మందముగ గాఢముగ నిల్చి మండు విరహ
వేదనానలమున నులివెచ్చ నగుదు!

దాని హృదయ పీఠిక నధిష్ఠాత నగుదు!

ప్రణయినీ వదనాంచల భాగమందు
నొక్కుచిఱునవ్వుతరగనై యూగుచుందు!

ప్రణయినీ శీతల దృగంతపాతమందు
కరడు గట్టిన యొక సుధాకణము నగుదు!
ప్రణయినీ ప్రసూనాంగ సంస్పర్శ తగిలి
తగులని విధాన కలిగి సంతనె యనంత
దివ్యరాగ స్రవంతిలో తేలిపోదు!

# అరటితోటలు

## "కంపెనీ" పద్ధతి

ఒక కృషీవలుడు

సుమారైదేసిగజముల కొకొక్కకజత పిల్కలను నాటి తోటను అనేక సంవత్సరములాకేచోట నుంచుట గోదావరిజిల్లాలో అరటితోటలను బెంచు సామాన్యపద్ధతి. దీనికి "దేశవాళీ" పద్ధతి అనవచ్చును. దీనివలన నిపు డెకరమునకు రెండు వందలు మొదలు నాల్గువందల రూపాయల వరకు లాభము వచ్చుచున్నది. 10, 12 సంవత్సరముల క్రిందట 7, 8 అడుగుల దూరమున ఒకొక్కక మొక్క నాటి, తోటను ఒకసంవత్సరమే కాని రెండు సంవత్సరములుమాత్రమే కాని ఉంచుపద్ధతి యొకటి దక్షిణాదినుండి ప్రవేశపెట్టబడెను. దీనికి రైతులు 'కంపెనీ" పద్ధతి అని పేరిడిరి. దీనివలన నిపుడు రైతులకు ఆరు వందలు మొదలు వేయిరూపాయలవరకు లాభము వచ్చుచున్నది. ఈపద్ధతిని అరటితోటలను బెంచు విధానము ఈదిగువ వివరింపబడును.



చక్కెరకేళీ అరటితోట (కంపెనీపద్ధతి)

### మొక్కలను నాటుకాలము

సామాన్యముగ మొక్కలను కార్తిక మాసము మొదలు ఫాల్గుణమాసము వరకు (నవంబరు మొదలు మార్చిఆఖరువరకు) నాటుదురు. కార్తికమార్గశీర్ష మాసములలో నాటిన మొక్కలు వేసవి ముదురులోపలనే కొంతవరకెదిగ వేడిగాడ్పుల కంతగా చెడిపోవు. వేడిగాడ్పులు వీచునప్పటికి మొక్కలు మిగుల లేతగ నున్నయెడల నవి ఉడికిపోయి తొలకరించిన పిమ్మటగూడ తెప్పిరిలవు. కావున మొక్కలను సాధ్యమయినంత ముందుగ నాటుట మంచిది.

కార్తికమార్గశీర్ష మాసములలో నాటిన వేసవిఘూలగాసి, నీటివసతి సరిగాలేని యెడల మొక్కలు కొంతవరకు చెడును. కావున తొలకరిలో మొక్కలను నాటి మరల వేసవిముదురులోపల గెలలన్నియు ముదిరిపోవునటుల సాగుచేయుట మరియొక ఉత్తమమయినపద్ధతి. ఇదియే కంపెనీపద్ధతి. కాని, ఈ పద్ధతిలో ఆయాంపనులు శ్రద్ధగ జేసి చెట్లు అనుకొనినకాలమునకు గెలలు వేయునట్లు చేయజాలకపోయినయెడల యెండకాలమున చెట్లు గెలలతో నుండుటయు, ఉడుకెత్తిగాని గాలిదుమారములచే గాని అవి పడిపోవుటయు కాలువలుకట్టివేయుటచే తగినంతసిరు లేకపోవుటయు తటస్థించును. ఇప్పటికి మామిడిపండ్లు కూడ విస్తారముగ వచ్చుచుండుటచే పండ్ల అమ్మకమునకును కొంచెము చిక్కగనుండును.


శీతకట్టుననాటినతోటలలో చెట్లు మరుసటి వర్షకాలాంతముననునమ శీతకాలమునకు గెలలు వేయును. ఆగెలలు మరల వేసవికి ముందే ముదిరిపోవును. కాని యీతోటలలోని చెట్లు కార్తికమాసములో తరుచు తుపానులు గల్గుచుండుసమయమున గెలలతో నుండుటచే అప్పుడప్పుడు విశేషనష్టము గల్గుచుండును. తొలకరిలో వేసినతోటల కిట్టి నష్టమంతగా నుండదు.

రకములు

గోదావరిజిల్లాలో విస్తారము పెంచబడు రకములు. చక్కెరకేళీ, కర్పూరచక్కెరకేళీ, అమృతపాణీ, బొంత. మొదటిది మిగుల ప్రశస్తమయినరకము. పండ్లకు హెచ్చుధర వచ్చును. రెండవది జనసామాన్యమునకు బనికివచ్చునది. కాని చెట్టు కొంత నాజూకయినది. అమృతపాణీకూడ జనసామాన్యమునకుపయోగించునదే. ఈచెట్టు మోటయినది. సులభముగ పెంచదగినది. ఈ మూడురకములును పండ్లరకములు. బొంత కూరరకము. ఇంకు మరల 4 ఉపరకములు గలవు.—పచ్చబొంత, బూడిదబొంత, పచ్చబొంతబత్తీసా, బూడిదబొంత బత్తీసా. మొదటిరెండును 4, 5 అత్తములుమాత్రమే వేయును. తక్కిన రెండును 10, 12 అత్తములవరకును వేయును.

ఇపుడు 'కంపెనీ' పద్ధతిని సాగుచేయుచున్న ముఖ్యరకము కర్పూరచక్కెరకేళి తోటలు రామచంద్రపురంతాలూకాలోను రాజోలు నర్సాపురంతాలూకాలలోను విశేషముగ గలవు. కొన్ని సంవత్సరముల క్రిందట అమలాపురం రాజోలుతాలుకాలలో చక్కెరకేళీ గూడ నీపద్ధతిని సాగుచేయబడుచుండెను. శీతకట్టున నాటుట ఆచారముగ నుండుటచే నిటీవల వేసవి ఘూలగాయుట నీ తోటలు మిక్కిలి చెడిపోవుట తటస్థించి అవి వేయుటతగ్గెను. మరియు నీపద్ధతిని పెంచిన పండ్లు దేశవాళీతోటలలోని పండ్లంతరుచిగా రుచిలేకపోవుటచే ధరగూడ తగ్గిపోయి తగినంతప్రోత్సాహము లేకపోయెను. అమృతపాణీ బొంతరకముల నీపద్ధతిని పెంచునాచారమంతగాలేదు. అవి రెండును మోటుజాతులగుటచే నంతగా శ్రమలేకయే, దేశవాళీపద్ధతిని పెంచబడుచున్నవి. మరియు నీరకపుతోటలు చాల

కాలము చెడకుండ నొకేచోట పెంచ వీలగు చున్నది.



బొంత అరటితోట (కంపెనీపద్ధతి)

కొడిగా నుండువండలి నేలలలో చాల రకములు జిగురునేలలో కంటె పెద్దగెలలు వేయు నని ఒకరి యనుభవము. కాని; చక్కెరకేళీ మాత్రము గరుపనేలలో కంటె జిగురు నేలలలో నే పెద్దగెలలు వేయు నని తోచును. ఈ విషయమయి కర్షకసోదరులు తమయభిప్రాయమును దెలుపుదురు గాక!

అరటితోటలు వేయునేల వర్షకాలమున ఊటయెక్కనిదిగానుండవలెను.

తొలకరిలో నాటుటకు చక్కెరకేళీ, బొంత ఈ రెండురకములును అనుకూలములు. ఇవి శ్రద్ధగా పెంచినయెడల నాటిన $7\frac{1}{2}$-$8\frac{1}{2}$ నెలలలోనే గెలలువేయును. గెలలు 10-11 నెలలలోనే తయారగును. కర్పూర చక్కెరకేళీ గెలలు వేయుటకు $8\frac{3}{4}$-$9\frac{3}{4}$ నెలలుపట్టును. గెలలు తయారగుటకు మరి మూడు నెలలు పట్టును. అమృతపాణీ గెలలు వేయుటకును, గెలలు తయారగుటకును మరియొకమాసము వరకు పట్టును. కావున నీరెండు రకములును తొలకరిలో నాటినయెడల మండు వేసవిని గెలలతో నుండుట తటస్థించును.

## నేల

అరటితోటలకు సామాన్యముగ వండలి నేలలు ప్రశస్తము. జిగురంతగా లేక గరుప

ఊట యెక్కినయెడల చెట్లు త్వరలో నెదిగి గెలలు వేయవు. మెట్టసేద్యమున నున్న నేలకంటె తగినంత మెరకగానుండుదంపనేలయే 'కంపెనీ' అరటితోటలకు అనుకూలముగదోచెడిని. చెరుకుతోటలవలెనే అరటితోటలును గుల్లబారిననేలలో బాగుగ నెదుగునట్లు తోచదు. మెట్టనేలలలో తరుచు దున్నుచుండుటచే నేల గుల్ల బారిపోయియుండును. గుల్లపునేలలలో నది దమ్ముచేయుటవలన గట్టిపారుచుండును

## పరివర్తనము - మిశ్రణములు

'కంపెనీ' అరటితోటను దంపనేలలో వేయునెడల, తక్కిన సంవత్సరములలో వరి పెసర, మినుము, మొదలగు ఆహారములను సాగుచేయుట మంచిది. దుక్కి అవసరమగు

పయఱ, నూవు, మొదలగు సస్యములను పెట్టగూడదు. నీటివసతిగల మెట్ట (వండలి) నేలలలో అరటిని మిర్చి, జొన్న, మెట్టవరి, కంది, వెల్లుల్లి, మొదలగు వానితో మార్చి పెట్టవచ్చును. ఒక యనుకూలమగు పరివర్తన మీా క్రింద వ్రాయబడెను.

మొదటి సంవత్సరము జొన్న + పెసర.
రెండవ సంవత్సరము మిర్చి
మూడవ సంవత్సరము సిపాయిపెసర— వెల్లుల్లి, పైరవుడు.
నాల్గవ సంవత్సరము మెట్టవరి + కంది.
ఐదవ సంవత్సరము అరటి (దీని నొకటి రెండుసంవత్సరము లుంచవచ్చును.)

కంపెనీతోటలలో దేశవాళీతోటలలో వలె మొదట కొంతకాల మితరసస్యములను పైరుచేయు టరుదు. కాని నర్సాపురం తాలూకాలో కొన్నిచోట్ల శీతకట్టున నాటు అరటితోటలలో పిల్కలను నాటునపుడే నీరుల్లి నారుకూడ మధ్యస్థలములలో నాటు ఆచారముగలదు. తొలకరిలో నాటు తోటలలో నితరపైరులను కల్పి పెట్టకుండుటయే మంచిది.

నేలను సిద్ధముచేయుట

తొలకరిలో కంపెని అరటితోటలను వేయునేలను వెనుకటిపైరు కోయగనే బెల్లు విరువవచ్చును. లేక లోతుగను మెత్తగను పెక్కుసార్లు దున్నవచ్చును. పిల్కలు నాటుటకుముందు, దున్నిన నేలకు పశువులమందగాని మేకగొర్రె మందలుగాని కట్టవచ్చును. బెల్లు విరచిన నేలలలో సామాన్యముగ మందగట్ట వీలుండదు. కాని వేసవిలో పెద్దవర్షమేదేని కురిసి బెడ్డలు విడిపోవునెడల నేల నొకటి రెండుసారులు దున్ని మందకట్టుట మంచిది.

మొక్కలు నాటుటకు కొన్నిదినములు ముందుగనే గోతులు త్రవ్వి వానిని ఆరనీయవలెను. నేల లోతుగ సాగుచేయబడియుండు నెడల గోతులు పిల్కలదుంపలు పట్టుటకు తగినంతమాత్రమే యున్నయెడల చాలును. సామాన్యముగ జేనెడు వెడల్పును అంతే లోతును ఉండవలెను మొక్కలునాటుటకు పూర్వము గోతులలో నేమియు యెరువు వేయకుండుటయే మంచిది.

చక్కెరకేళీ పిల్కలను ఎకరమునకు 1000 చొప్పున (అనగా 10 లింకులు=$6\frac{2}{3}$ అడుగుల దూరమున) నాటవలెను. బొంత పిల్కలను ఎకరమునకు 800చొప్పున (అనగా 11 లింకులు లేక $7\frac{1}{4}$ అడుగులదూరమున) నాటవలెను.

పిల్కలు - వానిని సిద్ధముచేయుట

పిల్కలలో 'సూద' లేక 'కన్య' పిల్కలనియు, 'అల్లి' లేక 'ఆకు' పిల్లలనియు రెండురకములు గాననగును. సూదపిల్క పుట్టినప్పటి నుండియు చురుకుగ నెదుగును. 1, $1\frac{1}{4}$ గజము ఎదుగువరకు సామాన్యపుటాకు లేర్పడక, పిల్కగనేరాకులవంటి సన్ననియాకులు గలిగియుండును. ఇందువలన నిట్టిపిల్కలకు గన్నెరుబోడులని కూడ పేరు. అల్లిపిల్క పుట్టినప్పటినుండియు వెడల్పయిన యాకులను వేసి మిగుల నెమ్మదిగ నెదుగును. 1, $1\frac{1}{4}$ గజమెదుగునప్పటికి సూదపిల్క 5, 6 ఆకుల

కంటె నెక్కువ వేయదు. అంతయె త్తైదుగు లోపల అల్లిపిల్క 20 ఆకులకు పైగా వేయును. అంతయెత్తైదుగుటకు 4, 5 నెలలు పట్టును, సూదపిల్క 2 నెలలలోపుగనే యింతయె త్తైదుగును. ఈరెండు రకముల పిల్కలను క్రిందిపటమున జూపబడెను.



అరటిపిల్కలు

ఎడమవైపున—సూదపిల్క. కుడివైపున—అల్లిపిల్క.

నాటుటకు సూదపిల్కలనే యెంచవలెను. అల్లిపిల్కనెపుడును నాటగూడదు. దీని దుంప మొదటినుండియు చిన్నదిగనే యుండును. ఇది పుట్టినప్పటినుండియు స్వాతంత్ర్యముగ నెదుగుటకు శక్తిలేక తల్లిదుంపనుండియే చాలవరకు సారమును తీసికొనుచుండును. సూదపిల్క అట్లుగాక, దుంప తల్లిదుంప కంటియున్నను, తనదుంపను వృద్ధిచేసికొని, వేళ్లువిస్తారముగ పోసి స్వాతంత్ర్యముగ నెదుగ నారంభించును. కావున విడదీసి నాటినపుడు పిల్క యెదిగినట్లు అల్లిపిల్క యెదుగదు.

1,2 నెలలవయసుగల పిల్కలు కంపెనీ తోటలలో నాటుటకు మంచిది. నాటదలచిన మొక్కలను దుంపలకు దెబ్బతగులకుండ త్రవ్వితీసి, వేళ్లన్నిటిని దుంపకు దగ్గరగ కోసివేయవలెను. తలలుకూడ దుంపకు $1\frac{1}{2}$ అడుగు ఎత్తున నరికివేయవలెను. వానిని నాటువరకు నీడనుంచవలెను. పెద్దపిల్కలు రెండుమూడు రోజులుంచినను అంతగా చెడవుగాని లేతపిల్కల వెంటనే పాతనియెడల చెడిపోవును.

నాటుట


తొలకరించినపిమ్మట అనగా (జ్యేష్ఠమాసములేక జూనునెలలో)ఏదేని వర్షముగురిసి నేలయూరినపుడు పైనిచెప్పినట్లు సిద్ధముచేసినపిల్కలను గోతులలో పెట్టి, అదివరలో గోతిలోనుండి తీసినమన్నుగాక దుక్కిమంటిని మొక్కచుట్టు పోసి బాగుగ దిగద్రొక్కి నీరుపోయవలెను. పిల్క త్రవ్వినపు డెంతలోతున నుండెనో నాటునపుడు దాని నంతేలోతున నాటవలెను. త్రవ్వకపూర్వము నేలలో నుండుభాగము ఆకుపచ్చగనుండక తెల్లబారియుండుటచే నీవిషయమును నిర్ధారణచేయుట మిగులసులభము. కొందరు పిల్కలను నాటుటకుముందే గోతులలో నీరుపోసి మంటిని త్రొసి కలిపి పిల్కను అందులోపెట్టి పైని మరికొంతమన్ను వేసి బిగద్రొక్కుదురు. ఈపద్ధతిలో పిల్కలు త్వరలో వేరుపట్టునందురు. కాని యిది పనియెక్కువగ పుచ్చుకొనును. పిల్కలను సాయంకాలము నను మబ్బుగనున్నదినమునను నాటుట మంచిది.

### తరువాతిపని

మొక్కలు నాటినపుడు బాగుగ నీరు పోసినయెడల మరల మూడవనాటివరకు నీరు పోయ నవసరములేదు. రెండవరోజు సాయంకాలమునకు మొక్కచుట్టును ఆరినయెడల మరల నొకసారి గట్టిగా బిగద్రొక్కవలెను. మూడవనాటిసాయంత్రము మరల నీరుపోసి అటుపిమ్మట వర్షములేనియెడల ఎండతీవ్రతను బట్టి ప్రతిదినమును గాని, రోజు విడచి రోజు గాని సాయంకాలమున నీరుపోయవలెను. ఇప్పటికి వర్షము లందుకొననియెడల, మొక్కల వరుసలమీదుగా బోదులు తీసి మొక్కల చుట్టును నీరు పెట్టవలెను. మొక్కలు 23 ఆకులు వేయగనే (అనగానాటినతరువాత సుమారు 1 నెలకు) మొక్కకు ½ పౌనుచొప్పున, ఆముదపుపిండిగాని, వేరుసెనగపిండిగాని మొక్కల చుట్టును, అడుగుదూరమువరకు వేసి గొప్పుత్రవ్వవలెను. ఇపుడే తోటఅంతటను కూడ గొప్పుత్రవ్వి కల్పుతీయవలెను. లేక మొక్కల మధ్య జాగ్రత్తగ రెండుసార్లు దున్నవలెను. పిమ్మట మరియొక నెలకు మరల నొకసారి గొప్పుత్రవ్వి కల్పుతీయవలెను. మరియొకమాసమయిన పిమ్మట నేలయొక్క సత్తువనుబట్టి మొక్కకు 1, 2 పౌనుల చొప్పున పిండిని మరల వేయవలెను. ఈసారి పిండిని తోటయందంతటను చల్లి గొప్పు త్రవ్వవలెను ఏవేని చెట్లు పిల్కలను పెట్టినయెడల వాని నిపుడే తీసివేయవలెను. ఇప్పటికి వర్షములు కూడ అధికమయి నేల ఊటయెక్క నారంభించును. కావున ప్రతి రెండువరుసలమధ్యను జెనెడులోతును 1 అడుగు వెడల్పును గల కాల్వను దీసి అందుండి తీసినమంటిని మధ్యనుండు పెడలపై పరచవలెను. నేల ఇంతకు ముందే ఊటయెక్కనెడల, ఎప్పుడు ఊట యెక్కునని తోచిన నపుడే ఎరువు వేసి కాల్వలు త్రవ్వుట మంచిది. వర్షకాలాంతమున వర్షముచే పూడిన కాల్వలను మరల లోతుచేసి ఆమంటిని పెడలమీద వేయవలెను. వెనుకబడియున్న మొక్కలేవైన నున్నయెడల రెండవసారి కాల్వలు త్రవ్వుటకు ముందు వీనికి ప్రత్యేకముగ కొంత యెరువు వేయుట మంచిది. పిల్కలనుగూడ మరల పొడిచివేయవలెను పిమ్మట అప్పుడప్పుడు పిల్కలను పొడిచి వేయుటయు కాల్వలలో అవసరమయినపుడు నీరుపెట్టుటయు, పెడలునానగనే తీసివేయుటయు తప్ప చేయవలసినపని అంతగాలేదు. చెట్లనీడచే నేల అంతయు కమ్మబడుటచే గడ్డి గాదము లంతగా బయలుదేరవు. బయలుదేరినయెడల నొకటిరెండుసార్లు గొప్పుత్రవ్వి కలుపుతీయవలెను. ఇట్లు శ్రద్ధగా పనిచేయుచునచ్చిన యెడల చక్కెరకేళీ, బొంతచెట్లు డిసెంబరు నెలాఖరున గెలలు వేయ నారంభించి, ఫిబ్రవరి నెలాఖరులోగా గెలలు వేయుట పూర్తియగును. గెలలు బాగుగ ముదురకమునుపే ప్రతిగెలకును ఒక పెద్దవెదురును దానికెదురుగా పటవాలుగా నాటి కట్టవలెను. లేనియెడల గెలబరువుచేగాని, గాలివలన గాని చెట్లు విరిగిపోవును. సామాన్యముగ రెండేసి వెదుళ్లను కత్తెరకాళ్లుగా కట్టి గెలలకు బోట్లు

పెట్టుదురు; కాని గాలి విసరునపు డివిపని చేయవు. ఒక్కొక్క మంచివెదురును పైని చెప్పినట్లు నాటి కట్టుటయే మంచిది. ఫాల్గున మాసము (మార్చినెల)లో గెలలు సిద్ధము కా నారంభించును. చైత్రమాసము (ఏప్రిల్ నెల) లో గెలలు చాలవరకు తెగిపోవును. ఇంకను ముదరని గెలలు ఎండదెబ్బచే చెడిపోవుట కవకాశము గలదు. కావున గెలలు చైత్రమాసాంతములోపలనే తెగిపోవునట్లు తోటను మొదటినుండియుమిగుల శ్రద్ధతో పెంచవలెను.

ఊటమొక్కని గరువనేలలలో రెండవ సారి యెరువువేసిన పిమ్మట కాల్వలు త్రవ్వుటకుబదులు మళ్లుకట్టి నీరుపెట్టవచ్చును. ప్రతి వరుస మీదుగను నిలువుగ చిన్నచిన్న గట్లు వేసి 3, 4, వరుసల కొకవరుసమీదుగా అడ్డగట్లు వేసినయెడల నీరుకట్టుట కనుకూలమగు మళ్లేర్పడును. నీరుకట్టుటకు వీలగునట్లు బోదుల నేర్పరచవలెను. మళ్లబోదులు ఏర్పరచు విధాన మీక్రింది పటమున జూపబడెను.




ఆముదపుపిండిగాని, వేరుసెనగపిండిగాని వేసినయెడల చెట్లు శీఘ్రముగ నెదిగి త్వరలో గెలలు వేయును. కాని కాయలరుచి తగ్గునని చాలమంది యభిప్రాయము. విస్తారముగ నేయెరువువేసినను కొంతవరకు రుచితగ్గుట స్వాభావికమే; కాని కొలకరిలో నాటినతోటలలో పండ్లు వేసవి వచ్చుటచే కాబోలు నకాలమున పండిన పండ్లలో రుచి అంతగా తగ్గుట లేదు. శీతకట్టున నాటినతోటలు వర్షకాలమునగాని శీతకాలమునగాని పండుటచే ఇంతకంటె రుచి తక్కువగ నుండవచ్చును.

ఆముదపుపిండితోగాని వేరుసెనగపిండితోగాని, పశువులయెరువుతోగాని పాటిమంటి నికూడవేసినయెడల గెలలు పెద్దవిగవేయును. చెట్టు 1 కి 30 40 పౌనులు చాలును. కొన్ని చోట్ల పందిపెంట మానవపురీషముకూడ వేయుచున్నారు; కాని ఇట్లు పెంచిన పండ్లు మరింత రుచి హీనముగ నుండును.

పిల్కలు పొడిచివేయుటకు వెడల్పయిన ఆకుగల బరువైన గడ్డపార అనుకూలముగ నుండును. దీనిని చెట్టునకును పిల్కకును మధ్య నిలువుగ దింపి పిల్కలు తీసివేయవలెను. పిల్కలు తీసివేయునపుడు తల్లిచెట్టు, కదలిపో

కుండగను వేళ్లంతగా తెగకుండగను జాగ్రత్త పుచ్చుకొనవలెను.

శీతకాలమున తోటలు నాటువారు కొందరు వెనుకటివరిపంట కోసి నెల ఆరగనే (నవంబరు డిసెంబరు నెలలలో) నేలను దున్నకయే గోతులు తీసి పిల్కలను నాటుదురు. మొక్కలకు నీరుపోసి బ్రతికింతురు. చెట్లు కొంతవరకు ఎదిగి నేలబెల్లు విరచుటకు సిద్ధముకాగానే తోటఅంతయు బెల్లు విరువబడును. బెడ్డలు బాగుగ ఆరినవెనుక నెకతడి పెట్టబడును నేల మరల ఆరినవెనుక రెండుసార్లు దున్నబడును. పిమ్మట సుమారు నెలకొకతడిచొప్పున పెట్టబడును. తొలకరిలో మెరువువేసి యిదివరలో చెప్పినట్లే కాల్వలు త్రవ్వబడును. చాలమంది మెరువును చెరకుతోటకువలెనే మొక్కలసమీపమున గోయితీసి అందువేసి కప్పుదురు. కాని మడిఅంతటను చల్లుటయే శ్రేష్ఠము.

కొందరు వరిచేను కోసికొని నేలను దున్ని సిద్ధముచేసి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో నాటుదురు.

రెండవసంవత్సరముకూడ తోట నుంచదలచినవారు మొదటిసంవత్సరపు గెలలు నరికినపిమ్మట తొలకరిలో మరల ఎరువువేసి పిల్కలు ప్రాతదుంపలు తీసివేసి కాల్వలను బాగుచేసి ఆమంటితో ఎరువును కప్పుదురు.

తొలకరిలో వేసి బాగుగ పెంచినయెడల చక్కెరకేళీ తోటవలన నెకరమునకు సామాన్యముగ వేయిరూపాయిలకుపైగా రావచ్చును. నాటిన 1000 చెట్లలోను 900 లయిన గెలలు వేసి సకాలమున నాగెలలు ముదురు ననుకొన వచ్చును. గెల 1-కి రు 1-4-0 చొ॥ 1125 రూపాయలగును. ఇట్లే బొంత ఎకరమునకు 800 వేసిన యెడల 750 గెలల వచ్చును. గెల 1-కి 12 అణాలచొప్పున 750 రూపాయలు వచ్చును. బొంత బత్తీసా పెద్దగెలలువేయుటచే గెల 1-కి రు 1-2-0 చొ॥ 850 రూపాయలు వచ్చును.

వ్యయము సామాన్యముగ నెకరమునకు 300-350 రూపాయలు అగును.

# సింధుసంకీర్తనము

సాహిత్యసరస్వతి సిరిపి ఆంజనేయులుగారు

దివ్యబలమున వెలయు హ్రాదినులలోన
నీదుశక్తి యమేయమై నెగడు కతన
నమితమౌ నీదు మహిమాంచితమును గూర్చి
గాన మొనరించు సుకవి స్వర్గమున, సింధు!

పందెమును నీవు గెలువ సమందరయము
తోడఁ బరువిడు సమయానఁ ద్రోవసూపి
తోడుపడుఁ గాల్వఁ దీసి తోడ్తోడ నీకు
వరుణదేవుండు భువన జీవనవిభుండు.

నాయకుఁడు ముందుఁ జనుచు సైన్యంబు నడుపు
విధమున సరిత్ప్రపంచంబు వెంటఁ గొనుచు
నురవడినిఁ బర్వ్వాఱుచు నుందు వెపుడు
తుహినతలముల శైలపఙ్క్తులను గడచి.

పటుతరంబగు శక్తిసంపద నెసంగఁ
బెనుతుపానున రాలెడు పిడుగు మాడ్కి
నద్రి శిఖరాగ్రములనుండి యవతరించి
యశని ఘోషించుగతి మహోగ్రారవమున
వీరహుంకార మీవు గావించి మించి
పరువిడుదు నమ్మ! యున్మత్తపశువు కరణి.

వత్స[illegible] పాలుద్రావంగవలచి, తల్లి
కడకు నుఱికెడురీతి శాఖలు తమంత
రభసమున నిన్నుఁ జేరు. సంగ్రామరంగ
మునకు సైన్యాళిఁ బిల్చెడు మనుజనాథు
పోల్కి, వాని నాదేశించి పొల్తు వీవు.

దేవిరో! నీవు దివ్యప్రభావ మెసఁగ
రాష్ట్రముల దాఁటి సుంత విశ్రాంతిఁ గనక
విమలజలముల మెఱుపుఁ దీవియవిధాన
నాణెమున మించి చిత్రవర్ణముల నీను
నాఁడు గుఱ్ఱంబు పోలె నీ వరుగుచుండ,
ఆ ప్రయాణవేగము నెవ్వ రాఁపువారు.

అమ్మ! యఖిలసంపదలు నీ కమరియుంట
స్వర్ణమయ భూషణాంబ రావళి ధరించి
సౌరభముఁ జిమ్ము కమ్మపూసరులఁ దాల్చి
జవ్వనము గుల్కఁ గరుణారసమ్ము చిల్కఁ
గనకరథముల ఘనతురంగముల నెక్కి
స్వారి వెడలుదు వమరులు సంస్తుతింప

కాంత! నీకృపామృతవర్ష కారణమున
నన్నవస్త్రంబుల కొకింత యలఁత లేమి
నీదుసంతతి భోగ భాగ్యాదు లంది,
విజయ కాంక్షాభిరతిఁ గల్గి వెలయుచుండు
నిన్నుఁ గొల్చెడు భక్తులకున్న కొఱఁత
నీరథము నీహయంబులు నీ ప్రగాఢ
శక్తి విజయంబె పొందించు సతత మట్టి
పూర్ణబలమున జయసిద్ధిఁ బొంద నిన్ను
నేము నర్థింతు మాశీర్వదింపు మమ్ము.

---

# భూతత్త్వశాస్త్రము

బ్రహ్మశ్రీ, ఆచార్య వస్సా పార్వతీశం గారు, ఎం. ఏ., బి. యస్. సి.
డిప్లమో యిన్ ఎడ్యుకేషన్ (ఎడింబరో)

భూతత్త్వశాస్త్రము (Geology) పాశ్చాత్య దేశములందు శాస్త్రములలో నొక పెద్దశాస్త్రముగాఁ బరిగణింపఁబడుచున్నది. దీనినిగూర్చి యనేక మహాగ్రంథములు వ్రాయఁబడి పెక్కురచే ధారాళముగాఁ జదువఁబడుచున్నది. కాని మన దేశమునం దయ్యది యత్యల్పసంఖ్యాకులచేతమాత్రమే కొంచెముగాఁ దెలియఁబడుచున్నది. ఇది మిక్కిలి శోచనీయము. కాఁబట్టి నా శక్తి కొలఁది సంక్షేపముగ నీశాస్త్రవిషయములు గొన్నిటి నిందుఁ బొందుపఱుప యత్నించుచున్నాఁడను. భూతత్త్వశాస్త్రమన భూమియొక్క నిర్మాణమును చరిత్రమును వస్తుతత్త్వమును దెలుపుశాస్త్రము. భూమియొక్క పూర్వావస్థను దెలిసికొనవలెననిన యెడల భూమియొక్క ప్రస్తుతచరిత్ర నూఁతగాఁ దీసికొనవలసియుండును. వర్తమానకాలమందు జరుగుమార్పులే భూతకాలమందు జరిగియుండనోపుననియు భవిష్యత్కాలమందుగూడ నట్టిమార్పులే జరుగగలవనియు నూహింపవలసియుండును. శాస్త్రజ్ఞులు వర్తమానమును భూతభవిష్యత్తుల కాధారభూతముగాఁ జేసికొని యీశాస్త్రమును రచించిరి.


## భూనిర్మాణము

ప్రస్తుతము భూమి, చంద్రుఁడు, బుధుఁడు, శని మున్నగుఁగల గ్రహములతోఁ గూడిన సూర్యుఁడును, నక్షత్రములు మున్నగుఁగలజ్యోతులును గలసి మొట్టమొదట నొకేమహాగోళముగా నుండెనని శాస్త్రజ్ఞులు నమ్ముచున్నారు. అట్టిమహాగోళము వాయుజ్యోత్యుష్ణమయమై యాకాశమునందు గిఱ్ఱగిఱ్ఱ యొకవైపునకు నాత్మప్రదక్షిణముఁ జేయుచుండెననియు, నట్టితటి నత్యుష్ణమగుమహావాయుజ్యోతిర్గోళమునుండి కొన్ని శకలములు విడివడి మాతృజ్యోతిర్భాగముతోఁ బాటు దాని సంచారము ననుసరించి యొకవైపునకు నొకేక్షేత్రమునఁ (Plane) దిరుగ మొదలుపెట్టెననియు నమ్ముచున్నారు. ఇమ్మహావాయుతేజఃపుంజమునుండి విడివడిన శకలములు మొట్టమొదట నావిరిరూపముగాఁ గాని మేఘరూపముగాఁ గాని యుండవచ్చును. దీనినే శాస్త్రజ్ఞులు "నెబ్యులా" (Nebula) యందురు. ఇట్టివి ప్రస్తుతముగూడ నక్షత్రప్రకాశమానమగు రాత్రులందుఁ బెక్కులు చూడనగు. ఇయ్యవి గడియారపుచుట్టలవలె (Watch Springs) నాకాశమునందుఁ గాన్పించును. వీనియందందు సాంద్రమైనపదార్థరాశి ప్రోగుగా నేర్పడియుండును. ఇవి రానురా నుష్ణతను గోల్పోయి గ్రహములుగా మాఱెననియు మధ్యనుండు మహాతేజాంశమే సూర్యుఁడుగా నేర్పడెననియు నూహించుచున్నారు. అట్లు కాదేని సూర్యుని చుట్టును దిరుగుగ్రహములన్నియు నొకేవైపునకు నొకేక్షేత్రమున సంచారము చేయుట పొసగక యుండియుండును. ఇట్టి సూర్యగ్రహనక్షత్రములకు గల యవినాభావసంబంధ మితరకారణములచేఁగూడ దృఢపడుచున్నది. ఆకాశమునందుండుగోళములు చాలవఱకు మనభూమిని పోలియుండుట మనము చూచుచున్నాము. కేవలము వర్తులత్వముననే కాక వస్తుతత్త్వమునందుఁగూడ మన భూమి నితరగ్రహములు పోలియున్నవి. "స్పెక్ట్రోస్కోపు" (Spectroscope) అను దృష్టియంత్రమువల్లను భూమిపైఁ బడునుల్కలవల్లను ... న గ్రహపదార్థములకును సూర్య... బంధమును గనిపెట్టిరి. వానిపదార్థములకు మిక్కిలి సన్నిహితసంబంధము కలవని నిర్ణయించిరి.

మఱికొందరు శాస్త్రజ్ఞులు లెక్కకుమిక్కిలియగు నుల్కలు కొని చెప్పుదురు. ఈయుల్కలు గ్రహసంబంధమైన పదార్థము గల్గి సంచరించు చిన్నశకలములై

యున్నవి. ఇవి భూమియొక్క వాయుప్రదేశమునందుఁ బ్రవేశించి భూమిచే నతివేగముగ నాకర్షింపఁబడి వచ్చుచున్నపుడు వాయుసంఘర్షణముచే మిక్కిలి తేజోవంతమై నక్షత్రపాతముగా మనకు గాన్పించును. వీటినే మనము రాత్రులందుఁ గ్రిందికిఁ బడు నక్షత్రములుగా భావించుచుందుము. ఇవి యత్యల్పపరిమాణము గలవి యైనచో భూప్రదేశమునకుఁ జేరకమునుపే వాయుసంఘర్షణచేనైన వేడివలనఁ గరగి ధూమమై మార్గమధ్యముననే నశించును. లేక యివిమిక్కిలిపెద్దవియైనచోఁ బూర్తిగా గరఁగియవ్యక్తముకాక పూర్వమే భూప్రదేశమునఁ బ్రవేశించుచుండుట మనముచూచుచున్నాము. ఇట్టియనంతసంఖ్యాకములైన యుల్కలాకాశమునందుఁ బ్రస్తుతము వజ్రపురస్వోలాజబోసినట్లు, రాత్రులందుఁ గాన్పించునల్పగ్రహావళితోఁ గలిసి గ్రహములుగా నేర్పడెనని కొంద ఱూహించుచున్నారు. అందందు భూమిపైఁ బడినయుల్కలయొక్క వస్తుస్వభావమును బరిశీలించి చూచి యుల్కలకును దక్కిన గ్రహములకును గల సన్నిహితసంబంధమును స్థిరపఱచిరి.

భూమి యుష్ణవాయుజ్యోతినుండి యేర్పడినట్లు చెప్పుకొంటిమి. ఈజ్యోతిరూపమైన వాయుపదార్థము రానురాను జల్లనై ఘనీభవించి ప్రస్తుతము మనము చూచుచున్న నీరు శిలలు గాలితోఁ గూడినభూమిగా నేర్పడెనని చెప్పుకొనక తీరదు. ప్రప్రథమమున వాయువునందుండు కొంతపదార్థము చల్లారి ఘనీభవించి భూమియందలి ఘనపదార్థముగను, మఱికొంతపదార్థము నీరుగను నింకను గొంతపదార్థము వాయువుగను నేర్పడినది. పదార్థములు సాధారణముగాఁ జల్లారి ఘనీభవించుతఱి కొంత తగ్గునను సిద్ధాంతము ననుసరించి భూమియొక్క పరిమాణము క్రమక్రమముగాఁ దగ్గుచుండెను. ఇందుకు దృష్టాంతముగా నొకవంకాయను నిప్పులోఁ గాల్చి చల్లారనిచ్చినయెడల నది రానురాను బరిమాణమునందు సంకుచితమై ముడతముడతలుగా నేర్పడుట మనము చూచుచున్నాము. అటులనే భూమికూడ జల్లారినకొలఁది పరిమాణముతగ్గి పైభాగమునందు ముడతలు గలదియై యుండును. ఈముడతలయొక్క యున్నతభాగములు పర్వతములుగను నిమ్నభాగములు లోయలుగను, సరస్సులుగను, సముద్రములుగను నేర్పడుచున్నవి. వాయుపదార్థమన్నిట మిక్కిలి తేలికయగుటచే భూమిపైఁ గొంతయెత్తువఱకు వ్యాపించి యుండెను ఇదిరమారమి నూరుమైళ్లవఱకుఁ గలదని చెప్పుచున్నారు. భూమి రానురాను జల్లారుచున్నదని శాస్త్రజ్ఞులు నమ్ముటచే భూమియొక్క యంతర్భాగమునకుఁ బోనుపోను వేడి యెక్కువ యగుచుండవలెనను యవసరము కలుగుచున్నది. దీనికిఁ దారకాణముగా నందందు శాస్త్రజ్ఞులు త్రవ్విచూచి భూమిలోపలి భాగము క్రమక్రమముగా నష్ణమునందు హెచ్చుచుండుటఁ గనుగొనిరి. అమెరికాయందును దక్షిణాఫ్రికాయందును మఱికొన్ని ప్రదేశములయందును భూమిలోనికి గొట్టములదింపి యుష్ణము యిరువదిమొదలు నూరడుగుల లోతునకొక్కడిగ్రీ వేడి హెచ్చుచుండునని శాస్త్రజ్ఞులు సిద్ధాంతము చేసియున్నారు. మఱియు భూగర్భమునుండి యొకొక్కచో వేడియైనధారలు వేగముతో భూమిపైకెగసివచ్చుటయుఁ దజలముతోఁ బాటు భూగర్భమునఁ గలపదార్థమును దీసికొనివచ్చి భూమిపై వెదజల్లుటయుఁ గలదు. వీనిని గెయిజర్సు అని వ్యవహరించుచున్నారు. ఇట్టివి ఐస్లండు (Iceland) నందును, యునైటెడ్ స్టేట్సు నందును న్యూజీలండు (Newzealan ) నందును గలవు. ఇట్టివేడియూటలు భూమియొక్క గర్భమునందు మిక్కిలి యెక్కువైనయుష్ణము గలవని స్థిరపఱచుచున్నవి మఱియు భూమినుండి పదార్థములుకరఁగి సలసల కాగుచుఁ బట్టరానివేడిగలిగి చీకట్లు గ్రమ్ము ధూమరాశితో భూప్రదేశమును బ్రద్దలుచేసికొని యగ్నిపర్వతములనూలమున వచ్చుటచ్చుట బయలువెడలుట మనము చూచుచున్నాము. ఇదికూడ భూమిలోనికిఁ బోనుపోను వేడి మిక్కిలి హెచ్చుననుట కొకముఖ్యమైననిదర్శనము.



భూమియొక్క ముడతలవలన నేర్పడు నిమ్నోన్నతములు


## భూగర్భపదార్థముయొక్క స్థితి

మనము భూమియొక్క లోనిభాగమునందు బదార్థమత్యుష్ణస్థితియందుఁ గలదని చెప్పుకొనునప్పుడుపాఠకు

లకుఁ దత్పదార్థము తేలికయగు వాయురూపముననో లేక ద్రవరూపముననో యుండియుండునని తోఁచక మానదు. కాని పదార్థములు మిక్కిలి యుష్ణతగలిగి యున్నను నవి విస్తరించి పల్చనై వాయుద్రవస్థితులఁ బొందుట కవకాశము చిక్కనిచో వాయువుగాఁ గాని ధ్రువముగాఁగాని మారక యుండుట తటస్థించును. శాస్త్రజ్ఞులు భూగర్భమునందు మిక్కిలి సాంద్రమైన యంతర్గమనము గల యొకవిజాతీయమైన పదార్థము కలదనినమ్ముచున్నారు. అట్టిపదార్థము భూమిపై నుండుపదార్థము కంటె మిక్కిలి బరువై యుండియుండునని కనిపెట్టఁబడినది. ఎట్లనగ నొక యిరువదిఘనపుటడుగులపరిమాణము గలగోళమును దూఁచినయెడల నూరుపౌనులయెత్తు కలదని యనుకొందము. అందుండి గోళముయొక్క పైభాగమునందెచటనైన నొకయయిదు ఘనపుటడుగుల పదార్థమును దీసితూచితిమేనియది పదిపౌనులబరువు మాత్రమే యున్నయెడల నాగోళముయొక్క యంతర్భాగము పైభాగముకంటె మిక్కిలి బరువై యుండవలెనని బుద్ధిమంతులకుఁ దోఁచక మానదు. ఏలననఁ బైభాగమునుండి గోళముయొక్క మొత్తములో నాల్గవవంతు (అనగా అయిదుఘనపుటడుగులు) పరిమాణముగల పదార్థమును దీసి తూఁచిన పుడు గోళముయొక్క మొత్తపుబరువులో నాల్గవవంతు (అనగా 25 పౌనులు) బరువుండుటకు బదులుగాఁ బదిపౌనులబరువుమాత్రమే యుండుటచే లోపల మిక్కిలి బరువైన పదార్థ ముండనోపునని యూహింపక తీరదు. అట్లనే శాస్త్రజ్ఞులు భూమిపైఁ గల పదార్థముయొక్క భారమును దీసి తూఁచి భూమియొక్క మొత్తపు భారముతోఁ బోల్చి భూమిలో నుండుపదార్థ మెక్కుడు బరువై యుండునని నిర్ణయించిరి. కనుక భూగర్భపదార్థము మిక్కిలి సమ్మర్దమును, భారమును, నుష్ణమును, నంతర్గమనమును గలయొకవిజాతీయమైనపదార్థమై యుండవచ్చును.

## భూమియొక్క మూఁడుభాగములు

శాస్త్రజ్ఞులు భూమిని మూఁడుభాగములుగా విభజించిరి. అవి యెవ్వియనిన (1) మిక్కిలిబరువును నుష్ణమును సాంద్రమును నైన భూగర్భలోహగోళము (2) గర్భలోహగోళముపై నావరించి మనకుఁ బ్రత్యక్షమై




వాతావరణము, శిలావరణము, భూగర్భలోహగోళము, ధృవములందు పల్లము

యుండుశిలావరణమును (3) శిలావరణము నావరించుకొనియుండువాతావరణమునై యున్నవి. భూమియొక్క చుట్టుకొలత సుమారు 25 వేలమైళ్లు కలదియై యున్నది. ఇది కొంచెమించుమించుగా గోళాకృతిని గలిగియున్నది. భూమియొక్క యొకవైపునుండి మఱియొకవైపునకు నొకదబ్బనమును గ్రుచ్చవలెనన్న నాదబ్బన మేడువేలతొమ్మిదివందలయిరువదియాఱు మైళ్లపొడవు గలిగియుండవలెను. ఇట్టి పరిమాణముగలభూగోళముపై నూరుమైళ్లవఱకు వాతావరణము వ్యాపించుచున్నది. పైకి వెళ్లినకొలఁది వాయువు క్రమక్రమముగా బల్చనగుచున్నది. పైనఁ జెప్పుకొన్న శిలావరణము మనమువసించు భూమియొక్కపై భాగమే. ఈశిలావరణము క్రిందికి నలుబది మైళ్లవఱకుఁ గలదని హద్దునేర్పరిచి శిలావరణమునందు భూప్రదేశమునఁ గానవగుజలమునుగూడ నిమిడ్చి రను న్నారు. భూమిలో నుండుతక్కినభాగము గర్భలోహగోళముగా వ్యవహరింపఁబడుచున్నది.


## భూ కంప ములు

భూమిలోనుండుపదార్థము క్రమక్రమముగాఁ జల్లారి బరిమాణమునందు సంకుచితమగునెడలఁ జాలవఱకుఁ

జల్లారి కొంతవఱకు స్థిరపడినశిలావరణము ముడతలు గలవగుటయుఁ గొన్నిచోట్ల నందుచే నైన నొత్తుడువలన బీటలు వారుటయు మఱికొన్ని చోటుల భూమిలోనికిఁ గ్రుంగుటయు మఱియొకచోఁ బైకుబుకుటయుఁ దటస్థింపక తీరదు. శిలావరణమునం దిట్టిసంచలనము కలుగునపు డెల్ల భూకంపములు కలుగుచున్నవి. భూకంపములు శిలావరణమునందు వ్యాపించుతరంగములై యున్నవని పాఠకులు గ్రహింతురు గాక. ఇందుకు దృష్టాంతముగాఁ బ్రశాంతమైన నీటిపై మన మొక్కరాతిని వైచినయెడల నచ్చటి జలము సంక్షుభితమై నలుగెలంకులఁ దరంగములఁ గ్రమక్రమముగా వ్యాపింపఁజేసి పరిసరప్రదేశముల సంఘర్షించుట యనుభవసిద్ధము. అటులనే భూమియొక్క యంతర్భాగమునందు గాని, బహిర్భాగమునందు గాని యెచ్చటనైన నొకచోఁ బైనఁజెప్పినకారణములచే మహాసంచలనము కలిగినపుడు భూపదార్థమునం దలలు బయలువెడలి యనేక వందల వేల మైళ్ళదూరమునందుండు ప్రదేశములను సహితము కంపింపఁజేయును. భూకంపముయొక్క వ్యాప్తియును నుద్రేకమును, దత్కారణములైన భూసంచలనములను బట్టి నిర్ణయింపబడుచున్నవి. కొలఁదికాలము క్రిందట జపానుదేశమునందు సంభవించిన మహాభూకంప మిట్టిభూసంచలనమువలనఁ గలిగినదే యని గ్రహింతురు గాక. జపానుదేశ మిట్టిభూసంచలనమున కనువగు ప్రదేశమునకు మిక్కిలి చేరియుండుటచే లెక్కకు మిక్కిలియైనభూకంపములకు గుఱియైయున్నది. జపానుదీవుల తీరమందుఁ గలసముద్రము మిక్కిలి లోతుగలిగి యుండుటచే శిలావరణముయొక్క మందము మిక్కిలి తగ్గియున్నది ఇట్టి పల్చని బలహీనమైన శిలావరణముగల ప్రదేశములు సంచలనమునకు నెంతయు లోనగుటకుఁ దగియున్నవి. ఇట్టి బలహీనమైన శిలావరణము క్రిందనుండు గర్భలోహగోళ మొకానొకప్పు డవకాశము చిక్కినచో నాయావరణమును బ్రద్దలుచేసికొని యగ్నిపర్వతములుగాఁ బైకి వెడలుటయుఁ దటస్థించుచున్నది. భూకంపములయొక్క చలనము తరంగములరీతి వ్యాపించునని చెప్పియుంటిమి. ఇందుకుఁ దార్ఖాణముగా భూకంపములు గలుగునపుడు గోపురములు వృక్షములు మిక్కిలి యెత్తైనగృహములు నిటునటు చలించుట సంభవించుచున్నది. మఱియు తరంగములవలె సంచలనముయొక్క జన్మస్థానమునుండి దూరమునకుఁ బోనుపోను భూకంపములయొక్క తాకుడు తగ్గుటయుఁ దటస్థించుచున్నది. మనదేశములో హిమవత్పర్వతప్రాంతదేశమునఁ జాల భూకంపములు గలుగుచున్నవి. వీనిని బరీక్షించుటకుఁ బ్రభుత్వమువారు "భూకంపదర్శిని" అను యంత్రము నొకదానిని సిమ్లాయం దేర్పఱిచి యుండిరి.

## అగ్నిపర్వతములు

భూగర్భలోహ గోళమునందున్న పదార్థము తన యుష్ణముచే మిక్కిలి వేగముగాఁ జరించు స్వభావము గలదై యెల్లప్పు డాందోళనతోఁ గూడి యుండును. ఇట్టిగర్భగోళము పైనుండుశిలావరణమునం దేదైనకొంత సంక్షోభము కలిగి బ్రద్దలగుటగాని లేక బలహీనమగుటగాని తటస్థించినచో గర్భగోళమునందుండి యావిరియు ద్రవపదార్థమును మిక్కిలి వేగముతోఁ బైకి వెడలును.




అగ్నిపర్వతము

ఇవియే యగ్నిపర్వతములని వ్యవహరింపఁబడుచున్నవి. అగ్నిపర్వతములు విజృంభించుటకుఁ బూర్వము కొన్ని సూచనలు కాన్పించును. భూమినుండి నలుదిశలు మాఱు మ్రోగునట్లు ధ్వనులు పిక్కటిల్లును. భూమికంపించు ఇట్టి ధ్వనులకును, భూకంపములకును శిలావరణమునందుఁగలుగుసంచలనమే కారణమై యుండవచ్చును. నీటిబుగ్గలందును బావులందును నీరు సారించును. సముద్రము పొంగును. అటు నగ్నిపర్వతరంధ్రమునుండి కరఁగినశిలలును, యావిరియుఁ గ్రమముగా హెచ్చి రానురాను నీరావిరిరూపముగా మిక్కిలి యెత్తైన స్తంభాకారము దాల్చి పెల్లెగసి పైన నలువైపుల వ్యాపించును. పై కెగసిన నీటియావిరి దట్టముగా నాకాశమునందు వందలకొలది మైళ్ళదూరమున మేఘు

రూపమున వ్యాపించి యచ్చటనుండు శీతలవాయువులచే వర్షరూపముగా ఘనీభవించి మిక్కిలి భయోత్పాతమైన యఖండవృష్టిగాఁ గురియ నారంభించును. నీటియావిరి పైకి విజృంభింపక పూర్వము మార్గమధ్యముననుండు శిలావరణముయొక్క పదార్థములను దుత్తునియలు చేసి వాతావరణములోనికి విసరివేయును. ఇట్టులఁ బైకెగసినపదార్థ శకలములు కొన్ని గుండ్రనివిగను, కొన్ని పెద్దశిలలవలెను, కొన్ని రవ్వలవలెను, దక్కినపదార్థము సన్ననిరజమువలెను నలుదిశల వెదజల్లఁబడును. మఱియు నీటియావిరి పైకుబికినపుడు తనతో వాయురూపము దాల్చిన పదార్థమును వాతావరణములోనికి వ్యాపింపఁజేయును. ఇట్టి వాయుపదార్థము వర్షముచే ఘనీభవించి రజోరూపమైన ఘనపదార్థముగా మాఱును. ఇట్టిరజమును బైకెగురవేయఁబడినశిలారజమును నీయఖండవృష్టితోఁ గలిసి భూమిపైఁ బడి పెద్దబురదప్రవాహమువలె నలుదిశల వ్యాపించి క్రిందనుండు భూప్రదేశ మెట్టుగాఁ గాలియుండుటచే వేడియైప్రవహించుచు మార్గమధ్యమున గల వృక్షములకును జీవరాసులకును వినాశమును గలుగఁజేయును. పిమ్మట నగ్నిపర్వతరంధ్రములనుండి కరఁగినశిలాపదార్థములు బైకెగసి నలువైపులఁ బొంగి ప్రవహించి తత్ప్రాంతపట్టణములఁ బల్లెలఁ గాల్చి వేయుచు వ్యాపించును. ఈవర్షపాత మగ్నిపర్వతరంధ్రములనుండి వెలువడునుష్ణద్రవపదార్థము లకంటెఁ గూడ నెక్కువయైనవిపత్కారణమై యున్నది. భూగర్భమునుండి పదార్థములు వెలువడునపు డందుండి కొన్ని వాయుపదార్థములును, నీటియావిరియు మిక్కిలి తీవ్రవేగముతోఁ బైకివిజృంభించి మార్గమునగలశిలావరణ పదార్థమును ఛేదించి శిథిలము చేసి ధూళిగా మార్చి యాకసముపై వేలకొలది మైళ్లవఱకు వెదజల్లును. అట్టి రజము క్రమక్రమముగా భూమిపైఁ బడి పరిసరప్రదేశములందుండు పట్టణములను బల్లెలను వనములను గప్పుటయే కాక పెక్కుగజములయెత్తుగ భూమిమీద వ్యాపించుచుండును. ఇటలీదేశముయొక్క తీరమునందు గల "వెసూవియస్" (Vesuvius) అనునగ్నిపర్వతము "పాంపే" (Pompey) "హెర్క్యులేనియం" (Herculanium) అనుగొప్పనగరములఁ దనయందుండి వెలువడినధూళిరాశిచేఁ గప్పియుండుట మనము చూచుచున్నాము. ఇటు లగ్నిపర్వతధూళిచేఁ గప్పఁబడియుండు భవనములు వృక్షములు దక్కినపదార్థము లనేకవందలసంవత్సరములు గతించినను దమయాకారమును గాని పరిమాణమును గాని కోల్పోక పూర్వమునందుండురీతినే నేటికిని గాన్పించుచున్నవి. ఇప్పటికిని 'పాంపే' నగరమునందుఁ బూర్వమునం దప్పట్టణవాసులగుజను లే యేపరికరముల నెందెందు కుపయోగించుకొనియుండిరో యవి యన్నియు నీధూళిచేఁ గప్పఁబడి సంరక్షింపఁబడి నేటికిని బూర్వచారిత్రమును మనకు దెల్పుచున్నవి. ప్రపంచయాత్రికులు (World travellers) ప్రపంచమం దుండు యద్భుతములఁ గాన నేగుచు, యిటలీయందు "నేపుల్సు" అను రేవుపట్టణమున దిగి యగ్నిపర్వతపదార్థరేణువులచేఁ గప్పబడిన నేఁడు మరలఁ ద్రవ్వఁబడి బహిరంగము చేయఁబడిన "పాంపే" నగరముయొక్క పూర్వపు పరిస్థితులను జూచి బూర్వపుచారిత్రమును దెలిసికొనఁ గుతూహలపడుచుందురు. ప్రస్తుతము ప్రాచీనవస్తుసంరక్షణ ప్రదర్శనార్థము పాలకులచే నేర్పఱుపఁబడు ప్రదర్శనశాలలువలెఁ బ్రకృతిగూడఁ దనయపూర్వవిచిత్రప్రదర్శనశాలల నిట్టిరీతిగ నేర్పఱిచి మానవనిర్మితచారిత్రమునకందరాని పూర్వపరిస్థితుల నేటివఱకు సంరక్షించి మనకుఁ బ్రసాదించుచున్నదో యనునట్లు బుద్ధిమంతులకుఁ దోఁచక మానదు.

## "క్రకటో" అగ్నిపర్వతము


అగ్నిపర్వతములయొక్క వ్యాప్తియు, శక్తియు నపారము. ఈశ్వరుఁడు సృష్టియందు రౌద్రావతారము దాల్చి భూమియందుఁ దాండవమాఁడుచున్నట్టు లగ్నిపర్వతములు భయోత్పాదకములై వినాశకరములై కాన్పించును. సుమిత్రా జావామధ్యమున "క్రకటో" యను చిన్న ద్వీపము 25 మైళ్లువెడల్పును 12 వేలయడుగుల యెత్తును గలిగినదై యున్నది. అట్టిది 1883 సంవత్సరమువఱకు నుండుట నావికులకందఱకుఁ దెలిసిన విషయమే. ఆసంవత్సరము మేనెలలో నాద్వీపముయొక్క యుపరిభాగమునుండి యావిరి బయలువెడల నారంభించుటయుఁ గ్రమక్రమముగా నగ్నిపర్వతముయొక్క చిహ్నములు కొన్ని కాన్పించుటయు ఆగస్టు 26, 27 తేదీలయందు పెట్లి యాద్వీప మించుమించుగా నంతయు నదృశ్యమై నామమాత్రావశిష్టమగుటయుఁ దటస్థించెను. అపుడు సముద్ర

తరంగము లుత్తుంగములై సమీపమునందుఁగల సుమిత్రా జావాదీవులఁ గల కొన్నిపల్లెలను, ముప్పదివేలమంది జనులను ముంచివైచెను. 27 వ తేదియందుఁ బైనఁగ్రమ్మిన ధూమముచే సూర్యుఁడు కాన్పించక దుర్దినమయ్యెను. పైకెగసిన ధూళిని వేయిమైళ్లదూరమున నున్న నావికులు నాఁటిదినమే చూచియుండిరి. అతిసూక్ష్మమైన శిలారజము ప్రపంచమునం దంతటను జాలకాలమువఱకు వ్యాపించి ప్రాతఃకాలములందును సాయం సమయము లందును సూర్యునికాంతికి వింతవింతరంగులఁ గలుగఁజేసెనని దానిని జూచినవా రిప్పటికినిఁ జెప్పుచున్నారు. మఱియు హిందూదేశమున భూమియొక్క బీటలద్వారమున భూగర్భమునుండి యగ్నిపర్వతరూపమున వెలువడినపదార్థము సుమారు నాలుగులక్షల చదురపుమైళ్లు వ్యాపించి 'దక్కను' పీఠభూమిగా నేర్పడినదని బుద్ధిమంతు లూహించుచున్నారు. భూగర్భమునుండి నీటియావిరి మున్నగుఁ గల పదార్థములు పై శిలావరణమును ఛేదించుకొని యగ్నిపర్వతద్వారము చుట్టును దమపదార్థములచే పెద్దకొండ నొకదానిని నిర్మించుచుండుట సాధారణముగా సంభవించుచున్నది. అందుచేతనే కాబోలు వీనినగ్నిపర్వతములని జనులు వ్యవహరించుచున్నారు.

భూగర్భమునుండి పైకి వెలువడినపదార్థములఁ గొన్ని ఖనిజములుండుటయు నవిజనుల యుపయోగార్థమో యనునట్లు చేతికందునట్టుల శిలావరణముపై వ్యాపించుటయుఁ దటస్థించుచున్నది. ఖనిజపదార్థ మగ్నిపర్వతపదార్థములనుండి వేరుపడి యొకప్రవాహశాఖగా ఘనీభవించుచున్నది. ఇట్టిఖనిజప్రవాహశాఖలే బంగారము, యినుము, రాగి మున్నగుఁ గలలోహములకు మాతృకలై యున్నవి. ఖనిజములు భూమియొక్క పదార్థరాశియం దణువులుగా నంతట వ్యాపించియుండినను నగ్నిపర్వతముయొక్క సహాయముచేతనే యాయాలోహలేశములన్నియుఁ గలిసికొని యేకప్రవాహమువలె వెలువడి యొకప్రదేశమున మానవులకు లభించుచున్నవి.

## ఆగ్నేయశిలలు

భూగర్భమునుండి వెలువడినపదార్థము ద్రవరూపమున భూమిపై బ్రవహించి శిలలుగా నేర్పడునని చెప్పుకొని యుంటిమి. ఇట్టిశిలలను "ఆగ్నేయ" శిలలని కొందఱు వ్యవహరించుచున్నారు. ఈశిలలు పొరపొరలుగా నేర్పడక మిక్కిలి కఠినమైనశిలారాశిగ ఘనీభవించును. ఇట్టిశిలలందుఁ గొన్నిఖనిజములు మిశ్రమై యుండును. భూగర్భపదార్థము శిలావరణముపై ద్రవరూపముగ బ్రవహించునెడ నందుండు ఖనిజములు చల్లారిస్ఫటికాకృతిని దాల్చుటకుఁ గొంతవఱకు మాత్రమే యవకాశముండుటచే నట్టి యాగ్నేయశిలలఖనిజములు గొంతవఱకు మాత్రమే స్ఫటికాకృతిని దాల్చుచున్నవి. ఒకానొకచో భూగర్భపదార్థము పైకి వెలువడుట కుద్గమించి కొంతదూరమువఱకు వచ్చి శిలావరణముయొక్క యుపరిభాగమును జేరలేక లోపలనే భూమియొక్క పొరలమధ్యమునఁ బ్రవహించును. ఇట్టిసందర్భమున భూగర్భపదార్థమునందలి ఖనిజములు చల్లారి స్ఫటికాకృతినిఁ బూర్ణముగ దాల్చుటకుఁ దగినంతయవకాశముండుటచే నట ఘనీభవించిన శిలలు సంపూర్ణస్ఫటికాకృతిగలఖనిజమిశ్రణములై యున్నవి. ఇట్టిశిలలం దుండుపదార్థము పూర్ణముగ స్ఫటికాకృతిని దాల్చుటయే కాక సంపూర్ణముగాఁ బెద్దస్ఫటికము లేర్పడుటకుఁ గారణమగుచున్నది. ఇంకను గొన్నిచోట్ల భూగర్భపదార్థ మగ్నిపర్వతద్వారముల మునశిలావరణముపై కుద్గమించఁ గలిగినను సముద్రములోనికిఁ బ్రవహించుటచేఁ



ఖటికకర్బనపుశిలలు


గ్రమక్రమముగాఁ జల్లారి శిలాఖనిజములు స్ఫటికాకృతిని దాల్చుట కవకాశములేక కేవల స్ఫటికాకృతివిహీనమైన యద్దముకంటి పదార్థరాశిగా నేర్పడుచున్నది. పైనచెప్పినచొప్పున నాగ్నేయశిలలు కొన్ని పూర్ణముగ స్ఫటికాకృతిని దాల్చిన ఖనిజమిశ్రణములుగను గొన్ని కొంతవఱకు స్ఫటికాకృతిని దాల్చినఖనిజమిశ్రణములు

గను దక్కినవి కేవల స్ఫటికాకృతిహీనమైనఖనిజమిశ్రణములుగను నున్నవి.

అగ్నిపర్వతము లాయాప్రదేశములందుఁ గొంతకాలము విజృంభించుటయుఁ బిమ్మటఁ గొంతకాలము ప్రశాంతములగుటయుఁ దటస్థించుచుండును. ప్రస్తుతము జరుగుచున్న యుద్ధములు కొంతకాలము తీవ్రముగఁ బ్రబలి యిరుపార్శ్వములవారు బలమునందు క్షీణించి యశక్తులై కొంతకాలమువఱకు శాంతముగా నుండి మరల యొకించుక శక్తి నలవరచుకొని యుద్ధరంగమునకు దుముకువిధముఁ బ్రస్తుతము ప్రశాంతములైన యగ్నిపర్వతములు గూడ మరల యాయాస్థలములందు సమయము చిక్కినపుడు వెలువడునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. దుష్టులశాంతముకూడ భయావహముగదా! 'వెసూవియస్' యను అగ్నిపర్వతము ప్రస్తుత ముద్రేకము నడఁచిపెట్టి జనులకు హానికరముగాక కొంచెము కొంచెముగా నను దినమును ననుక్షణమును ధూమమును నగ్నిశకలములను ధూళిని బైకుమియుచుండుట యీలేఖరి యొకించుక దూరమునుండి చూచినవిషయమే. దీనిని జూచువారలకు వినోదమును భయమును గలుగక మానదు. కాని యగ్నిపర్వతము లనఁ బేరఁబరగుచున్నను వాటిద్వారమునుండి యత్యుష్ణమైనబురదయు, ధూమమును, నీటియావిరియు మాత్రము బయటకు వెలువడుచున్నవి. అట్టివి కొన్ని జపానుదేశమునందుఁ గలవు. మఱికొన్ని యగ్నిపర్వతములు తమయందుండుపదార్థము నొకటి రెండు బిలముల వలన బయటకు గ్రక్కక పెక్కువందలమైళ్లు నిడివిగల పంక్తులయందుండెడి చిన్నచిన్నరంధ్రములవలన బైకి ద్రోయుచున్నవి. ఇట్టివి ప్రస్తుతము ఐస్‌లండునందుఁ గాననగును.

## పర్వతములు

కొన్నిపర్వతములు పైనఁజెప్పినచొప్పున నగ్నిపర్వతములయొక్క పదార్థరాశి యగ్నిపర్వతరంధ్రముల చుట్టును గుప్పకుప్పలుగా నేర్పడుటచేఁ గలుగుచున్నవి.




అగ్నిపర్వతమువలన గలిగిన కొండ

మఱికొన్నిపర్వతములు నిదివఱలో సూచించినరీతి శిలావరణముయొక్క ముడతలచేనైన లేక పైకుబికి మిక్కిలి యున్నతమైనప్రదేశములచేనైనఁ గలుగుచున్నవి. ఇంకను గొన్నిపర్వతములు చదునైనప్రదేశముల ప్రాంతభాగము లిదివఱలో సూచింపబడినకారణములలో నేదేని యొక దానిచేఁ గ్రుంగినయెడల మిగిలినప్రదేశమెత్తై పర్వతముగా నేర్పడుచున్నది. ఇటఁ బార్శ్వమునందున్నప్రదేశము భూమిలోనికిఁ దిగబడుటచేఁ దక్కినభూప్రదేశము మిక్కిలి యెత్తై పర్వతముగా వ్యవహరింపబడుచున్నది. పార్శ్వస్థప్రదేశములయొక్క నిమ్నోన్నతములతారతమ్యమే పర్వతనిర్మాణమున కెడమిచ్చుచున్నది. నదీసముద్రజలనిరంతరసంఘట్టనలచేఁ బ్రాంతప్రదేశపదార్థముల గరఁగించి ద్రవరూపముగా నన్యప్రదేశములకుఁ గొనిపోయినచో మిగిలినప్రదేశమెత్తై యొక్కొకచోఁ బర్వతముగాఁ బరిణమించుచున్నది. నిమ్నోన్నతములు పరస్పరసంబంధముచేఁ గలుగుచున్నవి. శిలావరణమునందుఁ బర్వతములుగా వ్యవహరింపఁబడుచున్నప్రదేశములనిర్మాణమునుగూర్చి యొకించుక విమర్శించితిమి కాన నిమ్నప్రదేశములఁగూర్చి వేఱ నుడువ నవసరము లేదు. ఇట్టి నిమ్నప్రదేశములు సముద్రములుగను సరస్సులుగను లోయలుగను నేర్పడుచున్నవి.



# శ్రీ కృష్ణ భారతము

చ. అమృతము పుట్టినట్టి సమయంబున వేలుపు లెల్ల వంచనా
క్రమమున సోఁకుమూఁకలను గన్ను మొఱంగి హరించి వారి కీ
కమృతముఁ దారె మెక్కుటకు నాయిత మౌట గ్రహించి సోఁకు లా
సమయమునందు దేవతల సఖ్యము వీడి పరాక్రమంబునన్. 3౬

వ. పైఁబడి ముష్టాముష్టిం గచాకచిం బెనంగి పోరి యమృతకలశం బొడిసికొని రట్టి సమయంబునఁ బుండరీకాక్షుండు రాక్షసుల కమృత మిడుట పాములకుం బాలుపోయుట యని నిశ్చయించి. 3౭

మ. తళుకుంబంగరుడాలు డీ ల్పడుగతిం దైవారు నెమ్మేనును
న్నెల నా ముద్దులు మూటగట్టి మిగుల న్వాల్గొందు నెమ్మోము ను
న్గలుకుంగుబ్బలు వాలుఁగన్నులును విన్నుం బోలు లేఁగౌనునుం
గలనారీమణి యై రమాధవుఁ డటన్ గన్పట్టె నప్పట్టునన్. 3౮

తే. ఇట్లు మోహిని యై విష్ణు వెసఁగి నల్ల, ద్రావుడుల నెల్ల వంచింపఁ దలఁచివ
కెలనఁ బ్రత్యక్షమగుటయుఁ గరలివారు, మోహపరవశులై యుండి రూహ చెడఁగ. 3౯

వ. ఇట్లు మేను మఱచి తన్నుం జూచుచున్న దానవుల చెంత కా దైత్యాంతకుండు తక్కుచుం దారుచుం జని మీలో మీ రిట్లేల వాదు పెట్టుకొని యెదరు నేను మీయిరు దెఱంగులవారికి నమృతంబు పంచి యిచ్చెదం దెం డని తత్కలశంబు పుచ్చుకొని సురాసురుల వేఱువేఱ రెండుపంక్తులుగఁ గూరుచుండం బెట్టి సుధారసం బసురులకుం బోయక సురలకుం బోయుచుండె నపుడు నరుండు విల్లు గొని దైత్యదానవులం దఱిమి రానీక నిలువరించె నాలో రాహు వక్కలకం బెఱింగి దేవరూపంబున వారిబంతికి వచ్చి యమృతం బాస్వాదింపఁ బోవుటం దెలిసి పుష్పవంతు లెఱుంగం దెలుపుటయు నతిరభసంబునఁ జక్రి చక్రాయుధంబున వానిశిరంబుఁ దెగనఱకె నంతఁ గబంధంబు నేలఁగూలి విలవిలఁ దన్నుకొనుచు సారణ్యాపర్వతం బగు భూతలంబెల్లఁ జలింపం జేసె నమృతస్పర్శంబునం జేసి తెగియును శిరం బజరంబై గగనంబున కెగసి భయంకరధ్వానంబుఁ గావించె నది మొదలు రాహుముఖమునకు సూర్యాచంద్రమసులతోడి వైరంబు శాశ్వతం బయ్యె. ౪౦

అమృతప్రదానము




చిత్రకారుడు: శ్రీయుత, ఎ. రామమోహన రాయిగారు

వెనుకవైపు చూడుడు

# ఆ తి థ్య ము

ఓలేటి వేంకట రామశాస్త్రిగారు

అమ్మా! యెవ్వరిదాన వీవు? భవదీయాకార సౌభాగ్యభా
గ్యమ్ముల్ సూచినఁ గన్నుదోయికి మహాహ్లాదమ్ము సేకూరె, రా
వమ్మా! రమ్ము! పదద్వయీకలితదివ్యన్మంజుమంజీరశ
బ్దమ్ముల్ "ఘల్లురు ఘల్లు" రంచు శ్రవణద్వంద్వంబు రంజింపఁగన్. ౧

గీ. వయసునం బెద్దముత్తైదువ వయినట్లు, కానిపించుచు నున్నావు కన్నతల్లి!
కడుపు నిండెను నీమోముఁ గన్నయంత, రాఁగదే! యెక్కమా యిటు రాఁగదమ్మ! ౨

సీ. పసిమి బంగారంపుఁ బరువమ్ముగల మేని, పైఁ జిన్నిముడుతలు పడిన నేమి?
విరిసి వెన్నున వ్రేలు పింజామరముఁబోలు, నెఱివెండ్రుకలు కొంత నెఱియ నేమి?
యుండి యుండనియట్లు లోతుపుఁ జూపెడు పేద, నడు మొకించుక వంపు వడిన నేమి?
తమ్మిపూఱేకులఁ దలపించు కనుదోయి,పయి ఱెప్ప లొక్కింత వ్రాల నేమి?
గీ. సహజసౌందర్య లక్ష్మీప్రసాదమధుర, మైన నీరూపవిభవంబు నరసినపుడు
మనసు వికసించి యానందమగ్న మయ్యె, నిండెఁ గోర్కులు, కన్నులపండు వయ్యె.

క. నవనవలాడెడు నీదగు, నవయువ సౌష్ఠవముఁ గాంచినపు డో ముత్తై
దువరాల! జవ్వనియువతెఁ, గవులకుఁ గాన్పింతు వృద్ధకామిని వయ్యున్. ౪

గీ. అమ్మరో! నిన్నుఁ గనుఁగొన్నయంతలోన, హృదయమునుండి యేదియో యెఱుఁగరాని
యొక్క-నవరసవద్భావ ముద్భవించి, పరవశు నొనర్చి నను నేనె మఱవఁ జేసె. ౫

చ. కలకల నవ్వుచున్న తెలిగన్నులు, కన్నులనుండి యిట్టుల
ట్టులుఁ దొలకాడు శీతలపటు ప్రసరామలకాంతిపూరల
త్మ్ములు, మది కింపు నింప నినుఁజూడఁగ ముచ్చటయయ్యెఁ దల్లిరో!
వలగొని మ్రొక్కువాఁడ; నిటువచ్చి మదీయ సపర్య లొందుమీ. ౬

గీ. తెల్లదామరలందలి తేట యేమొ, నిండు చందురునందలి నిగ్గు లేమొ,
మల్లెపూవులయందలి మవ్వ మేమొ, నీదు కనుగొనలందుండి నిండి జాఱు. ౭

చ. బడలితివమ్మ! నెమ్మొగముపైఁ బెనుజెమ్మట గ్రమ్మి జాఱ, నూ
ర్పడరఁగఁ, జెక్కుటద్దములపై నరుణద్యుతు లుల్లసిల్ల, లే

నదు మసియాడ, నేఁ బిలిచినన్ వినఁబోవక యట్టు లట్టులే
వడివడి నేగుచుంటి తగవా? దయసేయుము విశ్రమింపఁగన్! ౮

గీ. చలువపన్నీరు చిలికి స్వచ్ఛముగ నలికి, పూవుపుప్పొళ్లతో ముగ్గు పొందుపఱచి
పండుటాకుల నొత్తుగాఁబఱచి యిచట, విడిదె లోనఁగెద రావమ్మ! విశ్రమింప. ౯

క. పరమ పవిత్రంబగు నీ, చరణద్వంద్వంబు నొక్కసారి యిచటకున్
బరపి యనుగ్రహమున మముఁ, దరియింపఁగఁ జేయఁగూడదా మాతల్లీ! ౧౦

సీ. కొమ్మకొమ్మను వ్రేలుకుసుమిత నవలతా, డోలికలందు నుయ్యాలఁబూఁచి
పూవుపూవునఁ బొంగిపొరలెడు మకరంద, ధార లాకంఠంబుఁ ద్రావఁబెట్టి
చెట్టుచెట్టునఁ బండి చేతికందెడు మంచి, పండులతో బొజ్జ నిండఁజేసి
తీవతీవను విచ్చి తావుల వెదఁజల్లు, పూవుగుత్తులతోడఁ బూజఁజేసి

గీ. గున్నమావుల లేఁత చిగుళ్లతోడఁ, గలువపూవులు తామరల్ గలిపికూర్చి
తోరణంబులు గట్టినతోఁటలోన, విందుఁ గుడిపెద నీకు; నీ విందు రమ్మ. ౧౧

చ. తెలియక యేమొ! నీ వకట! తెర్వులు దప్పి చరించుచుంటి; వా
వల నదె యొక్క కాఱడవి వచ్చుచునున్నది, యందు నెన్నొ చి
క్కులు గలవమ్మ; నీ వచటి ఘోరమృగమ్ములఁజూచి యెంత బె
గ్గిలెదవొ తల్లి! నామనవికిం జెవియొగ్గి యనుగ్రహింపవే. ౧౨

చ. ఒకయెడ సింహగర్జితము, లొక్కయెడన్ గజఘీంకృతుల్, మఱిం
కొకయెడ వ్యాఘ్రఘాంకృతు, లిఁకొక్కెడ సూకరభీకరధ్వనుల్
వికటములై శ్రవఃపుటవిభేదనముం బొనరింప భీతిఁజెం
దక యెటు లుందు వాయడవిఁ? దల్లిరో! యుల్లమునం దలంపవే. ౧౩

గీ. లీల నీహస్తమందుఁ దాల్చినగులాబి, పూవురేకు లవే వాడిపోవుచుండె
శ్రవణయుగళి శిరీషపుష్పములు కమలె, నెంత వడదాఁకెనో నీకు నిపుడు కనుము. ౧౪

గీ. ఎఱుఁగవే కష్టసుఖము లెన్నెన్ని గుడిచి, వయసుఁ గడపినయట్టి పావనచరిత్ర?
ముక్కుపచ్చ లేనాఁటినిముద్దుబిడ్డ, పోల్కి వినిపించుకొనక కట్టె పోవుచుంటి! ౧౫

గీ. కఱకుఱాలు ముండ్లకంచెలుఁ బదముల, గాడ, నీరసంబు గదురఁ, దప్పు
త్రోవ నడుగుదోయి తొట్రిల, నెచ్చోటి, కరుగుచుంటి వమ్మ! యాఁగు మమ్మ! ౧౬

గీ. వినుము చెవులార నిదె యొక్క వీణపాట, తినుము చవులూర నిదె యొక్క తీయపండు
కనుము కనులార నిచటి చక్కదనమ్ము, చనుము తరువాత నీకు నిష్టమగు కడకు. ౧౭

మ. అవిగోఁ బూచినతీవపందిరులు నేత్రానందముం జేయు, న
ల్లవిగోఁ బక్షులమంగళధ్వనులు శ్రోత్రానందముం గూర్చు, న
య్యవిగోఁ బండినవృక్షసంతతులు నెయ్యంబొప్ప నాతిథ్య మీ
య విలోకించుచు నున్నవమ్మ! దయ సేయంగా వచ్చు నీ విఁకిటన్. ౧౮

చ. వలసినపండ్లుఁ దేనెలు నవారిగ నున్నవి క్రొత్తక్రొత్తపూ
వ్వులు వికసించి తావులను బ్రోవులు సేయుచు నున్న వెల్లెడన్,
గలకల నాదముల్ వెలయ గానము సేయుచునున్న వంశజం
బు; లిచటఁ దల్లి! నీకుఁ బరిపూర్ణము లన్నియు, వచ్చి చూడుమీ! ౧౯

శా. ఆలన్ మేపెడుగోపబాలికలు వృక్షాగ్రంబులం దెక్కి దా
దాలం గోకిలకాకలీసదృశగాత్ర స్వాదు రావంబుతో
లీలన్ బాడుపదంబు కర్ణపుటపాళిం దేనె లొల్కించు, నీ
వాలింపం గదవమ్మ! యొక్కపరి పర్ణాసీనవై యిచ్చటన్. ౨౦

సీ. తల్లిరో! నీకు మెత్తనిపండు లిష్టమో, దోరపం డిష్టమో యేరికొనుము
మాయమ్మరో! నీకు మకరంద మిష్టమో చెఱకుపా లిష్టమో, చెప్పఁగదవె
నాతల్లి! నీకు వీణాగాన మిష్టమో, పికగాన మిష్టమో వినుము వచ్చి
జననిరో! నీకు నీసంపెంగ లిష్టమో, సన్నని జాజు లిష్టంబొ చెపుమ

గీ. కొదవ లేకుండ నాశక్తికొలఁది నిట్లు, కొన్ని వస్తువు లిట సమకూర్చినాఁడ
నన్నుఁ జిన్నఁబుచ్చక యివిఁ గొన్ని నీవు, సేకరించి కృతార్థునిం జేయు మమ్మ! ౨౧

సీ. వసియింపు మమ్మ! యీ వలితెమ్మెరలలోన, బడలిక యొక్కింత పాయువఱకు
విహరింపు మమ్మ! యీవిరజాజపందిళ్ల, నాసన ప్రస్వేద మాఱువఱకుఁ
గూర్చుండు మమ్మ! యీగున్న మావులనీడ, నాయాస మొకకొంత యడఁగువఱకు
శయనింపు మమ్మ! యీజాజిపూసెజ్జపై, నడుగుఁ దామరల కం దుడుగువఱకు

గీ. ఆఁకలియు డప్పికయుఁ దీఱునంతవఱకుఁ, జవిఁ గొనఁ గదమ్మ! యీదోరజామిపండ్లు
పుచ్చుకొను మమ్మ! యీ చిన్ని పూవుఁ దేనె, తలఁపకుము తల్లి! యిది పరస్థల మటంచు

సీ. చూడు మిచ్చటి యాకుజొంపంబులను దల్లి! తిలకింపు మిచటి పూదీవపొదలు
పరికింపు మిచ్చోటి పల్లవంబులు తల్లి! దర్శింపు మిచ్చోటి తరుచయంబు
కనుఁగొను మిచ్చోటి కమలాకరముఁ దల్లి! వీక్షింపు మిచ్చటి విహగతతుల
నరయు మిచ్చోటి యీ యాకుటిండులు తల్లి! దృష్టించు మిచ్చోటి దీనజనము

గీ. కలయ నీక్షింపు మిచ్చోటికలమములను, దావకీన కృపారసార్ద్రంబు లైన
విమలమధుర కటాక్షముల్ వెదలఁజల్లి, పావనము సేయు మోతల్లి! యీవనంబు. ౨౩



# తేజోలేఖనము

వింజమూరి కృష్ణమాచార్యులు గారు

## మొదటి ప్రకరణము

### చరిత్ర

ఈ దినములలో తేజోలేఖనయంత్రసహాయమున దీయబడిన రూపపటము లతిస్వల్పమూల్యమునకు లభ్యమగుచున్నవి. ఎంతబీదవారైనను, తమయొక్కయు, బిడ్డలయొక్కయు, బంధుమిత్రాదులయొక్కయు చిత్తరువుల గలిగియుండుటకు కవకాశ మేర్పడినది. తేజోలేఖనయంత్రసహాయమున దీయబడినట్టి, ఫోటోగ్రాఫుపటములను జూచియుండనివా రిపు డీప్రపంచమున నుండియుండరనిన, నది అతిశయోక్తి కాజాలదు. కాని, 60 ఏండ్లక్రిందట మిక్కిలి ధనవంతులగువారు మాత్రము, తమగృహములందు చిత్తరువులను గలిగియుండెడివారు. ఇప్పుడు కొన్ని అణాలకు లభ్యమయ్యెడి రూపపటమున కాదినములలో, వందలకొలది రూప్యములు వెచ్చింపవలసియుండెడిది. ఇక దేశాభిమానులయొక్కయు, రమణీయదృశ్యములయొక్కయు, చిత్తరువుల గలిగియుండెడిభాగ్యమేకొలదిమందిధనవంతులకో కాని గలిగెడిదికాదు. రూపపటనిర్మాణ మాకాలమున చిత్రకారులచేతులయందుండెడిది.

1816 వ సంవత్సరమందు "నిసిఫోర్ నైప్సి" యను ఫ్రెంచిదేశీయుడు, సూర్యతేజస్సహాయమున, రూపపటములను లిఖింపపనినిగురించి, తన సోదరునకు వ్రాసినట్టి కొన్నియుత్తరములందు తెలుపబడియుండెను. దాటినిబట్టి, నైప్సి తేజోలేఖనయంత్రనిర్మాణమునకు, కృషిసలిపెనని తేలుచున్నది. ఆయుత్తరములందలి సంగతులు తప్ప, పిమ్మట 9 ఏండ్లవరకును, నైప్సియొక్క పరిశోధనల ఫలితము కానరాలేదు. 1825 వ సంవత్సరమునందా దేశముననే, 'డెగూరీ' యనువాడుకూడ తేజోలేఖనయంత్ర నిర్మాణమునకు శోధనలు గావించుటకు మొదలిడెను. నైప్సి, తనవలెనే డెగూరీ యీపనియందే కృషిసలిపెనని విని, ఆతనిసందర్శించెను. కొంతకాలమునకు వీరిరువురును భాగస్వాములుగా నేర్పడి, "డెగూరియోటైప్" అనురూపపటనిర్మాణపద్ధతిని కనిపెట్టిరి. కాని, యీపద్ధతి ప్రకటితమగులోపలనే, నైప్సి మరణించెను. వానికుమారునియొద్దనుండి, డెగూరీ, తానును నైప్సియును కలిసి కనిపెట్టిన, పద్ధతి యందలిహక్కును కొనెను. ఈరోజువరకాపద్ధతి "డెగూరియోటైప్" అను పేరుతో పిలువబడుచున్నది.

తేజోలేఖన చారిత్రమునందు, 1839వ సంవత్సరము చాలముఖ్యమైనది. ఈ సంవత్సరమునందే ఫ్రాన్సుదేశమున డెగూరీ తనపద్ధతిని ప్రకటించి, మెప్పు వడసెను. అదేకాలమున ఇంగ్లాండునందు, "ఫాక్సుటాల్బట్" అనువాడు, యంత్రసహాయమున, కాగితములపై రూపపటములను దీయు నూతనపద్ధతిని కనిపెట్టి, ప్రకటించెను. ఒకేసారి ఫ్రాన్సునందును, ఇంగ్లాండునందును, నూతన చిత్రపట నిర్మాణపద్ధతులు ప్రకటితమగుటవలన, ఆయాదేశములందలి జనులు చిత్రకారులతో

నిక పనియుండదనియు, నచిరకాలముననే వివిధవర్ణములతో రూపపటములను దీయగలుగు యంత్రములు నిర్మింపబడుననియు, సంతసింప మొదలిడిరి. చిత్రకారులును తమజీవనోపాధికి భంగముకలుగునేమోయని చింతింపసాగిరి. కాని, వారలనుకొనినంత వేగముగా నీశాస్త్ర మభివృద్ధి నొందియుండలేదు. ఆకాలపు డెగూరియోటైప్ పటములు, మెరుగుపెట్టబడినట్టి వెండి రేకులపై దీయబడుచుండుటచే మిగుల హెచ్చువెలగలిగియుండెడివి. ఫ్రాన్సుదేశమునం దీడెగూరియోటైప్ పటములు ప్రీతితో జూడబడుచుండినను,' ఇంగ్లాండు దేశీయులకుమాత్ర మివి నచ్చియుండలేదు. టాల్బట్ యొక్క పద్ధతి ననుసరించి దీయబడిన పటములు, కాగితపువగుటచే, తక్కువ వెలకు లభ్యమగుచువచ్చెను. అవి యీకాలపు ఫోటోగ్రాపు పటములతో నేవిధముగను గూడ బోలకున్నను, ఆరోజులలోమాత్రము మిగుల పొగడబడుచుండెను.

1850 వ సంవత్సరమున, "ఆర్చర్" అనువాడు "వెట్కలోడియన్" అను మరియొకపద్ధతి కనిపెట్టెను. అప్పటివరకు, తేజోలేఖనము బాల్యదశయందే యుండెను. ఆర్చర్ యొక్క వెట్కలోడియన్ పద్ధతియే, అవసరమగు మార్పులతో, నేటివరకు ప్రపంచము నందంతటను తేజోలేఖకులచే నభ్యసింపబడుచున్నది. తేజోలేఖనశాస్త్ర మభివృద్ధినొందిన దంతయు, ఆర్చర్ వెట్కలోడియన్ పద్ధతి కనిపెట్టినపిమ్మటనే. ఈచారిత్రము నింకను విపులముగా దెలుపబూనినచో, నొకచిన్న గ్రంథము కాగలదు. చదువరులకు నవీన తేజోలేఖన పద్ధతులుమాత్రము విపులముగా దెలియజేయు నుద్దేశతో నీవ్యాసమును వ్రాయుటవలన చారిత్రకవిషయమింతటితో విరమించవలసి వచ్చినది.

## నీ వేల తేజోలేఖకుడవు కావలెను?

కేవలపశుప్రాయుడగు అడవి మనుష్యుడు మొదలు పరిపూర్ణశాస్త్ర వేత్తవరకును, ఉయ్యాలలో పరుండు పసిబిడ్డడుమొదలు వ్యాపారమునందు మునిగి తేలుచు అహర్నిశములు తనకాలమును వ్యర్థపుచ్చ నిష్టపడని వర్తకునివరకు, ఎల్లరును చిత్తరువులయందు ప్రేమగలవారే. కొంచె మెచ్చుతగ్గుగా ప్రతిమానవునకును, చిత్తరువులయందలిప్రేమ సహజము. కాని, నీ విష్ట[illegible]వి, నీకుతూహలమును పెంపొందింపజేయునవి, వేరొకరిచే వ్రాయబడినట్టి చిత్తరువులా, లేక, నీచే స్వయముగా వ్రాయబడినట్టివా యనునది ప్రశ్న. నీమనసు నొక్కమారు నీపడకగదిపై పునకు పోనిచ్చి చూడుము! అందే అన్యదేశపు చిత్రకారులచే వ్రాయబడినట్టి చిత్తరువులో, లేక అట్టివానినుండి యంత్రసహాయమున నచ్చొత్తింపబడినట్టి పటములో, అలంకరింపబడియుండునుగదా? వాటికిమారుగా, నీచే స్వయముగా వ్రాయబడినట్టి చిత్తరువు లుండియుండినచో నీ కెంతయానందముగ నుండియుండును! కాని, ప్రతివాడును సులభముగా చిత్రకారుడు కాజాలడు. నీవు చిత్రకారుడవు కావలెననిన, ఎన్నియోయేండ్లు శ్రమపడి గురువునొద్దనో, చిత్రకళాశాలయందో యీవిద్య నభ్యసింపవలసియుండును. తేజోలేఖకుడవు కావలెనన్ననో, అట్టిచిక్కు లేవియు నిన్నెదురుకొనజాలవు. జీతమును బత్తెమును [illegible]కొనకయే సూర్యుడు నీయధీనమున నుండు చిత్రకారుడు కాగల[illegible]

నీ వొక తేజోలేఖనయంత్రమును కలిగియుంటివేని, అది నీ కద్దమువలె ఎల్లప్పుడు నుపయోగకారిగా నుండగలదు. పిల్ల లెచ్చటగలరో అచ్చట యీ తేజోలేఖనయంత్రముయొక్క ఉపయోగ మపారము. నవ్వుచు ఎత్తుకొనుమని చేతులు చాచు నీచిన్నబిడ్డనియొక్కయు, పలువిధములగు వింతవింతయాటలనాడుచు, కేవలము సంతోషములో మునిగి, కష్టమన నెట్టిదో ఎరుగని పసిబాలురయొక్కయు, బాలికలయొక్కయు, భావపూరితములగు చక్కనిచిత్తరువుల నెన్నిటినైనను సులభముగా నీయంత్రసహాయమున దీయగలుగుదువు. తమ బిడ్డల యొక్క వివిధరీతుల చిత్తరువులగని ఏతలితండ్రు లానందింపకుందురు? పితృత్వముయొక్క పూర్ణసంతోషమును బడయగోరితివేని, నీసంతానమునందలి ప్రతిబిడ్డయొక్కయు పటములను ఏటేట గలిగియుండుట ప్రధానము. ఈపటములు, నీచే స్వయముగా నీ తేజోలేఖనయంత్రసహాయమున దీయబడి, వరుసవెంబడి పుస్తకమునం (Album) దతికించి యుంచినచో, నీసంతానముయొక్కజీవచరిత్ర చిత్రపటరూపమున నుండగలదు. నీపిల్లలు పెద్దవాండ్రయిన పిమ్మట, యీచిత్తరువుల పుస్తకము



ఆంధ్ర బాలిక

శ్రీయుత వి. కృష్ణమాచార్యులుగారు తీసిన ఛాయాపటము


నీకెట్టియానందము నిచ్చునో యోచించుకొనుము! నీయింటిఆవరణముదాటి వెలుపలకు పోనగత్యము లేకనే, ఎన్నియోచిత్తరువుల దీయవచ్చును. విశ్రాంతికొరకుగాని, యితరకారణమువలనగాని, ఇల్లువిడిచి బయటికి పయనమైతి వేని నీవెంట తప్పక తేజోలేఖనయంత్ర ముండితీరవలసినదే. విలాసార్థముగ నేదేని యొక పెద్దపట్టణమునకు వెళ్లియుంటి వనుకొందము. అచ్చట నెన్ని రమణీయదృశ్యములు నీకంట బడుచుండును! ఆసుందరమందిరములు, విశ్రాంతిస్థలములు, యుద్యానవనములు, వస్తుప్రదర్శనశాలలు మొదలగువాటియొక్క దృశ్యములను నీ తేజోలేఖనయంత్రముతో నాకర్షింపకుంటివేని, క్రమక్రమముగా నవి మరుపునకు వచ్చును. నీవిలాససంచారదినములలో దీయబడినట్టి యీచిత్తరువు లెల్లప్పుడు ఆరమణీయదృశ్యములను నీకు జ్ఞప్తికితెచ్చుచుండుటమాత్రమే కాక, వ్యయప్రయాసలు లేకనే, నీ స్నేహితులకందరకును వాటిని చూచి యానందించుట కవకాశ మేర్పరుపగలవు.


పుణ్యక్షేత్రములను దర్శింపబోవునపుడు, తేజోలేఖనయంత్రము వెంటనుండవలయునని, వేరుగ చెప్ప నక్కరలేదు. ప్రాచీనశిల్పకళా సామర్థ్యమును ప్రపంచమునకు చాటు ఆదేవాలయములను, గోపురములను, పుష్కరిణులను, వివిధప్రాంతములనుండి వచ్చు యాత్రికులను, ఉత్సవములను చూచి, నీవుమాత్ర మానందించి యూరకుందువా? నీబంధుమిత్రాదులనుగూడ, నీ ఆనందమునందు పాల్గొననీయవా? వారిని, నీవెంట గొనిపోకుండ సంతసింపజేయుట యొక్క చిత్తరువులమూలముననే.

తేజోలేఖనమును వృత్తిగా గైకొనగోరెదవేని, మంచిరాబడి వచ్చుటకు సందేహముండదు. ప్రతిపట్టణమందును, పల్లెయందును, తేజోలేఖకునకు పని గలుగుచునే యుండును. సచిత్రవార్తాపత్రికలకు, వార్తావిషయములకు జెందిన పటములను దీసి పంపుచుండుటవలనగూడ, మంచిరాబడి చేకూరగలదు. ఈ విద్య నభ్యసించుటకు విశేషధనవ్యయమగునని హెచ్చుమందిచే దలపబడుచున్నది. కాని, అది వట్టిపొరబాటు. నీవు విశేషధనమును తేజోలేఖనయంత్రమునకై వెచ్చబెట్టజాలకుంటివేని, 10, 15 రూప్యములకే గూడ లభ్యమగు యంత్రములు గలవు. ఈచవుకరకపు యంత్రములతోగూడ చక్కని చిత్తరువులు దీయవచ్చును. కాని, వందలకొలది రూప్యముల వెలగలయంత్రములతో యీ చవుకవాటిని సరిపోల్చజూచుటకాని, అట్టియంత్రములతో దీయుటకు వీలగునన్ని చిత్తరువుల దీయ సాహసించుటగాని, తగనిపని. మంచిప్రకాశమానమగు వెలుతురులో చవుకయంత్రములు సహితము, చక్కని చిత్తరువులను దీయగలవు. మబ్బుగా నుండునపుడుగాని, సాయంకాలమందుగాని, వీటితో చిత్తరువుల దీయుట కవకాశముండదు. తేజోలేఖనమునకగువ్యయము, కాబోవు తేజోలేఖకునియొక్క ఇష్టమునుబట్టి యుండగలదు. ఒకడు కొలదిపెట్టుబడితో చవుకరకపుయంత్రమును, దాని కత్యవసరమగుసామగ్రియు మాత్రము గలిగియుండి, మిక్కిలి తక్కువఖర్చుతో చక్కనిచిత్తరువుల దీయవచ్చును. వేరొకడు విశేషధనము వెచ్చించి అత్యుత్తమమగు యంత్రమును, దాని కనువగు ననేక యితర సామగ్రియు గలిగియుండిననేకాని, తృప్తినొందక పోవచ్చును. చూపరులకీయిరువురి చిత్తరువులకును విశేషభేద మగుపడకుండగూడ నుండుట గలదు. కొన్నిసమయములందు చవుకయంత్రములతో దీయబడినట్టి పటములే, హెచ్చువెలగల యంత్రములతో దీయబడినవాటికంటె సుందరముగా నుండుటగూడ గలదు. మరియొకసంగతి నీస్నేహితు లెవ్వరేని యిదివరలో నీవిద్య నభ్యసింపబోయి ఆశాభంగమును పొందితిమనియు, యింతటి విసుగుపుట్టించుపని వేరొకటి యుండజాలదనియు, చెప్పిన చెప్పవచ్చును. కాని, అట్టివారిమాట లెన్నటికిని విశ్వసింపదగినవి కావు. సామాన్యముగా హెచ్చుమంది, తేజోలేఖన యంత్రమును కొనుటతోడనే, యీవిద్యను బోధించుగ్రంథమును దేనినిగూడ సావకాశముగా చివరంటజదువక, తమయంత్రమునందలి కదలుభాగములనన్నింటిని ఆడించిచూచి, అంతటితో తృప్తినొంది, తమకండ్ల కగుపడు ప్రతిదృశ్యముయొక్క పటమును దీయుటకు మొదలిడుదురు. అట్టివారల కాశాభంగము గలుగుట యేమి వింత? తేజోలేఖన మభ్యసింప తగనిదనియు, విసుగుపుట్టించెడిదనియు, చెప్పెడివారు పైతరగతిలోనివారే. కాన, సందేహమువీడి నేడే తేజోలేఖకుడ వగుటకు తీర్మానించుకొనుము.

## రెండవ ప్రకరణము

### ఉ ప క ర ణ ము లు





Stand camera


తేజోలేఖకుడవు కావలెనని నిశ్చయించుకొనిన పిమ్మట, ఎట్టియంత్రము కొనవలయునో, ఉపకరణము లేవి కావలయునో, అవి ఎట్లుపనిచేయునో తెలిసికొనవలసియున్నది. తేజోలేఖనమునకు ప్రధానసాధనము కమీరా యనబడు యంత్రమైనప్పటికిని, పలువిధములగు నితరయుపకరణములుగూడ చాలవర కగత్యము. ఈపని కత్యంతావశ్యకమగు సాధనసామగ్రియొక్క పట్టిక యీప్రకరణాంతమున గానవగును. కమీరాకు లెన్సు, (Lens) షట్టర్, (Shutter) డార్కుస్లయిడ్ (Dark slide) మొదలగు సాధనము లమర్చబడియుండిననేకాని, అది సంపూర్ణమైనయంత్ర మనిపించుకొనదు. సాధారణముగా పైసాధనములన్నియు గలిగియున్నట్టి యంత్రములే విక్రయింపబడుచుండును. ఈయంత్రము లనేకరూపములను దాల్చినను, నవి కోళ్ల ఊతపై నిలుచు స్టాండు కమీరాలనియు (Stand Cameras), చేతి కమీరా లనియు (Hand Cameras) రెండు తరగతులుగ విభజింపబడినవి. చేతికమీరాలు తిరిగి, మెగజిన్ కమీరాలనియు (Magazine Cameras), మడత జేబు కమీరాలనియు (Folding Pocket Cameras), మడత ఫిలిమ్ కమీరాలనియు (Folding film cameras), రిఫ్లెక్సు కమీరాలనియు (Reflex Cameras) నాలుగు రకములుగ విభజింపబడినవి.

స్టాండుకమీరాలయందు, రెండురకములు గలవు. ఒకరకపువాటికి నలుచదరపుతిత్తులును, (Square Bellows) మరియొకరకపువాటికి, ముందునకు రానురాను సన్నమగునట్టితిత్తులును, (Conical Bellows) ఉండును. చదరపుతిత్తులుగల కమీరాలు, భారముగను దృఢముగను ఉండి సామాన్యముగా ధనార్జనకొరకు తేజోలేఖనమును వృత్తిగా గైకొనిన వారలచే తరుచు వాడుక చేయబడును. (చూడు 1 వ పటము) ముందుభాగమున సన్నముగా నుండు రెండవరకపు తిత్తులుగల కమీరాలు తేలికగను కొలదిస్థలమున నిముడునవిగను ఉండి, అన్నివిధములగు పనులకును ఉపయోగపడగలవు. ఈస్టాండుకమీరాలు సామాన్యముగ లెన్సు, షట్టర్, డార్కుస్లయిడ్, మడత స్టాండు, నల్లగుడ్డ, వీటి నుంచుటకు వీలగుపెట్టె వీటితో కలిపి విక్రయింపబడును. ఈరకపు కమీరాలయందు ముఖ్యముగా నీక్రిందిఏర్పాటు లుండును.


1. ముందునకును వెనుకకును వంగువెనుక భాగము (Swing Back); 2. పైకి క్రిందికివచ్చు ముందుభాగము (Rising and falling front) (౩) వెనుకభాగము, ముందుభాగము, దగ్గరకు వచ్చునట్లుచేయు ఏర్పాటు (Wide angle Movement); (4) వలయునంతకాలము వెలుతురును లెన్సుగుండ కమీరాలోనికి పోనిచ్చి, తరువాత ఆపివేయుసాధనము (Shutter).

చేతికమీరాలవలె తేలికగను, జేబులో నిముడునంత చిన్నవిగను నుండక కొంచెముభారముగనుండినను సమస్తవిధములగు చిత్తరువుల దీయుటకును, ముఖ్యముగా మనుష్యులరూపపటములను దీయుటకును మిక్కిలి యనుకూలముగ నుండుటజేసి, యీస్టాండుకమీరాలు నే యంత్రములందు చాలకాలమునుండి ప్రాముఖ్య ...వియున్నవి. ఇవి ఆరుకొలతలలో లభ్యముకాగలవు. $\frac{1}{4}'' \times 3\frac{1}{4}''$, $6\frac{1}{2}'' \times 4\frac{1}{4}''$, $8\frac{1}{2}'' \times 6\frac{1}{2}''$, $10'' \times 8''$, $12'' \times 10''$, $15'' \times 12''$ అం॥ $6\frac{1}{2}'' \times 4\frac{1}{4}''$ అం॥ కొలతగల చిత్తరువులం దీయుకమీరాలు హెచ్చుమందిచే వాడుకచేయబడుచుండును. $8\frac{1}{2}'' \times 6\frac{1}{2}''$ అం॥ పై దాటినకొలతలుగల కమీరాలు.


పటము 1.                వివిధవిధ తేజోలేఖన యంత్రములు




1




2




3




4




5



6




8



7


1. స్టాండు కమీరా (ముందునకు రాను రాను సన్నము తిత్తులు గలది)
2. స్టాండుకమీరా (నలుచదరపు తిత్తులు గలది)
3. చేతిపెట్టె కమీరా.
4. మడత జేబుకమీరా.
5. మడత ఫిలిమ్ కమీరా.
6. రి ఫ్లెక్సు కమీరా
7. వాచి జేబులోపట్టు చిన్నకమీరా.
8. వాచి కమీరా. (విక్కిలి చిన్నది)

ధనార్జనపరులగు ఫొటోగ్రాఫరులచే మాత్ర ముపయోగింపబడును.




చేతిపెట్టె కమేరా (Magazine Camera)

తేజోలేఖనముయొక్క వ్యాప్తికి నిజముగా యీ చేతి కమేరాలే కారణము. ఈరకపు కమేరాలే కనిపెట్టబడకుండినచో ధనార్జనపరులగు బహుకొలది మంది మాత్రము తేజోలేఖకులై యుండెడివారు. ఈచేతిపెట్టె కమేరాలయందు 12 ఆకర్షణ అద్దములు (Sensitive Plates) ఒకేమారుపెట్టుటకు (అనగా 12 అద్దములు ఒకదానివెనుక మరియొకటి సిద్ధముగా నుండుటకు) వీలుగలదు. మొదటియద్ద మేదేని దృశ్యము నాకర్షించినపిదప, (Exposed) కమేరాయొక్క పైభాగమున నుండు సీల నొకదానిని నొక్కినతోడనే, ఆయాకర్షింపబడినట్టి యద్దము (Exposed Plate) క్రిందిభాగమునకు పోయి దానిస్థానమున వేరొక క్రొత్తయద్దము వచ్చి నిలుచును. ఇటులనే 12 అద్దములును ఒకదాని వెనుకమరియొకటి, ఆకర్షింపబడినది క్రిందికిపోవుచు, క్రొత్తది వచ్చి దానిస్థానమున నిలుచుచుండును. స్టాండుకమేరాలయందువలె వీటికి వెనుకభాగమున గ్రవుండుగ్లాసు (Ground Glass) అద్దముపై మనము దీయబోవుదృశ్యముయొక్క ప్రతిబింబము, నిర్మలముగ నగుపడునంతవరకు, కమేరాయొక్క ముందుభాగముగాని వెనుకభాగముగాని ముందువెనుకలకు నడుప నగత్యము లేదు (Focussing). ఈప్రతిబింబము, కమేరాపైభాగమున నమర్చబడియుండునట్టి చిన్నఅద్దములో (View Finder) స్పష్టముగా కనబడుచు, కమేరాకు 10 అడుగుల కావలయుండు ప్రతిదృశ్యముయొక్క రూపమును, నాకర్షించుచుండును. ఈకమేరాలతో స్టాండుయొక్కయూత అగత్యములేకనే, చేతిలో నుంచుకొని, చిత్తరువుల దీయవచ్చును ఇవి సామాన్యముగా, $4\frac{1}{4}'' \times 3\frac{1}{4}''$ కొలతలోమాత్రము లభ్యముకాగలవు.



మడత జేబుకమేరా (Folding Pocket Camera)


మడతజేబు కమేరాలు పైవాటివలె పెట్టెరూపమున నుండక, స్టాండుకమేరాలవలె తిత్తులుగలిగి జేబులో నిముడునంత తేలికగను చిన్నవిగను ఉండును. వీటికి స్టాండు కమేరాలకుండు సదుపాయము లన్నియు చాలవరకుండుట మాత్రమేకాక, పెట్టెకమేరాలవలె చేతిలోనుంచుకొని చిత్తరువుల దీయుటకును, స్టాండుపై నుపయోగించుటకునుగూడ వీలుగలదు. మనము దీయబోవు దృశ్యముయొక్క ప్రతిబింబము, నిర్మలముగ నగుపరచుటకున్ను, దానిసరియగుస్థానము నిరూపించుటకున్ను (Focussing) వలయు గ్రవుండ్ గ్లాసును, స్టాండు కమేరాలందువలె వెనుకభాగమున గలిగియుండియు, యిదేపనికి కమేరాను చేతిలో నుంచుకొని చిత్తరువులు దీయునపు డగత్యమగు దృశ్యదర్శని (ViewFinder) అనుసాధనమునుగూడ లెన్సునకు (Lens) పైభాగమున గలిగియుండును. పెట్టెకమేరాలందువలె 12 ఆకర్షణ అద్దముల నొకేపర్యాయము గలిగియుండు ఏర్పాటు మాత్రము వీటికుండదు. ఈఅద్దములు వేటికవి ప్రత్యేకముగా వాటిని కలిగియుండుటకై నియమింపబడిన సన్నని రేకుపెట్టెలలో, (Dark Slides) పెట్టుకొనవలసియుండును. విలాసార్థముగ తేజోలేఖనము నభ్యసించువారికిని, తరుచు ప్రయాణము చేయుచుండువారికిని, యీ మడతజేబు కమేరాలు మిక్కిలి అనుకూలముగ నుండగలవు. వీటికి స్టాండుకమేరాలయొక్కయు, చేతిపెట్టె




విజయనగర మహారాజావారి ఉద్యానవనసౌధము

(శ్రీయుత వి. కృష్ణమాచార్యులుగారు తీసిన ఛాయాపటము)

కమీరాలయొక్కయు, సౌకర్యములు కలసియుండుటచే వీటినే అనేకులిపుడు వాడుక చేయుచున్నారు. ఈ కమీరాలు $5\frac{1}{2} \times 3\frac{1}{2}$ అంగుళములకంటె హెచ్చు కొలతలలో లభ్యము కానేరవు.



మడత ఫిలిమ్ కమీరా (Folding Film Camera)



రిప్లెక్సు కమీరా (Reflex Camera)

ఫిలిమ్‌కమీరాలు తేలికగా నుండుట యందును, కొద్దిస్థలములో నిముడుటలోను, మడతజేబు కమీరాలను బోలియుండి, పెట్టెకమీరాలయందువలె వరుసగా 12 చిత్తరువులదీయుట కవకాశముగూడ గలిగియుండును. వీటియందు ఆకర్షణ అద్దములకు మారుగా, కాగితమువలె పలుచగనుండు రోల్ ఫిలిమ్ (Roll Film) అను ఆకర్షణరేకు చుట్ట ఉపయోగింపబడును. వీటి నుపయోగించువారలకు, చీకటిగదియొక్కయవసర ముండనేరదు. ఈ కారణమున, వీటికి వెలుతురులో పనిచేయు కమీరాలనికూడ పేరుగలదు. ఈ రకపు కమీరాలలో జేబుగడియార మంతచిన్నవిగూడ తయారు చేయబడుచున్నవి. పటము 1 చూడుము.

ఈ ప్లెక్సు కమీరాలు రూపమునమాత్రము కొంతవరకు, చేతిపెట్టె కమీరాలను బోలియుండును. వీటికి పైభాగమున నమర్చబడియుండు అద్దములో, నిండుపరిమాణమున, మనయెదుటి దృశ్యముయొక్క ప్రతిబింబము, ఆకర్షణఅద్దముపై నాకర్షింపచేయబడుక్షణమువరకును, మనకండ్లకునిర్మలముగా నగుపడుచుండును. వీటికి ఫోకల్ ప్లేన్ షట్టర్ (Focal Plane Shutter) అను ఆకర్షణ కాలపరిమితిని నిర్ధారణ జేయునట్టి యొక యద్భుత సాధన మమర్చబడియుండును. దాని సహాయమున నెట్టి దృశ్యములనైనను, యెంతవేగముగా పోవుచుండిన వాటి యొక్క ప్రతిబింబములనైనను, రెప్పపాటులో నూరవవంతు కాలములో దీయవచ్చును వీటి కమర్చబడియుండు లెన్సులుగూడ మిక్కిలి త్వరితముగా పనిచేయునట్టి హెచ్చువెలగలవై యుండును. భావపూరితములగు చిత్తరువుల దీయగలుగున దొక్క యీ రిప్లెక్సు కమీరాయనియే చెప్పవచ్చును. ఈ కారణములచే వీటిని సచిత్రపత్రికావిలేఖకులు తరుచు వాడుచుందురు. ఇవి మిక్కిలి వెలగలిగియుండుటచే సామాన్యులకందుబాటులో నుండనేరవు.

# పోతన్నగారికి నైవేద్యము

విద్వాన్ గరిమెళ్ల సోమన్నగారు, ఎం. ఏ, ఎల్. టి.

గౌరీశునర్చించు కరములు కరములు, శ్రీకంఠువర్ణించు జిహ్వజిహ్వ;
సోమశేఖరుఁజూచు చూడ్కులు చూడ్కులు, శివసాంబునకుమ్రొక్కు శిరము శిరము;
భీము నాకర్ణించు వీనులు వీనులు, మదనారిఁ దవిలిన మనము మనము;
పశుపతి వ్రాలఁగొను పదములు పదములు, భూతేశ్వరునిమీఁది బుద్ధి బుద్ధి;
త్రిపురదాహకుఁ జింతించు దినము దినము, సర్వభూషణుఁ బ్రకటించు చదువు చదువు;
గుహగురుం దగఁ జెప్పెడి గురుఁడు గురుఁడు, ధరణి హరుఁ జేరుమనియెడి తండ్రి తండ్రి.

సీ. కామారికినిగాని కాయంబుకాయమే, పవనగుంభితచర్మ భస్త్రిగాక,
ఫాలాక్షుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే, ఢమఢమధ్వనితోడి ఢక్కగాక,
హరుపూజనములేని హస్తంబు హస్తమే, తరుశాఖనిర్మితదర్విగాక,
గౌరీశుఁ జూడని కన్నులుకన్నులే, తనుకుడ్య జాలరంధ్రములుగాక,
శంభు చింతలేని జన్మంబు జన్మమే, తరళసలిల బుద్బుదంబుగాక,
భీమభక్తిలేని విబుధుండు విబుధుఁడే, పాదయుగముతోడి పశువుగాక.

సీ. సంసారజీమూత సంఘంబువిచ్చునే, శంభుదాస్య ప్రభంజనములేక,
తాపత్రయాభీల దావాగ్నులారునే, భీమసేవామృతవృష్టిలేక,
సర్వంకషా ఘౌఘజలరాసు లింకునే, హరమనీషా బడబాగ్ని లేక,
ఘనవిపద్గాఢాంధ కారంబు లడఁగునే, ఫాలాక్షనుతిరవి ప్రభలులేక,
నిరుపమాపునరావృత్తి నిష్కళంక, ముక్తినిధిఁగానవచ్చునే ముఖ్యమైన
చంద్రశేఖర చింతనాంజనము లేక, తామరసగర్భునకునైన ధాత్రియందు.

సీ మందార మకరంద మాధుర్యమునఁ దేలు, మధుపంబువోవునే మదనములకు,
నిర్మల మందాకినీ వీచికలఁదూఁగు, రాయంచ చనునె తరంగిణులకు,
లలితరసాలపల్లవఖాదియై చొక్కు, కోయిల చేరునే కుటజములకు,
పూర్ణేందు చంద్రికాస్ఫురితచకోరకం, బరుగునే సాంద్రనీహారములకు,
అంబికాప్రియ దివ్యపాదారవింద, చింతనామృతపాన విశేషమత్త,
చిత్త మేరీతి నితరంబు సేరనేర్చు, విబుధనుతశీల మాటలు వేయునేల?


# నాగై—ఒక శిథిలమయిన పట్టణము, గుల్బర్గ జిల్లా

కొ. నరసింహాచారిగారు

నాగపురము హైదరాబాదురాజ్యములో 'వాడి' స్టేషనుకు సమీపమున చితాపురమునకు నైఋతిభాగమున $1\frac{1}{2}$ మైలు దూరమున నుండియుండెను. ప్రస్తుతమీపురము నామమాత్రావశిష్టమై సుమారు 4 చదరపుమైళ్లవైశాల్యము గలిగి, పాడుపడినట్టియు, శిథిలములైనట్టియు కట్టడములతోను, దేవాలయములు మసీదులతోను, బావులు తటాకములతోను నిండియున్నది. ఈపట్టణ మొక్కయున్నతప్రదేశమున నున్నందున చుట్టుపట్ల చాలదూరమువఱకును దృగ్గోచరమగుచుండును. దీనికి నాగపురమనుపేరెలగలిగినది యని చెప్పగలిగినవారు లేకున్నను, నిచ్చటనేకములగు సర్పప్రతిమలు చెక్కబడిన రాళ్లనుజూచిన వీటికిని పట్టణనామమునకును సంబంధ ముండియుండు నని తోచుచున్నది.

ఈపురమునుగురించి జనులు వాడుకొను కథలు కొన్ని గలవు. శ్రీరాములవారు సీతాన్వేషణార్థము బయలుదేరినప్పుడు మార్గమున నచ్చటచ్చట విశ్రమించెననియు అట్టివిశ్రాంతిస్థలములయందంతయు, వారియుపయోగార్థము మంచినీటియూటలు పుట్టెననియు వాడుక కలదు. దండకలోనిభాగము, మిక్కిలి ప్రవేశింప దరముగాని యరణ్యములు గలిగియుండినందున శ్రీరాములవారు లక్ష్మణసహితులై యచ్చటచ్చట సమీపస్థలములలో విశ్రమించియుండిరి కాబోలు. మగ్గా, రావూరు, భూమల్లి మొదలగు సమీపగ్రామములలో నీటియూటలు తటస్థించుచున్నవి.

ఈ పట్టణనాశమును గురించి యొకకథ గలదు. ఇందలిజనులు పాపకార్యములకు గడగినందున దైవము సహించక యీపట్టణమును నశింపజేసెనట. మొదట రత్నవర్ష మపరిమితముగ గలిగి తర్వాత నొక ఘోరమగు నగ్నివర్ష ముగురిసి కొన్నినిమిషములలో నీస్థలమంతయు పాడయ్యె నని జనులు వాడుకొనెదరు. ఈ ప్రళయమున జావక మిగిలినవారు సమీపమున పూర్వము తుమ్మయపవిగా నుండి



పురద్వారము-నాగై

యిప్పుడు చితాపురమనబడు నూరు చేరిరట. నాగపురములో నిపుడు విరిగినమంటపములును, పగిలిన మశీదులును, పాడుపడిన గృహములును, తప్ప మరి జనులు వసించుజాడయే లేదు. రాత్రులందు భూతప్రేతములరావములు వినబడుచుండునని జనులురాత్రులందావంక చూడనైనజాలరు.



శిథిలమైన దేవాలయము-నాగై



శిథిలమైన కట్టడములు-నాగై

మరొకకథ యేమనిన: నాగపట్టణములో నిప్పటికిని మానుషనేత్రమున కగోచరుడై యొకసాలె యుండునట్లును, నతడు ప్రతిసంవత్సరమును దినమున కొకయడుగుచొప్పున 365 అడుగులపొడవు శిరోవేష్టనము నల్లునని యు, నీతలపాగయే శ్రీశైలక్షేత్రమున మహాశివరాత్రినాడు శివునిశిరము నలంకరించునని యు వాడుక.

ఇచ్చట సుమారు 10 శిథిలములగు శివాలయములు, ఆంజనేయాలయములు, దేవ్యాలయములు, విఘ్నేశ్వరాలయములు, నంది నాగవిగ్రహములు, యింకను పడి పాడుపడిన యిండ్లును, వీటిసంబంధములగు రాళ్లచే గప్పబడిన వెడల్పగు రాజమార్గములును గలవు. చాలవరకును నివి యన్నియు మనుష్యులుసులభముగబోవుటకువీలుగాక చెట్లుచేమలతో నిండియుండును. మంటపముల స్తంభములపైని చెక్కడపుపనులు కొన్నిచోట్ల సామాన్యమైనవియు, కొన్నిచోట్ల కడునేర్పరితనమును వెల్లడిచేయునవిగా నున్నవి. ఒకచోట నొక జైనదేవాలయము గలదు. ఇందు జైనవిగ్రహము గలదు. ఈవిగ్రహము దిగంబరమై అయిదుపడగలుగల సర్పముపైన గలిగి త్రిశిర కిరీటముతో నున్నది. ఇట్టిచిహ్నములతో నుండు జినవిగ్రహము జైనులయిరువదినాలుగు తీర్థంకరులలో నేడవయాయన.'సుపార్శ్వనాథు' డని పిలువబడుచున్నది. ఈ సర్పఫణములు

నేడు గలిగిన విగ్రహములు, 'పార్శ్వనాథు' నివని తెలిసికొననగును. ఇచటగల యొకమశీదులోనిద్వారము, స్తంభములు, పీఠిరాళ్లు దేవాలయపురాళ్లని తోచుచున్నవి. ఇచట చిన్న యేఱును, కోనేళ్లును గలవు.

ఈపట్టణములో నన్నిటికన్న పెద్దదని తోపఁజేయు దేవాలయము మిక్కిలి యందముగా చెక్కబడిన స్తంభములును, వాటిపైని చామరములు వేయు స్త్రీవిగ్రహములును, గజలక్ష్మివిగ్రహములును, మరియు నితరస్త్రీపురుషవిగ్రహములును గలిగియున్నది. ఇటగల 'మహాదేవాలయములో' నొకచిన్నలింగమును, నొకనందియును గలవు. ఇచ్చట గల మరియొక దేవాలయము అరువది స్తంభముల గుడి లేక 'అర్వత్తుకంబంగుడి' యనునది. దీనియందు ౬5 స్తంభములు గలవు. కాళీమశీదు



కాళీమసీదు-నాగై

నందు నందమగు నల్లని స్తంభములు గలవు. ఇవి పూర్వ మొక దేవాలయములోనివిగానుండినట్లు తోఁచుచున్నది. అయినను ఇట్టిరాళ్లు ఈయూర మతే దేవాలయములోను గనుపించనందున నీరాళ్లను స్థలాంతరమునుండి తెచ్చియుందురు. మరియొక మశీదు మొదట దేవాలయముగా నుండి మశీదుగా మార్చబడినట్లు కనబడుచున్నది. దీనిప్రాకారములోపల వీరప్పగుడియను చిన్నయాలయము వంటిది గలదు. ఇందు యిద్దరుయోగుల గోరీలు గలవు. ఈగోరీల పైన రెండుగోపురములు గలవు. తక్కినవాటివలె శిథిలముగాకయుండు ఆంజనేయాలయ మొకటి గలదు. ఈ యాలయమునగల గోడపై రామాయణగాథలు చెక్కబడియున్నవి. ఇందు యుద్ధప్రకరణములును, ద్వంద్వయుద్ధ, మల్లయుద్ధ, ఆశ్విక, గజ, పదాతి సైన్యయుద్ధములు చూపబడియున్నవి. ఈయాలయము ముందు 114 దీపములు గల ఎత్తైన దీపస్తంభము గలదు. పట్టణపు పశ్చిమదిక్కున శిథిలమగు నొకకట్టడము గలదు. ఇందుగల విశాలములగు గదులును, అరుగులును, నీళ్లుండుటకు గట్టబడినరాతితొట్లును పూర్వ మిచ్చట నొక రాజభవనమునకు సంబంధించిన క్రీడాభవనములును కేళాకూళులునునుండినట్లు తోఁపఁజేయుచున్నవి. ఇచ్చట గల యేయింటికిని పైకప్పు లేదు. ఇండ్లన్నియు మన్నములేక రాళ్లతోనే కట్టబడియున్నవి. కలపయుపయోగింపబడియుండిన చిహ్నములు లేవు.

# సంఘసేవ - మోక్షమార్గము

గుండిమెడ వేంకట సుబ్బారావుగారు

గంగాసరిత్తరంగముల నాజన్మంబు, మున్గితేలుచుఁగాక ముక్తిలేదు!
హిమవన్మహీధరాగ్రమున నేకాకియై, ముకుమూసికొనుఁగాక ముక్తిలేదు!
ప్రకటరీతుల నహోరాత్రముల్ జగదీశు, పూజచేయునుగాక ముక్తిలేదు!
సంసారమును బాసి సన్న్యాసియై వనంబులఁబట్టి చనుఁగాక ముక్తిలేదు!
స్వార్థ చింతావిదూరమై యనవరతము, మహితప్రేమామృతంబొల్కు మానసమునఁ
జేయఁబడెడు నిస్తులసంఘ సేవ యొకటె, రాజమార్గంబు మోక్షసామ్రాజ్యమునకు!

సీ. సిద్ధసంకల్పమౌ చిత్తశుద్ధియెయున్న, అష్టాంగయోగ విద్యలవియేల?
ప్రీతియెరుంగని మేటి భ్రాతృభావంబున్న, అతినిష్ఠురంపు సన్న్యాసమేల?
చలనంబులేని మేల్ సహనసంపదయున్న, భయద మహారణ్యవాసమేల?
ప్రేమామృతముఁ జిల్కు విమల మానసమున్న, భీకరంబగు తపోవృత్తియేల?
వాయుభక్షకులైన తాపసులకేని, దర్శనంబీని ముక్తికాంతాలలామ
వచ్చి తన యంతటనె నమోవాక మిడదె, శ్రీగుణాకరుఁడగు సంఘసేవకునకు!

సీ. విమల బృందారణ్య వీథి నీనాఁటికే, మహనీయ మంత్రంబు మారుమ్రోఁగు,
యమునానదీతరంగములు నేఁటికి నేయు, హీన మంత్రంబు జపించుచుండు,
శాశ్వతానంద వాంఛాలోలుఁడైన గౌతముఁ డే యమోఘ మంత్రముపఠించె,
శ్రీగాంధి, కలియుగ క్షేమంక్రియాదీక్షుఁ, జెలఁగియే ఘనమంత్రసిద్ధిఁ గాంచె,
అట్టి సకలకల్యాణగుణాత్మకమయి, తనరు ప్రేమమంత్రంబె యాదర్శకముగ
కలుషదూరమైనెగడు సంఘంబె కాదె, ధారుణీస్థలి ప్రత్యక్షదైవతంబు!

ఆ. వె. సర్వశుభదమైన సత్సంఘమును మించు, దైవతంబులేదు ధరణి నెందు.
సదమలాత్మతోడ సలుపు సత్సంఘసే, వాప్రసక్తి మించు భక్తిలేదు!

# లోటా

చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు

"అన్నన్నా! యెంతకష్టమెంతకష్టము? ప్రతి దినము సాయంకాలమునందు పది మందితో గలసి త్రాగి నవ్వుచు ప్రేలుచు మహానందసముద్రమున తేలియాడునట్టి నేను, స్నేహితులమాటయటుండనిచ్చి, స్వయముగానైన త్రాగుటకు నాలుగణాలైన చిక్కవుగదా! ఛీ! దిక్కుమాలిన బ్రతుకెందుకు? పావులాడబ్బులైన దగ్గఱలేనివాడు జీవింపగూడదు. ఎవ్వరినైన నప్పడుగుదమన్న నిన్న మొన్న నాడిన జూదములో నే నోడిపోయి స్నేహితులకు బాకీపడితిని. నోరుతెరచియడిగిన లాభమేమి? వారు నా కప్పీయకపోవుటయేకాక కంటబడగానే జుట్టుదొరకపుచ్చుకొని జూదపుబాకి తెమ్మని బాధింతురు. ఇల్లువాకిలి యమ్ముకొని చెడత్రాగి పాడైనవానికి గ్రామములో మఱియెవ్వరు ఋణమిత్తురు? చేతిలో డబ్బు పుష్కలముగా నున్నప్పుడు షాపులలోనికి బోయి బ్రాంది, విస్కీ, మొదలైన మంచిమంచి సీమసారాలు త్రాగి హాయిగా గాలక్షేపము చేసితిని. డబ్బు తక్కువైనతరువాత సామాన్యపుసారాయితోనే తనివిజెంది యుంటిని. అదికూడ నేడు కరవైనది. రెండు శేర్ల కల్లునీళ్ళయిన లోపలపోయుదమన్న రెండణాలడబ్బులైనా లేవు. సూర్యాస్తమయమైనది. పక్షులు గూండ్లు చేరుచున్నవి. నేను సారాదుకాణము చేరలేకపోతిని. నామనసులో బెంగవలెనే చీకటి నాలుగుదిక్కుల గ్రమ్ముచున్నది. కాళ్ళు పీకుచున్నవి. చేతులు లాగుకొనిపోవుచున్నవి. కల్లుగాని సారాగాని గడగడ త్రాగునట్టిభాగ్యము నేడు నాకు కలుగునాయని మనస్సు సందేహపడుచున్నది. నామనస్సులోనుత్సాహము జారిపోయినట్లే సూర్యబింబము క్రమక్రమముగా జారిపోయినది. ఆడవాండ్ర మెడలలోనున్న వస్తువు లేవైన త్రెంపుకొందమన్న నీగోదావరియొడ్డున వేసవికాలమగుటచే జల్లగాలికి జను లనేకులు వచ్చి తిరుగుచున్నారు. ఆపనిచేయుటకు వీలులేదు. ఇండ్లలో దూరి గిన్నె చెంబు, తపేలా, మొదలైనవస్తువులు సంగ్రహించిపోవుదమన్న గొప్పవారియిండ్లకడ నౌకర్లు కావలియుందురు. పేదవాండ్రయిండ్లలో నేమి దొరకవు. నేడేమిచేయుటకునాకు దోచకున్నది. అయినను చిరకాలమునుండి నాసొమ్ముతిని కడవలకొలది కల్లు సారాయి నాకు పోసినగమళ్లగంగన్న దగ్గఱకు బోయి కల్లుగాని సారాయిగాని నాకరువుపోయుమని వేడుకొనియెదను. వాడు నాకింతమాత్ర ముపకారము చేయకపోవునా? వెనుక రెండుమూడుసారులు వాడు నాకరువు పోసినపుడు నేను సొమ్ము నాలస్యముగా నిచ్చితినని నామీద మండిపడి యిష్టమువచ్చినన్ని కేకలు వైచి తూలనాడినాడు. అరువుపోసినదాక నమ్మకము లేదు. లేకపోయిన నేమి?

అడిగినందువలన నష్టమేమి?" అని తలపోయుచు నొక త్రాగుబోతు రాజమహేంద్రవరము గోదావరియొడ్డున నొకనాడు సంధ్యాకాలమున నిట్టట్టు తిరిగితిరిగి తనమనోనిశ్చయమున ననుసరించి యచ్చోటు విడిచిబయలుదేరి రంగిరీస్‌పేట మీదుగా తనమనోరథము తప్పక నెఱవేరునని పుట్టెడాసతో దన ప్రాతచెలికాడైన గమళ్ల గంగన్నను దర్శింపబోయెను. ఆసమయమున గిడ్డంగిదగ్గరనున్న సందడి యేమనివర్ణింపను? తెగత్రాగుటచేత నాలుక కొణుగుబోయి సరిగా మాటలాడజాలనివారు కొందరు; ఒడలుతెలియక యొండొరులతో లేనిపోనికయ్యములు కల్పించుకొని నోట నుచ్చరింపగూడని బంజబూతులు తిట్టుకొనుచు ఫెడీలుఫెడీలుమని దండదెబ్బలు కొట్టుకొనుచు ముందుకు వెనుకకు నూగుచు కలియబడి కొట్టుకొనువారు కొందరు; కట్టుకొన్నబట్ట లూడిపోవ నేలబడి పొరలాడుచు ప్రక్కను దాచిపెట్టుకొన్న బుడ్డి చేతులతో నెత్తి మఱలమఱల ద్రాగువారు కొందరు; జందెములు బొడ్డులో దోపుకొని కన్నులుమాత్రమే యగపడునట్లు ముసుగులు వైచికొని పెడమొగములు పెట్టి కంఠధ్వనులు మార్చి గమళ్ళగంగన్న చేతిలో డబ్బులు సీసాలు పెట్టునగ్రవర్ణములవారు కొందరు. ఒకడు త్రాగినంత త్రాగి శరీర మెఱుగక తనదగ్గరనున్నడబ్బులు బేడకాసులు పైకెగురవైచెను. చుట్టుప్రక్కల నున్నవారందఱు డబ్బులు, నాణెములు తీసికొని వానిని మఱల గంగన్నకే సమర్పించిరి. కొందరు త్రాగుటకు డబ్బుదొరకక పోవుటచే నేమియు తోచక కాలుగాలిన పిల్లులవలె నిట్టట్టు తిరుగుచు గిడ్డంగికి ప్రదక్షిణముచేయుచు ధనము కలిగి త్రాగి త్రుళ్లుచున్న ధన్యాత్ములనుచూచి లొట్టలు వేయుచు మిక్కిలి దీనభావముతో నితరులను బదులడుగుచు ఋణము దొరకనప్పుడు గొప్పయాశాభంగముచేత నుస్సురనుచు నిట్టూర్పులు విడుచుచు తమయదృష్టహీనతను నిందించుకొనుచుండిరి. ప్రాతబాకీలు చెల్లింపనందున కొందరు గంగన్నచేత తలవాచునట్లు చీవాట్లు దినుచుండిరి. ఈసమయములో నీకథానాయకుడగు త్రాగుబోతు గిడ్డంగిచేరి యచ్చట పరవశులై పడియున్నపురుషుల జూచినాడు. తన కట్టి భాగ్యము కలుగనందుకు మిక్కిలి చింతించి మెల్లమెల్లగా గంగన్నకడకు బోయి మిక్కిలి వినయముతో జేతులు నలుపుకొనుచు నాతని యెట్టయెదుట నిలువబడి "గంగన్నా!" అని మెల్లగా పిలిచెను. పనితొందరచేత గంగన్న వినిపించుకొనలేదు. ఆకలిగొన్నవాడు వంటయిల్లు జేరునపుడును, త్రాగుబోతు గిడ్డంగి జేరునపుడును వానియాత్రము చెప్పనలవియగునా? త్రాగుబోతుగంగన్నను మఱిరెండుసార్లు గట్టిగా బిలిచెను. గంగన్న 'యెవరు వా'రని తిరిగిచూచి, "దామోదరయ్యగారా! యేది? మీకాయ తెచ్చినారా?" యని యడిగెను. ఆమాటలు వినగానే దామోదరయ్య "గంగన్నా! యీరోజున డబ్బు దొరకలేదు. నే డరువుపోసితివా యీవేళటిసొమ్ము రేపటిసొమ్ము రేపు తెచ్చి యిచ్చెద"నని పలికెను. "చాలుచాలులేవయ్యా! నీమాట నీళ్లలోమూట. వెనుక రెండుమూడుసారులు నీ కరువుపోసితిని. ఆడబ్బు త్రిప్పిత్రిప్పి

రమి యెనుబదిసంవత్సరముల వయస్సుగల వాఁడని కొందఱు, సహస్రమాసములుగడచిన వని కొందఱు పలుకుచుందురు. ఆయన పండ్లు పాలు, దుంపలు, గోధుమరొట్టెలు మొదలగు వానిని భక్షించి దేహధారణము చేసికొనును. ప్రతిదిన మెవ్వరో యొకరు ఆయనకుగావలసిన యాహారము భక్తిపూర్వకముగా గొనివచ్చి నమస్కరించి సమర్పించుచుందురు. ఎవ్వరు సమర్పింపకపోయినను నోరుదెఱచి యడుగరు. ఒకటిరెండుసారులు వారు దెచ్చెదరని వీరు వీరు తెచ్చెద రని వారు తలంచి యమ్మహాత్మున కాహారము పురజనులు సమర్పింపకపోయిరి. ఆ రెండుదినములు పావనములగు గౌతమీజలములతో నుదరపూరణము జేసికొని యా యోగి యెప్పటివలె గాలక్షేపము చేసెనేగాని తనయాఁకలిబాధ నెవ్వరి కెఱిగింపలేదు. తఱుచుగా నతఁడు సమాధిలో నుండును. తనయగ్నిహోత్రమునెదుట కృష్ణాజినము పఱచుకొని పద్మాసనస్థుఁడై యా పరమయోగి కన్నులు మూసుకొని పరమధ్యానతత్పరుఁడై యుండఁగా నతనిని జూచినవారు తప్పక యతఁడు మహాయోగియని తలంపకపోరు. సాయంకాలములయందతఁడు తనపాకలోనుండి వెలుపలికి వచ్చి కూర్చుండి పురజనులతోను దూరమునుండి వచ్చు బైరాగులతోను సంభాషణ చేయుచుండును. చిరకాలము తెనుగుదేశమునందుండుటచే నతఁడు తెనుగుగూడ చక్కఁగ మాట్లాడగలఁడు. అతఁడు ఘూఁడుకాలముల యందుగూడ నదీస్నానము చేయను.

ఆనాటిసాయంకాల మాయనస్నానముచేసి కన్నులు మూసికొని కొంతసేపు సమాధియం దుండెను. ఎదుట ప్రజ్వరిల్లుచున్న యగ్నితేజమువలె నాయన విశాలఫాలమునుండి బ్రహ్మతేజము వెలువడుచుండును. మొగము శాంతరసమును గ్రక్కుచుండెను. మూర్తీభవించిన యోగవిద్యవలె నాయన ప్రకాశింపజొచ్చెను. కొంతవడికిసమాధినుండి మేలుకొనెను. మేలుకొని కమండలమందలి కమ్మనిజలము త్రాగి యగ్నివైపు చూచుచుండెను. పురజనులలోనొకానొకభక్తుఁ డొకనాఁ డాయనకు [illegible]గై దురూపాయలు వెలగలకంచుపంచపాత్ర నొక-దానిని సమర్పించెను. తనకది యక్కరలేదని బావాజీ యెంతనొక్కి చెప్పినను, తీసికొనిపొమ్మని యెన్నిసారులు బ్రతిమాలినను భక్తుఁడు దానిని తీసికొనక యచ్చటనే యుంచెను. పాలు, పెరుగు మొదలైనవి తెచ్చి భక్తు లాపంచపాత్రలో పోయుచుందురు. తులసీదాసు విధిలేక దధిక్షీరములను దానినుండి త్రాగుచుండును. తక్కినపనులకు తనకమండలమునేకాని దానినత డుపయోగింపఁడు. ఎవరో యొక రా కంచుపంచపాత్ర ననుదినము తెల్లగా తోమి పాకలో నుంచుదురు. ఆంధ్రదేశస్థులవలె నతడు దానిని పంచపాత్రయనక 'లోటా' యని వ్యవహరించుచుండును.

దామోదరయ్య మొట్టమొదట దురుద్దేశ్యమేమియు లేకయే వినోదార్థము పాక యెదుట నిలువబడియెను. నిలిచినతోడనే మండుచున్నయగ్నిహోత్రము వెలుగున తళతళమెఱయుచున్న కంచులోటా యతనికంట

వాడైన బావాజీ పరుగెత్తలేకపోయినను మొత్తముమీద కొన్నిగజములయెడముగా వారిరువురు పరుగెత్తుచుండిరి. బావాజీ నడుమ నడుమ "ఆవురే భేతా ఆవురే" యని కేకలు వైచుచుండెను. ఈలోపుగా నెదుటివైపునుండి నలుగురు మనుష్యులు వచ్చుచు విసవిసబరుగెత్తుచున్న దామోదరయ్యను 'దొంగదొంగ' యని పట్టుకొనిరి. వారిబారినుండి తప్పించుకొనిపోవుట కతడు కొన్ని ప్రయత్నములు చేసెను గాని యవి సఫలములు గాలేదు. వాడెంత గింజుకొన్నను వారు విడిచిపెట్టలేదు. 'దొంగ దొంగ' యని వారు మొదట వైచిన కేకల వలన చుట్టుప్రక్కలనున్న జను లనేకు లచ్చట గుంపులుగూడిరి. బావాజీయు వారిని గలిసికొనెను. దొంగవా డందరకు లోకువగావున నింటదూరినకుక్కయట్లు దామోదరయ్యను గొందఱు మర్దింపసాగిరి. తులసీదాసు కొట్టవద్దని వారిని మందలించెను. 'దొంగవానిని గొట్టకపోయినచో వానికి బుద్ధివచ్చునా?' యని కొందరు బావాజీ నడిగిరి. కొందరు పోలీసు ఠాణాకు వానిని బంపుమనిరి. ఎట్టుపాగాల రాజభటు లచ్చటకుబోయి ఠాణాకు వాని దీసికొనిపోయి బంధింపఁజొచ్చిరి. కాని బావాజీ వారిని వారించెను. మఱియొకరు వారించినచో పోలీసువారు వారిమాట వినకపోయియుందురు గానితులసీదాసునెడలవారికిగల భక్తివిశేషము చేత దామోదరయ్యను వారు ఠాణాకుగొనిపోవరైరి. కొట్టనీయక ఠాణాకు గొనిపోవనీయక బావాజీ దొంగ నేమిచేయునని ప్రతిమనుష్యునకు సందియముదోఁచెను. కొందరు బావాజీని జూచి 'యిత డేమిదొంగిలించెనని' యడిగిరి. బావాజీ తనచేతిలోనిలోటాజూపి 'ఇదివీడెత్తికొనిపోవుటకు ప్రయత్నించెను. కానినేనువానివైపు చూచుటచేత నచ్చట పాఱవైచి పరుగెత్తె"నని యతడుబదులుచెప్పెను. "మీసొత్తు పోలేదుగదా మీరతనినేల తఱుముకొనివచ్చితిరి. వానిని బట్టుకొని దండించినపక్షమున మీ కేమిలాభ" మని మఱికొందరడిగిరి. దామోదరయ్య ప్రశ్నోత్తరములను మిక్కిలి యాశ్చర్యముతో వినుచుండెను. చాలచోట్ల నతడు హస్తలాఘవముచేత ననేకవస్తువులను హరించి యప్పుడప్పుడు పట్టుబడుచునచ్చెను. గాని యీవిధముగా బాధింపవద్దనువారు, ఠాణాకు గొనిపోవద్దనువారు కనబడలేదు. పట్టుబడినపుడు పిడిగుద్దులు, చెంపకాయలు, తన్నులు, తిట్లు వాని కవిచ్ఛిన్నముగా లభించుచుండెడివి. ఇప్పు డవిలేకపోవుట మిక్కిలి వింతగానుండెను. అప్పుడు తులసీదాసు దామోదరయ్యదగ్గఱకు బోయి చేయిబట్టుకొని "నాయనా! యీ లోటాకొఱకై నీవెంతో కష్టపడి నాపాకముందర నెంతసేపోనిలచిమెల్లగాలోపలకు జేరితీసికొనబోయితివి. కానినేనునీవైపుచూచుటచేతభయపడి పారిపోయితివి. ఇదిగో! నీవు దీనిని తీసికో. నాకు మంచికమండలమున్నది. కొబ్బరచిప్పలున్నవి. వద్దువద్దనినేను బ్రతిమాలినను నామాట త్రోసిపుచ్చిపాపమావర్తకుడు నాయందు విశేషదయగలిగి దీనిని నిక్కడ బడవైచిపోయెను. నాకిదియక్కఱలేదు. నీకుగావలెను. కనుక నీవే తీసికొనుము. నాలుగైదు రూపాయల విలువగల యీలోటా నాకడ నుండుటచేత దీనిని రక్షింపవలసినభార మొకటి క్రొత్తగా నాపై

బడినది. ఇది నాహృదయమున లోభత్వము కలిగించుచున్నది. ఐహికవస్తువులతో నిది నన్ను బంధించుచున్నది. అందుచేత నిది నాకడ నుండగూడదు. అదియునుగాక యిది నాకడ నుండుటచేత నీవంటివా రప్పుడప్పుడు వచ్చి నాపాకలో బ్రవేశించుట కవకాశము గలుగుచున్నది. నీవంటి తెలివితక్కువవాండ్ర నిది లోభపెట్టి వారికాపద తెచ్చుచున్నది. పరులకాపద తెచ్చునట్టి పదార్థములు మావంటివారికడ నుండగూడదు. కాబట్టి సర్వవిధములచేత నిది నీవే తీసికొనిపోదగినవస్తువు. నేను కోపముతో మాట్లాడుట లేదు. ప్రసన్నభావముతోనే నీ కిది యర్పించుచున్నాను. నీకు హాని చేయుటకై నేను తలంచుటలేదు. కాని నేను నీ కొక్కసలహా చెప్పుచున్నాను. దీనిని నీవు విక్రయించి త్రాగుడునిమిత్తముగాని, వ్యభిచారమునిమిత్తముగాని యాధనము వినియోగించవద్దు. దాహముకలిగినప్పుడు పరమపవిత్రమైన గోదావరిజలము త్రాగుటకై దీని నుపయోగింపుము. నీపేరు మీదుగా నీయొద్దనిది నీవు బ్రతికియున్నంత కాలమునిలుపుకొనుము. ఇదిగాక నీకొక్కమాట చెప్పెద వినుము. నీవెవ్వడవో నేనెఱుగను గాని నీ ముఖవర్చస్సు చూడ సత్కులమునందు జన్మించినవాడ వని తోచుచున్నది. ఏలయీవిధముగా పాపము చేయుచున్నావు! ఈబ్రతుకు శాశ్వతముగాదు. ఎప్పటికైనను మనము చావకపోము. మనపాపపుణ్యములు విచారించుటకు పరమేశ్వరు డున్నాడు. భగవంతునియెదుట యీపాపములకు నీ వేమిసమాధానము చెప్పెదవు? పరమేశ్వరుని పూజించుటకు నీచేతుల నుపయోగించవలెను కాని దొంగతనమునకు కాదు. ఈశ్వరనామామృతము పానముచేయుటకై నీనోరునుపయోగించవలెనుకాని త్రాగుటకుగాదు. బిడ్డా! నీవు బాగుపడుము. ఇకమీదపాపము చేయకుము. భగవంతుఁడు నిన్ను మంచి మార్గమునకు మఱల్చుగాక.” అని ప్రసంగము చాలించిదామోదరయ్యతలమీద చేయివైచితట్టియూరకుండెనుదామోదరయ్యకన్నులనుండి జొటజొటబాష్పములురాలజొచ్చెను. దొంగిలించినసొత్తు దొంగవానికే సమర్పించుట యాదివఱకెవ్వరు నెన్నడుకనినది వినినది కాదు. కావునబావాజీయొక్క యుదారభావమునకు నచ్చటజేరినవారందఱు మిక్కిలి యచ్చెరువడి యతని యుపదేశవాక్యములను భక్తితో విని యానందించిరి. బావాజీ దామోదరయ్యకు లోటా నీయబోయెను. దామోదరయ్య దానిని గ్రహిం



# శ్రీకృష్ణభారతము

శా. దైత్యుల్ నిత్యపరాక్రమక్రమలసద్ధైర్యాతిశౌర్యంబునన్
బ్రత్యాలీఢపదస్థులై స్థగితరత్నవ్రాతహేతిచ్ఛటా
ప్రత్యాహారవిహారభూరిసమరవ్యాపారులై పోర నా
దిత్యుల్ స్థైర్యము దక్కి ధైర్యము చెడన్ దిక్కుల్ విలోకించుచున్ ౪౩

క. అతివ యగురూపు విడి వడి, నతులితవిక్రమముతోడ హరి నిశితాస్త్ర
ప్రతతిఁ బరగించి భీకర,గతి దానవకోటి నడిచెఁ గడువడి నంతన్. ౪౪

మ. నరనారాయణు లిద్దఱుం గవిసి సన్నద్ధాసురశ్రేణులం
గరవాలంబులు భిండివాలములు చక్రప్రాసకుంతాదులన్
గరిమన్ వ్రేయుచు డాయుచున్ ఘనభయాక్రాంతాత్ములం జేయుచున్
దురపిల్లన్ జముపీడుఁ జూపి రల పాథోరాశితీరంబునన్. ౪౫

శా. జంభద్వేషియు భూరిభూమిధరపక్షచ్ఛేదదక్షోచ్ఛల
ద్దంభోళిం గరమం దమర్చి నిజదోర్దర్పంబు దీపింప న
క్కుంభీపాకమునందుఁ బాకరుచిఁ గన్గోఁ జేసి దైత్యాధమా
రంభంబుం బొలివో నొనర్చె నిజసంరంభంబు జృంభింపఁగన్. ౪౬

శా. జ్యాఘోషంబున నాకసంబు వగులన్ సంధించి కోదండమున్
మాఘాదిత్యనిరీక్షఁ దొల్త నయి గ్రీష్మబ్రధ్నుఁడై యంత బా
ణౌఘాస్త్రంబుల దైత్యవాహినుల మాయం జేసె నుగ్రప్రచా
రాఘాటం బిసుమంత లేక నరుఁ డత్యంతప్రతాపంబునన్. ౪౭

మ. అని నారాయణుఁ డుగ్రుఁడై తగ ప్రవర్గ్యాగ్నిప్రభన్ భీమద
ర్శనమై మండు సుదర్శనం బది కరాగ్రంబందుఁ గైసేఁత గాఁ
గొని నాకద్విషులం దెరల్చుచు మహాఘోరక్రియం బోరెఁ బెం
పున సారణ్యసముద్రభూధ్ర మగు నీభూభాగ మల్లాడఁగన్. ౪౮

ఉ. అత్తఱి దేవదానవుల కైన మహాద్భుతయుద్ధమం దొగిం
దుత్తుము రై నశస్త్రములు దొప్పలు దోరలు కుప్పఁగూరలై
మొత్తములై కనంబడియె మొత్తెడు వేల్పుల కత్తిపోట్లఁ బె
న్నెత్తురు గ్రక్కుకొం చసురనేతలు గూలిరి నేల కెంతయున్. ౪౯

దేవదానవ యుద్ధము



చిత్రకారుండు : శ్రీయుత, ఎ. రామమోహన రాయిగారు

వెనుకవైపు చూడుడు

పక యేడ్చుచు బావాజీ పాదములపై బడి "స్వామీ! లోటా నాకు వద్దు. రక్షింపుడు రక్షింపుడు. బుద్ధి వచ్చినది. బుద్ధి వచ్చినది. నే నిక పాపము చేయను. నాకాలుబిడ్డలు లేరు. ఇక మీశిష్యుఁడనై మీపాదసేవ చేయుచుండెదను. అందుకు నన్ననుగ్రహింపుడు." అని యడుగులమీఁదనుండి లేవకపోయెను. బావాజీ వానిని బుజ్జగించి లేవనెత్తి "బిడ్డా! నీవు బాగుపడునట్లు, పాపముచేయనట్లు నేఁ డిచ్చట చేరినజనులయెదుట చెప్పుచున్నావు. కనుక నిన్ను నేను శిష్యునిగా దీసికొనుచున్నాను. నీకు గాఢమైనపశ్చాత్తాపము గలిగినదని నమ్ముచున్నాను." అని జనులవంక దిరిగి "బిడ్డలారా! చెడుత్రోవలకు బోయెడువారిని కొట్టి తిట్టి బాధించినందున లాభము లేదు. దయారసము ప్రవహింపచేసినచో వారిమనస్సునందలి పాపపంకము కొట్టుకొనిపోవును. ఇదే తార్కాణము." అని వారినందరి వారివారి యిండ్లకు బొమ్మని యానతిచ్చి దామోదరయ్యను తన వెంట పెట్టుకొని తననివాసమునకు బోయెను. త్రోవలో దామోదరయ్య బావాజీతో నిట్లు విన్నవించెను. "మహాత్మా! నేను బ్రాహ్మణుడను. నాతండ్రి యీపట్టణములో న్యాయవాది. చిన్నప్పుడు దుస్సహవాసములు చేసి చదువుకొనక త్రాగుబోతుతన మలవాటు చేసికొని చెడిపోయితిని. త్రాగివచ్చి నేను కొట్టెడుదెబ్బలు తినితిని నాభార్య కాలధర్మము నొందెను. ఒకకుమారుఁడు కలిగినాడుకాని పాపకర్ముఁడనైన నాకడ బ్రతికియుండుటకంటె బరమపతివ్రతయైన తల్లికడ నుండుటయే మంచిదనికాబోలు వాడుకూడ మరణించెను. బ్రతికియున్నంతకాలము నాతల్లి నాచేత నిరంతరము తిట్లు, కొట్లు పడి యెన్నిపాట్లు పెట్టినను కడుపుతీపిచేత నాకింత గంజికాచిపోసి నన్ను రక్షించెను. ఆమెయు లోకాంతరవాసిని యైనది. ఇప్పుడు నేను నిరాధారుడను. ఏకాకిని. ఆస్తియంతయు విక్రయించి త్రాగితిని. ఇప్పుడన్నవస్త్రములు లేవు. ఎండలో నుండి నీడకునైన రమ్మనెడు దిక్కు లేదు. త్రాగుటకై ధనమునిమిత్తము నేనుచేయనిపాపము లేదు. నేను త్రాగుబోతును; జూదరిని; చోరుడను; జారుడను; హంతకుడను; నిత్యమనృతవాదిని. నేనుజేయనిపాపము లేదు. మీచరణములే నమ్ముకొంటి. ఈగౌతమీనది సాక్షిగా, మార్కండేయస్వామి సాక్షిగా, గోపాలస్వామిసాక్షిగా, నే నికమీద నేపాపము జేయనని మఱియొకమారు శపథము చేయుచున్నాను. పోలీసువారి లాటీపోటులకంటె, మేజస్ట్రీటులు కొట్టించిన కొరడాదెబ్బలకంటె మీపలుకు లెక్కుడుపటీవములై నన్ను మంచిమార్గమునకు మఱల్చినవి." ఈమాటలు ముగియునప్పటికి వారు పాక జేరిరి. నిర్భాగ్యదామోదరుఁడైన దామోదరయ్య పశ్చాత్తాపముచేత నిక్కలి పరిశుద్ధుడై భక్తిశ్రద్ధలతో బావాజీని సేవించుచు పరిశుద్ధముగా జీవయాత్ర గడపెను. పాపరోగములను హరించుటకు పశ్చాత్తాపమువంటి యౌషధము మఱియొకటి లేదుగదా!

# ప్రేమతత్త్వము

మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు

ప్రేమతత్త్వనిరూపణము

(ప్రథమభాగము)



జ్ఞనమానీంద్ర మహేంద్రజిద్బలిశిబి శ్రీరామజీమూతవా
హనరాధేయదధీచులాపరశురామాదుల్ దయాదానభం
డనవీరుల్ వినవచ్చుచుందురు పురాణగ్రంథవిఖ్యాతవ
ర్తనులై వారిగుణంబులం దెసఁగు పూర్ణప్రేమ వీక్షింపుఁడీ!

గీ. ఆమహావీరులకు సాటియైనవార, లిపుడు లేరనఁగూడ దహింసయందు
నపరబుద్ధుండునాఁగ మహాత్ముఁడైన, యట్టియొక్కండు వెల్వర పెట్టుగాదె?

చ. ధన మఖిలంబొసంగిన వదాన్యులు దేహములైన లెక్కచే
యనిపరకార్యదక్షులు దయామయులెన్నివిపత్తులైన శాం
తినిభరియించుచున్ మతము దేశము గాంచెడి వీరశేఖరుల్
ఘనులు మహాత్ములెందఱు జగంబున లేరది ప్రేమగాదొకో!

సీ. పంచాపగాభూమిపై దాడివచ్చిన, వీరులఁ దఱుముఁడే పృథ్వీరాజు?
కుకంటిని మ్రింగఁగోరిన పగతురఁ, ద్రోయఁడేమి ప్రతాపరుద్రవిభుఁడు?
క[illegible]ంబు కాంక్షించువిరుదుల, రాయఁడే శ్రీకృష్ణరాయవిభుఁడు?
హిందూమతంబుపై యెత్తినవిమతులఁ, జెండాడఁడే శివాజీవిభుండు?
కంఠమునఁ బ్రాణమున్నంత కాలమల్లి, పోరుసలుపుచు వారందఁ బొలియలేదె!
కంటిరే దేశమతములఁ గావఁబూని, నట్టిప్రేమాతిరేక మహత్త్వ మహహ!

సీ. దిక్కుమియును లేనిదీనుల ననదలఁ, గనికరంబునఁ బ్రోవఁగడఁగువారు
బాటసారుల కన్నపానముల్ నిచ్చలు, పెట్టంగ సత్రముల్ పెట్టువారు
పరులకష్టంబులఁ బాల్గొని వానిఁ దప్పించుచో వడుము బిగించువారు
సాధుసజ్జనబాధ సలుపుదుష్టుల నెదిరించి వారల నణఁగించువారు
దేశమతభక్తిబద్ధులై తిరుగువారు, గాఁగ బహువిధవీరు లేకాలమందుఁ
గలరు వారలసుగుణంబు లలమికొనిన, సాత్త్విక ప్రేమమున కొందుసాటియగునె?

హాస్యము;—

సీ. చిత్తరంజక చిత్రగోష్ఠి విచిత్ర, వాద కేళీకలాదివినోదలగ్న
మైన యధికానురక్తిచే హాస మొదవుఁ, గాన హాస్యంబునకుఁ బ్రేమ కారణంబు.

ఉ. కందుకకేళులన్ సరసగానములన్ రసహావభావని
ష్యంది విచిత్రపాత్రనటనాదుల హాస్యకథాప్రసక్తులన్
బొందులవారితోఁ గలిసి భోగపరాయణులైనకొంద ఱా
నందమునొందు చెప్పుచును నవ్వుచునుందురు నిర్విచారులై.

వత్సలము;—

చ. మొలకలువాఱుముద్దునగుమోముల బిడ్డలమేనికౌఁగిలిం
పులఁ బసలార బాలురకు బుద్ధులు దిద్దుచు నేర్పునట్టివి
ద్యలఁ గులహీనదీనజనదాసులఁ బాలనసేత మీఱువ
త్సలమును బ్రేమ మొక్కటని సర్వజగద్విదితంబు గాదొకో!

చ. వెలసినపాణినీయ మన విశ్రుతికెక్కినపండితుండు శి
ష్యులఁ దనకన్నబిడ్డలఁగ నోమినముద్దుగుచర్ల బ్రహ్మశా
స్త్రులు సతతాన్నదానపరితోషితపాంథు... పుణ్యమూర్తి వ
త్సలరసమూర్తి నా సుజనసన్నుతిఁ గాంచఁడె గౌతమీతటిన్?

మ. కర ముప్పొంగినవైనతేయి నడిలంకం జిక్కి మాలండు దు
ర్భరమౌనాఁకట నర్ధరాత్రమున బొబ్బల్ వెట్ట, నేఁడేదిపోఁ
గరుణన్ భర్తను బంపె నన్నమిడి, డొక్కా సీతమాంబాఖ్య
మరసాధ్వీమణి దీనవత్సలత సామాన్యంబె కీర్తింపఁగన్?

బీభత్సము;—

గీ. తమకుఁ దమయందుఁ గలకూర్మిఁ దలఁపఁ దాఁక, వినఁగఁ దినఁగఁ గనుంగొన వెగటుదోఁచు
నట్టికొన్నిపదార్థంబులందు రోఁత, పడయుదురు గొంద ఱదియె బీభత్సరసము.

చ. తనసరివారు మద్యమును ద్రావఁగఁబోవుచుఁ దన్నుఁగూడఁదో
డ్కొనిచని యించుకంత చవిగొమ్మని యీయఁగఁబోవఁ జీ యిసీ!
యనుచును ముక్కు మూసికొని యావలకేగి యొకండు దీనివా
సనగొనఁజాల రోఁతపడఁజాల నటంచును జాఱె నింటికిన్.

అద్భుతము;—

గీ. అలవికాని పదార్థంబు లాత్మలోనఁ, దలఁచికొని సంతసించుకొందఱకు నవియె
కలిగెనేనియు నాకస్మికంబు లగుచుఁ, బొడము విస్మయ మదియె యద్భుతరసంబు.

సీ. కడుఁ బేదయగు నొక్కవడుగు పెండిలియాస, ధనముసంపాదింపఁ దరలిపోయి
పురము పల్లియు నాక తిరుగుచు నొకయూరి, కరణంబునింటికి నరిగినంత
వృద్ధుండు నర్థసమృద్ధుండు మృతదార, పుత్రుఁ డేకాకి యాభూసురుండు
తనకుమారునియట్లు కనవచ్చునాబాలు, నెమ్మిమైఁ దనయింట నిలిపి యంత
నన్ను గనిపెట్టి యుండు నీ ప్రసన్నమెసలఁ, బెండ్లి చేసి యశేష మర్పింతు ననఁగ
సత్యమా యని యతఁడు విస్మయమునందెఁ, దుదకు నట్టులె సర్వసంపదలు నొందె.

రౌద్రము:—

గీ. తాను ప్రేమించినట్టి పదార్థమునకుఁ, బరునిమూలంక మొదవినపట్టునందు
నెపలు తెలియని క్రోధంబు పొడము నదియ, రౌద్రరసమయ్యె దానికారణము ప్రేమ.
(దీనికి దుష్టప్రేమ క్రింది పద్యము లరయునది)

భయానకము:—

క. మానధనప్రాణంబుల, హానికలుగు నన్న శంక నతిభీకరదు
ర్మానవ మృగములఁ జూడం, గా నగుభయమే భయానకరసం బయ్యెన్.

ఉ. కాన భయానకంబునకుఁ గారణ మెన్నఁగఁ బ్రేమ మాను దు
ర్మానవుఁ జూచి యొంటి నోయి మానిని జంకుట, బాటసారియున్
గాన మెకంబుఁ జూచి నెఱి గాంచుట, దొంగల నింటఁ జూచియే
మానవుఁడైన బెగ్గిలుట మానతనూధన కాంక్షఁ గాదొకో?

కరుణము:—

చ. మరణము తప్ప దేరికను మాట నెఱింగియు దారపుత్రసో
దరగురుభర్తృబంధుసముదాయమునన్ మృతినొందినట్టియె
క్కరి కొక రేడ్చుచుండు రధికంబుగ శోకపయోధి మున్గి యా
కరుణము ప్రేమ భావరుఁడు కాపురమున్నయగార మాఁజుఁడీ!

గీ. ఇష్టవస్తువినాశన మిష్టబంధు, విప్రయోగంబు కాయికవిపదదశలు
నాత్మసుఖభంగహేతువులగుటఁ జేసి, నరులు విలపింతు రదియును గరుణ మగును.

గీ. ప్రేమ మేవస్తువుల నావరించియుండు, వానికలిమి సుఖంబును వాని లేమి
దుఃఖమును లోకు లనుభవింతురు నిజంబు. కాన సుఖదుఃఖముల కధికారి యదియె.

గీ. ఆత్మసంబంధ మిసుమంత యైన లేని, యొరులదుఃఖంబు కని దుఃఖ మొందు నెవఁడు
దానఁ బ్రేమంబు లే దని తలఁపరాదు; కుంభకారుండు చేయనికుంభ యున్నె?

క. పరిశీలింపఁగ శాంతే, తరరసములు వేఱుగతులఁ దనరుచుఁ దుదకున్
గరుణంబునఁ బరిణామముఁ, బొరయుట నైజంబు ప్రేమ పోవనికతనన్.

మ. జనసామాన్యము సర్వదా సుఖము గాంచం గోరి పర్యాయరీ
తిని గాంచున్ సుఖదుఃఖముల్ మనసు శాంతింబొందఁగారామి, నే
ర్చినవాఁడో కరుణంబున న్మఱిఁగి యాప్రేమంబు సౌఖ్యంబువం
కను బోనీయక త్రిప్పి శాంతరసభోగంబానఁగాఁ జేసెడిన్.

చ. హరిహరభక్తి శాంతరసమాను తపస్వులలోనఁగూడ నీ
కరుణరసంబు గ్రోలక యొకండును మున్నె విరక్తి నాపరా
త్పరుఁ గనఁగోరియుండెఁ డనవచ్చు, నిజంబుగ వాఁడుసౌఖ్యమున్
మరఁగియు దానిహానిఁ గరుణంబును గ్రోలియు శాంతమానుటన్.


గీ. వారు వీరననేల యావ్యాసబుద్ధ, శంకరాదులుగూడ వాత్సల్యగరిమ
జ్ఞానబోధకు లగుటకుఁ గారణంబు, పరులదుఃఖంబు గని దుఃఖపడుటఁగాదె?

గీ. తుదకు మోహానురాగహేతుకము లైన, యన్నిరసములు కరుణంబునందు నణఁగుఁ
గరుణమో నిత్యవైరాగ్య కారణమగు, శాంత ముదయింపఁ జేసి తా సమసిపోవు.

క. కామక్రోధాద్యనుగత, తామసరాజసగుణప్రధానం బగునీ
ప్రేమఁ గని సాత్వికాది ప్రేమంబులమార్గములు నిరీక్షింపుఁ డికన్

ఇది ప్రేమతత్త్వమున నైహిక మనుపూర్వభాగము.





# చిత్రలేఖనము

భమిడిపాటి రామసోమయాజులుగారు బి. ఏ.

## చిత్రకారుని గమ్యస్థానము

ప్రస్తుతకాలమున మనదేశమునందు చిత్రలేఖనమునం దనేకుల కాసక్తిజనించుటయు, వేలకొలదిగా చిత్రకారులేకదీక్షతో గృషిచేసి, భావగర్భితములగు చిత్రముల ననేకముల జిత్రించుటయు, వానింగూర్చి విమర్శకులు జనసామాన్యమెఱుంగువిధమున బొగడుచుండుటయు, చిత్రప్రదర్శనము లనేకచోట్ల ప్రతిసంవత్సరమును జరిగియుత్తమచిత్రముల కాదరణ బహుమానము లొసంగబడుటయు, మాసపత్రికలలో నట్టిచిత్రములను, రంగులతోడ ముద్రించి ప్రచురించుచుండుటయును, మున్నుగా గల శుభకార్యములన్నియు జూచి, యానందింపనిభారతీయుడెవ్వడున్నాడు? ఇట్టి గౌరవము దేశమునం దొసంగబడుచున్నను, చిత్రలేఖనమున కిది మహోన్నతదశయని యెంచుటకు వీలులేదు. అట్టి మహోన్నతదశ కలుగుట కిది యారంభమని చెప్పవచ్చును. ఈ యారంభమునందు శుభసూచకలక్షణములు గానవచ్చి, అట్టి మహోన్నతపదవి భారతదేశచిత్రలేఖనమునకు వచ్చునను కొండంతటి యాస భారతీయుని హృదయమున నిండి, తావు చాలక పైకుబ్బి పొంగి పొరలుచున్నది. ఆమహాశాప్రవాహము నిచ్చవచ్చిన దోవల బోవనీయక, దాని వశపరచుకొని, మంచి మార్గమున బెట్టి, గమ్యస్థానముం జేర్చుటే భారతీయుని విధి యై యున్నది. అట్లు కాక ప్రస్తుతమున గలిగిన యాశాప్రవాహము దాని యిచ్చవచ్చినరీతిని బోవనిచ్చినచో

బోడికొండపై గురిసిన వర్షమట్లల్పకాలము
లో, నెక్కడిదక్కడ నే మాయమై పోవును
దేశమునందు నెట్టియౌన్నత్యమునకు నైన
ముఖ్యముగా తోడ్పడునది యాశయొక్క
యుద్రేకము. ఆయుద్రేక మొక్కొకసారి కలుగు
చుండును. అది పాలపొంగువంటిది. దానికి నిలు
కడ స్వభావము లేదు. నిలుకడస్వభావమే యు
న్నచో నది యుద్రేక మనబడదు. పురుషులకు
శౌర్య మెట్టిదో దేశజనులం కీయుద్రేక మట్టిది.
అదిసర్వసాధారణముగా నడగియుండియును,
ఒక్కొక కాలమునందు విపరీతబలయుతమై,
పై కుబ్బుకొని వచ్చును. అట్లు లుబ్బుకొని
వచ్చిన యుద్రేకమును చావనీయక, దాని
యిచ్చవచ్చినతీరున బోవనీయక, జాగ్రత్తగా
లొంగించుకొని దేశౌన్నత్యమున కనువులగు
మార్గములందు బ్రవేశపెట్టినచో దాని ఫలి
తముం బొందగలము. చిత్రలేఖనమునందు
గలయాసక్తి యీయాశాప్రవాహమునుగమ్య
స్థానము జేరునట్లుగా జేయునని యనుటకు
ముందుగా, నాగమ్యస్థానమన నెట్టిదియో
విచారింపవలసియున్నది. ప్రస్తుతమందు వన్నె
కెక్కియున్న బంగాళాదేశచిత్రలేఖనమును,
ఆంధ్రచిత్రలేఖనమును, ఆగమ్యస్థానమున కెం
తదూరములో నున్నవో కూడ మనము పరి
శీలింపవలయును. ఆగమ్యస్థానముం జేరుటకు
వంగదేశచిత్రలేఖనమునకంటెను మనయాంధ్ర
దేశచిత్రలేఖనమున కెక్కువగా నవకాశము
లున్నవని నానమ్మకము. అదియు నీవ్యాస
మందు జర్చింపవలయును.

ఇదివరలో నివ్యాసములందు కవిత్వము
వలెనే చిత్రలేఖనముగూడ కర్తయొక్క భావ
ములం జూపించునని యనేకసారు లంటిమి.
చిత్రము చిత్రకారునిభావముం జూపించు
టొక్కపనియే చేయునా, లేక, దానివలన
మరియొకవిధమగు కార్యముగూడ నేదియైన
నున్నదా? కవిత్వమునందు పదములయొక్క
కూర్పు మున్నగులక్షణము లేతీరున భావము
నకు బైబడి యందముచందముం గల్పించుచు
న్నవో, ఆతీరుననే చిత్రలేఖనమునందుగూడ,
లక్షణము, భావమునకు బైబడి చిత్రమునకు
వన్నె నిచ్చి చూపఱుల కానందము నొసంగు
చున్నది. చూపఱుల కానందమిచ్చుటకూడ
చిత్రముయొక్కయుద్దేశమని చెప్పకపోలు లేదు.
లేనిచో నింటిప్లానులనుగూడ చిత్రములనవలసి
వచ్చునేమో! చిత్రములకు రంగు లుపయో
గించుట, చిత్రములందు మనుష్యులను వ్రాయు
టలో మనుజశరీరముల ననుసరించి వ్రాయుట,
మున్నగు నిజచిత్రలక్షణములు, భావముం
జూపు టొక్కటియే కాక, చిత్రమును చూప
ఱుల కానందము నొసంగగల్గు నందముగల్గి
యుండునట్లు చేయుచున్నవి. చిత్రము నేత్ర
పర్వ మొనర్చును. అట్లు నేత్రపర్వమొనర్చుట
చిత్రముయొక్క యుద్దేశములలో నొకటియై
యున్నది. భావగర్భితమై యుండి చిత్రము
నేత్రానందకరమై యొప్పారవలెను. అట్లు నేత్రా
నందకరముగాక భావము నొక్కటినే చూపు
చిత్రమునందు లక్షణ మంతగా కనుపట్టదు.
ఉండవలసిన లక్షణము నుండనీయక భావమే
ప్రధానమని వ్రాసినచిత్రములు, ప్రకృతి నను

సరించి యుండవు. ప్రకృతివిపరీతము లెట్లును జిత్రములు కానేరవు. ప్రకృతి ననుసరింపనియెడల, నట్టి వానిని చిత్రము లనుటలో నర్థము లేదు. భక్తిపరవశుడైననరునియొక్క చిత్రము వ్రాయునప్పుడు, నిజమానవస్వరూపమునే వ్రాయవలయుంగాని, యేదియో వికారాకారముం గల్పించి దానిని మానవుడనినచో బాగుండునా? అది బాగుండునని వాదించువారును గలరు. కాని వారియభిప్రాయములతో నిమిత్తము లేకయే యట్టివి యుత్తమచిత్రములు గానేరవని మనము నిశ్చయించి చెప్పవచ్చును. ఎందుచేతననగా నిజముగా మానవునిబోలనిబొమ్మ, మానవుడేయని మన మేల తలంపవలయును? కుండ్రనియున్న జట్టి దానికి మనుజునిపేరు పెట్టుకొనరాదా? పోలిక లేకుండుట కేయాకృతియైన నేమి? అట్టివాదమును మరింతదూరము సాగించినవారికి సర్వవస్తువులకు నాకార మొక్కటియే యని కూడ బోధయగునేమో! గానమున రాగములన్నియు నొకేతీరునవినవచ్చుననువారు లేరా? అదికారణమున వస్తురూపము రంగు, వస్తుదూరము, వస్తుతారతమ్యము, వెలుగునీడలు, మున్నగాగలముఖ్యలక్షణముల నన్నింటిని, చిత్రమునందు జూపించుచు, భావమునకు ప్రాముఖ్యము నొసంగుచు వ్రాయబడుచిత్రములే యుత్తమ చిత్రము లనబడును. అట్లు వ్రాయుట కష్టసాధ్య మయ్యు నసాధ్యము కాదు.

అట్లని లక్షణము భావమునకంటె చిత్రమునందు ముఖ్యమైనదని యెవ్వరును జెప్పరాదు. భావమే ముఖ్యమైనదనియును భావములేనిచిత్రము నిర్జీవమనియును ఇదివరకే మనమెరింగియున్నారముగదా. లక్షణము భావమునకు వెనుకవచ్చునని చెప్పవలయును. లక్షణము భావమునకు లొంగియుండవలయును. ఇంత కంటె నీసంగతు లెరుంగుటకై మనమొకయుదాహరణముం దీసుకొని, దానిమూలమున నీసత్యముం గ్రహింప బ్రయత్నింతము. కాటికాపరియైనహరిశ్చంద్రునిబొమ్మ వ్రాయుదము. తొలుతనాబొమ్మలో నేమేమి చూపింపవలయును? రాత్రి, నిర్మానుష్యమైన దహనభూమి, విపరీతౌదార్యస్వభావుడై, మహాసత్యవంతుడై, కర్మవశంబున దండధరుడై కాటికాపరియైన హరిశ్చంద్రుడు. వీనినికదా వ్రాయవలయును? ఈభావములు చిత్రమునం దెంతయు గొప్పగానుండును. చిత్రమునకుదగియున్నవి. అట్టివానిని జూపించుట చిత్రకారుని భావనాశక్తిని జూపింపగలదు. కాని యిచ్చట లక్షణమంత సరిగా జూపుట కవకాశము లేదు. ఏలయనగా, నర్థరాత్రమందు గాఢాంధకారలీనమై యదృశ్యమగు భూప్రదేశమున మనుష్యుడున్నట్టులును, వానియౌదార్యభావములు కానవచ్చునట్టులును, చూపించుట లక్షణవిరుద్ధముగాదా? వెలుగున్నగాని వస్తువులు గోచరింపవు. ఇచ్చట వెలుగులేదు. హరిశ్చంద్రుడు మనకగుపడుట కవకాశ మేది? అందువలన నిట్టిచోట్ల భావమునకే ప్రాముఖ్యము నొసంగి లక్షణమును దాని వెనుక వచ్చునట్టుల జేయవలసియున్నది. ఇంతవరకును లక్షణము భావము తోడ బుజములపై జేతులు వైచికొని వచ్చియు, నిచ్చటమాత్రము, భావమునకు

జోటిచ్చి తా వెనుక బడినది. ఇంతవరకే లక్షణముం గాపాడవలయును. ఇంతవరకును గాపాడక తీరదు? లక్షణముండక తప్పదు. భావమున కది యపకృతి సేయరాదు. భావమున కెదురేగనిలక్షణము చిత్రమున కావశ్యకమే.

తరువాత - యేయేభావములు చిత్రములందు జూపింపవచ్చునో, యెయ్యవి చిత్రముల కర్హములు గావో, చిత్రకారునిభావప్రపంచమునకు విస్తీర్ణ మెంతయో, విచారింపవలసియున్నది. దీనిని లెక్కప్రకారము నిర్ణయించి చెప్పుట కవకాశములేదు. అయినను సాధ్యమగునంతవరకు దీనిని నిర్ణయింపక తీరదు. మానవునిభావప్రపంచమునకు మేరలు లేవు. దాని విస్తీర్ణ మింతయని కాని, దాని హద్దులియ్యవియని కాని, వచించుట కెవ్వరికిని సాధ్యము కాదు. అట్టు లాద్యంతములు లేని భావప్రపంచమున నుద్భవించు భావముల నన్నింటిని, చిత్రరూపమున జూపింపవచ్చునా, లేక యీచిత్రలేఖనముయొక్క వాడుకకు హద్దులున్నవా యని ప్రశ్న. కొన్నిభావములను జూపించుటకు కవి కవకాశము లేదు. ఆరీతినే చిత్రకారుడుకూడ కొన్నిభావములం జూపింపజాలడు. దీనికిగూడ నొక యుదాహరణముం దీసుకొందము. మగవేషము వేసుకొని జనులను మోసపుచ్చిన స్త్రీయొక్క బొమ్మ వ్రాయవలె ననుకొందము - అట్టియెడల చిత్రకారుడు పురుషునిచిత్రమునే వ్రాయవలసియుండును. మగవేషము వేసికొనినదనుభావము నాతడు చిత్రమునందు జూపింపనేరడుకదా! అట్లు చూపించినను మన మెరుగగల్గువిషయమును మోసపోయినవారెరుంగకుందురా, మోసపుచ్చజాలిన వేషమును మనముమాత్ర మెట్లెరుంగగలమని ప్రశ్నింపవలసివచ్చును. కాన నట్టిసందర్భములందు చిత్రకారుడు కొంతవరకే తనకవకాశ మున్నదని యొప్పుకొనక తప్పదు. ఉత్కృష్టభావముల నన్నింటిని చిత్రకారుడు చూపింపగలడు. కవి యెట్టిభావములం దెలియజేయగలడో, చిత్రకారుడుకూడ నాభావముల దెలియజాలును. కొండకు లోపల గనులున్నవని చూపింప గలడా? పైప్రపంచమునందు గానవచ్చుభావముల నెల్ల నాతడు చూపింపజాలును. అట్లొకవేళ గానరాకుండియు, కానవచ్చుట కవకాశముండి ప్రకృతివిపరీతములు కాని భావములంగూడ నాతడు చూపింపగల్గును. పూర్తిగా మంచివాడైన వాడీ ప్రపంచమున గానరాడు. కాని యట్టివాడుండుట కవకాశము లేకపోలేదు. అట్టియెడల చిత్రకారు డట్టి వానిం జిత్రించి, వానిముఖమునం దావిపరీతసుగుణముం జూపింప వచ్చును. అట్టిముఖము కలదాయని ప్రశ్నింపరాదు. ఉండుట కవకాశమున్నచో జాలును. భావముం జూపుచు లక్షణవిరుద్ధము కాకున్న జాలును. చిత్రకారుని చిత్రమునందు లోపములేనియందకత్తెలం జూచుచున్నాము కామా? అట్టివారిని లోకములో జూచుచున్నామా? ఒకచోట సొగసైనకన్నులను, వేరొకచోట సొగసైన శరీరచ్ఛాయయు మరియొకచోట నందములగు చేతులను, జూచుచున్నామా? అట్టివానినన్నిటి నొకస్త్రీయందు

జేర్చి చిత్రకారుడు తనభావమునందు గల్పింపబడిన నట్టిదాని జిత్రమునందు జిత్రింపనచ్చును. అందుస్పష్టివ్యతిరేకస్వభావములు లేకున్నప్పుడట్టిస్త్రీ యెందుల కుండగూడదు? అది చిత్రకారునికి వలయు ప్రశ్న.

చిత్రకారునిభావమును తానే చిత్రమునందు జూపుచుండుట స్వాభావికమును సాధారణము నై యున్నది. కవికిని చిత్రకారునకును భావప్రకటనమునం దిసుమంతేనియు భేదము లేదని యంటిమికదా! ఇప్పుడింకొక విషయమును గమనింప వలసియున్నది. ఒకభావమును కవి తనగీతమునందు పాడును. ఆభావమునే చిత్రకారు డాగీతము నాలించుపైన దనలోన గలిగిన రసోద్రేకము ననుసరించి చిత్రించును. ఈచిత్రము చిత్రకారునియొక్క భావమును గాక, కవియొక్కభావమును దేటపరచును. చాలవరకు దానినే వృద్ధిగావించును. (Illustrations). ఇట్టు లొకకవి రచించిన కావ్యములందలిభావములను చిత్రకారుడు చిత్రింప, నట్టిచిత్రలేఖన ముత్కృష్టమైనదా కాదా యని యొకప్రశ్న. కాదనువాదము న్యాయమైనది కాదని నాయభిప్రాయము. ఎందుచేత ననగా భావము మంచిదైనప్పుడు, తద్భావమును బడసినపురుషు డెవ్వడైన నేమి? దాని నెన్నివిధముల ప్రపంచమునకు బోధింపనలవియో, యన్నితెరగుల బోధించుట యుక్తమేకదా! ముఖ్యముగా మన దేశమం దీజాతిచిత్రలేఖనము చాల తక్కువగా నున్నది. దీనియొక్క ప్రాముఖ్యము చాలగా నున్నది. చిన్నచిన్న కథలను సచిత్రములుగా ప్రచురించునప్పుడు వానిం జదువు బాలురకు గలిగెడి జ్ఞానమునకును, చిత్రములు లేకుండగనే చదివినప్పుడు వారికి గలుగుజ్ఞానమునకును, చాలవరకు భేదమున్నది. పిన్నలకు గాని పెద్దలకు గాని భావములు మనస్సునందు బొమ్మలబొడకట్టజేయుట, బుద్ధిస్వభావమై యున్నది. "అల వైకుంఠపురమ్ములో, నగరులో, నామూలసౌధంబు దాపల" అనుట వినువెంటనే, వినువారిమనోవీథిలో, నొకపట్టణమును, అందులో నొకదివ్యమగునగరు, అందొకమూల నిర్మింపబడియున్న సౌధమును, ప్రపంచములో నున్నతెరంగున బొడకట్టును. వర్ణన వృద్ధియైనకొలది, నామానసికచిత్రమునందలి వస్తుతత్వము, వస్తుసముదాయముకూడ, దానికనుగుణముగా, ననుక్షణము గల్పింపబడుచునే యుండును. అట్టిమానసికచిత్రకల్పనాశక్తి కేవల మప్రయత్నమైనది. అది కొందరు బుద్ధిమంతులకు చాల విపులముగా నుండి, చెప్పబడనియంశములకు గూడ తావు నిచ్చి యాచిత్రమున జీవమును గల్పింపజేయును. మఱికొందరి కట్టిచిత్రములే కల్పింపబడవు: ఒకచో గల్పింపబడినను భావానుసరణములై యుండనేరవు. నిజబుద్ధిశాలి యగుచిత్రకారునికి, నట్టిమానసిక చిత్రకల్పనాశక్తి యమరియుండును. అది చిత్రకారుని కమరుట స్వాభావికము. అట్లాతనికి బొడకట్టిన చిత్రము నాతడు నిజముగా జిత్రించినప్పుడు, సామాన్యజనులకు, నాభావము చిత్రసాహాయ్యము లేకుండునప్పటివలె నేదియో కలలోనిసంగతివలె నిరాకారము నబోధమునై యుండక, స్పష్టమై నాటుకొని పోవును. ఒక

ఘోరవనముం గూర్చి యెన్నడు నడవియన నెఱుంగని పట్టణవాస్తవ్యున కెన్నివిధముల బెంచి చెప్పినను, దానిని జనస్వభావము బుద్ధికి గోచరించుట కష్టము. అట్టిదానిని చిత్రము నందు జూపించినచో, మాటలసహాయ మెంత తక్కువగా నున్నను, ఆచిత్రమువలన నా యడివిలోని ప్రకృతిస్థితి నాతడు నిజముగా జూచినరీతిని తెలియగలడు. ఈ కారణములం బట్టి కవులు వ్రాయు గ్రంథములలోని యుత్కృష్ట భావములను వెల్లడిజేయుటకు చిత్రలేఖనము సాయపడుట ముఖ్యమని చెప్పకతీరదు. ఒక గొప్పపట్టణమును నిర్మించునప్పుడు, దానిలోని భవననిర్మాణమును శిల్పి చేయుచున్నాడు. భవనమునకు రంగులు చిత్రకారుడు వేయుచున్నాడు. కార్య మొక్కటియే యైనను దాని పెంపునకు వేరు వేరు పనులలో నారితేఱినవారు వారివారిచాకచక్యములం జూపి తోడ్పడుచున్నారు. అట్లే ఒకేభావమును కవి కావ్యరూపమున బోధింప చిత్రకారుడు చిత్రమూలమున దానినే దృఢపరుపవచ్చును. అట్లు చేయుటయు ముఖ్యమే. సద్గ్రంథములన్నియు సచిత్రములై యుండుటకంటె, మంచిపనియున్నదా? ఆంధ్రమహాభారతమున నెన్నితావుల బొమ్మ లవసరమో యోజింపుడు. ఎన్నెన్నిచోట్ల బొమ్మలు లేకుండియును, భారతము చదువరుల కెవ్వియో బొమ్మలు దమ బుద్ధిలో గల్పింపజేయునో అట్టిచోట్ల ఘనులగు చిత్రకారులచే జిత్రింపబడిన చిత్రములుకూడ నున్నచో నెంత యుపయోగకరములుగా నుండునో చెప్ప బనిలేమున్నది? ఈజాతిచిత్రలేఖనము మనదేశమునందు జాల యభివృద్ధి జెందవలసియున్నది. అదియును ప్రారంభించెననుటలో సందియము లేదు. ఎందుచేతననగా ప్రస్తుతము మనదేశమునందు చిత్రింపబడుచున్న చిత్రములలో చాలవరకు పూర్వగ్రంథములందలి పద్యములలోనిభావములుగా నున్నవి. అట్టిగ్రంథములను మరల ముద్రించునప్పు డాయాచిత్రములం గూడ నందందు నమర్చి ముద్రించునట్లు పునర్ముద్రణ మొనర్చువారిబాధ్యత యై యున్నది.

నటునకు, చిత్రకారునకు నీవిషయమున చక్కనిపోలిక యున్నది. నాటకకర్త ప్రపంచముం బరిశీలించి పరిశీలించి, మానవస్వభావరహస్యములం గ్రహించి గ్రహించి తననాటకములం దాస్వభావములం జూపి, యీప్రపంచమునకు నీప్రపంచమునే తననాటకదర్పణమున జూపించుచున్నాడు. అట్టినాటకకర్త యొక్కభావమునందు జొచ్చి దానిని సవిస్తరముగా నెఱింగి, నటుడు తన్నాటకమును రసభావోచితమగునట్టులు నటించి, ప్రపంచమునకు దెలుపుచున్నాడు. నాటకమున కెంత ప్రాముఖ్య మీయవలయునో, నటునకుగూడ నంతటిప్రాముఖ్యము నొసంగక తీరదు. అంతకంటె నెక్కువగా నీయతగదు. ఆరీతినే చిత్రకారుడు కవిభావములను చిత్రములందు జూపవలయును. నటునివలన నాటకము రంగస్థలమున బ్రత్యక్షము గావింపబడునట్లే, చిత్రకారునివలన కవిభావము పటమున బ్రత్యక్షము గావింపబడును. అట్లు ప్రత్యక్షమైననేకదా భావము జనసామాన్యమునకు సులభగ్రాహ్యమై నాటుకొనగలదు?

ఈసందర్భమున నాంధ్రచిత్రకళా ప్రాగ
ల్భ్యముంగూర్చి యించుక విచారింపవలసియు
న్నది. ఇదివరకొకవ్యాసమందు, పాశ్చాత్య
చిత్రలేఖనము లక్షణయుతమయ్యెను, చాల
వరకు భావహీనమై యున్నదనియును, వంగ
దేశచిత్రలేఖనము భావగర్భితమయ్యెను, లక్ష
ణహీనమే కాక లక్షణవిరుద్ధముకూడనై యున్న
దనియును, చెప్పియున్నాము. ఈవిషయమునే
యిచ్చట నించుక విపులముగా దెలుపవలసి
యున్నది.

ఆధునిక భారతచిత్రకళావైభవ సౌధ
నిర్మాతలమని తలంచుచు, వంగదేశీయు లొక
విధమగు నూతనమార్గము నవలంబించి, చిత్ర
ములవ్రాసి, భావప్రధానచిత్రవృక్షమునకు
బీజమును నాటినారు. అది నిర్వివాదాంశము. ఈ
మార్గము కేవలము నూతనమైనదగునా కాదా
యని ప్రశ్నించుటయును ప్రస్తుతాంశమునకు
లాభకారికాదు. అది యటుండ, కేవల నూ
తనము లెంచను నుండ జాలవు. ఎట్టినూతన
కార్యమైనను ప్రాతవానితో సంబంధము గలిగి
యుండక తప్పదు. పుష్పములు క్రొత్తవి విక
సించుచున్నను లతమాత్రము ప్రాతదేకదా! ఆరీ
తినే ప్రస్తుతవంగదేశచిత్రకళావైఖరి. నూతన
మైనదనుటలో పూర్వభారత చిత్రలేఖనము
నకును, దీనికిని సంబంధము లేదను నర్థము తీసు
కొనరాదు దీని గాపాడుచున్న చిత్రకళాశాస్త్ర
సూత్రములు, పూర్వసూత్రములే కాని, వాని
యందే కొన్ని మార్పులను జేసి, కేవల భావ
ప్రధానములగు జిత్రములను వారు సృష్టించు
చున్నారు. వారి చిత్రములు కేవల మనుభా
వమును సూచించుటకే చిత్రింపబడుచున్నవి.
అందు లక్షణమునకు ప్రాముఖ్య మొసంగక,
చిక్కనిరంగులమైత్రియు, కమ్మని రేఖాలాలి
త్యమును జూపి, చిత్రకారులు తమతమ గూ
ఢభావములను బ్రౌఢముగా జూపించుచున్నారు.
ఇట్టి యభిప్రాయము లాదేశమున వృద్ధియై
వృద్ధియై తుదకు సందరు చిత్రకారులు నీ
నూతనమార్గగాములై భావసాధముల జేరు
కొన బ్రయత్నించుచున్నారు. అట్టి బంగాళా
చిత్రములయందలి గుణములు సంస్తవనీ
యములు. వానింగూర్చి భారతీయులు గర్వప
డవలసినదే కాని యాచిత్రములందు, లక్షణ
ము బొత్తిగా కానరాలేదు. ఒకరిద్దరు, ఘను
లగు చిత్రకారులను విడిచినచో వంగదేశము
నం దీనాడు బయలువెడలుచున్న తక్కిన
చిత్రకారుల చిత్రములన్నియు విలక్షణములని
చెప్పుట యం దసత్యము రవ్వంతయు లేదు.
ఈబంగాళాచిత్రకారుల కజంతాచిత్రములే
తొలుతనుండియు బ్రోత్సాహము గలిగించిన
వి. అవియే వారికి పూనాది నొసంగినవి. పా
శ్చాత్య చిత్రకారులు లట్లుగాక, లక్షణయు
తములైన చిత్రములను జిత్రించియును, వాని
యందు తమభావములకు జోటు నీయకు
న్నారు. ఫొటోగ్రాఫుయంత్రమునకును పా
శ్చాత్యచిత్రకారునకును భేద మేమియును
లేదని చెప్పుకొందరిపలుకులు నిజములని నమ్మ
కముగల్గించు చిత్రములుకూడ పశ్చిమదేశము
లనుండి వెలువడుచున్నవి. అట్లని పాశ్చాత్య
చిత్రకారులందరును బుద్ధిహీనులని పల్కుట,
మనబుద్ధిహీనతం దెలుపును. నిజమగు

బుద్ధికలవారు, స్థలకాలభేదములతో నిమిత్తము లేక పుట్టుచుందురు. అంతరించుచుందురు. షేక్స్పియరు ఇంగ్లాండునను, కాళిదాసు హిందూదేశమునను, డాంటే, ఇటలీలోను పుట్టి సమానబుద్ధిమంతులని చరిత్రలందు పేరెక్కలేదా? ఇంగ్లాండుయొక్క, మహోన్నత్యదశ కాని, హిందూదేశముయొక్క దుర్దశ కాని, ఇటలీయొక్క మధ్యమస్థితి కాని, యీ మహాబుద్ధుల జీవితములందలి ఘనతను వారి గ్రంథములయొక్క జ్ఞానవిభవమును మార్పగల్గెనా? యేసుక్రీస్తు యేనాటివాడు? మహాత్ముఁ డేనాటివాడు? కాలముతో నిందుసంబంధ మేమున్నది? అందువలన విపరీతవ్యక్తులను విడిచిపెట్టి చూచినచో పాశ్చాత్య దేశములందు భావహీనములగు చిత్రములను, వంగదేశమున లక్షణహీనములగు చిత్రములును జాలవరకు గాన నగుచున్నవి.

ప్రస్తుతాంధ్ర చిత్రకారులలో బుద్ధిమంతులగువారందరు, నీసత్యముం గ్రహించి, నిజచిత్రలేఖనము వృద్ధిచేయుసంకల్పముతో, పాశ్చాత్యుల మార్గముంగాని, వంగదేశీయుల మార్గముంగాని కేవలముగా నవలంబింపక, నందు నిందు గలమంచిగుణముల గ్రహించి, స్వాంధ్ర చిత్రలేఖనావిభవమును నీనాటికిని వెల్లడిచేయుచున్న యజంతాచిత్రముల లోని శాస్త్రసూత్రముల ననుసరించి స్వచ్ఛమగు నాంధ్రచిత్రలేఖనమును పోషించి పెంచుచున్నారు. ఈ నూతనాంధ్ర చిత్రకళావిభవము, చిత్రప్రదర్శనములందు కొలది సంవత్సరములనుండి పేరెక్కుచు వచ్చుచున్నది. క్రమక్రమముగా, దానిఘనత హెచ్చుగాక మానదు.

ఇందు భావము ప్రధానమే యైయున్నది. అట్లని లక్షణము వెనుకబడియుండలేదు. భావము నంతటిప్రధానస్థానము గాకున్నను, భావము తరువాత మరల నంతటి యున్నతస్థానము నాక్రమించిలక్షణము చిత్రములగాపాడుచున్నది. ఇందుచక్కని రంగులమైత్రి, మెత్తదనము గిల్గియొప్పచున్నది. రేఖాలాలిత్యము నీ చిత్రకారులు మోటుతనమెరుగని చేతులతో బెంచుచున్నారు. అన్నివిధములను వీరిచిత్రములు భారతదేశమునకు వన్నెతేదగియున్నవి.

ఈ యాధునికాంధ్రచిత్రములలోఁగూడ కొన్ని లోపము లున్నవని చెప్పవలయును. ఇందు రెండులోపములు కానవచ్చుచున్నవి. అందొకటి వెలుగునీడలు బొత్తుగా జూపకుండుట, వెలుగునీడలు చూపమానుట యనునది. భావమునకు మచ్చదెచ్చు పట్లనైనచో నది, లోపము కానేరదు. లక్షణమును విడచుటకు దగినకారణ మొక్కటియే. భావమునకు లక్షణ మపకృతిసల్పునప్పుడే లక్షణమును విడువవలయును. లేకున్నచో విడువరాదు. ప్రస్తుతాంధ్రచిత్రము లన్నిటియందును వెల్గునీడలు మానివేయుచున్నారు! అదిమానకుండ, వానిం గాపాడు కొనియే భావము లేలచూపరాదో! వెలుగునీడలను బాగుగా జూపించినచో, రేఖాలాలిత్యమున కవకాశ ముండదని సంగతి నిజమే! అట్టిపట్టున, రేఖాలాలిత్యముం బాడొనరింపకుండువరకు వెలుగు నీడల జూపవచ్చునే! అది యట్లుండ, రెండవయది:—

చిత్రింపబడు పాత్రలముఖములందు భావప్రకటన ముండక పోవుట. చిత్రకారుడు భావముం దెలియజేయుటకు (అంతకంటెను ముందుగ నెంచవలసినసంగతి) ప్రకృతిలో హృదయభావము లితరు లెఱుంగుటకు నాధారమై యున్నది ముఖలక్షణము. సర్వరసములను, భావములను, ముఖమునందు గాననగును. అట్లు కాననగువానినే చిత్రకారుడు చిత్రమునందు జిత్రించుచున్నాడు. అంతటి ముఖ్యములైన ముఖలక్షణములందా భావప్రకటనము లేనిచో, చిత్రమునందే లేదని చెప్పవలయును. రంగులమైత్రియు, రేఖాలాలిత్యమును, తక్కినలక్షణములు ముఖమునందీ భావప్రకటన మున్నపైన, దానికి దోడుపడి, దానినే పోషించుచుండును గాని యది లేనిదే, వాని యంతట నయ్యవి, భావమును సూచింపగలుగు సామర్థ్యముగలవి కావు. అందువలన నిది యొకలోపము. ఈరెండులోపములును లేక, యేనాడాంధ్రచిత్రకళ నిర్దుష్టమై యొప్పునో ఆనాడు భారతదేశ చిత్రలేఖనానైపుణి యున్నతసోపాన మెక్కినదని యనవలసినదే.

ఉన్నతసోపానమన నెయ్యది? దానికొక హద్దుకలదా? మహోన్నతదశ యనునది యిట్టిదని పేరు పెట్టి చెప్పనలవికాదు. దానికి హద్దులు లేవు. అది జనులు దరిజేరుచున్న కొలదిని దూరమగుచుండును. ఆశ కంతములేనట్టులనే, యీమహోన్నతపదవికిని అంతములేదు. ఈచిత్రలేఖనావైభవముకూడ నట్టులే. భారతదేశమం దంతరహితమైన మహోన్నతదశకు నెక్కుచున్నది.

కళకు జావన్నది యుండదు. ఎంతటిదురవస్థలోనైన నది వృద్ధియగుటకే ప్రయత్నించును. ఐరోపామహాసంగ్రామము, యూరపునందలి కవిత్వముం గాని, చిత్రలేఖనము గాని, మరియేకళం గాని చంపగలిగినదా? పనిముట్లు ధ్వంసము కావచ్చును. పట్టణములు నాశనము కావచ్చును. జనులు మృతినొందవచ్చును. కళకుమాత్రము నాశములేదు. ప్రపంచమం దేకాలమునందునైన నది వృద్ధిజెందుటకే ప్రయత్నించుచుండును. భారతదేశమం దిప్పుడు జన్మించి యౌన్నత్యము గాంచ బ్రయత్నించుచున్న నూతన చిత్రలేఖనవైఖరి యీదేశమునందు ప్రస్తుతకాలమున నన్నియు నుత్కృష్టములే యైన చిత్రములను బయటికి దెచ్చుచున్నదనియను జెప్ప జాలము. ఏ నూతనోద్యమమునందైన ఫలితములు మంచిచెడ్డల కూటమిగలిగియుండును. అందు సాధారణముగా చెడ్డయే యెక్కువగా మేళనమైయుండును. నూతనాంధ్రకవిత్వప్రవాహమున నంతయు మధు వేపారుచున్నదా? గనులనుండి వజ్రముల త్రవ్వి తీయునపు డెన్నియో పనికిమాలిన రాళ్ళను త్రవ్వుచుండలేదా? ఎన్ని రాళ్ళనో తీయగాతీయగా మధ్య నొకవజ్రము బయలుదేరుచున్నది. అట్టి రాళ్ళురాకుండ, వజ్రములే రావలెనన్నచో, నది యెన్నడును కలుగనేరదు. క్రొత్తగా దున్ని, విత్తు చల్లిన భూప్రదేశమున చేనుతోపాటు వివిధములగు గడ్డిమొక్కలు పుట్టుచుండుటలేదా? అట్టియెడల, నాగడ్డిమొక్కల నూడదీసి, చేనునకు నీరుపెట్టి, పెంచి ఫలవంతమగునట్టుల చేయుట

యే వ్యవసాయదారునివిధి. ఆరీతినే ప్రస్తుతమున వచ్చు చిత్రములందలి మంచివానికి గౌరవ మొసంగి చెడ్డవాని నడచి విమర్శనాతీర్థమువలన నాంధ్ర చిత్రలేఖనవృక్షముం బెంచుటయే యాంధ్రుని విధి. ఏకళాభివృద్ధికైనను విమర్శనమును విమర్శకుడున్న ముఖ్యములు. విమర్శకుడు, కళానౌక నాశాసముద్రమునందు గాపాడి గమ్యస్థానముం జేర్పగలడు. కళకు విమర్శనము పునాది యగుచుండును. భవన నిర్మాణమునం దిటుకల నంటించు సున్నము వలె విమర్శనము, చిత్ర కళాభవన నిర్మాణమునందు చిత్రములకును చిత్రములకును సంబంధము లేర్పరచి వానినన్నిటికి నైక్యము నిచ్చి నిలుపును. ఎదుగుచున్నలతకు, ప్రక్కను ప్రాతియున్నకొయ్య యెట్టిదో, వృద్ధికాగల కళకు విమర్శనమట్టిది. అందువలన, మంచి చెడ్డల విమర్శించి, గుణపూరితములగు చిత్రముల భూషించి, వికృతచిత్రములం దూషించి, చిత్రకళం గాపాడుట, వృద్ధికై తోడ్పడుట, విమర్శకుని పనియైయున్నది. అట్టి విమర్శకులుకూడ మన దేశమం దీనాడు పలువు రుద్భవించుచుండుటయు దేశభాగ్యమే.

---

# రాధవలపు

మంగిపూడి వేంకట శర్మగారు

చెన్నలరారు నీ సొగసు చిన్నెలు వన్నెలుచూచి మెచ్చినీ,
కెన్నడు నాపయిన్ దయ జనించు నికెన్నడు నన్నునేలు దిం
కెన్నడు నాదుజన్మ తరియించు నికెన్నడి కెన్నడంచు నీ
చిన్నతనంబునుండి తమి జెంది భజించుచునున్న నన్నిటుల్
చిన్నతనంబునన్ బొగుల జేయుట న్యాయమటే మనోహరా!

ఉ. చిక్కనివాని జేసితిని చిత్రపుటాసలచక్కరుక్కరల్
చిక్కనిపాలు మీగడలు జిన్ను (?) వెన్నలువెట్టి యేరికిన్
జిక్కనివాడవైతివని చెందితిగర్వము నాకె నీవిటుల్
చిక్కనివాడవై వెతల జిక్కగ జేయుదువా మనోభవా!

ఉ. చక్కనివాడవైన నెరజాణడవైన నిజాలకున్ నినున్
జిక్కనివానిగా వలపు చేయక నీపయి మగ్గ చెందుటల్
చిక్కని చింతచేయకయె చిక్కితి చిక్కితి చింతవంతలన్
చక్కని శాస్తిచేసితివి చాలురె! బాగరరే! మనోహరా!

ఉ. లోకువవాడవంచు నిను లోనొనవచ్చునటంచు నెంచియే
లోకులెటాడుకొన్న మదిలోగక మేల్పడి నీకు మోహపున్
వాకను గ్రుంకి గ్రుంగి వసివాడితి వేడితినాకు నీకృపా
లోకమె లేకపోయె నయొ! లోకమికేలర! నామనోహరా!

# బ్రాహ్మణుఁడు: నాఁడు-నేఁడు

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

స్వార్థపరిత్యాగ సాధుశీలములచేఁ, గన్న జగన్మాన్యఘనపదమ్ము
జపహోమవర తపస్స్వాధ్యాయనిరతిని, దొరికిన యైహికగురుపదమ్ము
దాన దయాసత్యధర్మప్రబుద్ధిచేఁ, బడసిన యారాధ్యభక్తిపదము
పరతత్త్వవిజ్ఞాన పరమానుభూతి సంభవమైన యతులితబ్రహ్మపదము
మహిత బుద్ధిజాడ్యజనితోన్మాదముచేతఁ, గోలుపడి తొంటి తేజంబు డీలుపడఁగ
స్వార్థపరతను కానిత్రోవల మెలంగి, పతితుఁడైనాఁడు నేఁడార్యబ్రాహ్మణుండు.

ప్రచండముగ వీచుచున్న గాలితుపానుమూలమున పెళపెళమని ప్రోడుమ్రాఁకులు విరిగి పోవుచున్నవి. ఏండ్లతరబడినుండి పెరిగి పాతాళమున కంతకును వ్రేళ్లు తన్నుకొని వర్ధిల్లుచు వచ్చినవృక్షరాజములు నెత్తుగ నొక్కగాలిపెట్టునకు సమూలముగఁ బెల్లగిలి పోవుచున్నవి. వాతావరణమంతయు మహాబీభత్సముగ నున్నది. అంతయు సంక్షోభము, కలవరము, అశాంతి, విపరీతప్రవర్తనముతక్క దృగ్గోచరమగునది వేఱెదియు లేదు. భీతావహమైనయీబీభత్సప్రదర్శనమున కాలపురుషుఁడు విలయాత్మకమైనదివ్యగానము సేయుచు, భావప్రపంచమును జల్లడింపఁజేయుచున్నాఁడు. కాలపురుషునివిలయస్పర్శ భౌతికప్రవృత్తికొకవిలక్షణమైనక్రొత్తరూపము నిచ్చుచున్నది. బ్రాహ్మణుఁడా! ప్రపంచము మారుచున్నది. ప్రవృత్తులు మారుచున్నవి. అఖండశక్తియుతుఁడైనలయమూర్తియొక్క యకాండతాండవమున నేఁడు ప్రపంచ మంతయు కలఁగి సంక్షుభితమగుచున్నది. ప్రపంచమున నన్నియుఁ దారుమారగుచున్నవి. మందుఁడా! ప్రళయకాలమేఘగర్జాసదృశములైన చప్పుళ్లు నీకు వినవచ్చుటలేదా? రాఁగలకాలపు ప్రపంచప్రవృత్తి నీకు నయనగోచరమగుటలేదా? ఆలస్యము కాకమునుపే, ఆ వెనక పశ్చాత్తాపము చెందికుందకమునుపే స్థలము నిండకమునుపే సర్దుకొనుము. చోటు చూచుకొనుము. ఎంతటిబుద్ధిమాంద్యము కలిగినది నీకు?

నీవెవరవో నీవు మఱచితివి. నీప్రవృత్తి యెద్దియో నీవు మఱచితివి. నీసత్త్వ యెట్టిదో నీకుఁ దెలియకున్నది. కటకటా! ఎట్టివాఁడ వెట్టివాఁడవుగ మారితివి? సంఘమున నీవెట్టిస్థితియందుంటివో నీకుఁ దెలియునా! కన్నులుండియు గనిపించుటలేదా? వీనులుండియు వినిపించుటలేదా! అన్నివర్ణములు నీపై దెబ్బ చఱచుచున్నవి. ఎల్లరు నిన్ను ద్వేషించి దూషించుచున్నారు. అందఱకు నీవయిష్టుఁడవైతివి. ఒక్కరు నిన్ను ప్రేమించువారు లేరు. నీకు గౌరవమర్యాదలు చూపువారు లేరు. నీసొమ్మయిన గౌరవము నేఁడు నిండుసున్నయైనది. నీవయిన భరతవర్ష గురుపీఠము నేఁడు నీటఁ గలసినది. ఎంతటిదుస్థితి! ఎచ్చటనో ప్రమాదము కలిగినది. అది నీకుఁ దెలియకయే మరింతబలపడినది. తత్ఫలిత మిది. ఆలోచించితివా? అసలు నీస్థితి నీకు గోచరమగుచున్నదా? గాఢనిద్రయా? మైకమా? మేల్కొనియుంటివా? ఇంద్రజాలమున నుంటివా? నీయింట నాచీఁకటి యేల? నీవిజ్ఞానదీపక మెచట? ఆరిపోయినదా? కొడి కట్టినదా? చమురున్నదా? జీవకళలేదా? అయ్యో! దేశమునకంతకు దారిచూపఁగల ఆకాంతి యేది నీకడ? నీవే యజ్ఞానమున మునిఁగితివా? చీఁకటిలోఁ జివికిపోవుచుంటివా? ఎండ కెండుచున్నావు? వానకుఁ దడియుచున్నావు. చలికి వడఁకుచున్నావు. మంచులో నానుచున్నావు. ఇన్ని బాధలు పడుచున్నను నీబాధ నీకుఁ దెలియుటలేదే! దేహము మొఱడుపారినదా? బుద్ధిబలము కరడుకట్టినదా? ఆత్మశక్తి యరిగి

పోయినదా? దుర్భరము! దుర్భరము! ఎంతకష్టమెంతకష్టము! నీపూర్వస్వరూపము నొకమారు బ్రాహ్మణుఁడా! సంస్మరించుకొనుము.

* * * *

ఆర్యావర్తపుణ్యభూమి యంతయు వేదఋక్కులతోఁ బ్రతిధ్వనించుచుండినకాల మది. గంగా, సింధు, సరస్వతీ, దృషద్వతీ మున్నగు నదీమతల్లులపవిత్రతీరముల పసరుటాకులపచ్చిపొదరిండ్లతోఁ బచ్చిక బయళ్లు నడవుల లో ఋషివాటిక లేర్పడియెను. ప్రశాంతమైన ఋషివాటికయొక్క నిరాడంబరజీవనమునకు ఆ మా శ్రమపదంబునకు తిలకాయమానముగ నున్నపొరుటాకుల చిన్నికుటీరమే సాక్షి. పరమేశ్వరునిపరమాద్భుతమహత్వతత్త్వలీలలను వీనులకు వినఁగరాని ముగ్ధస్వరముతో అనంతరుచుల, అనంతకంఠముల, అనంతరూపముల నభివర్ణించు నాకాంతారములలో బ్రాహ్మణుఁడు ఋషికుమారుఁడై చిరునవ్వునవ్వి నవ్వించులీలాప్రకృతియంకపీఠిక నెక్కి కేరికేరింతములాడి, యానందమున నోలలాడి యొడలెఱుంగని దివ్యజ్ఞానమున విశ్వమోహనమైన సామగానము చేసియున్నాఁడు. ఆతని వేదుకపాటలు ఉషస్సెఱుంగును. తనయుదయప్రభ నాపాటకుఁ గానుక నిచ్చెను. సరస్వతి యెఱుంగును. పొంగి పొరలు నుత్సాహతరంగములతో నాపాట నాలకించెను. ఆరణ్యక యెఱుంగును. ఆపాటకు వలపుఁ గూర్చెను. హోమకుండముకడఁ బ్రసన్నులైన యింద్రాదిదేవత లెఱుంగుదురు.

కుమారుఁడు వేఁకువ మెలపుచూపు చూచునప్పటికి మేలిముసుంగు నెడఁ ద్రోసి తొంగిచూచు ఉషస్సు మధురమైన మందహాసము నేయుచుఁ గన్నులపండువుగ గోచరించుచుండెడిది. ఋషికుమారుఁ డామెను గాంచి మోహననృత్యము చేసెను. పర్ణకుటీరముల ముంగిలివాకిట రాలినపండుటాకులు ఆమోహననృత్యమునకు ముద్దుముద్దు గలయవైచెను. కొండచరుల దిరుగాడు క్రూరమృగమును పచ్చికబయళ్లఁ గ్రేళ్లుఱుకు పదుచులేడియు ఆనటునిప్రక్క అన్యోన్యావలోకనముల బఱపుచు నిలువంబడినవి.

ఇంతలో మబ్బుతెరల నెగఁజిమ్ముకొని సహస్రకిరణుఁడు దినమణియై పొడుపుకొండ నెక్కెను. ఓహో! ఆదివ్యతేజస్సు! ప్రచండమైన యాగభస్తిమండలము 'భగవానుఁడా! లోకబాంధవుఁడవు నీవే దైవమవు' అని కుమారుఁ డర్ఘ్యపూర్వక ప్రణామం బాచరించెను.

అంతలో ఆకసము జీమూతపుంజములతో సంచలించెను. తళుక్కురని కన్నులు మిరుమిట్లుకొలుపు చక్కని మెరుపు మెఱసెను. ఘెళఘెళారావములతో పిడుగులు గురిసెను. మఱియొకమారు చేతులు మొగిడ్చెను కుమారుఁడు. 'ఓవరుణుఁడా నీవును దైవమవు' అని యాతఁడు వినుతి సేసెను.

చూచెను నిలబడి, తనచుట్టునున్న ప్రపంచమునంతను జూచెను. అతని కంతయు వెరపే. అంతయు వెఱగే. 'ఒగ మంతయు దేవలోకము. విశ్వమందలి ప్రతివస్తువు ఆరాధింపఁదగినది! పరమాణువు మొదలు బ్రహ్మాండమువఱకు అంతట పరమేశ్వరుని దివ్యతేజస్సు శతసహస్రమరీచికలతో వెలుఁగొందుచున్నది.' విజ్ఞానతేజోవిముగ్ధుఁ డయ్యెను కుమారుఁడు.

ఆలకదుపుల నదలించి పచ్చికబీట దిరుగలాడెను: ఋషికుమారుని దివ్యగానము వినఁబడెను. నాగలి చేతఁబట్టి చాలు దున్నుచుండెను: ఆతని దివ్యగానమే చెవి సోకునది. సరస్వతీతీరమునకుబోయి నిలబడెను: చల్లనిపావనోదక మాతనిచిన్నిదోయిలి తడుపుచుండెను: అప్పుడును ఆతనిగానమే. సమిధలు తెచ్చెను: హోమము చేయుచుండెను: ఆతనిజీవగానము జ్వాలాజిహ్వునికి వినఁబడె, నాతఁడు వర్ణింపఁగలఁడు అతనిదివ్యమైనసత్యగానము: ఆతని విశ్వగానము: అది యొకమంత్రమయ్యెను.

ఆకులే నీతల్పము. ఆకులే నీమఱువు: ఆకులే ఆతపనివారకమైన నీయాతపత్రము. సెలయేటి లేటనీరు నీపానీయము. కాయగూరలు నీభోజనము: తపస్సు నీధర్మము. నియమనిష్ఠలు నీస్వభావము: ప్రకృతికిఁ గారాబుబిడ్డవై, ఆమె యొడిలోఁ గూర్చుండి, ఆమె కిలకింతల కులికి కులికి ఆప్రకృతివిలాసమున నీవిలాసమును జూపుచు, సత్యస్వరూపమైన దివ్యమంత్రమును జపియించిన ఋషికుమారుఁడవు నీవే: ప్రకృతి పాలతోఁ బెరిగినవాఁడవు మునుపు ఓ బ్రాహ్మణుఁడా జ్ఞాపకమున్నదా? నీప్రాకృతజీవనము! నీపూర్వవృత్తమును స్మరించుకొనుము. కన్నులు తుడుచుకొని ప్రబుద్ధుడవు కమ్ము.

# ఎవరిదితప్పు?

(ఒక కథ)

మాడపాటి హనుమంతరావుగారు

౧

పండువెన్నెలయందు మనోహరమగు పిల్లవాయువులు వీచుచుండగా, గృహోద్యానమందలినీటిహౌజు (కేళాకూళి) ప్రక్కన తిన్నెపై కూర్చుండిన కృష్ణారావు సుందరమ్మతో ననెను. "నీవు భయపడవలసినపని లేదు; నేను త్వరలోనే వచ్చెదను"

సుందరమ్మ భర్తవైపు దీనమగుచూడ్కుల బరపి పలికెను. "నన్ను మీవెంట తీసికొని పోగూడదా?"

కృష్ణ: వీలులేదు. అక్కడ నీకు శ్రమ చాలయగును. నేను ఒకనాడొకచోట రెండవనాడింకొకచోట ఉండవలసివచ్చును. కంపని బద్ధకాకివలె ఊరూరు తిరుగవలసియుండును.



పర్వతప్రాంతము. కొన్నిచోట్ల పెక్కుక్రోసులవరకు గ్రామమే కనుపడదు. అరణ్యము. క్రూరమృగముల భయము. మంచి వస్తువులు దొరకవు. నీ విట్టికష్టములకు అలవాటుపడిన దానవుకావు.

సుంద: మీకు మాత్రము యీ కష్టము లలవాటైయున్నవా?

కృష్ణ: నేను మగవాడను; పని బడినయెడల, ఎట్టి కష్టములనైనను సహించుకొనగలను.

సుంద: నేను ఆడుదానను; పని బడినయెడలఅగ్నిగుండములో దుముకగలను. స్త్రీలుసుకుమారలనుమాట పురుషుల కల్పనము. వారిని

అబలలని సౌకుమార్యము కలవారలని అని అని, వారిని చేతగానివారిగా జేసియున్నారు. శరీరము దుర్బలము అయినకావచ్చును గాని మానసము దుర్బలము కాదు. వారిధైర్యసాహసములను జీవితమందలి ఎట్టిఅవాంతరములైనను లొంగదీయలేవు"

కృష్ణారావు భార్యను ప్రేమపూరితమగు చూపున జూచి యనెను. "నీతర్కము యథార్థమే. కాని పురుషులయాకల్పనము చాలకాలమునుండి వచ్చుచున్నది. ఇంతప్రాతవిశ్వాసము ఒక్కనిమిషమున మాయమై పోజాలదు. నీకష్టములను జూచి సహించుట నావలన కాదు. చూడుము, యీవెన్నెల యెంతమనోహరముగా నున్నది? కొన్ని విషయములలో ఈవెన్నెలకంటె సాయంత్రపు వేళయెంత ఎక్కువమనోహరముగా నుండును సుమా! నీయభిప్రాయ మేమి"?

సుంద: నామాటలను మరపించి పిచ్చిదానిని జేయవలెనని చూచుచున్నారు నేను మీవెంట వచ్చుమాట నిజము. మిమ్ము విడిచియుండుటయన్న నాకెంతో బాధాకరము. మీతో వచ్చిన శరీరకష్టము అనెదరు. శరీరకష్టముకన్న మానసికకష్టము యెక్కువ బాధించునదిగదా!

కృష్ణ: నీశ్రమమాట కాదనుకో. నీవు వచ్చుటవలన నేనుపడవలసినకష్టములెన్నియో విచారింపుము. నీకొరకు పోయినచోట నెల్ల ఇల్లుచూచుట, బండ్లకుమర్చుట, ఇతర సుఖసాధనముల సంపాదించుట వీనియందు నాకాలమంతయు సరిపోవును; నేను బోవుచున్న పని మూలబడును.

సుందరమ్మ నిరాశతో ననెను. "మీయిష్టము వచ్చినట్లు చేయుడు. నేను పట్టుదల వదలెదను. మీరుపోయినతరువాత మీరెట్లున్నారోయని నామనస్సూరక బాధించుచుండును. నాది విచిత్రమైనస్వభావము. మీరు యెదుట లేనప్పుడు వివిధములగు భ్రమలు, ఆందోళనలు వేధించుచుండును. అదేమిచిత్రమో కాని మీ క్షేమమును కాపాడువారు యీప్రపంచమున నేనుదప్ప మరెవ్వరు లేరనుభావము నా హృదయపుమారుమూల దాగియుండును. దీనికి కారణము కనుపడదు. మీరు ఆటలాడబోయినప్పుడు మీకేదైన దెబ్బతగిలెనేమో యని నామనస్సు శంకించుచుండును. మీరు వేటాడబోయినప్పుడు గుఱ్ఱమేమయిన కొంటెతనము చేసెనేమోయని మానసము కలవరపడుచుండును. ఇంతటిస్వచ్ఛమయిన వెన్నెలకదా! ఇంటిలోని తోటకదా! నేను మీసమీపమునగాక యింటిలోపల నుండుట సంభవించెనేని మీరు మరల కనుపడువరకు నామనస్సునిశ్చింతగా నుండదు. నాస్వభావనిర్మాణమే అట్టిది."

కృష్ణారావు ఆమాటలువిని కొంత విచారపడెను. 'సుందరమ్మయొక్క దుర్బలమగుహృదయము వియోగభారమును సహించగలదా? సున్నితములగు ఈమెభావతంత్రులను ఏదైన యంశము త్రెంచివేయుదుగదా!" అని పలుమారువితర్కించుకొని ఇట్లనెను. "సుందరీ! నావంటి కృత్రిమస్వభావముగలవాడు నీయథార్థమగు అగాధప్రేమకు తగియుండ జాలడు? నా

విషయమున ఉన్నతమగు అభిప్రాయమును నీవుహృదయమునస్థాపించుకొనినట్లుకానవచ్చుచున్నావు. నేను సాధారణమగుభావములను కలవాఁడను; స్వార్థపరుఁడను; ఆశావంచితుఁడను; కార్యవాదిని; స్వసుఖము నపేక్షించువాఁడను. ప్రేమకన్న భోగాపేక్షకు నామనసున నెక్కువ ప్రాముఖ్యము కలిగియుండును. మిత్రులతోడ కలయక, వేటాడుట, ఖేలనములు ఇవి లేకుండ జీవించుట నాకెంతో కష్టము! ప్రేమతరంగమునకు నామానస సముద్రమున తావుకలదుగాని ఆయల మహాదుర్బలమైనది. నామమాత్రమైనది!"

సుందరమ్మ భర్తపై అనుమానమును ప్రకటించుదృష్టిని బరపెను. ఆచూపునందు, "మాటలెన్ని చెప్పినను మీ హృదయమును నేను ఎఱుగనా?" యనుభావము వ్యక్తమగుచుండెను.

## ౨

కృష్ణారావుస్వభావము కొంతవిలక్షణమైనది. స్వతంత్రాభిలాషియయ్యును నియమబద్ధుఁడు; ధనవంతుఁడయ్యు జాగరూకుఁడు; జమీందారుఁడయ్యు వినయశీలుఁడు; గొప్పవారిప్రాపు కలవాఁడయ్యు పేదలకు మిత్రుఁడు. ఈతనితలిదండ్రులు బాల్యముననే ఈలోకమును వదలిచనిరి. ఇతనిపోషణభారము సేవకులపైననేపడియుండెను. ప్రేమయొక్క ప్రభావమున కాతఁడు అపరిచితుఁడుగానుండెను. అతఁడు ఏదైనవస్తువు 'నాకుకావలెను' అనగానే వచ్చుచుండెడిది. దానికొఱకై ఏడ్చుటకుగాని అలుగుటకుగాని బాల్యమున అవసరమే కలిగినదికాదు. తనతోనాడుకొనుబాలురు, తమతల్లిదండ్రులచేతచీవాట్లుపడుటయు, అప్పుడప్పుడు దెబ్బలుతినుటయు అతఁడు చూచియుండెను. కోపపడుటకును, మారాముపెట్టుటకును అతనిబాల్యచాపలము ఉత్సాహపడుచుండెను. కాని అతని కట్టియవకాశ మేది? పిల్లలు చీవాట్లుతినియు తమతల్లులవెంట పరుగెత్తుచునేయుందురు. పనిపాటలు సవరించుకొని ఆతల్లులు వారినెత్తికొని ముద్దుగొనగానే కలిగిన పిల్లలయానందము వర్ణనాతీతముకదా. కృష్ణారావు బాల్యమున నట్లే తన్ను ప్రేమించువారి చీవాట్లు దిని వారివలన తరువాత మెప్పునొంది వారికొంగున మోము గప్పికొని, వారిచంక కెక్కి యానందింపనువ్విళ్లూరుచుండెను. కాని ఏడువవలసినపని పడకపోయినను నవ్వవలసినపనియు కలుగుచుండలేదు! అతనిబాల్యము నిస్సారముగాను, మనోహరదృశ్యముల లేనిదిగాను గడచిపోయెను.

పెద్దవాఁడైనతరువాత నలువైపులనుండియు సంబంధములు రాసాగెను. ధనవంతులగువారు వర్తమానము లంపజొచ్చిరి. వరదక్షిణలమొత్తము లొకదానికంటె నొకటి పెచ్చుపెరుగుచుండెను. కాని మనకృష్ణారావు ధనమునకుగాని ఆస్తికిగాని ఆకలిగొనియుండినవాఁడా? అతనిహృదయము ప్రేమను గోరుచుండెను. అతని పిపాస యాయమృతమునే వెదకుచుండినది. ఎన్నియోసంవత్సరము లీయన్వేషణము సాగుచునేయుండెను సౌందర్యము దొరకెను; సౌకుమార్యము దొరకెను; విద్య దొరకెను; నిర్వాహణసామర్థ్యము దొరకెను; కాని దొరకని దేది? అది ప్రేమయే.

కనుక బంగళాలను, సుందరమందిరములను వెదకుట మాని కృష్ణారావుకుటీరముల వైపు దృష్టి సారించెను. అచ్చట నాతనికోరిక నెరవేరెను. సుందరమ్మ యొకపేదయింటియాడుపడుచు. ఆమెతండ్రి కృష్ణారావుదివాణమున గుమస్తా. పిన్నటినాట ఆమె ఆతనితో నాడిన బాలిక. కొద్దిస్థితిగల యాపిల్ల దొరసానియగునని యెవరైన తలచియుండిరా? కృష్ణారావు సుందరమ్మను వివాహమాడ నిశ్చయించెను. కావలసినవారందరు "కూడదు కూడదు" అని హితముబోధించిరి. కృష్ణారావు పట్టుదల కలవాడు. సుందరమ్మను తనఇల్లాలిగా జేసికొనియే తీరెను.

3

కొంతకాలమునకు దేశముయొక్కమారుమూలన కఱవు ఒకటి దాపురించెను. జనులు చెట్లయాకులను బెరళ్లను తినసాగిరి. వేళ్లు త్రవ్వి తీసి, కడుపు నింపుకొనుచుండిరి. క్షుద్బాధ కులాచారములను మతధర్మములను తొలగద్రోచివైచెను. శుద్ధము, ఎంగిలి వీనికి నడుమగల యంతర మెగిరిపోయెను. పశువులు, నిసువులుసంగతి యటుండనిండు. మనుష్యులు తమశిశువులను తవ్వెడుగింజల కమ్ముకొన నారంభించిరి. హృదయవేధకములగు నరమాంసాహారకథలే వినవచ్చుచుండెను. పత్రికలందీవార్తలు చదువగానే కృష్ణారావు హృదయమవిసెను. సేవాసమితి పక్షమున వెంటనే కొందరు ఇచ్ఛికభటులనుగొని ప్రయాణమయ్యెను. పోవునప్పుడు సుందరమ్మ భర్త వెంట చనదలచెను; ప్రార్థించెను. కాని వీలులేకపోయెను. తుదకు "త్వరగా వత్తు" ననిపించుకొని "దినమొకయుత్తరము వ్రాతు" నని భర్తచేత వాగ్దానము పొందెను. వారముదినములవరకు కృష్ణారా వాగ్దానమును పాలించెను. కాని కార్యబాహుళ్యము ప్రతిదినము హెచ్చుచుండినందున ఆలస్యము కాజొచ్చెను. కొన్నిగ్రామములు టప్పాఖానా (పోస్టాఫీసు)కు దూరమున నుండెను. కనుక ప్రతిదినము ఉత్తర మందు నేర్పాటుచేయుట యసాధ్యమయ్యెను.

సుందరమ్మ ఉదయమునుండి సాయంత్రమువరకు ఉత్తరమునకై ఎదురుచూచుచుండెడిది. ఆదినములలో ఆమె యాత్మశాంతి కిదియే ముఖ్యమగు సాధనముకదా. ఉత్తరములాలస్యముగావచ్చుట మొదలైనతోడనే ఆమెమనస్సు కలతనొంద నారంభించెను. "నేను వారి మాటలవలన నెంత మోసపోయితిని? తప్పక వెంట పోవలసియే యుంటిని."అని పరిపరి విధముల యాలోచించుచుండెను. ఎటుదోచక ఒక్కొకసారి మేడపైకెక్కును. మరల క్రిందికి దిగును. ఒకవేళ తోటలోనికి బోయి యచ్చట గూలబడును. కనుపడు ప్రతివస్తువు ఆమెకు వ్యాకులమయముగా నుండెను. పెంపుడు చిలుకపలుకులయందలి మాధుర్యము ఎచ్చటికో పోయెను. వీణాతంత్రులలోని చిత్తాకర్షక స్వభావము నశించెను. తోటలోని లేడిపిల్లయొక్క చెంగుచెంగులు జుగుప్సాకరము లయ్యెను. పిల్లులు, కుక్కలు మున్నగు జంతువులు కరువవచ్చుచున్నట్లు తోపసాగెను. అలమారులలో మంచిమంచి పుస్తకము లుండెను కాని సుందరమ్మ కవి యేమాత్రము నానందమును

గోలుపలేదు. ఉత్తరమువచ్చువరకు ఆమెహృదయము విచారభరితమై యుండెడిది. ఉత్తరము రాగానే వాడిన చేనులమీద వర్షముపడినట్లగుచుండెను. ముఖకమలము వికసించును; ఉత్తరమును ముద్దుపెట్టుకొనును; కన్నుల కద్దుకొనును; మరలమరల చదివి యానందించును.

అయినను ఆ యానందము ఆనాటివరకే. మరుచటిదినము మరల నదే విచారము. కృష్ణారావు ఛాయాపటమును గంటలకొలది చూచుచుండును. మొదటిదినములలో ఇదియే ఆమె ముఖ్యదినచర్య. క్రమక్రమముగా వియోగమునకు కొంత యలవాటుపడసాగెను. మొదటిదినములలో భర్తకూర్చుండు కురిచీ, ఉత్తదిగా జూడగానే మనస్సు తత్తరపడుచుండెను. ఇప్పు డామెనిరాశావశమై యట్టిమానసికావస్థను మరలించుకొనజొచ్చెను. ఆయన పుస్తకములను—విడివిడిగా అటునిటు పడియున్నవానిని ఒకచో కూర్చి వరుసగా చేర్చిపెట్టుట; ఆయనపటముపై నపడిన దుమ్మును దులిపి, పరిశుభ్రముచేసియుంచుట, ఆయన యాయుధములను యథాక్రమమున సవరించుట మున్నగు పను లామెకు తాత్కాలిక మనశ్శాంతి కలిగించుచుండెడివి.

నెలదినములు గడచెను. ఒకనాటిరాత్రి సుందరమ్మకు స్వప్నము వచ్చెను. కృష్ణారావు ఉత్తతలతో, ఉత్తకాళ్ళతో నిలబడి ఏడ్చుచుండినట్లు ఆమె కాంచెను. కెవ్వున కేకవేసి నిద్రనుండి లేచి కూర్చుండెను. వెంటనే బంగళాపైకి బోయి చూచెను. ఎల్లెడలను వ్యాపించియున్న నిశ్శబ్దత చూచినపిమ్మట ఆమెకు బాగుగా తెలివివచ్చెను. భర్తకు తత్క్షణమే అర్జెంటుతంతివార్త పంపెను. ప్రత్యుత్తరము రాలేదు. దినమంతయు గడచెను; జవాబు లేదు. రెండవరాత్రియు గడచెను. జవాబు లేదు. సుందరమ్మ అన్నము, నీరు ముట్టక, వ్యాకులమగు మనస్సుతో కూర్చుండియుండెను. కనుపడినవానినెల్ల "జవాబు వచ్చినదా" యని యడుగుచుండెను. ఆకు కదలినను "జవాబు వచ్చినదా?" యనుపదములే యామె పెదవులనుండి బయటబడుచుండెను!

సుందరమ్మ మనసును ఎన్నియో యనుమానములు బాధింపసాగెను. పనికత్తెలను ఈ స్వప్నఫలమేమని యడుగును. "అమ్మా! దొరగారు సుఖముగానే యున్నారు. కలలో "ఏడ్చుట" యనగా నిజమున "నవ్వుట"; కలలో ఉత్తతలతో గానవచ్చుట యనగా యథార్థమున "గుఱ్ఱమునెక్కుట." భయపడవలదు" అని సమాధానము చెప్పుచుండిరి. కాని సుందరమ్మమనస్సు నీమాటలు శాంతపరుపలేదు. "తంతికి జవాబు రాకపోవుటకు కారణమేమో" యని యామె కళవళపడుచుండెను. ఇంతలో నాలుగుదినములు గడచిపోయెను.

౭

చుట్టుపట్టు గ్రామములలో మూడు ఆమడలవరకు గోపాలశాస్త్రిగారి నెరుగనివారు అరుదు. వీరితండ్రితాతలు విశేషముగా చదువుకొనినవా రగుటవలన పుట్టినతరువాత నామకరణము నాటినుండియే వీరు శాస్త్రిగారని పిలవబడుచుండిరి. వీరివృత్తి వంశక్రమముగా పౌరోహిత్యమే యైనను, జ్యోతిషమునందేమి,

సాముద్రికము నందేమి, వైద్యమునందేమి, స్వప్నఫలనిర్ణయమునందేమి వీరినైపుణ్యమును అందరును మెచ్చుకొనుచుండిరి. ప్రశ్న చెప్పుటయందు వీరికౌశల్యము ఆబాలగోపాలము ఎరుగుదురు. ఏదైన పల్లెటూరికి శాస్త్రిగారు వచ్చినచో ఆవార్త నిమిషమాత్రము నలుదెసల నల్లుకొనుచుండెను. అనుభవశాలినులగు అత్తలు విఫలమనోరథలైన తమకోడండ్రను శాస్త్రిగారికి జూపి తృణమో పణమో సమర్పించి, వారియదృష్టమును తెలిసికొనుచుండిరి. దూరదృష్టిగల తల్లులు యౌవనవతులగు తమ కూతులచేతులను శాస్త్రిగారిచే పరీక్షింపించి వారిని ధన్యురాండ్రుగ జేయుచుండిరి. శాస్త్రిగారును, సుఖదుఃఖములను, వచ్చినవారికందరకు తృప్తికరముగా బంచిపెట్టుచుండిరి. ప్రశ్నలకు వారుచెప్పు ఉత్తరములలో స్పష్టత తక్కువగను, గూఢత ఎక్కువగ నుండినను, వినువారుమాత్రము వారివచనములను తమకు సమాధానమగు విధమున నన్వయించుకొని, శాస్త్రిగారి వాక్యములలోని అర్థగాంభీర్యమునకు వారినెంతయు కొనియాడుచుండిరి. కాని భక్తి విశ్వాసశూన్యులగు ఈకాలపువారు కొందరు శాస్త్రిగారుఅదృష్టమునుగూర్చి చెప్పు ఫలములు అదృష్టముకంటె ఎక్కువగూఢముగను సందిగ్ధముగను నుండుననుచుండుటవలన శాస్త్రిగారికప్పుడప్పుడు కొంచెముకోపము వచ్చుచుండుట కలదు. అయినను ప్రపంచజ్ఞానముకలవారుగనుక త్వరలోనే శాంతతవహించుచుందురు. నవీనవిద్యాప్రభావము జ్యోతిశ్శాస్త్రగౌరవమును తగ్గించి యుండవచ్చునేమో కాని జ్యోతిష్కుని గౌరవముమాత్రము తగ్గించలేదు. ఫలము నమ్మినను, నమ్మకపోయినను అడుగువిషయమున వెనుదీయువారెవరును కానబడరు. కనుక నవీనులమూలమున శాస్త్రిగారి ఆదాయమునకు నష్టము వాటిల్లియుండలేదు.

సుందరమ్మ భర్తకు తంతిసమాచారమంపి నేటికి అయిదుదినములు గడచినవి. ఆనాడు గ్రామమునకు శాస్త్రిగారు వచ్చిరి. ఈసంగతి తెలియగానే సేవకులు వారిని దొరసానిగారి యింటికిపిలుచుకొనిపోయిరి. చుట్టుపట్టుల అమ్మలక్కలు కృష్ణారావుగారి చావిడిలో గుమిగూడిరి. జ్యోతిష్కుడు కాలగర్భమున డాగియున్న భవిష్యత్తులన్నిటిని ఈవలకు లాగివేయసాగెను. సుందరమ్మకు కొంతసమాధానము కలుగుదారియేర్పడెను. శాస్త్రిగారిని లోనికి రప్పించి స్వప్నఫలమును విచారించెను.

శాస్త్రిగారు ఇటునటు పరికించి చూచిరి. పంచాంగము కట్టవిప్పి కాగితముల తిరుగవేసిరి. వ్రేళ్ళగణుపులు లెక్కించిరి. కాని ఎట్టిప్రత్యుత్తర మవసరమో నిశ్చయింపలేక యడిగిరి. "దొరసానిగారికా ఇట్టి స్వప్నము వచ్చినది?"

సుంద: కల నాకు రాలేదు. నాస్నేహితురాలికి వచ్చినది. ఇది దుస్స్వప్నమని నావాదము; కాదు మంచికలయని ఆమె వాదించుచున్నది. తమ రేమి నిర్ణయింతురు?

శాస్త్రిగారు మరల ప్రక్కలు చూడ సాగిరి. కృష్ణారావు గ్రామాంతరమునకు— దూరదేశమునకు పోయినసంగతి పాపము వారి కెరుకలేదు. గ్రామమునకు వచ్చినతరువాత ఈసంగతులువిచారించి తెలిసికొనునంత యవ

కాశము వారికిలభింపలేదు. అట్టి యవకాశమే దొరికినచో ఆవిశేషమును దొరసానిగారి ముఖలక్షణమును, సమ్మేళనముచేసి సంపూర్ణమగు భవిష్యత్తును గాని ప్రశ్నాఫలమునుగాని సిద్ధపరచియుందురు. సుందరమ్మ నొక ప్రశ్న యడిగి కొంత యవగాహన సంపాదింప శాస్త్రిగారు యత్నించిరిగానినిష్ఫలమయ్యెను. ఎట్లైనను అమ్మగారి కనుకూలమగువిధమున ప్రశ్నఫలమును నిర్ణయించుట క్షేమకర మని భావించి పల్కెను:— "దొరసానిగారి యభిప్రాయమేసరియైనది.స్వప్నముమంచిదికాదు."

సుందరమ్మ భయవిహ్వలయై వడవడ వడకసాగెను.

శాస్త్రిగారు చెప్పుచుండిరి."ఆమెభర్తకు గొప్ప ఆపద మూడనున్నది. గృహభాండశుద్ధి యగును. దేశాంతరగతుఁడగును. మహాదుఃఖదాయకమగు సంకట మేదో వచ్చిపడగలదు!"

సుందరమ్మ కెవ్వున కేక వేసెను. "ఆపద్బాంధవా! హతోస్మి! హతోస్మి! మాంరక్ష! మాంరక్ష!! యని యరచి మూర్ఛిల్లెను.

తాను మోసపోయినసంగతి శాస్త్రిగారు ఇప్పుడు గ్రహించిరి. ఇప్పుడాతడు సుందరమ్మను ఓదార్పసాగెను. "అమ్మా! ఇట్లంటివని భయపడవలదు. దీనిపరిహారము నాకు తెలియును. నాకు కొంచెము నూనె, దారము, ఒకక్రొత్తకుండ తెప్పించి యివ్వండి. ఒక కొబ్బరికాయ, పదినిమ్మకాయలు దొరికితే చాలును. తత్క్షణమే నివారణము చేయుదును. దొరగారు సుఖముగా నున్నసమాచారము వచ్చినతరువాత తమచిత్తమునకునచ్చినబహుమానముదయ చేయవచ్చును. కార్యము కఠినమగుసంగతి మాత్రమునిజము. అయినను ఈశ్వరానుగ్రహమువలన నే నీదుస్స్వప్నదోషమును పోగొట్టగలను. నాకు గొప్పగొప్ప మహారాజులెన్నియోబహుమానము లిచ్చి సత్కరించినారు. మొన్న మొన్న తహస్సిలుదారుగారి బిడ్డ వ్యాధిగ్రస్తురాలైనది. డాక్టరులు మంచి మంచివారు—చేతులు వెలికలవేసిరి. నేనొకయంత్రము ఇచ్చితిని. తీసివేసినట్టువ్యాధి మాయమై పోయి తెలివి వచ్చెను. ఇది నిన్నటి మాటయే! మొన్న సముద్రాల శేఖరయ్యగారియింట నొక రూపాయలసంచి మాయమైనది. నేను ప్రశ్నచూచి



# శ్రీ కృష్ణ భారతము

వ. సమాధి విడం గనులు దెఱచి నలుగడం బరికించుతం డ్రికి దండప్రణామంబు చేసి పరి
క్షితుండు వచ్చి సర్పశవంబు వేయుటయుఁ దా నతని శపించుటయుఁ దెలియఁ జెప్పిన
శమీకుండు కరం బలిగి కొడుకుదిక్కు మొగం బై. ౨౭౭

క. సీ సీ దోసము చేసితి, భూసురుఁడవు మఱి తపస్వి ముఖ్యుఁడ విది నీ
భాసురమతి ధర్మం బని, చేసినయదియే ప్రకోప శీలుఁడ వకటా! ౨౭౮

*　　　*　　　*　　　*

తే. ధర్మపరిపాలనము సేయు ధరణిపతికి, దురిత మన నది యింతయు దొడరఁబోదు
పదుగురకుశ్రోత్రియుల కెనవచ్చునృపతి, యని మనువు వల్కె నెఱుఁగవే తనయనీవు.

క. శ్రుతిహితధర్మవ్రతుఁ డతు, లితవిక్రమకీర్తి సల్లలితమూర్తి పరీ
క్షితుఁ డతనిక్షితిం దగఁ దప, మతికినమన మతఁడు చితుక నలుగం దగునే. ౨౮౬

*　　　*　　　*　　　*

తే. వయసు మీఱినవాఁడేని ప్రాజ్ఞుఁడేని, కొడుకు గుణవంతుఁడై కీర్తి గొనెడునట్లు
తలఁచి బోధించుచుండును దండ్రి యెపుడు, గాన నే నిప్డు చెప్పెడుదాని వినుము.

క. మరలింపఁ గలిగితేనియు, మరలింపుము శాప మనుడు మది బెదరుచు నే
మరలింప నోప నాపలు, కరయంగ మృషాత్వ మంద దనె శృంగి వడిన్. ౨౮౯

వ. అనిన శమీకుండు మిగుల వగలం బొగులుచుఁ జేయునది యెద్దియును లేక శృంగి
శాపంబున నగుతక్షకదంశమునకు మణిమంత్రతంత్రాదు లమరించుకొ మ్మని తనప్రియ
శిష్యుం డగుగౌరముఖునివలనఁ బరీక్షితునకుం జెప్పి పుచ్చె నంత నొత్తఁ జేయుండును.


క. తన్నెఱుఁగ కెదిరి నెఱుఁగక, యున్నట్టుల యుండి తపము నొనరుచుమునులం
గన్నుం గానక పదరుచు, బన్నంబులు గూర్చుజనులు బడలం బడరే. ౨౯౧

సీ. కడుపులోపలిచల్ల గదల కుండఁగ నింట, నిట్లుండ కడవి కే లేగినాఁడ
నేగి యంతన పోవ కిట్టట్టు మెట్టుచు, మెకములగమి నేల మెసవినాఁడ
మెసవి యంతన పోక వెసఁ బాఱుపందితోఁ, గఱకరినై యేల పఱచినాఁడ,
బఱచి యంతన పోక పాపపీనుఁగు నెత్తి, తపసికుత్తుక కేల తాపినాఁడఁ

తే. దాపితిని గాన దయలేక తాపసుండు, పాముచేఁ జావు మని తిట్టె బాము వెట్టె
నకట చెడుపోకలం బోయి యాగడముగ, గ్రొవ్వి యుండినవారికి గొడవ లరుదె?

ఆదిపర్వము—ఆశ్వా. 3.

గౌరముఖుఁడు శృంగిశాపమును బరీక్షితునకుఁ దెలుపుట



చిత్రకారుఁడు : శ్రీయుత, ఎ. రామమోహన రాయిగారు

వెనుకవైపు చూడుడు

చెప్పితిని. నిముసములో దొంగ పట్టుబడెను. అత డెవ్వడో కాడు వారిగుమాస్తాయే. సంచి వానియింటిలోనుంచి చెక్కుచెదరక బయట బడెను. ... ... ... ...

శాస్త్రిగారు స్వీయచరిత్ర వినుపించుచుండిరి కాని సుందరమ్మకు స్మృతియే లేదు. విషము శరీరమంతట ఎగబ్రాకెను! మంత్ర మిప్పుడేమిపని చేయగలదు?

కొంతసేపటికి తెలివి వచ్చినది. పనికత్తెను పిలిచి యిట్లాజ్ఞాపించెను. "ప్రయాణసన్నాహముచేయుము. సాయంత్రపు రైలుబండిలో వెళ్ళుదను. మనుష్యుల సిద్ధముగ నుంచుము. దొరగారియొద్దకు బోవలయును.— శాస్త్రిగారికి గుమాస్తాతో చెప్పి ఏమైన ఇప్పించుము."

౫

కృష్ణారావు వ్రాసిన తుదియుత్తరమునందు ఆయన సీతాపురమున నున్నట్లుండెను. కనుక టికటు తీసుకొని సుందరమ్మ రైలులో నెక్కెను. పరిచారకులు వేరుబండిలో గూరుచుండిరి. కొన్నిదినములనుండి యామెకు నిద్దురయే లేదు. రైలు కదిలినకొంతసేపటికి ఆమె కన్నులు కునుకసాగెను. నిద్దుర పట్టగానే మనసులోని కలవరము విచిత్రములగు దృశ్యములను ప్రదర్శింపదొడగెను.

విశాలమగు సముద్రము. దానిలో నొక పగిలినపడవ అటునిటు కొట్టుకొనుచున్నది. దానిమీదమాలిమికాడు లేడు. తెరచాప లేదు. తెడ్లు లేవు. తరంగములతాకుడున కొక్కొక్కసారి యది పైకి లేచుచుండును. మరి యొక్కొకవేళ క్రిందికి బోవుచుండును. అకస్మాత్తుగా దానిపై నొకమానవు డగపడెను. అతడు కృష్ణారావే. ఉత్తతల; ఉత్తకాళ్లు; కన్నుల నశ్రువులు గారుచున్నవి. సుందరమ్మ ఈదృశ్యమును జూచి కంపించుచుండెను. పడవ మునిగె; మునిగె, ననుస్థితియందుండెను. ఆమె బిగ్గరగా కేకవేసెను. కన్నులు తెరిపిడిపడెను. శరీరమంతయు చెమ్మటచే దడిసియుండెను. గుండె తటతట కొట్టుకొనసాగెను. లేచి, ముఖము కడిగికొని, ఇక నిద్రపోకూడదని ధైర్యముతో గూర్చుండెను. "అక్కటా! ఎంతటి భయంకరమగు కల! దేవా! నిన్నే నమ్మియున్నాను!! వారికెట్టి యాపదయు రానీయకుము!!!" అనుకొనెను.

తల బయటికి వెళ్ళబెట్టి చూచెను. ఆకాశమున నక్షత్రములు ప్రకాశించుచుండెను. గడియారమున ౧౨ గంటలు కొట్టెను. పుస్తకమొకటి పెట్టెలోనుండి తీసి భావములను కేంద్రీకరింప యత్నించెను. కొంతసే పైనతరువాత కన్నులు మూతలుపడసాగెను. మరల తెలివిదెచ్చుకొని బిగ్గరగా చదువ మొదలుపెట్టెను. ఎన్నియోదినములనుండి నిద్రనెరుగనికనులు, ఆమెయుద్దేశ్యమునకు లొంగ నిష్టపడలేదు. అంత దిండుకుతలను ఆనించి చదువ నారంభించెను. కునికిపాట్లు మొదలయ్యెను. మరియొకదృశ్యము ఎదుటికువచ్చెను!

పెద్దపర్వతము. దానిశిఖరము ఆకాశమునంటినట్లుండెను. పైనున్నవృక్షములు చిన్నమొక్కలవలె గాన్పించుచుండెను. నల్లనిమేఘ

ములు కమ్ముకొని, చెవులు చిల్లులువడునట్లు గర్జించుచుండెను. భయంకరమగు నాపర్వత శిఖరమున మానవు డొకడు నెత్తికి బట్టలేక కూర్చుండియుండెను. అంత ఎత్తున నున్నను అతని కన్నులనుండి కారుచున్న నీటిచుక్కలు స్పష్టముగా కానవచ్చుచుండినవి. సుందరమ్మ హృదయము వ్రక్కలయ్యెను. ఆవిగ్రహము కృష్ణారావుదే! అతడాకొండపైనుండి క్రిందికి దిగయత్నించుచుండెను. కాని దారిదొరకదు. ఆయన ముఖము భయముచే పచ్చబారియుండెను. తటాలున మేఘమధ్యమునుండి పిడుగు దిగజారెను. దానినుండి వెడలిన మహాజ్వాల కృష్ణారావు విగ్రహమును కనుపడకుండ జేసెను!

సుందరమ్మ మరల కేకవేసెను. తెలివి వచ్చినది. రొమ్ము పగులుచుండినట్లు తోచెను. కన్నులనుండి వెడలు నీరు ప్రవాహముగా మారెను. లేచినిలచి, రెండుచేతులనుమోడ్చి, ఆకాశమువంక జూచి ప్రార్థింపజొచ్చెను. "ప్రభువా! నా కిట్టి దుస్స్వప్నములు పరంపరగా వచ్చుచున్నవి. వారిగతి ఏమైనదో తోచుట లేదు. నీవు దీనులపాలిటి కల్పవృక్షమవు. నాపై దయజూపుము. నా కైశ్వర్యము వలదు! మందిరముతో పనిలేదు. కుటీరమునందు మహాసంతోషముతో నుందును. భర్తగారి క్షేమము మాత్రము అనుగ్రహింపుము. ఇదియే నాకు గావలసినవరము!"

సుందరమ్మ స్వస్థలమున గూర్చుండెను. తెలతెలవార జొచ్చినది. రాత్రి గడచినది; కనుక ఇక నిద్దుర రాదుకదాయని యామె ధైర్యముతెచ్చుకొనెను. మార్గమున కిరుప్రక్కల మనోహరములగు వృక్షలతాదులును, పచ్చికబయళ్ళును నేత్రపర్వము చేయుచుండెను. చూచుచుండగనే ఎప్పుడు కన్నుల మలిగెనో కాని నిద్ర పట్టనేపట్టెను! కల రానేవచ్చెను!!

కృష్ణారావు గుర్రముపై నెక్కి యొక వంతెనమీదుగా బోవుచున్నాడు! వంతెన చాల ఇరుకైనది!! గుర్రము తంటాలు పెట్టుచున్నది!!!

"గుర్రమునుదిగండి! గుర్రమునుదిగండి!" యని అరచుచు ఆసుందరమ్మ అతనివైపు దుమికెను. కన్నులు తెరచి చూచువరకు రైలుబండి ఏదోస్టేషను ప్లాటుఫారమువద్దనుండి సర సర సాగిపోవుచున్నది. కృష్ణారావు ఉత్త తలతో ఉత్తకాళ్ళతో ప్లాటుఫారముపైన నిలచియుండెను. సుందరమ్మ దృష్టియందింకను స్వప్నములోని దృశ్యమే స్థగితమైయుండినది. భర్తను చూడగానే, అతడు గుర్రమునుండి క్రిందపడి నదిలోనికి బోవుచున్నాడని భ్రమించెను. తత్క్షణమే యాతని పట్టుకొనుటకై యామె చేతులుసాచెను. భర్త శరీరము అందకపోయినందున అసంపూర్ణ జాగ్రదవస్థలోనే యామె రైలుబండితలుపు తెరచెను! ఆకాశమునుండి ఎవరో నేలపైకి పడద్రోచినట్లయ్యెను! గట్టిదెబ్బ యొకటి తగిలినట్లు స్ఫురించెను!! అంత స్మృతితప్పిపోయినది!!!

సీతాపురముస్టేషను ఇదియే. సుందరమ్మ పంపినతంతివార్త అంది భర్తస్టేషనుకు వచ్చియుండెను. అది మెయిలుబండి యగుటచేత

అచ్చట ఆగదు. భార్యచేతులుముందుకుసాచుచుండుటచూచియతఁడు "హా! హా!" యని వాఁరించుచు విద్యుత్తువంటి వేగముతో ముందునకు దుమికెను. కాని అంతలోపలనే, లలాటలిఖితము పూర్తిఅయ్యెను. సుందరమ్మ వియోగ దుఃఖమునకుతావులేనిలోకమును చేరనేచేరెను!

కృష్ణారావు మూడవదినమున స్వగ్రామమువచ్చెను. దుఃఖభారమును సహింపలేక, ఆస్తియంతయు సేవాసమితికి దానముచేసి, ఉత్తతలతో, ఉత్తకాళ్ళతో దేశదేశములు సంచరించుచున్నాఁడు. శాస్త్రిగారి వాక్యము ఫలించినది !!

---

# ముక్తావళి

వేదుల సత్యనారాయణశాస్త్రి శతావధాని, (సాహితీసమితి సభ్యుడు)

౧

పూవుల రోజులుం గడచిపోయె, విషాద హిమావృతాంధకా
రావిలమయ్యె, ఈ ప్రకృతి యంతయు; ఆకులపాటునొంది పూ
దీవలు నాఁడు లేయెడద తీరున మ్రోడయిపోయె, నాటి యా
జ్ఞావిధి స్వామి! నాకిపుడు జ్ఞప్తికివచ్చి భయంబు పుట్టెడున్.
ఈ మధుమాసశోభ గతి యించక పూర్వమె పూలతోటలో
కోమల పుష్పముల్ వెదకి కోసి మనోజ్ఞపుమాల గ్రుచ్చియున్
నామెడలోన వేయుమనినావపుడొక్క సుమంబునైన, నో
స్వామి! భవత్పదార్పణము సల్పఁగ లేనయితిన్ విమూఢతన్.

౨

నావలె, శుష్కజీవనమునన్ దురపిల్లెడు, ఈ పవిత్ర గో
దావరి పేద వడ్డనిన దంబులతో శ్రుతి గల్పి, ప్రేమరా
గావహదుఃఖగీతు లిపుడల్లుచు, గ్రుచ్చుచునుంటి నొక్క ము
క్తావళినిం, బవిత్రనయనాంబు కణోజ్జ్వలమౌక్తికంబులన్.
ఈ సుకుమార మాల ధరి యింపుము నీ హృదయంబునందు, స్వా
మీ! సుముఖంబులై పరిణమించు పవిత్ర వసంత మాస సం
ధ్యా సమయాంతరంబుల, రవంత, భవన్మధురార్ద్ర దీర్ఘని
శ్శ్వాస పరీమళానిలపు స్పర్శను, ప్రేమ ననుగ్రహించుచున్

# ప్రాచీన హైందవ గణితములు

దర్భా యజ్ఞేశ్వర సోమయాజిగారు బి. ఏ., యల్. టి.

(గత సంచిక శేషము)

23. రేఖాగణితవిభాగమున నార్యభట్టీదిగువ విషయములను గూర్చి వివరించియున్నాడు.

1. త్రిభుజముల వైశాల్యములను గనుగొనుట.

2. వృత్తముయొక్క వైశాల్యమును గనుగొనుట.

3. సమానాంతర ద్విబాహుక చతుర్భుజముల (=సమలంబచతుర్భుజముల) వైశాల్యముల గనుగొనుట (Areas of trapeziums).

4. సమానాంతర ద్విబాహుక చతుర్భుజము (Trapezium) యొక్క కర్ణముల సంపాత బిందువునకును సమానాంతర భుజములకును గల దూరముల నిర్ణయించుట.

5. వృత్తముయొక్క త్రిజ్య (Radius) పరిమాణమును గనుగొనుట.

వృత్తముయొక్క వైశాల్యము "$\pi$ త్రి$^2$" యను సంకేత (Formula)చే బ్రకటించును "$\pi=\frac{62832}{20000}$"యను, సూక్ష్మమును యథార్థమును నగు పరిమాణమును బ్రకటించియున్నాడు. "$\pi$"యొక్క యథార్థమైన పరిమాణమును, పర్బాకుకాలమువఱకు (క్రీ. శ. 1423-61.) నైరోపీయు లెఱుగరు. దీనియందలి రేఖాగణిత ప్రమేయములు దోషభూయిష్ఠములుగనే యున్నవి.

24. త్రికోణమితికవిభాగమున ప్రథమపాదమునందు (In the first quadrant) $3\frac{3}{4}°$ భాగల (degrees) యంతరముగల యన్ని కోణములసాధారణ "జ్యా"లపతకము (table) నిచ్చియున్నాడు. ఈతఁడు $3\frac{3}{4}°$కోణపు "జ్యా" పరిమాణమును దానికి రెట్టింపుకోణముయొక్క పూర్ణజ్యార్ధముగ (Semichord of double the angle) గైకొనెను. $3\frac{3}{4}°$కోణపు "జ్యా"దాని చాపీయమాన (Radian measure) తుల్యమను కొని యాతడు దీనిపరిమాణమును 225 గ గ్రహించెను. ఈసంఖ్య యాకోణమునందలి నిమిషములసంఖ్యకు సమానము. దీనితరువాత నాత డొకసూత్రమును వాక్రుచ్చెను. ఇది యించుమించు దురవగాహముగా నున్నను యీదిగువ నిర్దేశము (Statement) తో సరిపోలుచున్నది.

*జ్యా (స + 1)క్ష − జ్యా స.క్ష = జ్యా సక్ష − జ్యా (స−1)క్ష − జ్యా సక్ష. కోక్ష.క్ష ........(I)

---

* ఈ సంకేతయందు "కోక్ష"యనునది "కోటిక్షతి- (Cosecant)" యను పదమునకు సంకేతముగా బ్రయోగించితిని. (Secre-to Cut. క్షతి-హతి).

దీనిలో "श"యన్నది "$3\frac{3}{4}^\circ$"లకుబదులుగా నుపయోగించెను. దీనినుపయోగించి "జ్య"లపతకము (Table of Sines) నొకదాని నీతడు కల్పించి "జ్య 90°" పరిమాణము 3438 అని నిర్దేశించెను. "π"(పై) పరిమాణము 3.1416గ గ్రహించినచో నీఫలితము యథార్థముగా నున్నది. మఱియొకచోటకూడ "π" కీత డీపరిమాణమునే యొసగియుండుటయన్న దెంతయు నాహ్లాదకరమగు విషయము. దీనిని బ్రకటించు యథార్థసంకేత నిచ్చట పొందుపఱచెదను

$$\text{జ్య } (\text{స}+1)\text{श} - \text{జ్య సश} = \text{జ్య సश} - \text{జ్య } (\text{స}-1)\text{ श} - 4\text{జ్య సश}.\ \text{జ్య}^2\, \frac{\text{श}}{2}.$$

ఆర్యభట్టు "4 జ్య$^2$ $\frac{\text{श}}{2}$=కోకు श" యనికైకొనియున్నాఁడు. అనగా నాతఁడు "2జ్యश=1+జ్య 2 श" గ గ్రహించినట్లు తేటపడుచున్నది. ఆతడు "జ్యश, జ్య 2 श" లకు మారుగ నుపయోగించిన స్థూలఫలముల (Approximate value) నుపయోగించినచో నిది "2×225=1+449" యనునదియే యగుచున్నది.

25. వరాహమిహిరుఁడు. క్రీ. శ. ఆరవ శతాబ్దమునందు (క్రీ. శ. 505. ప్రాంతమున) వరాహమిహిరుఁడు పంచసిద్ధాంతికమను గ్రంథమును వ్రాసెను. ఇది యాకాలమునాటికి ప్రచారములోనున్న యైదుసిద్ధాంత గ్రంథముల యొక్క సారసంగ్రహము. దీనిలోసూర్య సిద్ధాంత మప్పటి నుండియు ప్రమాణగ్రంథముగ బరిగణింపబడు చున్నది. ఇది నాల్గవశతాబ్దమునకు పూర్వము వ్రాసినట్లగపడదు. హిందూదేశములో శాస్త్రసమ్మతముగ వ్రాసిన ఖగోళశాస్త్రములందు, పంచసిద్ధాంతికము చాల ప్రాచీనమైనదియు నారూఢమైనదియుగఁగన్పట్టుచున్నది. "1. పౌలిససిద్ధాంతము, 2. రోమకసిద్ధాంతము, 3. వాసిష్ఠసిద్ధాంతము, 4. సౌరసిద్ధాంతము, 5. పితామహసిద్ధాంతము" నను నీయైదింట పౌలిససిద్ధాంతము మిక్కిలి యారూఢమై యథార్థముగనున్నది. రోమకసిద్ధాంతము దాదాపుగ దీనిని పోలుచున్నది. వీనికంటె మిక్కిలి యారూఢమైయథార్థముగనున్నదిసవిత్ర(=సూర్య) సిద్ధాంతమే. తక్కిన రెండుసిద్ధాంతములును యథార్థమునకుకొంచెము బాహిరములుగనున్నవి.

26. పంచసిద్ధాంతికమునందు మిక్కిలి హృదయరంజకములైన గణితవిశేషము లున్నవి. చరిత్రరీతిని జూచినను ప్రాశస్త్యమున దీనిని మించు గ్రంథము తరువాత వ్రాసిన హైందవ గ్రంథములందు వేరొక్కటి కానరాదు. పౌలిససిద్ధాంతమునందలి గణితభాగము మిక్కిలి హృద్యమైనది. దీనియందు హైందవత్రికోణమితికముయొక్క సారమంతయు నున్నది. దీనియందలిసూత్రముల [ఒక్కరూపము (Unit) ప్రమాణముగల త్రిజ్యతో వ్యవహరించినచో] నీదిగువరీతిగ, నవీనవిధుల ననుసరించి ప్రకటింపవచ్చును.

1. $\pi=\sqrt{10}$
2. $\text{జ్య } 30^\circ=\frac{1}{2};\ \text{జ్య } 60^\circ=\sqrt{1-\frac{1}{4}}$
3. $\text{జ్య}^2\text{श}=\left\{\frac{\text{జ్య}^2\text{श}}{2}\right\}+\left\{\frac{1-\text{జ్య}(90^\circ-2\text{श})}{2}\right\}^2.$

వీనితరువాత $3\frac{3}{4}^\circ$ యంతరముగల యిరువదినాల్గుకోణముల "జ్య"లయొక్క పతక

మొకటి యున్నది. ఇది టాల్మీగారిపూర్ణ జ్యల పతకమును పోలి యున్నది. టాల్మీగారివలె త్రిజ్యను 60 సమానభాగములుచేయక పౌలి సుడు 120 సమానభాగములుగ జేసెను.

$$\text{జ్య}\ \frac{\text{ब}}{2} = \frac{\text{పూర్ణ జ్య ब}}{2}\ \text{యగుడు}$$

అంకెలయం దెట్టిమార్పును జేయ నక్కర లేకయే, యీ త్రిజ్యవిభజనము, పూర్ణ జ్యల పతకమును "జ్య"లపతకముగ వ్యవహరింప ననువగున ట్లొనర్చుచున్నది. ఆర్యభట్టు త్రిజ్యకు మఱియొకపరిమాణము (34381 నిమిష ములు) నొసగినాడు. ఇది "జ్య"లపరిమాణ ముల నొకవిధమైన చాపీయమానవిధిని (Circular measure) బ్రకటింప దోడ్పడినది

27. మన మిప్పుడు మూడు ప్రస్ఫుట స్థితులను జూచుచున్నాము.

1. టాల్మీగారి పూర్ణ జ్యలు "పూర్ణ జ్యब", త్రి =60 సమాన భాగములతో

2. పౌలిస "జ్య" లేక "$\text{జ్య}\frac{\text{ब}}{2} = \frac{\text{పూర్ణ జ్యब}}{2}$"

త్రి =120 సమానభాగములతో

3. ఆర్యభట్ట "జ్య" లేక "$\text{జ్య}\frac{\text{ब}}{2} =$ $\frac{3}{\text{ब}}$. $\frac{\text{పూర్ణ జ్యब}}{2}\frac{3}{3}$ త్రి =3438 నిమిషములతో

మూడవఫలితమును స్థాపించుటకు $\pi = \frac{600}{191}3.1416$(3.1416) పరిమాణమునే ప్రత్యక్షముగా నుపయోగించిరి. "జ్య" ఫలముల ప్రయోగముల (Use of sine functions) చరిత్రను బట్టి చూడ నివి ప్రప్రథమమున నీకాలము నాటి సిద్ధాంత గ్రంథములందే వాడబడి యున్నట్లు తేటపడుచున్నది. హిందువులకంటె నరబ్బులే మిక్కిలి ప్రశస్తమైనశాస్త్రీయోద్యమముతో నీనూతన విషయము నుపయోగించియున్నారు.

28. ఈకాలమునాటి హైందవగ్రంథములలో కొన్నిటిలో "జ్య" లపతకమును కల్పించుట కనుకూలించు నివేశితసంకేతను (Interpolation formula) గల్పించిరి.

$$\text{“}\underline{\Lambda}\text{స} + 1 = \underline{\Lambda}\text{స} - \frac{\text{జ్య సब”}}{\text{జ్య ब}}$$

దీనియందు $\underline{\Lambda}\text{స} = \text{జ్య}\frac{\text{సब}}{2} - \text{జ్య}(\text{స} - 1)\frac{\text{ब}}{2}$

ఈసంకేతను వీ రాడంబరముగ నొసగినను దీనిక్రింద వేసినపతకము దీనినుండి గ్రహింప నసాధ్యముగానున్నది.

III హైందవగణితముల యుచ్ఛదశ

28. హిందూదేశమునం దార్యభట్టు గణితశాస్త్రమును స్థిరముగ స్థాపించెననుట యెంత మాత్ర మతిశయోక్తి కాదు. దీనితరువాత వ్రాసినవారి గ్రంథములందన్నిట నీతడు వ్రాసినవిషయములనే తిరుగ వ్రాసియున్నారు. గ్రంథకర్తల నామములుదక్క, వారినిగూర్చియు, వారి చరిత్రనుగూర్చియు మన కేమియు నంతగా దెలియుట లేదు. ఈదిగువ పేర్కొన్నవారి గ్రంథములలో గొన్ని జాగ్రత పెట్టి దాచియుంచిన విప్పటికి నున్నవి.

1. బ్రహ్మగుప్తుడు. క్రీ. శ. 598 (జననము.)

2. మహావీరాచార్యుడు.

3. శ్రీధరాచార్యుడు. క్రీ. శ. 991 (జననము)

4. భాస్కరాచార్యుడు. క్రీ. శ. 1114 (జననము)

29. ఈశకమునందలి సిద్ధాంతులలో మిగుల ప్రఖ్యాతినహించినది భాస్కరాచార్యుడు. ఏకారణముచేత నీతని కింత గణ్యత గల్గినదోకాని బ్రహ్మగుప్తుని గ్రంథము శాస్త్రరీతిగ జూచినచో విపులవిజ్ఞాన పూరితమైనదిగను, చరిత్రలరీతిగ జూచినచో చాల ప్రధానమైనదిగను నున్నది. వీరందఱునుగూడ నొకేవిషయముల గూర్చి భిన్నరీతుల వ్రాసియున్నారు. బ్రహ్మగుప్తుని గ్రంథమును, దక్కినవారందరు నుపయోగించినట్లు గోచరించుచున్నది. భాస్కరాచార్యుడు మాత్రము పద్మనాభుడను మఱియొకగణితజ్ఞుని పేర్కొని మహావీరాచార్యుని పేర్కొనమానెను.

30. వీరివీరి విషయప్రకటనాకౌశలంబులందలి వైచిత్ర్యంబులలో రేఖాగణిత భాగముల ధోరణి నొకదానినిగ పేర్కొనవచ్చును. బ్రహ్మగుప్తుడు వృత్తీయ చతుర్భుజములను గూర్చి దాదాపు సంపూర్తిగనే వ్రాసియున్నాడు. తక్కినవారీవిషయమును క్రమముగ వదలివేయుచు వచ్చుటచే భాస్కరుని కాలమునాటికి దురవగాహమైన విషయముగ బరిణమించినది.

31. ఈదిగువ యంశముల వివరణలే యీశకమున వ్రాసిన విషయములలో హృద్యములుగ నున్నవి.

1. కుట్టకములు (Indeterminate Equations)

2. అకరణీయ సమకోణ త్రిభుజములు (Rational right-angled triangles )

3. ఉపేక్షగజేసిన రేఖాగణిత వివరణలు.

వీనిలో రెండవవిషయమును శుల్వసూత్రములలో గొంతవఱకు చర్చించియున్నారు. విమర్శించిచూడ శుల్వసూత్రములందలి విషయమునకును, నీశకమునందలి గణితములందున్న విషయమునకును, నెట్టి సంబంధమునున్నట్లగపడదు. ఈకాలమువారు బౌధాయనాపస్తంబ సూత్రగతములైన ఫలితములను బొత్తిగా నెఱుగరు.

32. కుట్టకములు. కుట్టకములయొక్క ప్రాచీనచరిత్రకు సంబంధించిన మహామహుల నామములయొక్కయు వారి జీవితకాలముల యొక్కయు పట్టిక నిచ్చుట బొందుపరచెదను.

| | |
|---|---|
| డైయొఫాంటస్. | క్రీ. శ. 360 |
| హైపేటియా. | క్రీ. శ. 400 |
| ఆర్యభట్టు. | క్రీ. శ. 476 |
| బ్రహ్మగుప్తుడు | క్రీ. శ. 596 |
| భాస్కరాచార్యుడు. | క్రీ. శ. 1114 |

ఈకాలమునాటికి పాశ్చాత్యులకు "కుట్టకము"లందు గల విజ్ఞానముయొక్క స్థితి యూఢిగా మనకు దెలియదు. డైయొఫాంటస్‌గారి గ్రంథములలో గొన్నియు, హైపేటియా యన్ని గ్రంథములును గూడ దొరకకుటయే లేద. లభ్యమైన గ్రంథములను జూడ గ్రీకులు ప్రథమ, ద్వితీయఘాతీయ సమీకరణములయు, తృతీయఘాతీయ సమీకరణము లొకకొన్నిటియొక్కయు, నకరణీయ వివరణల స్థాపించునంతదాక నీ విశ్లేషణరంగమును నిరీక్షించి గణితఫలములను కను

గొనిరి. గ్రీకులవిశ్లేషణ వివరణములకంటె హిందువులు చాలదూరము పరీక్షించినట్లు మనకు దొఱకు గ్రంథములవలన దేటపడు చున్నది. హైందవగణితములందు

కసీ + గయ=చ,........(అ). *

టలో$^2$ + 1=త ,......(ఇ). ǁ

యనుసమీకరణముల యకరణీయ వివరణాల ఫలములను స్థాపించియున్నారు. (అ) సమీకరణముయొక్క వివరణము నార్యభట్టు స్థూలముగ (Approximately) సూచించియున్నాడు. "త" శూన్యమేని తదితరమగు నే పూర్ణాంకమేని యై, "క/గ" యొక్క యుపధ పరిచ్ఛిన్నము (Penultimate Convergent) "ప/వ" అయ్యేనేని బ్రహ్మగుప్తుని (+ చిహ్నసంబంధమైన) వివరణము, నవీనులు (అ) యొక్క వివరణఫలములుగ బ్రకటించు

నీ= ± (చవ—గత)

య= ∓ (చప + కత)

యనుఫలములతో నేకీభవించుచున్నది.

"టలో$^2$ + 1 = త$^2$" సమీకరణము యొక్క వివరణము నీదిగువరీతిని సంగ్రహపఱచి ప్రకటింపవచ్చును.

"టక$^2$ + గ=చ$^2$, టఖ$^2$ + ఘ$^2$=ఛ$^2$" ఐనచో నప్పుడు

(అ) ట (చఖ±ఛక)$^2$ + గఘ=(చఛ±కఖ.ట)$^2$

(ఆ) ట $\left\{\frac{\text{చ}+\text{కలో}}{\text{గ}}\right\}^2 \pm \left\{\frac{\text{లో}^2-\text{ట}}{\text{గ}}\right\} = \left\{\frac{\text{టక}+\text{చలో}}{\text{గ}}\right\}^2$

ఇందు "లో" యనునదేదేని యనుకూలమగు పూర్ణాంకముకావచ్చును.

మఱియు

(ఇ) ట$\left(\frac{2\text{స}}{\text{ట}-\text{స}^2}\right)^2$ + 1 =$\left(\frac{\text{ట}+\text{స}^2}{\text{ట}-\text{స}^2}\right)$ యగును. ఇందు "స" యేదేని సాధారణాంకము కావచ్చును

33. (అ), (ఆ) వివరణముల సంపుటీకరణమునంజేసి సమీకరణముయొక్క సంపూర్ణ అకరణీయ వివరణము లభించుచున్నది. వీనిలో (అ) వివరణమును బ్రహ్మగుప్తుడు సిద్ధాంతీకరించెను; కాని యీతని కైదు శతాబ్దములైన తరువాతనున్న భాస్కరాచార్యుడీ రెండిటిని గూడ నొసగియున్నాడు. (అ) వివరణమును సంయోజనవిధి (Method of Composition) యనియు, (ఆ) వివరణమును వృత్తీయవిధి (Circular method) యనియు వ్యవహరించియున్నాడు. గణితశాస్త్రచరిత్రములందు హైందవగణితముల కగ్రస్థానము నొసంగుటకీ రెండువివరణములే చాలునని పాశ్చాత్య గణితశాస్త్రజ్ఞులే యుగ్గడించియున్నారు. ఈ వృత్తీయవిధినిగూర్చి హెంకెల్ దొరగారిట్లు పొగడియున్నారు. "ఇది వర్ణనాతీతము. లంగ్రాంజిదొరగారికి బూర్వము అంకమీమాంస (Theory of numbers) లందలి వైన దిగ్విజయములలో నిది యుత్కృష్టతమమైనది."

34. అకరణీయ సమకోణత్రిభుజములు. ఈకాలమునాటి హైందవ గణితశాస్త్రజ్ఞులకీ సమస్యయందు వెఱ్ఱియప్రమత్తతగల్గినది.దీనం జేసియే యీ సమస్యయొక్క ఫలములను బ్రకటించు సూత్రముల జాల గల్పించియున్నారు. మహావీరాచార్యుడు.

---

* (ax + by=c) ǁ (px$^2$ + 1=q$^2$)

$$(2\,\text{కోల})^2 + (\text{కో}^2 - \text{ల}^2)^2 = \text{కో}^2 + \text{ల}^2$$

యనుఫలితము నొసంగి దీని నుపయోగించు ప్రశ్నల నొకకొన్నిటి నచ్చట బొందుపఱచి యున్నాడు, "కోల" యనునీరెండింటిని బీజములని (Elements) వ్యవహరించియున్నారు. భాస్కరాచార్యు డొసగిన ఫలములు చరిత్రరీతిగా నొక కొంతప్రాధాన్యములగు విషయములుగనున్నవి.

35. రేఖాగణితభాగములు.

"1. నిర్వచనములు (Definitions) లేమి;

2. కోణములనుగూర్చి వ్యవహరింపమి;

3. సమానాంతర రేఖలనుగూర్చి ప్రశంసింపమియు, ననుపాతముల మీమాంస (Theory of proportion) లేమి;

4. పారంపర్యదోషములు సాధారణముగ బొడకట్టుచుండుట.

5. కాలక్రమమున రేఖాగణితజ్ఞానము క్షీణించుట" యనునీయైదుగుణములు నీకాలపు రేఖాగణిత నైసర్గికగుణములుగ గోచరించుచున్నవి.

36. ఇంతియకాక వృత్తీయచతుర్భుజములకు సంబంధించిన సూత్రములను మనము బాగుగ గమనింపవలెను. వృత్తీయచతుర్భుజములయొక్క కర్ణములను "య, ర"లచేతను; దానిభుజములను "క, చ, ట, త" లచేతను ప్రదర్శించి, "$\text{మ} = \left(\frac{\text{క} + \text{చ} + \text{ట} + \text{త}}{2}\right)$"యు ఐనయెడల

(i) $\text{చ} = \sqrt{(\text{మ} - \text{క})(\text{మ} - \text{చ})(\text{మ} - \text{ట})(\text{మ} - \text{త})}$

(ii) $\text{ర}^2 = (\text{కత} + \text{చట})(\text{కట} + \text{చత})$

$$\times (\text{కచ} + \text{టత})$$

$$\text{య}^2 = (\text{కచ} + \text{టత})(\text{కట} + \text{చత})$$

$$\times (\text{కత} + \text{చట})$$ యగును.

వీనిలో రెండవదానిని బ్రహ్మగుప్త ప్రమేయమని వ్యవహరించుచున్నారు.

37. నిర్వచనములు లేమియు, లక్షణయుక్తమైన క్రమమునం దలక్ష్యము (Neglect of Scientific order) వహించుటయు, నన్నవి హైందవ గణితములను గ్రీకుగణితములనుండి వేఱుపరించుచున్నవి. "జ్యా" ఫలములను గనుగొనుటచేతనే హిందువులకు గణ్యత గల్గినది. కోణముల విజ్ఞాన మంతగా గ్రంథములందు విపులవిధిని లేకున్నను, దోషభూయిష్ఠములైన సూత్రములతో నిజమగు సూత్రములుకూడ గలిసియుండుట యొక ప్రకృష్టాంశము. ఆర్యభటుడు సూచీ (Pyramid) యొక్క ఘనపరిమాణమునకుం దప్పుసంకేత నిచ్చియున్నాడు. గోళపుఘనపరిమాణమున కార్యభట్ట, శ్రీధర, మహావీరులు తప్పుసంకేతల నిచ్చియున్నారు. మహావీరుడు దీర్ఘవృత్తపు (Ellipse) వైశాల్య, పరిధులకు (Area and Circumference) దప్పుసంకేత నిచ్చియున్నాడు.

38. బ్రహ్మగుప్తుడు. ఈతడు సుమారు క్రీ. శ. 598 సంవత్సరమునందు జన్మించి క్రీ. శ. 660 సంవత్సరమువఱకు జీవించియున్నట్లు తెలియుచున్నది. ఇతడు బ్రహ్మస్ఫుటసిద్ధాంతమను గ్రంథమును బద్యకావ్యముగా వ్రాసెను. బ్రహ్మనిర్మితఖగోళశాస్త్రము లేక సిద్ధాంతమనియు దీనిపేరున కర్థము. దీనియందలి రెండు ప్రకరణములు (12వ, 18వ ప్రకరణములు) అంకగణిత, బీజగణిత, రేఖాగణితములనుగూర్చి వ్యవహరించుచున్నవి.

39. అంకగణితము పూర్తిగా సూత్రసమన్వితముగ నున్నది. చాలలెక్కలు త్రైరాశికవిధిని నిర్వర్తింపబడినవి. వీనిలో నెక్కువ భాగము వడ్డీలెక్కలే. సాధారణాంకగణిత క్రియల సులువుగ నిర్వర్తించుటనుగూర్చియు, వర్గమూలఘనమూలముల గనుగొనుటనుగూర్చియు(Determination of square and cube roots) త్రైరాశికాదులనుగూర్చియు, వడ్డీలగనుగొనుట గూర్చియు, అంకశ్రేఢిని గూర్చియు (A. P.) సరళాంకముల వర్గములయొక్క (Square of natural numbers) మొత్తమును గనుగొనుట గూర్చియు, బ్రహ్మగుప్తుడు వ్రాసియున్నాడు.

40. బీజగణిత భాగములుకూడ సూత్రమూలములే అంకశ్రేఢికి సంబంధించిన మూలసూత్రములను వివరించి, ద్వితీయఘాతీయ సమీకరణములను విపులముగ వివరించి యున్నాడు. ఈతడు సమీకరణ మూల్యముల (roots) స్వఫలమును (+ve Value) మాత్రమే పొందుపఱచెను.

41. బ్రహ్మగుప్తుడు చాల ప్రథమఘాతీయకుట్టకములపూర్ణాంక మూల్యములను, ఇప్పుడు వాడుకలోనున్నవిధి ననుసరించియే, నిర్ణయించెను. ఈతడు "సక$^2$ + 1=య$^2$" అను ద్వితీయఘాతీయకుట్టకము నొక్కదానిని మాత్రమే పేర్కొని దానిమూల్యములుగ $క=\frac{2 త}{త^2-స}$, $య=\frac{త^2+స}{త^2-స}$, యనువానిని పేర్కొనియున్నాడు. ఈసాధారణమూల్య ప్రకటనమును చేయుతరి నీతడు ఏదేని యొకసమీకరణముయొక్క మూల్యము (root) నొక్కదానినూహింపగలిగినచో దాని సాధారణమూల్యమును (general solution) సులువుగ వ్రాయవచ్చునని యుపపత్తీకరించియున్నాడు. కాని యీతడా యొకమూల్యమును కనిపెట్టెడివిధిని మాత్రము పేర్కొనలేదు. "య$^2$=సక$^2$ + 1" అనుసమీకరణమున "స" ను రెండువర్గాంకముల మొత్తముగ ప్రకటింపజాలని యుదాహరణములందన్నిటనుగూడ "క, య" ల మూల్యములు పూర్ణాంకములు కాజాలవనికూడ నిర్ధారణచేసెను.

42. ప్రాచీనబీజగణితజ్ఞులు, గ్రీకులైనను అరబ్బులైనను, ఇటాలియనులైనను, హిందువులైనను సరే, వీరు నిశ్చితానిశ్చిత సమీకరణములకు(Determinate and indeterminate) జెందినప్రశ్నల కేమియు విభక్తత యున్నట్లు వ్యవహరింపకపోవుటయన్నది యెంతయు శోచనీయము. లుప్తాక్షరపదబీజగణిత (Syncopated algebra) కాలము తరువాతనే సమీకరణములకు సాధారణవివరణల(Generel Solutions) నొసగ నారంభించిరి. ప్రథమఘాతీయ కుట్టకముకు దక్క తక్కిన యితరఘాతీయ సమీకరణముల వివరణములందైన కష్టమువలననే, వీనిని ప్రాథమిక బీజగణితములందు వాడుట మానిరి.

43. రేఖాగణితమునందు బ్రహ్మగుప్తుడు సమకోణత్రిభుజములదైన పైథగరు సిద్ధాంతము నుపపత్తీకరించెను. క్షేత్రవ్యవహారభాగముయొక్క వైశాల్యమును స్థాపించు సంకేత నీదిగువ సూత్రముచే ప్రకటించెను

శ్లో. స్థూలఫలం త్రిచతుర్భుజబాహుప్రతిబాహు యోగదళఘాతః । భుజయోగార్ధ చతుష్టయ భుజోన ఘాతాత్ సూక్ష్మమ్.

ఇది నవీనవిధిని ప్రకటించినచో

$చ = \sqrt{(స-క)(స-చ)(స-డ)(స-త)}$ యగుచున్నది. త్రిభుజ విషయమున (త) యను నాల్గవభుజముయొక్క పరిమాణము శూన్యమగుచున్నది గాన త్రిభుజవైశాల్యపు సంకేతకూడ దీనినుండి సంభవించుచున్నది.

$త్రి = \sqrt{స(స-క)(స-చ)(స-ట)}$ యగుచున్నది. ఇట్లీతడు త్రిభుజముయొక్కయు వృత్తీయ చతుర్భుజముయొక్కయు వైశాల్యమును నిర్ణయించు సంకేతల నొసగెను. వృత్తముయొక్క వైశాల్యము దానిపరిధిలో సగముపొడవును, దాని త్రిజ్యయంత వెడల్పునుగల యాయతపు వైశాల్యమునకు సమానమని ప్రకటించియున్నాడు. వృత్తమునకు తుల్యమగు నాయతమును కల్పించుటయందీతఁడు దిగ్విజయము నందజాలకపోయెను. ఈతని ఫలితము నరయ "$\pi = \sqrt{10}$" గ గైకొనినట్లు తెలియుచున్నది. సూచీ (Pyramid) యొక్కయు, శంకు (Cone) యొక్కయు ఉపరిభాగ వైశాల్యములను, ఘనపరిమాణములను నిర్ణయించు, సంకేతల నీతఁడొసగియున్నాడు. వీనిని స్థాపించుటయందే యార్యభట్టు చాల యపభ్రమ పడెను. రేఖాగణితపు తక్కటి భాగమంతయు నించుమించుగా దురవగాహముగానే యున్నది. కాని వీనినిజూడ వృత్తీయచతుర్భుజముల యొక్క వివిధపరిమాణములను నిర్ణయించు సంకేతలను కల్పించుటకై చేసినయత్నములట్లు గోచరించుచున్నవి. వీని నరసిచూడ నీత డకరణీయబీజములతో (Rational elements) వృత్తీయ చతుర్భుజముల కల్పనలకై తంటాలుపడినట్లు గోచరించుచున్నది. వీనిని వ్యాఖ్యాత లంతబాగుగ గ్రహించి, వీనిగుణములను ప్రకటించిన ట్లగపడదు. వీనిలో కొన్ని మహావీరాచార్య శ్రీధరాచార్యుల గ్రంథములందు కాన్పించుచున్నవి. భాస్కరాచార్యుని కాలమునాటి కివి దురవగాహములై పోయినవి.

44. ఈ భాగమున బ్రహ్మగుప్తుడు (§ 39 నందు) ప్రకటించిన (i), (ii), సంకేతలకు తోడుగ నీదిగువ సంకేతల నిరూపించు సూత్రములను గూడ నొసగుచున్నాడు.

(iii) $2\,త్రి = \frac{ఖ}{జ్యక} = \frac{ఛ}{జ్యచ} = \frac{ఠ}{జ్యట}$

(iv) "$క^2 + చ^2 = ట^2$" మును, $ఖ^2 + ఛ^2 = ఠ^2$ మును, నైనచో నప్పుడు చతుర్భుజము (కఠ, టఛ, చఠ, టఖ) వృత్తీయచతుర్భుజమగుటయే కాక దీనికర్ణములు పరస్పర లంబమానములుగ నుండుటయుకూడ నిశ్చయమని ప్రకటించియున్నారు.

45. వృత్తములనుగూర్చిన ప్రాథమికాంశములును, ఘనముల ప్రాథమికక్షేత్రమితియు, (Mensuration) నిడల ప్రశ్నలు, స్వాబుణపరిమాణములు (+ve and —ve quantities) శూన్యముతోడి వ్యవహారములు (Operations with zero) కరణాంకములు, (Surds), సులభమైన బీజగణితీయ సరూపతలు (Identities), ప్రథమ ద్వితీయ ఘాతీయ కుట్టకములు, (వీని గ్రంథ

యమునం దివి చాలభాగము నాక్రమించి యున్నవి.) ప్రథమ ద్వితీయఘాతీయేకవర్ణసమీకరణములు (ఇవి పైవానికంటె తక్కువ స్థలమునే యాక్రమించుచున్నవి), అనునట్టి వీనిని గూర్చి వ్రాసియున్నాడు.

46. బ్రహ్మగుప్తునిచే స్థాపితములైనవని పైన నెసగిన ఫలములన్నియు నాతనిస్వకపోలజములని చెప్ప నలవిగాదు. ఈత డార్యభట్టు గ్రంథముల నెఱుంగును. ఆర్యభట్టు గ్రంథమునందలి "జ్యా"లపతకము నీతడు కూడ తన గ్రంథమున ప్రకటించియున్నాడు. ఆర్యభట్టు తరువాత వారుకూడ గణితశాస్త్రమును కొంచెము పెంపొందించినట్లును, బ్రహ్మగుప్తునికి వారివారి గ్రంథములతో పరిచయమున్నట్లును గోచరించుచున్నవి. బ్రహ్మగుప్తుని యంకగణిత బీజగణిత భాగములు చాలవఱ కాతనిస్వకపోలజములే.



# ప్రకృతిశోభ

పెనుమర్తి వేంకటరత్నము గారు

ఉదయాచలంబులోఁ గదిసియున్నట్టి
కెంపుఁజాయలలోన మంపు నింపెనఁట!
లేఁతసూర్య నవాంశువ్రాతమ్ములోన
దోబూచులాడుచుఁ దుఱఁగలించెనఁట!
కొలఁకులఁ జిఱుతరంగల ముచ్చటాడు
పిల్లగాడుపులలోఁ గొల్లలాడెనఁట!
మొగిలుపిండులలోన ముగుదసోయగము
వెలిఁదార్చు మెఱపుఁదీవియ నొప్పెనంట!
సదమలస్నిగ్ధ జ్యోత్స్నాపూరమందు
శైత్యసంపదలో నెసంగుచున్నదఁట!
నీమనోహరరూప రామణీయకము;
నవనవానంద సౌందర్య లాలనము;
హృదయముఁ దనియించు నెసకము పేర్మి;
కవితను నల్లించు కల్పనాశక్తి.

# ఆంధ్ర భాషా విమర్శనలు

## పోతుకూచి సుబ్బయ్యపంతులు ఎం.ఏ., ఎల్. టి, గారి శ్రీకృష్ణతులాభార ప్రశంస.

కమలాకర నారాయణరావుగారు

సరసమైన భాషావిమర్శనలు భాష కలంకారము తెచ్చుటయేకాక కావ్యరచన కత్యంతోత్సాహకరములనివేఱె చెప్ప నక్కరలేదు. ఆంధ్రకవితా పితామహుండల్లసాని పెద్దన :

"చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియి
చ్చు కప్పురవిడె మాత్మ కింపయిన భోజన ముయ్యె
లమంచ మొప్పు తప్పరయురసజ్ఞు లూహ తెలియం
గల లేఖకపాఠకోత్తముల్, దొరకినఁగాక యూరక
కృతుల్ రచియింపుమటన్న శక్యమే."

యని వివరించుటలో నొప్పుతప్పరయురసజ్ఞులు దొరకినఁగాని కావ్యరచన కావేశము కలుగనేరదని వర్ణించెను. విమర్శకునికిఁ గావలసిన లక్షణములు బహుసంక్షిప్తముగానుమిగులసరసముగాను బై మాటయందిమిడ్చెనని తెలియుచున్నది. బాగుగఁ బరిశీలించినచో విమర్శకుని లక్షణములు రెండుగాఁ గనుపడుచున్నవి. మొదటిది యొప్పు తప్పరయుట; రెండవది రసజ్ఞత.

ఒప్పు తప్పరయుటకుఁ బరిశుద్ధమైన శాస్త్రజ్ఞానమును నిష్పక్షపాతబుద్ధియు నవసరము. ఏదియో యెవరికిఁ దోఁచినది వారు వ్రాసినయెడల శాస్త్రజ్ఞాన మనిపించుకొనదు. రెండవలక్షణము రసజ్ఞతను గొంచెము పరిశీలింతము. లేనిపోని విమర్శనలు తావులకొలఁదిని వ్రాయవచ్చునుగాని సరసమైన యొకవాక్యమును రచించుట కష్టము. కవి హృదయము ననుసరించి నిండుమనంబుతోఁ గావ్యమును బరిశీలించిననేగాని రసముదొరకదు. కావ్యమందలిరసమును ముందు గ్రహింపఁగలిగిననేకాని యొప్పుతప్పరయుటకు వీలుకాదు. అందువలననే రసజ్ఞత విమర్శకునకుఁ బ్రథమలక్షణము. ఆంగ్ల భాషా విమర్శకులుకూడఁ గావ్యవిమర్శనకు రసజ్ఞతయే యవసరముగాని తత్త్వవిచారణ కాదని నొక్కి చెప్పుచున్నారు. * అట్టి రసజ్ఞులు దొరకుట కాధునికాంధ్రభాష విశేషమైననోము నోచుకొన్నది కాదు.

శ్రీభారతీపత్రికయొక్క రక్తాక్షి చైత్రమాసపుఁ బ్రతియందు శ్రీపారనంది జగన్నాథస్వామి ఎం. ఏ. ఎల్. టి. గారు మాగురువుగారి శ్రీకృష్ణతులాభారనాటకమును విమర్శించియున్నారు. విమర్శయందలిభాషను జూడఁగా వీరు గ్రామ్యవాదులని తోఁచెడిని. వీ రెవరైన నేమి? మాకుమాత్రము కక్షలతో నిమిత్తములేదు.

"నాటకమునకు ప్రదర్శనధర్మము ముఖ్యగుణమైనా" యని విమర్శన ప్రారంభించిరిగాని యాముఖ్యగుణమును బరిశీలింపలేదు. నాటకము దృశ్యకావ్యమా? కేవలశ్రవ్యకావ్యమా? దృశ్యకావ్యమును దృశ్యకావ్యలక్షణములచేత విమర్శింపవలెను. దృశ్యకావ్యములకు రంగస్థలముపరీక్షాలయము రసజ్ఞులైనప్రేక్షకులు పరీక్షాధికారులు. ఏదేశమునందైనను నాటకమును విమర్శించునపుడు ప్రదర్శనానుకూల్యము ప్రధానముగాఁ బరిగణింతురని వేఱె చెప్ప నక్కరలేదు. మనదేశీయు లీయుద్దేశమునుబట్టియే నాటకములకు రూపకములను సామాన్యనామము నిచ్చియున్నారు. ఆంగ్లభాషయందుఁగూడ నాటకవిమర్శనముచేయునపుడు ప్రదర్శనానుకూల్యము ప్రధానలక్షణముగాఁ బాటించియున్నారు. † ప్రదర్శనానుకూల్యము విమర్శింపవలసినపుడు కథాభివృద్ధి (Deuelopment of the plot), రంగము

* "The Poet must be tried by his peers and not by pedants and philosophers."

† "There is no quality in which shakespeare's greatness as a Dramatist is more conspicuous than his knowledge of what is effective on the stage." Ainger

యనుక్రమణిక (Arrangement of the scenes,) కాలగమనిక (the passing of time,) వివిధపాత్రోచిత భాషాప్రయోగము (Suitability of the language to the general characters) మొదలయినయున్నతలక్షణములఁ బరీక్షించినచో బాగుండును. చాలబాగుగనున్నదని వేయినోళ్లఁ బొగడఁబడిన యీనాటకమునందలి విశేషగుణమును బరిశీలించుట కీవిమర్శకులకు వీలైనది కాదు కాఁబోలు.

ఇట్లు ప్రదర్శనధర్మము ముఖ్యగుణమని విమర్శన కారంభించి యీముఖ్యగుణమును బరిశీలింపలేదుసరిగదా భాషావిమర్శనవిషయమై "ఈభాగముతో నాకంతగా ప్రసక్తి లేనందున నిక ముగించెద"నని యంతలోతుగా దిగరైరి.

మఱియేవిషయములు విమర్శనచేసిరో చూతము. వీరివిమర్శనయంతయుఁ గొన్ని సారాంశములక్రిందికిఁ దీసికొనిరావచ్చును.

I పురాణకథలుకల నాటకములు నాటకారంభదశను సూచించునని యొకసిద్ధాంతము నీవిమర్శకులు ప్రపంచమునకు వెల్లడిచేయుచున్నారు. నీతిబోధచేయుటకును, హృదయోల్లాసమును గలిగించుటకును, పారమార్థికచింతను బురికొల్పుటకును నిది యది యననేల సమస్తవిధమైనజ్ఞానమును వెదచల్లుటకును బురాణములు మంచి సాధనములు. చరిత్రకూడ పురాణములలోనిదే "నాటకే ప్రఖ్యాత మితివృత్త" *మని మనశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ప్రఖ్యాతమనఁగాఁ బురాణసుప్రసిద్ధ మని వ్యాఖ్యానము వ్రాసియున్నారు. సమస్తజనాదర్శకములైన రాముని చరిత్రగాని కృష్ణునిచరిత్రగాని తీసికొన్నయెడలఁ దప్పుకాఁబోలు. ఎట్టియవస్థ!

II శ్రీకృష్ణతులాభారనాటకమునందు శ్రీకృష్ణలీలలు ప్రధానమా? తులాభారకథ ప్రధానమా? యని యొకపెద్దప్రశ్న వేసియున్నారు.

ఈప్రశ్నకు వేఱేప్రత్యుత్తరము నీయ నక్కఱ లేదు. నాందిమొదలుకొని మంగళమువఱకును విమర్శించినచో నెట్టివారికిని శ్రీకృష్ణునితులాభారపుకథయే ప్రధానమని ద్యోతకము కాకమానదు. ఏల శ్రీకృష్ణలీలలకథ? ఆంగ్లభాషాసుపరిచయముగల యీ విమర్శకోత్తముఁడు సాదరభావముతో నొకసారి యీనాటకమును జదివిన యెడల సమాధానము వారికి దొరకకపోదు. శ్రీకృష్ణతులాభారమను తులసీమూలము ప్రథమాంకమునందలి యీశ్వరసంకల్పమువలన నుత్పాదితంబై శ్రీకృష్ణలీలామృతమువలన దోహదము చేయఁబడుచున్నది. రుక్మిణీరాధలకును సత్యభామకును గలతారతమ్యమును జూచిగదా నారదుఁడు శ్రీకృష్ణునితో "స్వామీ! యీయహంకారము వదలిననేకాని యీమెకు (భామకు) నీమహిమ గోచరముకాదని" ముచ్చటించుట కవకాశము కలుగుచున్నది. ఈప్రధానావసర మట్లుండఁగా శ్రీకృష్ణలీలలఁ బరీక్షించుటవలన శ్రీకృష్ణుండైహికభోగబద్ధుండైన స్త్రీలోలుండు కాఁడనియు లీలామానుషస్వరూపుండై ♦ "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహ"మనురీతిని భక్తులయారాధనలకొలఁదిని వారి వారికనుగ్రహించు మహనీయుండనియు శ్రీకృష్ణునిదైవమహిమమీఁద ప్రతిఫలించుచున్నది. పైగా శ్రీకృష్ణుండు సత్యభామవలలోఁ జిక్కుకొన్నవాఁడు కాఁడనియు భక్తిసామ్రాజ్యప్రాప్తికైన దురహంకారచ్ఛేదనంబున కంగీకరించువాఁడనియు నారదునికి గట్టినమ్మకము కలిగించి కథాసందర్భమునకుఁ దోడ్పడుచున్నది.

III శ్రీకృష్ణుం డొకచోట దైవముగాఁ జూపఁబడుటయు మఱియొకచోట మానవుఁడుగాఁ జూపఁబడుటయు నసందర్భము కాదా యని యొకవిమర్శనచేయుచున్నారు.

శ్రీకృష్ణునిచరిత్ర బాగుగ గ్రహించినచో నిట్టిప్రశ్నకవకాశము కలుగదు. భగవద్గీతలలో మొదటియధ్యాయమునందు.

"సేనయో రుభయో ర్మధ్యే రథంస్థాపయ మే ఽచ్యుత"యని. యర్జునునిచే వేడుకొనఁబడినశ్రీకృష్ణుండు వేఱుగను, బదునొకండవయధ్యాయంబున విశ్వరూపసందర్శన సమయంబున "పశ్యామి దేవాం స్తవ దేవ దేవ! సర్వాం స్తథాభూత విశేషసంఘాన్; బ్రహ్మాణ మీశం కమలాసనస్థం ఋషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యా" నని కొనియాడఁబడిన శ్రీకృష్ణుండు వేఱుగను దలంపఁ

---

* ప్రతాపరుద్రీయము.

♦ భగవద్గీత

బడవలసి యున్నదా? వెన్న తినుచున్నాడని గోపికలు శ్రీకృష్ణునితల్లితోఁ జెప్పినపుడు నోరుతెఱచి పదునాల్గు భువనంబులను దనలోఁ జూపిన శ్రీకృష్ణుండు వేఱుగను, యశోదచేత సామాన్యబాలుఁడుంబోలె ముద్దులాడఁబడిన శ్రీకృష్ణుండు వేఱుగను బరిగణింపఁబడవలసియున్నదా? ఇన్నిమాటలతో సమాధానము చెప్ప నక్కఱలేదు. శ్రీకృష్ణుండు లీలామానుషస్వరూపుండని యొక్కమాట చెప్పినఁజాలును. ఈమాట శ్రీకృష్ణతులాభారములో నెన్నిసార్లు దొరలినదో పుస్తకమును బాగుగఁ బరిశీలించిన వారికిఁ దెలియును. 41 వ పుట చూడుఁడు. "ఆలీలామానుషస్వరూపుం డన్నిచోట్ల నగపడుటయుఁ జూడ నాకే సిగ్గగుచున్నది." యని నారదుండనియెను.

IV శ్రీకృష్ణుండు సత్యభామమీఁదఁగోపించుటకు శ్రీకృష్ణనిరాకరణ యని తప్పభిప్రాయపడి యేమేమో విమర్శనలు వ్రాసియున్నారు. శ్రీకృష్ణునియలుకకుఁ గారణము సత్యభామ తనయందుఁ జూపిన నిరాకరణభావము కాదనియుఁ బట్టపుదేవియైన రుక్మిణియింటికిఁ బోఁగూడదని యసంభవమైన నిర్బంధము చేయుటయే యనియుఁ బుస్తకము బాగుగఁజదివినవారికి గోచరము కాకమానదు.

V పాత్రపోషణ విషయమై కుముదాసుందరుల తారతమ్యము తమకు నచ్చినట్లు తా మనుగ్రహించియున్నారు. భగవద్గీతాసాంప్రదాయమునుబట్టి శ్రీకృష్ణుండు లీలామానుషస్వరూపుఁడుగా వర్ణింపఁబడుటయు, దురహంకారమగ్నయైన సత్యభామ శ్రీకృష్ణతులాభారమను నొక్కమాదిరిపాఠమువలన నుపదేశము పొంది యపూర్వభక్తిపూరితస్వాంతయై శ్రీకృష్ణునిఁ జేరుటయు రుక్మిణి సర్వమును లీలగా నెఱింగినయాదిలక్ష్మిగా వర్ణింపబడుటయు నారదుఁడు పట్టికలహప్రియుఁడుగాక దురహంకారచ్ఛేదనంబు చేసి భక్తిమార్గంబునఁ జేర్చెడు మహామహుండుగా వర్ణింపఁబడుటయు నీవిమర్శకులకంతగా గోచరము కాలేదుకాఁబోలు. వీరివిమర్శనావరణములో గుణపరిశీలన మంతగా నవసరమని తోఁచలేదేమో?

ఇతరప్రదేశములయం దంతగాఁ దామెఱుంగక పోయినను నాల్గువత్సరంబులక్రిందట నాంధ్రపత్రిక వేయినోళ్లఁ బ్రకటింప నాంధ్రభాషాభిమానస్థలంబగు విజయనగరపురంబునందు వేనవేలుప్రేక్షకు లయోధ్యానాటకశాలయందు గుమిగూడి యదినాటకశాలయని మరచి యానందపారవశ్యంబు నొందుటయు, నైదవయంకమంతయుఁ దిరిగి ప్రదర్శింపుడని నిర్బంధించుటయు నొక్కొక్కపద్యమునే తిరిగితిరిగి యనేకపర్యాయములు చదివించుటయు, నపూర్వసంకల్పితులై యందలి విద్వజ్జనులందఱు నాటకగ్రంథకర్తను జూడఁగోరి యావిజయనగర మండలన్యాయాధిపతిచేత గ్రంథకర్తకు బంగారుపతక మిప్పించుటయు నాచుట్టుప్రక్కలవారికిఁ దెలియని విషయములు కావు. ఆవిద్వజ్జనులకంటె నీవిమర్శకోత్తము లెక్కువవారేమో మాకుఁ దెలియదు.

ఈనాటకము మద్రాసు (యూనివర్సిటి) విశ్వవిద్యాలయమువారు పఠనీయగ్రంథముగా నియమింపఁ బ్రయత్నములనుగుఱించి యావిమర్శనలో మార్గవశంబునఁగాఁబోలు ముచ్చటింపఁబడినది. మృదుమధురమైన వాడుకశైలిగల యాంధ్రగ్రంథంబులు చదివెడి మహాభాగ్యంబు మన విద్యార్థుల కబ్బునెడల మా శ్రీకృష్ణతులాభారము పఠనీయగ్రంథముగా నియమింపఁబడఁగలదు.

లేనిపోని గ్రామ్యగ్రాంథిక కక్షలతో నిమిత్తములేక గ్రంథప్రాశస్త్యమును మాత్రము ప్రధానముగాఁ బెట్టుకొని మా శ్రీకృష్ణతులాభారము నామోదించి స్వల్పకాలములోనే ద్వితీయముద్రణమున కవసరముకలిగించిన వివిధప్రదేశములందలి పఠనీయగ్రంథనిర్ణయ సామాజికులకు నాంధ్రభాషాభిమానులకును జదువరులకును వేనవేలు వందనములు. పరిశోధితమైన ద్వితీయముద్రణము విద్యార్థులకొఱకు వెలువడియున్నది.


విమర్శకు లొప్పుతప్పరయు రసజ్ఞులై కావ్యరచనకుఁ బ్రోత్సాహముచేసి యాంధ్రభాష నలంకరింతురుగాక యని ప్రార్థించుచున్నారము.

# ముక్త్యాల సంస్థానము

శ్రీ వాసిరెడ్డివారి సంస్థాన మాంధ్రావనియందు సకలవిధములను బ్రఖ్యాతిని బడసిన సంస్థానముగ వెలయుచున్నది. ఆసంస్థానచరిత్ర విమర్శన మైహికపదవుల యస్థిరత్వమును ధర్మప్రతిష్ఠాపనల స్థిరత్వమును విశదముచేయుచున్నది. వాసిరెడ్డివారి సంస్థానములు వృద్ధిక్షయములకు బాలైనను వారి ధర్మ ప్రతిష్ఠాపన లవిచ్ఛిన్నముగను నేటికిని నడుచుచున్నవి. సరస్వతీ పత్రికాధిపతులు శ్రీరాజా వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాద బహదరు మన్నె సుల్తానుగారు వారి సరస్వతి పత్రికయందు వారివంశచరిత్రమును విపులముగను బ్రచురించుచు నాంధ్రులకు జేయుచున్న యుపకృతికి వారు వంద్యులు. ఇతర జమీందారులును శ్రీజయంతిపురము రాజాగారిమార్గము నవలంబించుచు భగవద్దత్తములైన యవకాశములను భాషాసేవకును దేశసేవకును వినియోగించి కృతార్థులగుదురు గాత!

ఆంధ్రదేశమునందుగల సంఘములందు కమ్మసంఘము ప్రముఖతను గలిగియున్నది. కమ్మసంఘము స్వరూపస్వభావ శీలములందు వ్యక్తిత్వమును గలిగి దేశాభ్యుదయమునకు దోడ్పడిన విధమునకు వాసిరెడ్డివారిచరిత్రమొక నిదర్శనముగనున్నది. వాసిరెడ్డివారి సంస్థానములచరిత్రము కమ్మవారి బాహుపరాక్రమ శీలమునువలె వారికృషిపరాయణత్వమును సయితము విశదము చేయుచున్నది. మహాదారణ్య ప్రదేశముల నాక్రమించుకొని సంస్థానములను స్థాపించి ప్రదేశములను ఫలవంతముచేసి ప్రజలకు సుఖశాంతులను సమకూర్చుటయందు కమ్మవారు దక్షులుగనున్నారు. కమ్మవారు వర్తమాన కాలమునందు వారిశక్తి సామర్థ్యములను వ్యవసాయ పరిశ్రమమునందు వినియోగించుచు నాంధ్రదేశమునందు ప్రముఖతను గలిగియున్నారు. ఆంధ్రదేశమునందు కమ్మవారి ప్రముఖతను నిర్ణయించుటకు పండితులు సమగ్రచరిత్రము బ్రచురించుట యవసరంబుగ నున్నది. కమ్మసంఘ మీ ప్రయత్నమునకు బూనుకొనుట శ్రేయోదాయకము.


ఈ రాజవంశమునకు వాసిరెడ్డి వంశనామము గలిగినవిధమును శ్రీగిరి, మల్లికార్జున నాయుడుగారు, చంద్రమౌళిగారు, రాఘవయ్యగారు, రామన్నగారు, చంద్రమౌళిగారు, చినపద్మనాభుడుగారు, చినవరసయ్యగారు వేంకటాద్రినాయుడుగారు మొదలగు వారి చారిత్రచర్యలు సరస్వతి పత్రికయందు సవిస్తరముగను దెలుపబడినవి. బ్రిటీషు ప్రభుత్వ మీ సంస్థానములోని విశేషభాగమును బీరారులవలెనె ఆక్రమించుకొని వారికిగల భూకాంక్షను విశదముచేసినది. వేంక




ముక్త్యాల నవరాత్రిజపము



ముక్త్యాల శివరాత్రి మహోత్సవము



ముక్త్యాలకోట - కృష్ణానది



వేదాద్రి

టాద్రినాయుడుగారి సంస్థానమంతయును బ్రిటీషు ప్రభుత్వమునకు సంక్రమించినది. ఆ సంస్థానముతోపాటు ముక్త్యాల సంస్థానమును ప్రభుత్వము కైంకర్యముచేసినది. కాని చంద్రమౌళి ప్రసాదనాయుడుగారి తండ్రి స్వయంకృషివలనను పోయిన ముక్త్యాల చింతపల్లి జమీలను తిరిగి గడించిరి. ఇప్పుడు శ్రీ చంద్రమౌళి ప్రసాదనాయుడు బహద్దరుగారు ముక్త్యాల జమీందారుగను వారి సోదరులు శ్రీ సదాశివప్రసాద నాయుడుగారు జయంతిపురము జమీందారుగను వెలయుచు స్వధర్మ నిర్వహణమును జేయుచున్నారు. శ్రీ ముక్త్యాల రాజాగారి భాషాభిమానము దేశాభిమానము సువిదితములు. శ్రీ రాజాగారముద్రితగ్రంథములను ముద్రించియును పండితులను సత్కరించియును భాషాసేవను జేయుచున్నారు. వేల రూప్యములను వ్యయముచేసి బ్ర. శ్రీ. శ్రీ పాదకృష్ణమూర్తిశాస్త్రిగారు కృష్ణభారతమును రచియించుటకు దోడ్పడిరి. శ్రీ కృష్ణమూర్తిశాస్త్రిగారు శేషించిన భాగమును సయితము పూర్తిచేసి తమకీర్తిని శ్రీ రాజాగారికీర్తిని శాశ్వతముగను ప్రతిష్ఠించి స్వధర్మ నిర్వహణమును జేయుటకు పరమేశ్వరుడనుగ్రహించుగాక! శ్రీ మహాభారతమునందలి కథను చిత్రపటముల రూపమునను ప్రదర్శించుటకు శ్రీ రాజాగారాత్మారిరామమోహనరాయిగారిచేతను పెద్దరంగుల పటములను వ్రాయించిరి. శ్రీ రాజాగారాపటములను భారతియందు బ్రచురించుటకనుగ్రహించినందులకు వారికి వందనములు. శ్రీ రాజాగారికి సంగీతమునందును సాహిత్యమునందును వైద్యమునందును జ్యోతిషమునందును చిత్రకళలయందును మంచి యభినివేశముగలదు. శ్రీ ముక్తేశ్వరస్వామి శ్రీ రాజాగారికిని వారి కుటుంబమునకును నాయురారోగ్యైశ్వర్యముల నొసంగి వారి సత్ప్రయత్నములకు దోడ్పడుగాత! శ్రీ రాజాగారి నివాసస్థానమైన ముక్త్యాల మనోహరముగనున్నది. అగాధమైన కృష్ణానదియును ఉన్నతమైన దుర్గమును నీ ప్రదేశమున కనిర్వచనీయమైన శోభను గలుగజేయుచున్నవి. దీనియందు ప్రచురించిన చిత్రపటములీవిషయమును విశదముచేయుచున్నవి. శ్రీ రాజాగారి సంస్థానమునందు గల సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వేదాద్రిక్షేత్ర పటములును నిందు బ్రచురింపబడినవి.

# పత్రికా పరిచయము

సాహితి:—రక్తాక్షి చైత్ర వైశాఖమాస సంచికలు మాకందినవి. వానియందలివ్యాసములు సంఘమువారి యుద్దేశ్యము ననుసరించి యొప్పియున్నవి. పద్యవ్యాసములలో శ్రీ శివశంకరశాస్త్రిగారి 'అజ్ఞాతమిత్రము' పెమ్మర్తి వెంకటరత్నముగారి 'ప్రకృతి' వేమల సత్యనారాయణశాస్త్రిగారి 'ఈనాటికి' దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారి 'ప్రేయసీ' లక్కరాజు సాంబసదాశివరావుగారి 'ప్రేమమాధుర్యము' అనునవి రసవంతములుగ నున్నవి. గద్యవ్యాసములలో చింతా దీక్షితులుగారి అగ్రాసనాధిపత్యము, మొక్కపాటి నరసింహశాస్త్రిగారి 'పిలక' చమత్కారముగ నవ్వుగొలుపుచుఁ గొంత సంఘసంస్కరణము వంకకు దారి దీయుచున్నవి. రవీంద్రుని 'కచ-దేవయాని'ని మొక్కపాటి నరసింహశాస్త్రిగారు సరసముగను భావపూరితముగను అనువదించిరి. ఒడుదొడుకు నడకగల 'తన్మయత్వము'నను, ప్రేమగర్భితమగు వరూధినియందును, శృంగార మించుక మితిమించినట్లు తోఁచెడిని. 'సఖీ' ముద్రణవైఖరియందభిప్రాయవిశేషమున్నది కాఁబోలును. ఇందలివ్యాసములు చాలవఱకుఁ దాత్కాలికానందమును గూర్చునవి. నూత్నమార్గమున నాంధ్రవాణిని నడపింప సర్వవిధములఁ బ్రయత్నించుచున్న యీసాహితీసభ్యులొకటి రెంటినే కాక వివిధమార్గములను నిర్మింపవలసియున్నారు. అట్లైనగాని యామెకు సంపూర్ణవిహారానందము లభింపఁజాలదని మా యాశయము.

శారద:—జ్యేష్ఠమాససంచిక మా కార్యాలయమును జేరినది. ఇందుఁ బ్రకటితములైన గద్యవ్యాసములలోఁ జాలవఱకుఁ జరిత్రాత్మకములు. చక్కఁగ విమర్శించి వ్రాయఁబడినవి. కన్యాశుల్కవిషయమునఁ గావింపఁబడిన చర్చ సమంజసముగా నున్నది. మఱియు 'హిమబిందు', 'దేవదత్తుఁడు', 'తాపసుఁడగు జాఫర్ సాదెక్' 'పులికేశుని అశ్వమేధము' 'రాజనీతిశాస్త్రము' మొదలగు వ్యాసములును గలవు. పద్యవ్యాసములలో శ్రీమతి బెల్లంకొండ కనకమ్మగారి 'కృష్ణునినవ్వు' ముచ్చటలు గూర్చుచున్నది. 'ప్రకృతి' 'ఆదికవి', 'ఆంధ్రనగరము', 'మాతృదేశము', 'భగవద్గీతావళి' మొదలగునవి సరసభావపూరితములై యున్నవి. 'గ్రీష్మర్తువర్ణన' ముచితరీతిని వెలసియున్నది. ఇట్టి భావగీతములను రచియించు కవులు తమ నూతనకల్పనములకు మెఱుఁగుఁ దెచ్చుటకై కొన్ని యంశములయందు కొంత శ్రద్ధవహింపవలసియున్నారు. 'ప్రకృతి' యందలి 'కవికుమారులు భావగీతారవళిలో మగ్నము' అనుచోట 'గీతారవళి' సమాస మెట్లు పొసఁగునో? 'ఆదికవి' యందు "క్రౌంచమిథునము సుఖప్రపంచమున" అను పాదమును బ్రత్యేకముగఁ దీసినఁ బద్యపాద మని తెలియుట కష్టసాధ్యముగదా! ఇట్టివే యా యంశములు. క్రొత్తకల్పనలు భావములు మొదలయినవానికిఁ దోడుగా సరళమయిన నడకయుండినచోఁ బద్యములు పాఠకజనహృదయాహ్లాదకరము లగును. ఇందుఁగల 'జీవనభారము' 'బుద్ధుఁడు-జర' అను వర్ణచిత్రములు సహజసుందరములుగా నున్నవి. సాధారణచిత్రములు గొన్ని సందర్భోచితములుగా గలవు.

# సాభిప్రాయవిశేషములు

క. ఒరు లేయవి యొనరించిన, నరవర యప్రియము దనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి, పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. — భారతము.

గాంధిమహాత్ముని నివాసస్థలమైన సబర్మతీతీరస్థమైన సత్యాగ్రహాశ్రమము వర్తమానసమయమునందు ప్రపంచదృష్టినాకర్షించుచున్నది. మూరవెడలుపును మూడుమూరల పొడవునుగల గుడ్డను ధరించిన వామనమూర్తి నామము దిగంతములందును మారుమ్రోగుచున్నది. గాంధిమహాత్మునిమహాశక్తి శత్రువులకును మిత్రులకును ఆశ్చర్యమును గలుగజేయు చున్నది. గాంధి మహాత్ముడు జూను మాసారంభమునను సత్యాగ్రహాశ్రమమునందు నివాసమును గైకొనిన తరువాతను వేలకొలది ప్రజలు వేకువనుండి రాత్రివరకును మహాత్ముని సందర్శించుచు వారిసంస్కారమున కనురూపముగను మనోరథములను బడయుచుండిరి. ఈదర్శనాభిలాష గతవారమునందు కాంగ్రెసుస్థాయి సంఘము అహమదాబాదునందు గూడినపుడు విశదమైనది. వేలకొలది ప్రజలు మహాత్ముని యాగమనమునకై యనుదినమును గనిపెట్టుకొనియుండిరి. వందలమంది సత్యాగ్రహాశ్రమయాత్రను జేసి మహాత్ముని సందర్శించి యానందించుటకై పోవుచుండిరి. మహాత్ముడు విసుకువిరామములేకను అందఱకును సమాధానములను జెప్పుచు సంప్రీతులను జేయుచుండును. వచ్చినవారిని పంపివేయుటగాని వారిప్రశ్నలకు సమాధానములను జెప్పకుండుటగాని మహాత్ముని సాధుశీలమునకు వ్యతిరేకము. గాంధిమహాత్ముని ప్రసన్నవదనసందర్శనమాత్రముననే హృదయారవిందము వికసించి యానందము గలుగుచుండును. గాంధిమహాత్మునిమీదను ప్రజలకు గలభక్తివిశ్వాసములు ఆశ్చర్యమును గలుగజేయుచున్నను సహజములని వారిసహజశీలము విశదముచేయుచున్నది.

* * * *

అహమదాబాదునందు గూడిన కాంగ్రెసుస్థాయిసంఘసమావేశము సకలవిధములను కన్నులను తెఱచినది. మహాత్ముడు రెండుసంవత్సరములు దండనము ననుభవించి మృత్యుప్రవాతనుండి దైవకృపవలనను బయటబడినను 350 సభ్యులలో 167 గురు సభ్యులు మాత్రమే హాజరగుట దేశము నావరించిన యలసత్వమును విశదముచేయుచున్నది. సభావ్యవహారక్రమమును నాయలసత్వమునే విశదముచేయుచున్నది. గాంధిమహాత్ముని ధర్మశీలము వ్యవహారక్రమమునందంతటను గోచరంబైనది. సభారంభమునందు మహాత్ముడు సభ్యులు తనను చూడవలదని నిర్ణయించెను. ఇతర పక్షములవారు సభ్యులను తమతమమత

ములకు త్రిప్పుటకు బ్రయత్నించినను మహాత్ముడు సభ్యులు వారివారి ఇష్టానుసారముగను బ్రవర్తింపవలయునని హితోపదేశము నెప్పటి వలెనే చేయుచుండెను. మహాత్ముని లక్ష్యము ప్రజాక్షేమముగాని పక్షప్రాబల్యము గాదు. కాంగ్రెసు పక్షమైనను స్వరాజ్య పక్షమైనను ధర్మప్రతికూలము గానపుడు మహాత్మునకు సమాదరణీయమని అహమదాబాదు సమావేశము విశదముచేసినది. మహాత్ముడు చెప్పెడు మాటలనువిని యితరులను నిందింపడు. తనను దూషించిన వారినైనను భూషించునుగాని దూషింపడు. ఈవారపు 'యంగుఇండియా' యందు మహాత్ముడు తెలియజేసిన భావములు మహాత్ముని సత్యశీలమును సభ్యులనిర్లక్ష్య స్వభావమును విశదముచేయుచున్నవి. మహానాయకులమని విర్రవీగెడువారు సయితము నిర్లక్ష్యముగ బ్రవర్తించుట సంతాపకరము. ఢిల్లీయందు 1922 వ సంవత్సరమునందు బ్రదర్శితమైన నాటకమే 1924 సంవత్సరమునందు అహమదాబాదునందు ప్రదర్శితమైనను రెంటి ప్రదర్శనములకును విశేషమైన భేదముగలదు. ఢిల్లీ సమావేశమునందు నెహ్రూదాసుగారి లేఖలుగలుగజేసిన హృదయవేదనకు మించిన హృదయవేదనను నెహ్రూదాసుగారల సంభాషణములును నితర ప్రసంగములును మహాత్మునకును నితరులకును గలుగజేసినను ఢిల్లీ సమావేశమునందు గల దీక్షాపరాయణత్వము అహమదాబాదు సమావేశమునందంతరించినది. గాంధిమహాత్ముని సన్నిహితానుచరులు సయితము నిర్లక్ష్యభావమును జూపుటకాల మహిమగనున్నది. ధర్మపరాయణుండైన మహాత్మున కీపరిపాకము విషాదమును గలుగజేసె. విధమును స్వాయముగ నీవిషాదరంగమును జూచినవారు గ్రహింపనోపుదురు. మహాత్మునకు సహచరులయందు గల విశ్వాసమంతరించినపుడు విషాదమున కవకాశమేర్పడినది. మానవశీలమునందు మహాత్మున కపారమైన విశ్వాసముగలదు. తన విశ్వాసమునకు బాత్రులైన చౌతరాముగారి వంటి సాధువులు వికటమార్గము నవలంబించినపుడు మహాత్మునకు గలిగిన యాశాభంగము వర్ణనాతీతము. సభావ్యవహారక్రమమంతయును నాపరిస్థితులను విశదముచేసినది.

* * * *

అహమదాబాదు సమావేశము సభ్యుల నిర్లక్ష్యభావమును విశదము చేయుచున్నను గాంధివిజయమును దెలుపుచున్నది. మొదటి తీర్మానమును సభాధిపతి సభ్యుల సమ్మతుల వలనను నిర్ణయించుట దాసుగారికసంగతముగనున్నను సమంజసముగనున్నది. అహమదాబాదునకు కార్యక్రమమును నిర్ణయించుటకు బోయిరి గాని వాదప్రతివాదములతో గాలహరణమును జేయుటకు బోలేదు. అంగనిర్మాణసూత్రములు నిబంధనలు కార్యనిర్వాహణమున కేర్పడినవిగాని మృతాక్షరములుగ నుండుట కేర్పడలేదు. గాంధిమహాత్ముడీ యర్థమునే సభావ్యవహారమునందు విశదముచేసి కార్యమును నిర్ణయించుట సమంజసమని యంగీకరింపదగియున్నది.

* * * *

సుశిక్షితులైన సైనికులు విజయమునకు మూలమని సామాన్యులు సయితము గ్రహించినవిషయమును మహాత్ము డాచరణమునందు బెట్టుటకు మూడేండ్లుగ విశ్వప్రయత్నములను జేయుచుండెను. ఆరంభమునం దీప్రయత్నములు కొంతవరకు సఫలమైనను రెండేండ్లలో తిరిగి మందగమనము గలిగినది. మహాత్ముడు నాయకుల కార్యపరత్వమును నిర్ణయించుటకు ప్రతిపాదించిన ప్రస్తావము మహోద్వేగమును గలుగజేయుట విచిత్రపరిణామముగ నున్నది. కన్నులు తెరువలేనివారు మహాత్మునకు ధర్మోపదేశములను జేయుట పరిహాసాస్పదమైనను దురహంకారమునకు మితిమేరలు గనుపడవుగదా! స్వరాజ్యపక్షము వారిదురభిమానము కాంగ్రెసు పక్షమువారి సంశయభావము మహాత్మునకు సంగతిసందర్భములను విశదముచేసినవి. కర్మాచరణమునందు నిర్మాణవిధానమునందు విశ్వాసములేనిసభ్యులు ప్రతిఘటనమునకు బూనుకొనినపుడు మహాత్మునకు తనకర్తవ్యము గోచరంబైనది. ధర్మపరాయణులు ధర్మోపదేశమును జేయుటకు ప్రయత్నించుదురుగాని బలవంతము చేయజాలరు. సత్యాగ్రహపరాయణుండైన మహాత్మునకీ ధర్మము సహజశీలము. ఇతరులు విశ్వసింపని ధర్మమును మహాత్ముడు బలవంతముగ నవలంబింపజేయుటకు బూనుకొనడు. మహాత్ముడు సభ్యులకు సంబంధించిన దండనము నుపసంహరించుటకిదియే కారణము. ఈయుపసంహారమును పరాజయమునుగ బరిగణించుట యవివేకము. మహాత్ముని మాహాత్మ్యమీయుపసంహారమునందు గోచరమగుచున్నది. స్వరాజ్యపక్ష నాయకుడైన నెహ్రూగారి నాటకము వారి నిర్గమనము మహాత్మునకు గలిగిన విజయము ధర్మపరాఙ్ముఖత్వమునకు గారణము కాలేదు. రాజగోపాలాచార్యులుగారు వెడలిపోయినవారిసమ్మతులను గణించుట యసంగతమని హెచ్చరించినను మహాత్ముడు దైన్యాహర్షములను విడిచి స్వధర్మనిర్వాహణముచేసి మహాత్ముడనునామమునుసార్థకముచేసికొనెను. ఈవిషయము మహాత్ముని ప్రతిభను శాశ్వతముగను ప్రతిష్ఠించుటకు జాలియున్నది. హృదయదౌర్బల్యము ధర్మనిరసనమునందు సంగ్రాహ్యము గాని ధర్మారాధనమునందు గ్రాహ్యముగాదు. మహాత్ముని ఆత్మసంయమన సామర్థ్యము నీవిషయము విశదముచేసినది. మహాత్ముడు జయము నపజయమునుగ బరిగణించి ప్రతిపక్షులకు శృంగభంగము చేయగలిగెను.

* * * *

పంచవిధ బహిష్కారమునకు సంబంధించిన తీర్మానమును మహాత్ముని విశాలహృదయమును విశదముచేయుచున్నది. మహాత్మునకు డిల్లీ కాకినాడతీర్మానముల సంగతి సందర్భములు గ్రాహ్యము కాగానే శాసనసభ్యుల బహిష్కారము నుపసంహరించుట కంగీకరించెను. ఈ విషయమునందును మహాత్ముడు తనధర్మప్రవర్తనము వలనను దురభిమానులకు గర్వభంగ మొనరించెను. మహాత్ముడు కోరునది సత్యము కార్యనిర్వాహణముగాని పరవంచనగాదు. ఇతరు లాక్షేపించినను తిర

స్కరించినను మహాత్ముడు తన ధర్మనిర్వహణముసు జేసి యాత్మగౌరవమును గాపాడుకొనెను. గోపీనాథసహాకు సంబంధించిన దాసుగారు ప్రతిపాదించిన సిరజుగంజి తీర్మానమునకును మహాత్మా గాంధి ప్రతిపాదించిన తీర్మానమునకును గల భేదమును దాసుగారు గమనింపజాలకుండుట విచిత్రముగ నున్నది. మహాత్ముడు త్రికరణశుద్ధిగను అహింసా ధర్మము నారాధించుచున్నాడు. ఇతరు లహింసాధర్మమును మాటలతో నారాధించుచున్నారు. గోపీనాథసహాకు సంబంధించిన ప్రసంగము లన్నియును అసహ్యమును గలుగజేసినవి. ప్రసంగములు గలుగజేసిన పరిహాస స్వభావము మహాత్మునకు హృదయశల్యమువలె నాటినది. బాబాసాహెబు పరాంజపెగారి ప్రసంగము హేయముగనున్నను శ్రోతల హృదయములం దాహ్లాదమును గలుగజేయుట సభ్యులవిచిత్ర ప్రవర్తనమును విశదముచేసినది. గోపినాథసహా తీర్మానమును ప్రతిపాదించినపుడును చర్చాంతమునందును మహాత్ముడు చూపిన నిగ్రహము వారి లోకోత్తర ప్రతిభను విశదముచేసినది. వ్యవహారక్రమమంతయును మహాత్మునకు సంతాపమును గలుగజేయుటయందు విచిత్రము గనుపడదు. సభ్యుల దృష్టియంతయును స్వప్రకర్షణమునకు వినియోగపడునపుడు ధర్మారాధన మంతరించుటయును స్వారాధనము ప్రబలుటయును సహజము. స్థాయిసంఘమునకీ దుర్దశ సంప్రాప్తమైనపుడు మహాత్ముడు దేశస్థితిని గ్రహించుట దుర్లభమైనది. ఈ కార్యక్రమము మహాత్మునకు హృదయవేదనను గలుగజేసిన విధమును వారు యంగు ఇండియాయందు వ్రాసిన వ్యాసములు విశదముచేయుచున్నవి.

* * * *

హృదయ స్తంభితమైన మహాత్ముని విషాదమంతయును వ్యాజ్యములకు సంబంధించిన తీర్మానమును సభ్యులు ప్రతిఘటించినపుడు పొంగి పొరలినది. ఆరంగము సభాసమావేశమునందు విషాదరంగముగను బరిణమించినది. మహాత్ముని దుఃఖము సర్వత్ర వ్యాపించినది. సభ్యుల హృదయములందు పశ్చాత్తాపము గలిగినది. సభ్యులందరును మహాత్ముని క్షమార్పణలను గోరిరి. మహాత్ముని దిగ్విజయ మీరంగమునందు గోచరంబైనది. సభ్యుల నావహించిన దురభిమానమంతరించినది. వారి హృదయము గరిగినది. మహాత్మునిపట్ల ప్రజలకుగల భక్తివిశ్వాసములు విశదమైనవి. మహాత్మునిపట్లను ప్రజలకుగల భక్తివిశ్వాసములు కార్యరూపమును దాల్చుట కవసర మేర్పడినది. ఆయవసరమునే మహాత్ముడు తన తీర్మానముల రూపమునను ప్రతిపాదించెను. ఈ ప్రతిపాదనములు సవరణను బొందినను మహాత్ముని సంకల్పము ప్రజలకు విదితమైనది. స్థాయిసంఘ సభ్యులును ప్రజలును మహాత్ముని యుపదేశములను సఫలముచేసిస్వధర్మనిర్వహణమును జేయుదురుగాక!

* * * *

గాంధిమహాత్ముడు సత్యవ్రతుడు. ధర్మప్రియుడు. కర్మపరాయణుడు. త్యాగ సంపన్నుడు. అట్టిమహానుభావునికాలమునందు నివసించుచు వారి ధర్మోపదేశములను వినగల భాగ్యము మనకు గలిగినది. ఈ యవకాశములను ననుభవించుటకు ప్రజలు యావచ్ఛక్తిని వినియోగించి చరితార్థు లగుదురు గాత!

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No. 7 Thumbu Chatty Street, G. T. Madras